

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

ఒంగోలు

: fb.com/vaartha Digital

Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

3-8-2025 ఆదివారం సంపుటి: 31 సంచిక: 183 పేజీలు: 12 వెల: 8.00


ప్రజ్వల్ రేవణ్ణకు జీవితఖైదు

9లో

పిఎం కిసాన్ నిధులు విడుదల చేసిన ప్రధాని మోడీ

# రైతును రాజును చేస్తా

## 'అన్నదాత సుఖీభవ' నిధులు విడుదల చేసిన సిఎం చంద్రబాబు

రైతుల ఖాతాలకు తొలివిడతగా రూ.7వేలు జమ

46,85,838 మంది రైతులకు లబ్ధి

టెక్నాలజీ ద్వారా పంటలపై సూచనలు

వెలుగొండ ఫేజ్-1తో ప్రకాశం జిల్లాకు కృష్ణా జలాలు

సూపర్‌సిక్స్ అమలు సక్సెస్: సిఎం

**దర్శి, ఆగస్టు 2, ప్రభాతవార్త:** రైతులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. ఏ పంట వేస్తే లాభాలు వస్తాయన్నది అధ్యయనం చేసి వారికి సూచనలు జారీ చేస్తామని వెల్లడించారు. సూపర్ సిక్స్‌లో ప్రధాన హామీ అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రకాశంజిల్లా దర్శి మండలం తూర్పు వీరాయపాలెంలో ప్రారంభించారు. పచ్చని పొలాల్లో రైతుల మధ్య కూర్చునిఈ కార్యక్రమాన్ని సీఎం ప్రారంభించారు. కర్షక సోదరులతో కలిసి పథకాన్ని ప్రారంభించి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 46,85,838 మంది రైతులఖాతాల్లో రూ.7వేలు జమ చేశారు. అనంతరం ముఖ్యమంత్రి రైతులతో కాసేపుముచ్చటించారు. సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల అమల్లో గత ప్రభుత్వానికి కూటమి ప్రభుత్వానికి గల వ్యత్యాసం ఎంత మేర ఉందో చూడాలని సీఎం అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రకటన మేరకు రైతులకు ఏటా రూ.20,000 వేలు ఇస్తామన్న హామీని నెరవేర్చామన్నారు. ఈ పథకం ద్వారా 3విడతల్లో రైతులకు ఈ పథకాన్ని వర్తింపచేస్తామని సీఎం స్పష్టం చేశారు. **రైతుల కళ్లల్లో ఆనందం చూశా:** అన్నదాత సుఖీభవ పథకాన్ని ఇలా పచ్చని పొలాలు, దేశానికి అన్నం పెట్టే రైతుల మధ్య ప్రారంభించడం తనకు ఎంతో ఆనందాన్ని ఇస్తోందని ముఖ్యమంత్రి అన్నారు. రైతు కళ్లల్లో ఆనందాన్ని నేరుగా చూస్తున్నాను. రైతు ఎప్పటికి రాజే. కరోనా వంటి విపత్తులోనూ అన్నదాత నాగలి చేత పట్టి పొలంలో పనిచేశాడు. ఎన్ని కష్టాలున్నా రైతులు బాగుండాలనేది నా కోరిక. ఎన్నికలకు ముందు విధ్వంస, >>2



శనివారం తూర్పు వీరాయపాలెంలో అన్నదాత సుఖీభవ నిధులు విడుదల చేసిన సందర్భంగా సిఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రులు రామనారాయణరెడ్డి, అచ్చెన్నాయుడు తదితరులు



# '3'కు చేరువలో భారత్

## స్వదేశీ ఆయుధాలతో 'సిందూర్' సక్సెస్

భారత్ శత్రువులు భూగర్భంలో కూడా ఉండకూడదు

'ఉగ్ర'మద్దతుదారులే ఏడుస్తున్నారు: వారణాసిలో ప్రధాని మోడీ

**వారణాసి, ఆగస్టు 2:** ఆధునిక భారత దేశం శత్రుదేశాలకు కాలభైరవుడు అవుతాడని ప్రధాని మోడీఅన్నారు. తన స్వంత నియోజకవర్గం వారణాసిలో జరిగిన ఓ కార్యక్రమంలో ప్రధాని మోడీ మాట్లాడుతూ పాకిస్థాన్‌కు వార్నింగ్ ఇచ్చారు. భారత దేశ శత్రువులు భూగర్భంలో కూడా బ్రతికి ఉండరాదు అని అన్నారు. ఆపరేషన్ సింధూర్ సక్సెస్ గురించి ఆయన ప్రస్తావిస్తూ కాంగ్రెస్ పార్టీ వైఖరిని విమర్శించారు. ఆపరేషన్ సింధూర్‌ను తమాషా అని పేర్కొన్న కాంగ్రెస్‌ను తప్పుపట్టారు. తాజాగా జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో కాంగ్రెస్ ఎంపీ పరిణీతి షిండే ఈ వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది. ఆపరేషన్ సిందూర్‌ను ఎవరైనా తమాషా అని పిలుస్తారా అని ప్రధాని అన్నారు. ఆపరేషన్ సింధూర్ సక్సెస్ వల్ల విపక్ష నేతలకు కడుపు నొప్పి పుడుతోందన్నారు. పాకిస్థాన్‌లో ఉన్న ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేశామన్న వాస్తవాన్ని కాంగ్రెస్ కానీ, దాని మిత్రులు జీర్ణించుకోలేకపోతున్నట్లు చెప్పారు. విశ్వనాథుడి ఆశీర్వాదంతో ఆపరేషన్ సిందూర్ సక్సెస్ అయ్యిందన్నారు. ఆపరేషన్ సింధూర్‌తో ప్రతీకారం తీర్చుకున్నామన్నారు. కాశీలో ఉన్న మాస్టర్లను అడగాలనుకుం టున్నానని, భారత శక్తిపై మీరు గర్వంగా ఫీలవ్వడం లేదా అని ప్రధాని అన్నారు. భారత్‌లో తయారీ అయిన ఆయుధాలు ఆపరేషన్ సింధూర్ సమయంలో తమ సత్తాను చాటినట్లు చెప్పారు. పాకిస్థాన్‌లో ఉన్న చాలా వైమానిక స్థావరాలు ఇంకా ఐసీయూ స్థితిలోనే ఉన్నాయని, పాకిస్థాన్ బాధపడుతోందని, దాన్ని ఎవరైనా అర్థం చేసుకోగలరని, కానీ కాంగ్రెస్, సమాజ్ వాదీ పార్టీలు మాత్రం పాకిస్థాన్ బాధను చూడలేకపోతున్నారని ప్రధాని అన్నారు. >>2

# ఉచిత బస్సుపై రేపు ఉపసంఘం కీలక భేటీ

**విజయవాడ,ఆగస్టు2,ప్రభాతవార్తప్రతినిధి:** మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని ఈ నెల 15 నుంచి ప్రారంభించనున్నది,ఆ మేరకు ఏపీ ప్రభుత్వం ఇప్పటికే కీలక ప్రకటన చేసింది,ఈ క్రమంలో ఉచిత బస్సు పథకంపై మంత్రులు రాంప్రసాద్‌రెడ్డి, అనిత, సంధ్యారాణితో కూడిన మంత్రివర్గ ఉప సంఘం ఈ నెల 4న సమావేశం కానుంది. అదే విధంగా ఈ నెల 6న జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఈ స్కీం గురించి నిర్ణయం తీసుకొని అధికారికంగా విధివిధానాలు ప్రకటించనున్నారు. ఈ పథకానికి స్త్రీశక్తి అనే పేరు పెట్టారంట్లూ ఓ టికెట్ విస్తతంగా ప్రచారంలోకి వచ్చింది,అయితే . అది డమ్మీ టికెట్ అని, పథకం పేరు ఇంకా ఖరారు కాలేదని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. ఇదే సందర్భంలో మహిళలకు ఉచితబస్సు ప్రయాణంపై ఏపీఎస్ఆర్టీసీ సన్నద్ధమవుతోంది. ఎక్కువ బస్సులు అందుబాటులో ఉండేలా చూడటం, అదనపు డ్రైవర్లను సమకూర్చుకోవడం, కండక్టర్లకు శిక్షణపై అధికారులు దృష్టిపెట్టారు. సంస్థలో 11,449 బస్సులు ఉండగా,అందులో పల్లెవెలుగు, అల్ట్రాపల్లెవెలుగు, సిటీ >>2





శనివారం రహదారి ప్రాజెక్టుల శంకుస్థాపన కార్యక్రమంలో ప్రసంగిస్తున్న కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ

# ఇథనాల్ సృష్టికర్తలు రైతులే

## దేశ ఆర్థికవ్యవస్థ పటిష్టం వారితోనే..

నీరు, విద్యుత్, రవాణా, కమ్యూనికేషన్ల వ్యవస్థల వల్లే దేశపురోగతి: కేంద్రమంత్రి గడ్కరీ

రాష్ట్రంలో 27 రహదారులకు శంకుస్థాపన, రెండు ప్రాజెక్టులను ప్రారంభించిన కేంద్రమంత్రి

**విజయవాడ,ఆగస్టు2,ప్రభాతవార్తప్రతినిధి:** దేశ ప్రగతి నీరు,విద్యుత్తు, రవాణా,కమ్యూనికేషన్ వ్యవస్థలు కీలక పాత్రను వహిస్తాయని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. ఏపీ అభివృద్ధిలో నౌకాయాన శాఖ కీలక పాత్ర పోషిస్తుందన్నారు.రాజధాని ప్రాంతంలోని ఓ సమావేశ ప్రాంగణంలో రాష్ట్రంలో రూ.5,233 కోట్లు విలువైన 27 జాతీయ రహదారులకు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ,సీఎం చంద్రబాబు నాయుడుతో కలిసి శంకుస్దాపన చేసారు. రెండు ప్రాజెక్టలను ప్రారంభించి జాతికి అంకితం చేసారు. రాష్టంలో 185 కి.మీ మేర రూ.2,381 కోట్ల విలువైన 27 ప్రాజెక్టులకు శంకుస్దాపన జరిగితే 87కి.మీ మేర రూ.2,852 కోట్ల విలువైన రెండు ప్రాజెక్టులు ఉన్నాయి, ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు కె. రామ్మోహన్ నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, కేంద్ర సహాయశాఖ మంత్రులు పెమ్మసాని చంద్రశేఖర్, భూపతిరాజు శ్రీనివాస్ వర్మ, రాష్ట్రమంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీజనార్ధన్ రెడ్డి. పాల్గొన్నారు.ఆయా ప్రాజెక్టులను ప్రారంభించిన తరువాత నితిన్ గడ్కారీ మాట్లాడుతూ షిపింగ్, పోర్టులు, రోడ్లు అభివృద్ధి చెందితే ఆ దేశం వేగంగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతున్నామన్నారు. కొద్ది కాలంలోనే జపాన్‌ను అధిగమించామన్నారు. ఒకటి,రెండు స్దానాల్లో అమెరికా చైనా ఉన్నాయి. మోడీ హయంలో మన రైతులు విద్యుత్తుతయారు చేస్తున్నారు. ఇథనాల్ వల్ల దేశంలోరూ.లక్షలకోట్లు ఆదా అవుతాయన్నారు.భవిష్యత్తులో >>2

# లిక్కర్ స్కాం: సిట్‌వద్ద కీలక వీడియో

**విజయవాడ,ఆగస్టు2,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో గత హయాంలో జరిగిన మద్యం కుంభకోణం కేసులో వైసీపీ నేరారోపణను ఎదుర్కొంటున్న వారికి సంబంధించి సిట్‌కు ఓ వీడియో లభ్యమైనట్లు సమాచారం. ఈ కేసులో ఒక నిందితునిగా ఉన్న చెవిరెడ్డి భాస్కరరెడ్డి. డబ్బుల ఉంచిన స్దావరానికి సంబంధించి వెంకటేష్ నాయుడు ఫోన్ నుంచి వీడియోను రిట్రీవ్ చేశారు సిట్ అధికారులు. ఆ వీడియోలో మద్యం ముడుపుల లావాదేవిలు జరిగినట్లు చెప్పబడుతున్న ప్రదేశంలో నోట్ల కట్టలతో చెవిరెడ్డి పీఏ వెంకటేష్ నాయుడు సిట్‌కు అడ్డంగా దొరికిపోయాడు. వెంకటేష్ నాయుడు ఫోన్‌నుంచి రిట్రీవ్ చేసిన వీడియోలో డబ్బుల డెన్‌లో నోట్ల కట్టలు లెక్కించుకుంటూ ఉన్న వీడియో సంచలనం రేపుతోంది. ఈ కేసులో ఇప్పటికే >>2

15 సీట్లు రాకపోయి ఉంటే

# మోడీ ప్రధాని కాలేరు

ఎఐసిసి అగ్రనేత రాహుల్‌గాంధీ

**న్యూఢిల్లీ,ఆగస్టు 2:** మూడోసారి ప్రధానిగా పాలన చేపట్టిన నరేంద్రమోడీ అతితక్కువ మెజార్టీతో పదవి చేపట్టారని, మరో 15 సీట్లు రాకపోయి ఉంటే ఆయన ప్రధాని అయ్యేవారు కాదని ఎఐసిసి నాయకుడు రాయ్‌బరేలి ఎంపి రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. తాను దేశానికి రాజు కావాలని అస్సలు అనుకోవడం లేదని, అలాంటి భావనకు తాను పూర్తి వ్యతిరేకినని రాహుల్‌గాంధీ స్పష్టం చేశారు. శనివారం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సు ప్రారంభోత్సవంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాహుల్ గాంధీ ప్రసంగాన్ని మొదలుపెట్టగానే, ఇస్ దేశ్ కా రాజా కైసా హో, రాహుల్ గాంధీ జైసా హో అంటూ పలువురు సభికులు నినాదాలు చేశారు. దీనిపై ఆయన స్పందిస్తూ, "లేదండి, నేను రాజును కాదు. రాజు కావాలని నాకు లేదు. నేను రాజుకు వ్యతిరేకిని. రాజు అనే భావనను కూడా నేను వ్యతిరేకిస్తాను" అని తేల్చి చెప్పారు. గతంలో రాజు అనే పదంతో ప్రధానమంత్రి నరేంద్ర మోడీని రాహుల్ గాంధీ విమర్శించారు. దేశ ప్రజల అభిప్రాయాన్ని,మనోభావాలను మోడీ ఆలకించడం లేదని ఆనాడు కాంగ్రెస్ అగ్రనేత ధ్వజమెత్తారు. కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ)పై రాహుల్‌గాంధీ సంచలన ఆరోపణలుచేశారు. దేశంలో ఎన్నికల వ్యవస్థ ఇప్పటికే చచ్చిపోయిందని ఆయన విరుచుకుపడ్డారు. 2024లోక్‌సభ >>2



# ఎన్డీయె కూటమిని విచ్ఛిన్నం చేయలేరు

## రహదారి వ్యవస్థ మరింత పటిష్టం: డిసిఎం పవన్

**విజయవాడ,ఆగస్టు2,ప్రభాతవార్తప్రతినిధి:** దేశంగాని,రాష్ట్రంగాని ప్రగతి పథంలో ముందుకు నడవాలంటే రవాణా వ్యవస్ద కీలకమని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు,ఈ దిశలో కేంద్రంలోను,రాష్ట్రంలోను రహదారి వ్యవస్దను పటిష్టం చేసే దిశలో ఎన్డీఏ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.కూటమిలో ఉన్న మూడు పార్టీల్లోని నేతలు, కార్యకర్తలకు చిన్నచిన్న పొరపచ్చాలు ఉన్నా.. మీ స్థాయిలోనే పరిష్కరించుకొని ముందుకు వెళ్లాలని సూచించారు. మన కూటమి ఐక్యతను దెబ్బతీయడానికి వైసీపీ నేతలు ఎంతో ప్రయత్నం చేస్తారని.. మనం జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అభివృద్ధిలో వెనుకబడ్డ ఏపీ తిరిగి ముందుకు వెళ్లే ప్రయత్నం చేయాలని ఆకాంక్షించారు. కనీసం 15 సంవత్సరాలు ఈ కూటమి చాలా బలంగా ఉండాలని ఉద్ఘాటించారు. తమ ఈ ప్రయత్నం వల్లే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయని నొక్కిచెప్పారు.శనివారం మంగళగిరి సీకే కన్వెన్షన్ సెంటర్‌లో పలు జాతీయ రహదారులకు శంకుస్థాపన చేశారు. ఈ సమావేశంలో కేంద్రమంత్రి నితిన్ జైరామ్ గడ్కరీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడారు. ఈరోజు రోడ్లు వేయడమే కాదని.. ఇది భారత భవిష్యత్తుకు బలమైన పునాది అని పవన్ కళ్యాణ్ అభివర్ణించారు. ఈ దేశ ప్రగతికి చిహ్నాలు రవాణా మార్గాలని నొక్కిచెప్పారు. గోల్డెన్ క్వార్డలేటర్ ద్వారా రహదారులు దేశ దశను దివంగత మాజీ ప్రధానమంత్రి అటల్ బిహార్ వాజ్‌పాయ్ మార్చారని కొనియాడారు. భారతదేశం ఎదుగుదలకు అసలైన బలం మౌలిక వసతులని, దీనికి ప్రధాన కారణం కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ అని ఉద్ఘాటించారు. 2014లో దేశంలో జాతీయ రహదారులు 91 వేల కిలోమీటర్లు ఉండగా.. ఇప్పుడు లక్షా 40వేల కిలోమీటర్లకు చేరిందని చెప్పుకొచ్చారు. నిర్మాణ వేగం మూడు రెట్లు, బడ్జెట్ ఆరురెట్లు పెరిగిందని వివరించారు. అందుకే గడ్కరీని హైవే మ్యాన్ ఆఫ్ ఇండియాగా పిలుస్తారని ప్రశంసించారు పవన్ కళ్యాణ్.

గత జగన్ ప్రభుత్వానికి కేంద్రప్రభుత్వం నుంచి సహకారం వచ్చినా సరైన విధంగా స్పందించలేదని పవన్ కళ్యాణ్ మండిపడ్డారు. ప్రధానమంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ కింద కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.550కోట్లు ఇస్తే ఏపీ ప్రభుత్వం రూ.50 కోట్లు ఇచ్చిరోడ్లు వేశామని వెల్లడించారు. రవాణా లేని ఏజెన్సీ ప్రాంతాలను రోడ్లతో కలుపుతున్నామని అక్కడ డోలీ మోతలు లేకుండా చేశామని తెలి పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.50 కోట్లు ఇవ్వడంతో >>2



# దేవాంశ్ కోసం సెలవు పెట్టా..

కుమారుని స్కూలుకు హాజరైన మంత్రి లోకేష్

**విజయవాడ,ఆగస్టు2,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి మంత్రి నారా లోకేష్ దంపతులు తమ కుమారుడు దేవాంశ్ చదువుతున్న పాఠశాలలో నిర్వహించిన పేరెంట్ టీచర్ మీటింగ్‌కు హాజరయ్యారు. ఆ సందర్భంగా తీసుకున్న సెల్ఫీ ఫొటోను ఆయన 'ఎక్స్'లో పంచుకున్నారు. 'ప్రజా జీవితంలో తీరిక లేకుండా ఉన్న సమయంలో.. ఇలాంటి క్షణాలు ప్రత్యేక అనుభూతిని ఇస్తాయి. దేవాంష్ నవ్వు, చెప్పే ముచ్చట్లు తండ్రిగా సంతోషాన్నిస్తాయి కుమారుడిని చూసి గర్వపడుతున్నా' అని పేర్కొన్నారు. కొన్ని అనుభూతులు మరువలేని,అవి జ్ఞాపకాల్లో పదిలింగా ఉంటాయన్నారు.ఆయన తన ఎక్స్ పోస్టులో భార్య బ్రాహ్మణి, కుమారుడు దేవాంష్‌తో కలిసి దిగిన స్వీయ ఛాయా చిత్రాన్ని(సెల్ఫీ)నిజతపరిచారు. రాష్ట్రంలోని పెట్టుబడుల ఆకర్షణతోపాటు రాష్ట్రంలో కీలక మంత్రిగా, అంతకంటే ఎక్కువగా ముఖ్యమంత్రి కుమారుడిగా నిరంతరం అనేక సమావేశాలు, అధికార పర్యటనలతో నిత్యం తీరిక లేకుండా గడిపుతున్నారు లోకేష్. అయితే ఈసారి మాత్రం తన కొడుకుపాఠశాలలో జరిగే కార్యక్రమానికి ప్రత్యేకంగా ఒక రోజు సెలవు తీసుకున్నా..అంటూ >>2

# ఈవెంట్ మేనేజ్‌మెంట్ రంగానికి ప్రోత్సాహం

పర్యాటకం అభివృద్ధికి చర్యలు: మంత్రి దుర్గేష్





**విజయవాడ.ఆగస్టు2,ప్రభాతవార్తప్రతినిధి:** పర్యాటక, ఆతిథ్యరంగాల్లో కీలకపాత్ర పోషిస్తున్న ఈవెంట్ మేనేజ్ మెంట్ రంగానికి ఏపీలోని కూటమి ప్రభుత్వం తగిన ప్రోత్సాహం అందిస్తుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు.రాజస్థాన్ లోని ఉదయ్ పూర్ ఫెయిర్ మోంట్ ప్యాలెస్ లో ఆగస్ట్ 13 వరకు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈవెంట్ అండ్ ఎంటర్ టైన్ మెంట్ మేనేజ్ మెంట్ అసోసియేషన్ వార్షికోత్సవ కార్యక్రమానికి మంత్రి కందులదుర్గేష్, రాష్ట్రపర్యాటక శాఖ ఉన్నతాధికారులు అజయ్ జైన్, ఆమ్రపాలి కాటలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏపీటీడీసీ ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ >>2

# రాగులపాడు లిఫ్ట్ నుండి 10 పంపులతో ఎత్తిపోతలు



రాగులపాడు లిఫ్ట్ నుండి 10 పంపుల ద్వారా నీటిని ఎత్తిపోస్తున్న దృశ్యం

## హంద్రీనీవా చరిత్రలో సరికొత్త రికార్డు

3,150 క్యూసెక్కుల మేర పారుతున్న కృష్ణా జలాలు

**ఉరవకొండ, ఆగస్టు 2 ప్రభాతవార్త:** అసాధ్యం..సుసాధ్యమైంది. రాయలసీమ జిల్లాలకు వరప్రసాదిని అయిన హంద్రీనీవా కాలువ నీటి ఎత్తిపోతల్లో సరికొత్త రికార్డు శనివారం ఆవిష్కృతమైంది. అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గంలోని వజ్రకరూరు మండలం రాగులపాడు గ్రామం వద్దగల 8వలిఫ్ట్ నుండి 10పంపులతో కృష్ణా >>2

3-8pg2exHMNWJQE_3-8pg2exHMNWJQE.qxd 8/3/2025 12:25 AM Page 1



# రైతును రాజును చేస్తా

>> సైకో పాలనతో అందర్నీ ఇబ్బంది పెట్టి వారు ఆనందపడ్డారు. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్టే సూపర్‌సిక్స్ అమలు నాకు మాటల్లో చెప్పలేని సంతోషాన్నిస్తోంది. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రాష్ట్రంలోని 46,85,838 మంది రైతులకు లబ్ధి చేకూరింది. మొదటి విడతలో రాష్ట్ర వాటాగా ఒక్కో రైతుకు రూ.5వేలు చొప్పున జమ చేశాం. దీని కోసం కోట్లు ఇస్తున్నాం. జిల్లాలోని 2,65,317 లక్షల మంది రైతులకు ఈ పథకం ద్వారా లబ్ధి కలుగుతోంది. అలాగే దర్శి నియోజకవర్గంలో 42,786 మంది రైతులకు రూ.29 కోట్లు ఇస్తున్నాం. దర్శి మండలంలో 10,972 మంది రైతులకు రూ.7.36 కోట్లు ఇస్తున్నాం. ఒక్క వీరాయపాలెంలోనే 476 మంది రైతులకు రూ.31,00,000 లక్షలు ఇస్తున్నామని సీఎం చంద్రబాబు వివరించారు.

**సూపర్‌సిక్స్ అమలు సంతోషాన్నిస్తోంది:** రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా టీడీపీ, బీజేపీ, జనసేన పొత్తు పెట్టుకుని ఎన్నికలకు



శనివారం సిఎం చంద్రబాబుకు జ్ఞాపికను అందచేస్తున్న దృశ్యం

రూ.2,343 కోట్ల నిధుల్ని కేటాయించాము. మొదటి విడతలో కేంద్ర ప్రభుత్వం తన వాటాగా రూ.2వేలు చొప్పున రూ.832 కోట్లు ఇస్తోంది. మొదటి విడతలో కేంద్ర, రాష్ట్ర వాటాలు కలిపి ఒక్కో రైతుకు రూ.7వేలు జమ చేశాం. ఈ విడతలో రైతులకు రూ.3,175 కోట్ల మేర లబ్ధి కలుగుతోంది అని సీఎం తెలిపారు.

**సందేహాల నివృత్తికి పోర్టల్, టోల్ ఫ్రీ నెంబరు:** పథకం అమలుకు సంబంధించి రైతులకు ఎలాంటి ఫిర్యాదులు, సందేహాలు ఉన్నా అన్నదాత సుఖీభవ పోర్టల్‌లోని ఆర్ఎస్‌కే లాగిన్ ద్వారా తెలుసుకోవచ్చని ముఖ్యమంత్రి స్పష్టంచేశారు. అలాగే 155251 టోల్ ఫ్రీ నెంబరుకు కాల్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని అన్నారు. అన్నదాత సుఖీభవ కింద ప్రకాశం జిల్లాకు రూ.186 వెళ్లాం. ప్రజలు బ్రహ్మాండమైన మెజార్టీతో గెలిపించారు. గత ప్రభుత్వం రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం చేసింది. చాలా సమస్యలు వచ్చాయి. ఎన్ని కష్టాలున్నా ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని సూపర్‌సిక్స్ అమలు చేస్తున్నాం. నేను హామీ ఇచ్చినట్టే పెంచిన రూ.4000 పింఛన్ గత ఏడాది ఏప్రిల్ నుంచే ఇచ్చాను. పింఛన్ల కోసం ఏడాదికి 64 లక్షల మందికి రూ.32,134 కోట్లు ఖర్చు చేస్తున్నాం. గత ప్రభుత్వం ఐదేళ్లలో రూ.1000 మాత్రమే పెంచింది. భర్త చనిపోతే భార్యకు వితంతు పెన్షన్ ఎగ్గొట్టారు. ఎవరైనా లబ్దిదారులు రెండు నెలలు పింఛన్ తీసుకోకపోయినా మూడు నెలల మొత్తాన్ని ఒకే సారి ఇస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు.

**15వ తేదీ నుంచి ఉచిత బస్సు:** తల్లికి వందనం కింద ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అందరికి రూ.15వేలు ఇచ్చాం. గత ప్రభుత్వం అందరికి ఇస్తామని ఎన్నికల్లో చెప్పి తీరా గెలిచాక మాట మార్చి ఒక్కరికే పరిమితం చేశారు. దీపం పథకం కింద ఆడ బిడ్డల జీవితాల్లో వెలుగులు నింపాను. దీపం కింద మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. ఇందుకోసం రూ.2,700 కోట్లు వెచ్చిస్తున్నాం. ఈనెల ఆగష్టు 15న స్త్రీ శక్తి కింద ఆడ బిడ్డలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తాం. దీని వల్ల రాష్ట్రంలో 2 కోట్ల 60 లక్షల మంది మహిళలకు లబ్ధి చేకూరుతుంది. మీ పెద్దలు ఇచ్చిన ఆస్తి కంటే నేను నెలవారీ చేసే సాయమే ఎక్కువ. ప్రభుత్వం అన్నా క్యాంటీన్లు పెట్టి రూ.5కే భోజనం పెడుతుంటే గత ప్రభుత్వం క్యాంటీన్లను మూసేసిందని సీఎం చంద్రబాబు అన్నారు. **రిజర్వాయర్లు కళకళ :** ముందు చూపుతో అన్ని రిజర్వాయర్లకు నీరు వదలడంతో 700 టీఎంసీలతో రిజర్వాయర్లన్నీ కళకళలాడుతున్నాయి. శ్రీశైలం, నాగార్జున సాగర్, పులిచింతల, కాటన్ బ్యారేజ్, ప్రకాశం బ్యారేజ్, సోమశిలలో సమృద్ధిగా నీరు ఉంది. ఎవరికి తాగు, సాగు నీటి కొరత లేకుండా నదుల అనుసంధానం చేస్తాం. భూగర్భ జలాల పెంపుపై ప్రజలు కూడా దృష్టి సారించాలని కోరుతున్నాను. 2014-19 మధ్య కాలంలో సాగునీటి రంగానికి రూ.68 వేల కోట్లు ఖర్చు చేయగా గత ప్రభుత్వం రూ.12 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. గత పాలకులు ఉచిత భీమా పథకాన్ని నాశనం చేస్తే కూటమి అధికారంలోకి వచ్చాక మళ్లీ మేం దాన్ని పునరుద్దరించాం. వైసీపీ హయాంలో రూ.1,670 కోట్ల ధాన్యం డబ్బులను రైతులకు ఎగ్గొట్టారు. కూటమి వచ్చాకే ఆ బకాయిలన్నీ చెల్లించాం. గుండ్లకమ్మ గేట్లకు మేం మరమ్మత్తులు చేసి ప్రాజెక్టును సంరక్షించాం. వెలిగొండను గత ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. వచ్చే సీజన్‌కి ఫేజ్ వన్ పూర్తి చేసి కృష్ణా జలాలు వెలిగొండ ద్వారా ప్రకాశం జిల్లాకు తీసుకువస్తాం. 2027 డిసెంబర్ నాటికి పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్, పార్టీ జిల్లా అధ్యక్షులు నూకసాని బాలాజీ, బాక్టర్ కడియాల లలిత్ సాగర్, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, ఏఎంసీ ఛైర్మన్ దారం నాగవేణి సుబ్బారావు, మున్సిపల్ ఛైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, రైతులు పాల్గొన్నారు.



శనివారం డ్రైఫ్లవర్స్‌తో రూపొందించిన శ్రీవారిచిత్రపటాన్ని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ దంపతులకు అందజేస్తున్న టిటిడి అదనపు ఇఒ వెంకయ్య చౌదరి

# దేశం సంక్షేమంతో అభివృద్ధి చెందాలి

## పేదల జీవితాలు మెరుగుపడాలని వేడుకున్నా

## తిరుమలలో కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ

**తిరుమల,ఆగస్టు 2ప్రభాతవార్తప్రతినిధి:** దేశం సుసంపన్నంగా ఉండాలని, దేశ ప్రజల సంక్షేమం కోసం పేదల జీవితాలు మెరుగుపడాలని శ్రీవేంకటేశ్వరస్వామిని వేడుకున్నట్లు కేంద్ర రోడ్డు రవాణా జాతీయరహదారుల శాఖమంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించానన్నారు. శనివారం ఉదయం కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ కుటుంబంతో కలసి తిరుమల ఆలయంలోనికి చేరుకున్నారు. మహద్వారం వద్ద టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం స్వాగతం పలికారు. తొలుత ధ్వజస్తంభానికి మొక్కిన గడ్కరీ ఆనందనిలయంలో శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. కానుకలు సమర్పించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. అదనపు ఇఒ వెంకయ్యచౌదరి శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. స్వామివారి శేషవస్త్రం బహుకరించారు. స్వామివారి దర్శనంతో మనసు సంతోషం కలిగిందన్నారు. కేంద్రమంత్రి వెంట టిటిడి బోర్డుసభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి ఉన్నారు.

# ఇథనాల్ సృష్టికర్తలు రైతులే

>> విమానాలు కుడా రైతులు తయారు చేసే ఇంధనంతో నడుస్తాయన్నారు.ఇథనాల్,మిథనాల్, సీఎన్‌జీ,బయో డిజిల్ వినియోగం పెరుగుతుందన్నారు.ఈవీ వాహనాల తయారీ శరవేగంగా పెరుగుతుందన్నారు., లిథియం బ్యాటరీలు ఖర్చు క్రమంగా తగ్గుతుందన్నారు,వందశాతం ఇథనాల్‌తో నడిచే వాహనాలు రావాలన్నారు,.కాలుష్య రహిత దేశమే మన లక్ష్యం కావాలన్నారు.ఈ ఆర్థిక సంవత్సరంలోనే రూ.లక్షల కోట్లుతో పనులు ప్రారంభిస్తామన్నారు.నాగ్‌పూర్, జబల్‌పూర్‌లో వరిగడ్డి వినియోగించి రోడ్లు వేసామన్నారు.ఏపీ అన్ని రంగాల్లో వేగంగా దూసుకుని పోతుంది,మంచి నాయకుడు ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు.చంద్రబాబు గురించి వినేవాళ్ళమన్నారు.ఆయన లాంటి విజన్ ఉన్న నాయకులు అరుదుగా ఉంటారన్నారు. మన దేశ జీడీపీలో వ్యవసాయ రంగం వాటా 12శాతంగా ఉందన్నారు.అది 22 శాతానికి పెరగాలన్నదే తమ లక్ష్యం అని గడ్కరీ అన్నారు,మన రైతులు కేవలం అన్నదాతలు మాత్రమే కాదు. ఇంధన దాతలు కూడా. రాష్ట్ర పర్యటనలో భారీ ప్రాజెక్టులను మంజూరు చేస్తూ ప్రకటన చేసిన కేంద్ర మంత్రి గడ్కరీ హైదరాబాద్ విజయవాడరోడ్డు 6 లేన్లు చేస్తారు. ఖర్చు రూ.6700కోట్లు విజయవాడ మచిలీపట్నం రోడ్డు 6 లేన్లు చేస్తారు. ఖర్చు రూ.2600 కోట్ల వినుకొండ గుంటూరు రోడ్డు 4 లేన్లు చేస్తారు. ఖర్చు రూ.2605 కోట్లుగుంటూరు నిజాంపట్నం రోడ్డు 4 లేన్లు చేస్తారు. ఖర్చు రూ.2000 కోట్లుబుగ్గకయిప గిద్దలూరు రోడ్డు 4 లేన్లు చేస్తారు. ఖర్చు రూ.4,200 కోట్లు ఆకివీడు దిగమర్రు రోడ్డు 4 లేన్లు చేస్తారు. రూ.2500 కోట్లు పెడన లక్ష్మీపురం రోడ్డు 4 లేన్లు చేస్తారు. ఖర్చు రూ.4,200 కోట్లు ముద్దనూరు కడప రోడ్డు 4 లేన్లు చేస్తారు. ఖర్చు రూ.1182 కోట్లు ఇవి కాకుండా హైదరాబాద్ విజయవాడ గ్రీన్ ఫీల్డ్ హైవే కూడా మంజూరు చేశారు.ఏడాదిలో మరో లక్ష కోట్ల రూపాయాల హైవే ప్రాజెక్టుల మంజూరుకు వేదిక నుంచే గడ్కరీ అంగీకారం తెలిపారు. దీనిపై సంతోషాన్ని వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు...గడ్కరీకి ధన్యవాదాలు తెలిపారు

**అభివృద్ధికి నాగరీకతకు రహదారులు చిహ్నం: సీఎం చంద్రబాబు**

అభివృద్ధి, నాగరికతకు రహదారులు చిహ్నమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉద్ఘాటించారు. పోలవరానికి కేంద్రమంత్రి నితిన్ జైరామ్ గడ్కరీ అండదండలు ఎప్పటికీ మరిచిపోలేమని నొక్కిచెప్పారు. గడ్కరీ అంకితభావం, చిత్తశుద్ధి చాలా గొప్పవని కొనియాడారు. గడ్కరీ చొరవతో రోజుకు 37 కిలోమీటర్ల హైవేల నిర్మాణం పూర్తి చేశామని వెల్లడించారు.ప్రధాని నరేంద్రమోదీ దూరదృష్టితో రోడ్లకు రూపం ఇస్తే దాన్ని గడ్కరీ ముందుకు తీసుకువెళ్తున్నారు. ఇప్పుడు ఆరు ప్రాజెక్టులు నితిన్ గడ్కరీ అనౌన్స్ చేశారు. భవిష్యత్తులో రోజుకు 50 కిలో మీటర్లు రహదారులు మీ ఆధ్వర్యంలో నిర్మాణం అవుతాయి. నెల్లూరు నుంచి తిరుపతికి గతంలో 10 గంటలు పట్టేది. ఐదేళ్లు ఏపీలో రోడ్లు విధ్వంసం అయిపోయాయి. ఏపీలో 4300 కిమి ఉంటే 5 సంవత్సరాల్లో 8700 కిలోమీటర్లు పెంచే ప్రయత్నం గతంలో చేశాం. 11వేల కోట్లు 760 కిలోమీటర్లు ఒక్క ఏడాదిలో పూర్తిచేసాం.ఏపీలో ల్యాండ్ అక్విజేషన్ సమస్య లేదు... మీరు ఆదేశించండి యుద్ద ప్రాతిపదికను పనులు పూర్తిచేస్తాం. రూ.15000 కోట్లతో 1000కిలోమీటర్లు ఈసంవత్సరం పూర్తిచేస్తాం. రవాణా ఖర్చులు మన దగ్గర తగ్గాలంటే లాజిస్టిక్ పెరగాలి... అంటే పోర్టులు, రోడ్లు బాగుండాలి. డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ ముందుదేశంలో వేగవంతంగా జరుగుతున్న జాతీయ రహదారుల అభివృద్ధిని స్ఫూర్తిగా తీసుకొని, రాష్ట్రంలోనూ మారుమూల ఏజెన్సీ ప్రాంతాల్లో అడవి తల్లి బాట పేరుతో సుందరమైన రోడ్లు వేస్తున్నాం. పీఎం జన్ మన్ పథకం, ఉపాధి హామీ నిధులు, రాష్ట్ర ప్రభుత్వం గ్రాంటు కలుపుకొని రూ.1005 కోట్లతో స్వాతంత్రం వచ్చిన తర్వాత రోడ్లు కూడా చూడని గిరి ప్రాంతాలను అనుసంధానం చేస్తున్నాం. మౌలిక వసతుల అభివృద్ధితో పాటు ఎకో టూరిజం మీద దృష్టి నిలిపి గిరిజన ప్రాంత యువతకు ఉపాధికి దారులు చూపుతున్నామని ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ చెప్పారు. గత ప్రభుత్వం కూల్చివేతలతో పాలన మొదలుపెట్టి రహదారుల గుంతలు, విధ్వంసంమిగిలిస్తే, దాన్ని అధిగమించి కూటమి పాలన ముందుకు వెళ్తోందన్నారు. రాష్ట్రంలోని 29జాతీయ రహదారుల శంకుస్థాపనలు, పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో వేస్తున్న రోడ్లు కొత్త భవిష్యత్తుకు పునాది వేస్తాయి. అభివృద్ధిలో వెనుకబడిన గిరిపుత్రుల బతుకుల్లో కొత్త వెలుగులు తీసుకొస్తాయి. అడవి తల్లి బాట పథకానికి అడిగిన వెంటనే రూ.50 కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వ గ్రాంటును విడుదల చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నితిన్ గడ్కరీని ఏపీ సీఎం చంద్రబాబు ఘనంగా సత్కరించారు.

# సింగపూర్ నుంచి మలేసియా చేరుకున్న మంత్రి నారాయణ

## కౌలాలంపూర్‌లో సీఆర్డీయే కమిషనర్ కన్నబాబుతో కలిసి పర్యటన

**విజయవాడ,ఆగస్టు2,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతి నిర్మాణానికి సంబంధించి మలేషియా లో ఉన్న ఉత్తమ పద్ధతులను మంత్రి.అధ్యయనం చేస్తారు,.ఆయా అంశాలపై అక్కడి ఆర్కిటెక్స్, సాంకేతిక నిపుణులతో ప్రభుత్వ బాధ్యులతో చర్చిస్తారు.ఉదయం కౌలాలంపూర్ అధికారులతో కలిసి వరద నివారణ చర్యలు,అర్బన్ డెవలప్మెంట్ ,ఐకానిక్ స్కై స్క్రాపర్,పెట్రోనాస్ ట్విన్ టవర్స్,పిరమిడ్ మాల్ ,కన్వెన్షన్ సెంటర్లు,ను మంత్రి.అధ్యయనం చేయనున్నారు. మధ్యాహ్నం మలేషియా పరిపాలన రాజధాని పుత్రజయ నిర్మాణంపై మంత్రి నారాయణ అధ్యయనం చేయనున్నారు. ఇప్పటికే ఆయన ఇందుకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ఆయన అక్కడి అధికారుల నుంచి తెలుసు కున్నారు. పుత్రజయలో ప్రభుత్వ పాలన భవనాల నిర్మాణాలు,మౌలికవసతులు,టెక్నాలజీ పార్కులను మంత్రి నారాయణ. పరిశీలిస్తారు. వీటితో పాటు నగరనిర్మాణం,అక్కడి కట్టడాలు, డ్రైనేజీ వ్యవస్థ,గ్రీనరీ ఇతరంశాలపై తెలుసుకుంటారు.

# దేవాంశ్ కోసం సెలవు పెట్టా..

>> చేసిన ట్వీట్ అందరిని ఆకట్టుకుంది. ఆంధ్రప్రదేశ్ లో అత్యంత బిజీ నేతల్లో ఒకరైన ఐటీ, హెచ్ఆర్డీ మంత్రి నారా లోకేష్, శనివారం తన కొడుకు దేవాన్ష్ స్కూల్‌లో జరిగిన పేరెంట్ టీచర్ మీటింగ్‌కి హాజరయ్యారు. సాధారణంగా రాష్ట్రంలోని పెట్టుబడుల ఆకర్షణతోపాటు రాష్ట్రంలో కీలక మంత్రిగా, అంతకంటే ఎక్కువగా ముఖ్యమంత్రి కుమారుడిగా నిరంతరం అనేక సమావేశాలు, అధికార పర్యటనలతో నిత్యం తీరిక లేకుండా గడుపుతున్నారు లోకేష్. అయితే ఈసారి మాత్రం తన కొడుకు పాఠశాలలో జరిగే కార్యక్రమానికి ప్రత్యేకంగా ఒక రోజు సెలవు తీసుకున్నా అంటూ చేసిన ట్వీట్ అందరిని ఆకట్టుకుంది.

# సిట్‌వద్ద కీలక విడియో

>> వెంకటేష్ నాయుడును సిట్ అరెస్ట్ చేసింది. ఇప్పటివరకూ తనకు మద్యం వ్యాపారంతో సంబంధం లేదని వైసీపీ కీలకనేత చెవిరెడ్డి చెబుతున్నారు.అయితే. చెవిరెడ్డికి అత్యంత సన్నిహితుడైన వెంకటేష్ నాయుడుకు చెందిన ప్రదేశంలో దొరకటంతో ఈ కేసు ఇప్పుడు మరింత రసవత్తరంగా మారింది.

**ఆ 11 కోట్లు బ్యాంకులో జమ :** మద్యం కుంభకోణం ద్వారా పట్టుబడిన రూ.11 కోట్లు బ్యాంకులో సిట్ అధికారులు డిపాజిట్ చేశారు. ఆ నోట్లను వీడియో తీయాలని, విడిగానే ఉంచాలని ఏసీబీ కోర్టులో రాజ్ కసిరెడ్డి తరపు న్యాయవాదులు పిటీషన్ వేశారు. అన్ని నోట్ల కట్టలను ఫొటోలు, వీడియో తీయించినట్లు కోర్టుకు సిట్ అధికారులు తెలిపారు. బ్యాంకులో డిపాజిట్ చేసిన రూ.11 కోట్లను విడిగానే భద్రపరచాలని సెట్‌కు ఆదేశాలు జారీ చేసింది ఏసీబీ కోర్టు. కోర్టు ఆదేశాల కాపీలను బ్యాంకు అధికారులకు కసిరెడ్డి తరపు న్యాయవాదులు అందజేశారు.లిక్కరు స్కాంలో నిందితులకు చెందినవిగా చెప్పబడిన ప్రదేశంలో ఇటీవల సిట్ అధికారులు రూ.11కోట్లు స్వాధీనం చేసుకున్నారు. వీటితో తమకు సంబంధంలేదని లిక్కర్ కేసులో నిందితుడు కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి ఏపీ హైకోర్టు అఫిడవిట్ దాఖలు చేసారు. ఈ పరిణామాల నడుమ సోదాల్లో దొరికిన సోమ్మును బ్యాంకులో డిపాజిట్ చేయాలని విజయవాడ ఏసీబీ కోర్టు సిట్‌ను ఆదేశించింది. కోర్టు ఆదేశాలను సిట్ అమలుచేసింది.

# 10 పంపులతో ఎత్తిపోతలు

>> జలాలను ఎత్తిపోస్తున్నారు. 10 పంపులను ఆన్ చేయడం ద్వారా హంద్రీనీవా ప్రధాన కాలువలో 3,150 క్యూసెక్కుల నీరు జీడిపల్లి వైపు పరుగులు తీస్తుండటంతో నిండుగా కనిపిస్తోంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత హంద్రీనీవా ప్రధాన కాలువను 3,650 క్యూసెక్కుల సామర్థ్యంతో వెడల్పు చేయాలని నిర్ణయించి పనులు ప్రారంభించి కేవలం 100 రోజుల్లో మొదటి దశ కాలువ వెడల్పు పనులు పూర్తి చేయడంతో అసాధ్యమనుకున్నది సుసాధ్యమైంది. కాగా ఉదయం దాదాపు గంటపాటు 10 పంపులతో ఎత్తిపోతలు కొనసాగింగిన అధికారులు ఆ తరువాత ఒక పంపును ఆఫ్‌చేసి 9 పంపులతో ఎత్తిపోతలు కొనసాగిస్తున్నారు. 2013 నుండి హంద్రీనీవా కాలువకు నీరు వస్తుండగా ప్రతి ఏడాది గరిష్టంగా 6 పంపులతో మాత్రమే నీటిని ఎత్తిపోసినట్లు తెలుస్తోంది. జూలై 17న కర్నూల్ జిల్లా మల్యాల వద్ద నుండి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కాలువకు నీటి విడుదల చేశారు. ఈ క్రమంలోనే 22వ తేదీ నుండి రాగులపాడు లిఫ్ట్ నుండినీటి ఎత్తిపోతలు ప్రారంభంకాగా అతితక్కువ సమయంలోనే 1.68 టీఎంసీల నీటి సామర్థ్యంగల బెలుగుప్ప మండలంలోని జీడిపల్లి జలాశయం నిండటంతో అక్కడి నుండి నీటిని 11.100 టీఎంసీల నీటి నిలువ సామర్థ్యంగల పీఏబీఆర్ జలాశయం విడుదల చేస్తున్నారు.

# విచ్ఛిన్నం చేయలేరు

>> రూ.1000 కోట్లతో రోడ్లు వేయగలిగామని చెప్పుకొచ్చారు.అటవీ అనుమతులతోనే రోడ్లకు ప్రణాళికలు వేసి ముందుకు తీసుకెళ్తున్నామని ఉద్ఘాటించారు. గత జగన్ ప్రభుత్వాన్ని చూశామని.. కూల్చివేతలతో ఆ ప్రభుత్వం మొదలైందని కనీసం రోడ్లు కూడా వేయలేదని, రహదారులపై గుంతలు పూడ్చలేదని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వంలో ఇప్పుడు రహదారులు, హైవేలు నిర్మిస్తున్నామని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

**వారం - వర్జ్యం**

తేది : 03-08-2025, ఆదివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
శ్రావణ మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం
నవమి ఉ.9.41
విశాఖ ఉ.6.34
వర్జ్యం ఉ.11.00-12.47
దు.సా.4.52-5.43
శుభసమయం:ఉ.10.00-11.00,సా.6.30-7.30
రాహుకాలం - సా.4.30-6.00

**వార్తాఫలం**

**మేషం :** ఆర్థికపరిస్థితి సానుకూలంగా ఉంటుంది. వివాదాలకు దూరంగా ఉండండి. కొత్త కాంట్రాక్టులు లభిస్తాయి.

**వృషభం :** అనుకున్న అవకాశాలు శ్రమించడం వలన కలిసివస్తాయి. ఉద్యోగులకు హోదాలు లభిస్తాయి.

**మిథునం:** చాకచక్యంగా వ్యవహరించి పనులు సకాలంలో పూర్తిచేస్తారు. శుభకార్యాలకు హాజరవుతారు.

**కర్కాటకం :** ఉద్యోగులకు హోదాలు లభిస్తాయి. పాతమిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు.

**సింహం:** షేర్లు, భూముల క్రయ విక్రయాలలో ఆచితూచి వ్యవహ రించండి. ఆర్థికపరిస్థితి మెరుగుపడతాయి.

**కన్య :** సన్నిహితులకు మీవంతు సహాయం అందిస్తారు. సంబంధ బాంధవ్యాలు మెరుగుపడతాయి.

**తుల :** బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు. విలువైన వస్తువులు, వస్త్రాలు కొనుగోలుచేస్తారు.

**వృశ్చికం:** జీవితభాగస్వామి సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

**ధనుస్సు:** వివాహ, ఉద్యోగ యత్నాలు ముమ్మరం చేస్తారు. దూరప్రాంతాల నుండి కీలక సమాచారం అందుకుంటారు.

**మకరం:** స్థిరాస్తి వివాదాలు తీరి లబ్ధిపొందుతారు. పలుకుబడి కలిగిన వ్యక్తులను కలుసుకుంటారు.

**కుంభం:** ముఖ్యమైన కార్యక్రమాలు నెమ్మదిగా పూర్తికాగలవు. ఆర్థికపరిస్థితి అంతంతమాత్రంగా ఉంటుంది.

**మీనం :** ఆరోగ్యసమస్యలు ఎదురైనా అధిగమిస్తారు. స్థిరాస్తి వివాదాలు, కోర్టుకేసులు పరిష్కరించుకుంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఉచిత బస్సుపై రేపు ఉపసంఘం కీలకభేటీ

>> ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్‌లు అన్నీ కలిపి 8,548 (74 శాతం) ఉన్నాయి. పథకం అమలులో ఇవే కీలకం కానున్నాయి. సాధారణంగా ప్రతి డిపోలో కొన్ని బస్సులు స్పేర్ కింద పక్కన పెట్టేవి కూడా ఆగస్టు 15 నుంచి ఈ బస్సులనూ రోడ్డెక్కించనున్నారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంత విద్యార్థుల కోసం ఆర్టీసీ 371 స్కూల్ బస్సులు నడుపుతోంది. ఇవి ఆయా నగరాలు, పట్టణాలకు సమీపంలోని గ్రామాలకు ఉదయం వెళ్లి విద్యార్థులను బడులకు తీసుకొస్తాయి. మళ్లీ సాయంత్రం బడుల నుంచి ఊళ్లకు తీసుకెళ్తాయి. మిగిలిన సమయమంతా డిపోలోనే ఉంటాయి. ఇకపై మిగిలిన సమయంలో ఈ బస్సులను కూడా ఇతర రూట్లలో నడపనున్నారు. ప్రయాణికులతో సహనంగా వ్యవహరించండి: పథకం మొదలయ్యాక తొలి మూడు నెలలు అధిక రద్దీ ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఎక్కువ మంది మహిళలు బస్సుల్లో ప్రయాణించేందుకు ఆసక్తి చూపిస్తారని, దీనివల్ల అన్ని బస్సుల్లో రద్దీ పెరగనుందని భావిస్తున్నారు. దీంతో డ్రైవర్లు, కండక్టర్లకు అధికారులు తగిన సూచనలు చేస్తున్నారు. రద్దీ సమయంలో ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేసినా సహనంగా వ్యవహరించాలని పేర్కొంటున్నారు.

**మహిళలకు వేరుగా టికెట్లు:** ఉచిత ప్రయాణం అమలు ఉన్న బస్సుల్లో మహిళలకు వేరుగా జీరో టికెట్లు ఇవ్వనున్నారు. మగవారికి సాధారణ టికెట్లు, మహిళలకు జీరో టికెట్లు ఇస్తారు. భర్త, భార్య ప్రయాణిస్తే భర్తకు ఛార్జీ ఉండే టికెట్, భార్యకు జీరో టికెట్ రెండూ వేర్వేరుగా జారీ చేస్తారు. జీరో టికెట్ల జారీపైకండక్టర్లకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రస్తుత టిమ్స్‌లలో కొత్తగా ఉమెన్ ఫ్రీ టికెట్ అనే ఆప్షన్ తీసుకొస్తున్నారు.

# ఈవెంట్ మేనేజ్ మెంట్ రంగానికి ప్రోత్సాహం

>> లో పలువురు ఈవెంట్ మేనేజర్లతో వారు చర్చించారు. స్వర్ణాంధ్ర టూరిజం విజన్ 2029ను, ఏపీలో పర్యాటక వృద్ధికి గల అవకాశాలను కూలంకషంగా వివరించారు. ఈ రంగం ద్వారా రాష్ట్ర ఆర్థిక అభివృద్ధితో పాటు ఉపాధి అవకాశాల పెంచడానికి కృషి చేస్తోందని తెలిపారు. సరికొత్త ఆలోచనలతో, సృజనాత్మకతతో కూడిన కార్యక్రమాల ద్వారా పర్యాటకులను ఆకర్షించాలని నిర్ణయించామని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. ఏపీ పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా ఉందని ఇన్వెస్టర్లకు చెబుతూ నూతన పర్యాటక పాలసీ విధివిధానాలు, రాష్ట్ర వనరుల గురించి, పర్యాటకాభివృద్ధిలో ఈవెంట్ మేనేజ్ మెంట్ భాగస్వామ్య ఆవశ్యకతను వివరించారు. ఏపీ పర్యాటకంలో పెట్టుబడులు పెడితే భరోసా కల్పించే బాధ్యత మాదని ఈ సందర్భంగా ఇన్వెస్టర్లకు వారు వివరించారు. ప్రస్తుతం ఏ రంగంలోనైనా ఎలాంటి కార్యక్రమం చేపట్టాలన్నా ఈవెంట్ మేనేజ్ మెంట్ పరిశ్రమ భాగస్వామ్యం తప్పనిసరి అని మంత్రి దుర్గేష్ అన్నారు.ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ పర్యాటక అభివృద్ధిలో ప్రకృతి సౌందర్యంతో పాటు ఈవెంట్ మేనేజ్మెంట్ ల ఏర్పాటు అవసరాన్ని వివరించారు. మారుతున్నప్రపంచంలో ఈవెంట్ మేనేజ్ మెంట్ కి ప్రాముఖ్యత సంతరించుకుందని, ప్రజల్లో పెరుగుతున్న పర్యాటక ఆసక్తిని, ఇంట్లో జరిగే శుభకార్యాలు మొదలుకొని సినిమా ఫంక్షన్ల వరకు చేస్తున్న ఈవెంట్లను, ఈవెంట్ మేనేజ్ మెంట్ కు పెరిగిన ఆదరణ, ఆవశ్యకతను దృష్టిలో పెట్టుకొని పర్యాటకాభివృద్ధిలో భాగస్వామ్యులను చేయాలని భావిస్తున్నామన్నారు. అందులో భాగంగా ఏపీ టూరిజం అథారిటీ 21 ఈవెంట్ మేనేజ్ మెంట్ ఏజెన్సీలను 2 కేటగిరీల క్రింద ఎంప్యానెల్ మెంట్ చేసిందన్నారు. కేటగిరి ఏలో మెగా, జిల్లా స్థాయి ఈవెంట్స్, కేటగిరి బీలో జిల్లా స్థాయి ఈవెంట్స్ ఉంటాయన్నారు.110కి పైగా టూరిజం ఆపరేట్లను ఎంప్యానెల్ చేసిన విషయం వెల్లడించారు.ఈ నేపథ్యంలో తిరుపతి, విజయవాడ, విశాఖపట్నంలో మీటింగ్స్, ఇన్సెంటివ్స్, కన్వెన్షన్స్, ఎగ్జిబిషన్స్(ఎంఐసీఈ), వైజాగ్ బీచ్, కాకినాడ, అమరావతిలలో మ్యూజిక్ మరియు ఎంటర్ టైన్ మెంట్ ఈవెంట్స్,లేపాక్షి, తిరుపతి, అమరావతిలో పండుగలు, ఫెయిర్స్, విజయవాడ, తిరుపతిలో స్పోర్ట్స్ ఈవెంట్స్, కూచిపూడి గ్రామం,అమరావతి, వైజాగ్ లో ఆర్ట్ అండ్ కల్చరల్ ఈవెంట్స్, దిండి, అరకు వ్యాలీ, హార్సిలీ హిల్స్ లో డెస్టినేషన్ వెడ్డింగ్స్, తిరుపతి, అమరావతిలో ఎడ్యుకేషనల్ ఈవెంట్స్ నిర్వహించి తద్వారా పర్యాటకులను ఆకర్షించాలని భావిస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో 8 మెగా ఈవెంట్స్, 15 జిల్లా ఈవెంట్స్ నిర్వహించేందుకు ఈవెంట్ క్యాలెండర్ ను సిద్ధం చేశామన్నారు. గడిచిన 6 నెలల్లో ఏపీ ప్రభుత్వం 85కి పైగా ప్రఖ్యాత హోటల్లు, ఎంఐసీఈలతో ఎంవోయూలు కుదుర్చుకుందని మంత్రి దుర్గేష్ తెలిపారు. అంతేగాక 10,655 కోట్ల పెట్టుబడులు రాబట్టామన్నారు. తద్వారా 8163 గదులు ఏర్పాటు అవుతాయని, 7 ఎంఐసీఈ కన్వెన్షన్ సెంటర్ లు నెలకొల్పబడుతాయన్నారు. వీటి ద్వారా రాబోయే నాలుగేళ్లలో 22325 మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి కలగనుందన్నారు.

# '3'కు చేరువలో భారత్

>> ఉగ్రవాదులకు మద్దతు ఇచ్చే వాళ్ల పాకిస్థాన్‌లోనూ, ఇండియాలోనూ ఏడుస్తున్నారని విమర్శించారు. మన సైనిక బలగాలను కాంగ్రెస్ నిత్యం అవమానిస్తోందని, ఆపరేషన్ సింధూర్‌ను తమాషా అని పిలుస్తోందని మోదీ అన్నారు. కాంగ్రెస్ వ్యాఖ్యలను సిగ్గులేని చర్యగా ఆయన అభివర్ణించారు. ఉగ్రవాదులను ఇప్పుడు ఎందుకు చంపారని సమాజ్‌వాదీ పార్టీ అడుగుతోందని, వాళ్లను పిలిచి.. చంపాలా వద్దా అని అడగాలా, లేదంటే వాళ్ల పారిపోయే వరకు వేచి చూడాలని అని ప్రశ్నించారు. ఆపరేషన్ సింధూర్ సమయంలో భారతదేశ రుద్ర స్వరూపాన్ని ప్రపంచం తిలకించిందని, ఇప్పుడు నవ భారతం శత్రువులకు కాలభైరవుడిగా మారినట్లు ప్రధాని మోదీ వెల్లడించారు. పాకిస్తాన్ వైమానిక స్థావరాలు ఇప్పటికీ ఐసీయూలో ఉన్నాయని ఎద్దేవా చేశారు. బ్రహ్మోస్ మిసైళ్ల వల్ల పాకిస్తాన్‌కు నిద్ర పట్టడం లేదు.

ఈ క్రమంలో పాక్ మళ్లీ దాడులు చేయాలని చూస్తే, ఉత్తరప్రదేశ్‌లో తయారవుతున్న బ్రహ్మోస్ మిసైళ్లతో ఉగ్ర స్థావరాలను నేలమట్టం చేస్తామని మోదీ హెచ్చరించారు. లక్నోలో బ్రహ్మోస్ తయారీ యూనిట్ త్వరలో ప్రారంభం కానుంది. రక్షణ రంగంలో భారత్ స్వయం సమృద్ధిగా మారుతోందని, యూపీ డిఫెన్స్ కారిడార్‌లో పెద్ద పెద్ద కంపెనీలు పెట్టుబడి పెట్టడం ఇప్పటికే ప్రారంభించాయని ప్రధాని తెలిపారు.

# 15 సీట్లు రాకపోయి ఉంటే మోడీ ప్రధాని కాలేరు

>> ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందన్నారు. దాదాపు 70 నుంచి 100 లోక్‌సభ సీట్లలో రిగ్గింగ్ జరిగి ఉండొచ్చని, ఒకవేళ 15 సీట్లలోనే రిగ్గింగ్ జరిగి ఉంటే మోడీకి ప్రధానిగా అవకాశమే లభించేది కాదని రాహుల్ కామెంట్ చేశారు. చాలా స్వల్ప మెజారిటీతో ప్రధానమంత్రి కుర్చీపై నరేంద్ర మోడీకూర్చొని ఉన్నారనే విషయాన్ని అందరూ గుర్తుంచుకోవాలన్నారు. ఇంకొన్ని సీట్లు తక్కువగా వచ్చి ఉంటే ఆయన అక్కడ కూర్చోగలిగే వారే కాదని పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లోనూ రిగ్గింగ్ జరిగే అవకాశం ఉంటుందని రాబోయేకొన్ని రోజుల్లో తాము నిరూపించబోతున్నామని ఆయన వెల్లడించారు. కర్ణాటక రాష్ట్రంలోని ఒక అసెంబ్లీ స్థానంలో ఉన్న ఓటర్ల ఫొటోలు, పేర్లను తమ పార్టీ తనిఖీ చేయగా, మొత్తం 6.5 లక్షల ఓటర్లలోని 1.5 లక్షల మంది ఓటర్లు నకిలీలే అని తేలిందని రాహుల్ చెప్పారు. ఈ సమాచారాన్ని కాంగ్రెస్ విడుదల చేశాక ఎన్నికల వ్యవస్థలో ప్రకంపనలు రావడాన్ని అందరూ చూస్తారని, అది ఆటం బాంబులా కుదిపేస్తుందన్నారు. రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన కేంద్ర ఎన్నికల సంఘం కొందరి హస్తాల్లోకి వెళ్లిపోయిందని, దాని ఉనికి ప్రశ్నార్థకంగా మారిందని ఆయన ఆరోపించారు. ఇంతకుముందు తగిన సాక్ష్యాధారాలు లేక ఈ అంశంపై తాను మాట్లాడలేక పోయేవాడినని తెలిపారు.

03-08Pg3exHMNWJQE_03-08Pg3exHMNWJQE.qxd 8/3/2025 12:47 AM Page 1



# వరి నాట్లు వేసిన హోం మంత్రి అనిత



**గజపతినగరం (విజయనగరం జిల్లా), ఆగస్టు 2 ప్రభాతవార్త :** ఆమె రాష్ట్రానికి మంత్రి. జిల్లాకు ఇన్ఛార్జి మంత్రి కూడా. అయినప్పటికీ తన హోదాను పక్కన పెట్టి రైతుల సమస్యలను తెలుసుకునేందుకు స్వయంగా పొలంలోకి దిగారు. బురదలో అడుగులు వేస్తూ, స్వయంగా తన చేతితో వరి నాట్లు నాటారు. వ్యవసాయ కూలీలతో ఉబాల్లో పాలు పంచుకున్నారు. వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ఆమే రాష్ట్ర హోమ్ శాఖా మంత్రి వంగలపూడి అనిత. గజపతినగరం మండలం బంగారమ్మ పేట వద్ద ఈ అరుదైన సంఘటన శనివారం చోటు చేసుకుంది. మోకాళ్ల వరకు కూరుకుపోయే దమ్ము మడిలో మంత్రి అనిత అతికష్టం మీద కూలీల చేయి పట్టుకొని అడుగుతీసి అడుగు వేస్తూ, వారి కష్టాలను తెలుసుకుంటూ స్వయంగా వరినాట్లను వేయడం చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. ఒక ఎకరం పొలంలో నాట్లు వేయడానికి ఎంత సమయం పడుతుంది, ఎంత మంది పని చేస్తారు, రోజుకు ఎంత కూలీ సంపాదిస్తారు తదితర విషయాలను మంత్రి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ రాష్ట్ర చైర్మన్ కర్రోతు బంగారురాజు, జిల్లా వ్యవసాయ అధికారి రామారావు, పలువురు జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అన్నదాతలకు అండగా నిలుస్తుందని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాతే రైతాంగానికి మంచి రోజులు వచ్చాయని మంత్రి వంగలపూడి అనిత అన్నారు. రైతు సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆమె స్పష్టం చేశారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం జరిగిన అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ తొలి విడత నిధులు విడుదల కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని, రైతులకు చెక్కులు పంపిణీ చేశారు. అంతకు ముందు ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్న కార్యక్రమాల ప్రత్యక్ష ప్రసారాన్ని తిలకించారు. వ్యవసాయ, అనుబంధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్ సందర్శించారు. అనంతరం సభలో ఆమె మాట్లాడుతూ, రైతాంగాన్ని అన్ని విధాల ఆదుకున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కిందని అన్నారు. తమ ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెడుతూ, సూపర్ సిక్స్ లో భాగంగా ఈరోజు అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్‌ను విడుదల చేస్తున్నట్లు చెప్పారు. విత్తనం నాటిన దగ్గరనుంచి పంట కోసి ఇంటికి చేర్చేవరకు రైతుకు అన్ని విధాలా ప్రభుత్వ పరంగా సంపూర్ణ సహకారాన్ని అందిస్తున్నామన్నారు. విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు నాయకత్వంలో రైతన్నకు అన్నివిధాలా భరోసా అందుతోందని చెప్పారు. రైతులకు ఆధునిక పరికరాలను, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడమే కాకుండా, డ్రోన్ల ద్వారా సాగుకు సహకారాన్ని ఇస్తున్నామని తెలిపారు. అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు వినియోగించుకోవాలని సూచించారు.

## మచిలీపట్నం ఎంపి కార్యాలయం ఎదుట ధర్నా

**విజయవాడ,ఆగస్టు2,ప్రభాతవార్తప్రతినిధి:** జనసేన మచిలీపట్టణం ఎంపీ బాలశౌరి కార్యాలయం వద్ద శనివారం ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఎంపీ బాలశౌరి దగ్గర పీఏగా పనిచేస్తున్నగోపాల్ సింగ్ కలిసి నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇప్పిస్తాననని మోసం చేశారంటూ .. బాధితులు ఆందోళన చేపట్టారు. ఉద్యోగాలిప్పిస్తామంటూ .. తమ వద్ద కోటిన్నర రూపాయలు వరకూ వసూలు చేశారని ఆరోపించారు. 60 మంది వద్ద రెండు లక్షల రూపాయల చొప్పున వసూలు చేశారని బాధితులు తెలిపారు. ఎంపీ పీఏ గోపాల్‌సింగ్ గతంలో ఫేక్ అపాయింట్‌మెంట్ లెటర్లు ఇచ్చారని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అపాయింట్‌మెంట్ లెటర్ల గడువు ముగిశాయంటూ తప్పించుకునే ప్రయత్నం చేశారని తెలిపారు. విజయవాడలోని నోవాటెల్‌కు వస్తే మళ్లీ కొత్తగా అపాయింట్‌మెంట్ లెటర్లు ఇస్తానని నమ్మించారని వాపోయారు. దీంతో నిన్న నోవాటెల్ హోటల్‌కు బాధితులు వెళ్లగా, అక్కడకు గోపాల్ సింగ్ రాలేదని చెప్పడంతో బాధితులంతా ఆందోళన చేపట్టారు. తామంతా మోసపోయామని, తమకు న్యాయం చేయాలంటూ ఎంపీ బాలశౌరి కార్యాలయం ఎదుట నిరసన చేశారు. ఎంపీ కార్యాలయం వద్ద ఆందోళన చేయకూడదని పోలీసులు వారిని హెచ్చరించారు. ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని పోలీసులు వెల్లడించారు.

# తిరుమల సమాచారం

## పద్మావతిఅమ్మవారి సేవలో కేంద్రమంత్రి గడ్కరీ



**తిరుచానూరు,ఆగస్ట్ 2 ప్రభాతవార్త:** కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ శనివారం ఉదయం తిరుచానూరు పద్మావతి అమ్మవారిని కుటుంబంతో కలసి దర్శించుకున్నారు. ఆలయం వద్ద రాష్ట్రమంత్రి రాంప్రసాద్‌రెడ్డి, టిటిడి ఇఒ శ్యామలరావు, జెఇఒ వీరబ్రహ్మం, అమ్మవారిఆలయ డిప్యూటీ ఇఒ పి.హరీంధ్రనాథ్ కేంద్రమంత్రికి స్వాగతం పలికారు . అనంతరం ఆలయంలోపల అమ్మవారి ధ్వజస్తంభానికి నమస్కరించారు. అమ్మవారిని దర్శించుకుని ఆశీస్సులుఅందుకున్నారు. ఆలయ అర్చకుడు బాబుస్వామి, టిటిడి బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి, బిజెపి సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు గుండాల గోపీనాధరెడ్డి ,గాలిపుష్పలత కేంద్రమంత్రి వెంట ఉన్నారు.

## వెంగమాంబ బృందావనానికి పుష్పాంజలి



**తిరుమల,ఆగస్ట్ 2, ప్రభాతవార్తప్రతినిధి:** మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ 208వ వర్ధంతి పురస్కరించుకుని తిరుమలలోని వెంగమాంబ బృందా వనానికి పుష్పాంజలి ఘటించారు. శనివారం వెంగమాంబ వంశస్థులు పాల్గొని ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. వెంగమాంబ ప్రాజెక్టు అధికారులు,భక్తులు పాల్గొన్నారు.

## తెలుగు రాష్ట్రాల రైల్వే పిసిసిఎంగా ఇతి పాండే



**గుంతకల్లు రైల్వే, ఆగస్టు 2,ప్రభాతవార్త** తెలుగు రాష్ట్రాల దక్షిణ మధ్య రైల్వే జోనల్ ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ ఇతి పాండే బాధ్యతలను చేపట్టారు. ఇతి పాండే 1995ఐఆర్‌టిఎస్ బ్యాచ్ అధికారిణి. ఆమె అలహాబాద్ విశ్వవిద్యాలయం నుండి మనస్తత్వ శాస్త్రంలో బంగారు పతక విజేత. దక్షిణ మధ్య రైల్వేలో ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించడానికి ముందు ఆమె సెంట్రల్ రైల్వే భూసావల్ డివిజన్‌లో డివిజనల్ రైల్వే మేనేజర్‌గా బాధ్యతలు నిర్వహించారు. సెంట్రల్ రైల్వే ప్రధాన కార్యాలయంలో చీఫ్ కమర్షియల్ మేనేజర్ (ప్యాసింజర్ సర్వీసెస్)గా, సెంట్రల్, వెస్ట్రన్ రైల్వేలలో సరుకు రవాణా చీఫ్ కమర్షియల్ మేనేజర్, డిప్యూటీ చీఫ్ కమర్షియల్ మేనేజర్,సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్,డిసిఎం,ఏసిఎంతో సహా వివిధ పదవులలో సేవలను అందించారు. పాండేకు వాణిజ్య విభాగంలో నైపుణ్యంతో పాటు భద్రత, విజిలెన్స్ విభాగాలలో చేశారు. ఇతిపాండే భూసావల్ డిఆర్‌ఎంగా పనిచేస్తున్న సమయంలో మారుమూల ప్రాంతాలలోని రైల్వే కార్మికులు, వారి కుటుంబాలకు అందుబాటులో ఉండే ఆరోగ్య సంరక్షణ అందించడానికి రుద్ర అనే హాస్పిటల్ ఆన్ వీల్స్ చొరవను ప్రవేశపెట్టారు. ఈ మొబైల్ క్లినిక్ ఆరోగ్య సంరక్షణను మారుస్తూ వారికి అత్యంత అవసరమైన వారికి నేరుగా సకాలంలో వైద్య సేవలను అందిస్తోంది. జనంల్ మేనేజర్స్ అవార్డు(రెండుసార్లు), రైల్వే మంత్రిత్వ శాఖ అవార్డు ఫర్ ఎక్సలెన్స్ అండ్ మెరిటోరియస్ సర్వీసెస్ 2007, ఉమెన్ అచీవర్స్ అవార్డు 2016లను కైవసం చేసుకున్నారు. ఈఏడాది జూన్ 17న, రైల్వే మంత్రి రాజ్ బాషా రజత్ పడక్‌తో సత్కరించారు. ముంబైలో మొట్టమొదటి అన్‌రిజర్వ్డ్ టికెటింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయడంలో ఆమె కీలకపాత్ర పోషించారు. క్లెయిమ్స్ ఆఫీసర్‌గా ఆమె ఎల్ఫిన్‌స్టోన్ రోడ్ తొక్కిసలాట బాధితులందరికి క్లెయిమ్‌లు చేయడంలో కీలకపాత్ర పోషించారు. ఈ ఎపిసోడ్ రైల్వే పరిహారం రైల్వే చట్టం పరిధిలో లేకపోయినా న్యాయవాది ప్రమేయం లేకుండా పరిష్కారం చేయడంలో ముఖ్యమైన పాత్రను పోషించారు. చీఫ్ కమర్షియల్ మేనేజర్(ఫ్రైట్)గా బాధ్యతలను నిర్వర్తిస్తున్న సమయంలో పశ్చిమ రైల్వేపై సరుకు రవాణా కార్యకలాపాల సమగ్ర అవలోకనంపై 'రైడింగ్ ది ఫ్రైట్ ట్రైన్'అనే పుస్తకాన్ని రాశారు. బ్యూరోక్రాట్స్ వార్షిక జాబితా 2024లో 24మంది బ్యూరోక్రాట్ చేంజ్-మేకర్లలో ఆమె ఒకరుగా గుర్తింపు పొందారు. ఈ గౌరవం ఆమె దూరదృష్టి గల నాయకత్వాన్ని, ప్రయాణికుల సేవలు, సరుకు రవాణా సామర్థ్యాన్ని పెంచడంలో అవిశ్రాంత కృషిని ప్రతిబింబిస్తుంది.

## పోలీస్ నియామక ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో సెకండ్ ర్యాంక్ సాధించిన రమ్య మాధురి



**దత్తిరాజేరు (విజయనగరం జిల్లా) ఆగస్టు 2 ప్రభాతవార్త:** పోలీస్ నియామక ఫలితాల్లో విజయనగరం జిల్లా దత్తిరాజేరు మండలం గడసాం గ్రామానికి చెందిన గొర్లి రమ్య మాధురి రాష్ట్రస్థాయిలో సెకండ్ టాపర్‌గా నిలిచి 159 మార్కులు సాధించి రాష్ట్రస్థాయి మహిళా విభాగంలో ఫస్ట్ ర్యాంక్ సాధించింది. జనరల్ విభాగంలో సెకండ్ ర్యాంకు సాధించింది. పోలీస్ శాఖలో ఉద్యోగం సాధించాలని, పోలీస్ యూనిఫాం వేసుకోవాలని పట్టుదలతో చదివానని ఆమె తెలిపారు. తన ఆశయం నెరవేరడం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు. తండ్రి రమణ 2008 సంవత్సరంలో చనిపోవడంతో అప్పటినుండి తల్లి, అన్నయ్య గౌరీ శంకర్ తనను చదివించారని, తన తల్లి అదే గ్రామంలో ఆశా కార్యకర్తగా పనిచేస్తుందని రమ్య చెప్పారు. గడసాం హైస్కూల్లో 10వ తరగతి చదివి 9.3 పాయింట్లు మార్కులు సాధించి స్కూల్లో రెండవ స్థానం పొందానన్నారు. ఇంటర్మీడియట్, డిగ్రీ విజయనగరంలో పూర్తి చేశానని, కాకినాడలో కోచింగ్ తీసుకుని కానిస్టేబుల్ పరీక్ష రాశానని ఆమె పేర్కొన్నారు. కాగా ఆమె కృషి, పట్టుదల పట్ల కుటుంబ సభ్యులు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. రమ్య అద్వితీయ ప్రతిభ పట్ల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పందిస్తూ అత్యుత్తమ ఫలితం సాధించడం ద్వారా రమ్య జిల్లాకే గర్వకారణం అయ్యారని ప్రశంసించారు.

## గోవిందుని బ్రహ్మోత్సవాలకు సిద్ధమవుతున్న తిరుమల !

**తిరుమల,ఆగస్ట్ 2ప్రభాతవార్తప్రతినిధి:** నిత్య కల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లే తిరుమల కొండపై ఏడాదిలో తొమ్మిదిరోజులు పాటు జరిగే వార్షిక బ్రహ్మోత్సవాలంటే భక్తులకు ఎనలేని ప్రీతి. దేశవిదేశాల నుండి అశేష సంఖ్యలో భక్తులు తరలివస్తారు. తొమ్మిది రోజులు 17వాహనాలపై మలయప్ప స్వామి భక్తులకు కనువిందుచేస్తారు. సెప్టెంబర్ 23 నుండి మొదలుకానున్న శ్రీవేంకటేశ్వరస్వామి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు ఆలయం పరిసరాలు , మాఢవీధుల్లో గ్యాలరీలు ఏర్పాటు, తాగునీరు కల్పించేందుకు నీటికొళాయిలు మరమ్మతులు, మాఢవీధుల్లో స్వామివారి దశావతారాల ప్రతిమలతో స్వాగత ఆర్చిలు, ఆధ్యాత్మికత ఉట్టిపడేలా భక్తులను ఆకటుకునేలా తీర్చిదిద్దే పనులు మొదలయ్యాయి. తొమ్మిదిరోజులు జరిగే దేవదేవుని బ్రహ్మోత్సవాలకు కొండంతా సర్వాంగసుందరంగా ముస్తాబవుతోంది. ఇలవైకుంఠం నుంచి కలియుగ వైకుంఠానికి సాక్షాత్తు శ్రీమహావిష్ణువు శ్రీవేంకటేశ్వరునిగా ఆవిర్భవించడం, దీంతో వైకుంఠంగానే తీర్చిదిద్దుతారు. వాహనసేవలు ఊరేగే మాఢవీధుల్లో భక్తుల సౌకర్యార్థం గ్యాలరీల పనులు చేపడుతున్నారు. దక్షిణమాఢవీధిలో వాహనసేవల సమయంలో ఇనుపకంచె దాటిరాకుండా ఉండేందుకు బలమైన గోడను నిర్మిస్తున్నారు. భక్తుల భద్రతను కూడా దృష్టిలో ఉంచుకున్నారు. అధునాతన సిసికెమెరాలు, లైటింగ్స్ అన్నీ మార్పుచేస్తున్నారు.

## శ్రీవారి దర్శనంతో ఆనందం: ప్రముఖులు



**తిరుమల,ఆగస్ట్ 2ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనంతో మనసు ఆనందం కలుగుతుందని, స్వామివారి ఆశీస్సులు ప్రజలందరికీ కలగాలని ప్రముఖులు ఆకాంక్షించారు. తెలిపారు.తిరుమలలో భక్తులకు దర్శన ఏర్పాట్లు బావున్నాయని, భక్తులు సంతోషంగా స్వామివారిని దర్శనం చేసుకోగలుగుతున్నారన్నారు.

శనివారం ఉదయం విఐపి బ్రేక్ దర్శనంలో మృదంగం విద్వాంసుడు యల్లా వెంకటేశ్వరరావు, టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి తానా వేముల సతీశ్, నటుడు ఆది ,తమన్‌లు కుటుంబంతో కలసి శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## కోనలో వైభవంగా పెనుశిల లక్ష్మీనృసింహుని కళ్యాణోత్సవం

**పెంచలకోన (రాపూరు, నెల్లూరు), ఆగస్టు 2, ప్రభాతవార్త :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో శనివారం శ్రీ పెనుశిల లక్ష్మీ నరసింహ స్వామి వారి కళ్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున 4.30కి స్వామి వారి మూలమూర్తికి అభిషేకం గోపూజ, పూలాంగి సేవ నిర్వహించారు. ఉదయం 9.30కి స్వామి వారి ఆస్థాన మండపంలో స్వామి వారికి ఉభయ దేవేరులైన ఆధిలక్ష్మీ, చెంచులక్ష్మీ అమ్మవార్లతో వేద పండితులు, వేద మంత్రోచ్చరణలతో కళ్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం స్వామి,అమ్మవార్లను తిరుచ్చిపై వుంచి తిరుచ్చిఉత్సవం నిర్వహించారు. తదుపరి స్వామి అమ్మవార్లకు సహస్ర దీపాలంకరణ మండపంలో ఊంజల్ సేవ నిర్వహించారు. పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు కావలసిన భోజన,వసతి ఏర్పాట్లను ఆలయ ఉప కమీషనర్ పోరెడ్డి శ్రీనివాసుల రెడ్డి ఆధ్వర్యంలో సినియర్ సహాయకుడు పాలవల్లి లక్ష్మీ నారాయణ, ఎఇ వినోద్, సిబ్బంది నరసింహ, వెంకటసుబ్బయ్య, తదితరులు పర్యవేక్షించారు. స్వామి వారి పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా ఆలయ ప్రధానార్చకులు పెంచలయ్య స్వామి, అర్చక స్వాములు గుండ్లూరు శశి స్వామి, మధు స్వామి, వర్ధన్ స్వామి, వెంకట బాలజీ స్వామి, వినోద్ స్వామి, నాగరాజు స్వామి, సాయి స్వామి తదితరులు నిర్వహించారు.



రైతులకు ఆర్థిక సహాయం చెక్కులను అందిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

## శ్రీకాళహస్తిలో అన్నదాత సుఖీభవ - పిఎం కిసాన్ లాంఛనం

### ఇది రైతు ప్రభుత్వం: ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**శ్రీకాళహస్తి, ఆగస్టు 2 ప్రభాతవార్త** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అందించే ఆర్థిక సహాయం 'అన్నదాత సుఖీభవ-పిఎం కిసాన్' కార్యక్రమాలను తిరుపతిజిల్లాలోని శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో లాంఛనంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమాలను జిల్లా కలెక్టర్,వ్యవసాయశాఖ శ్రీకాళహస్తిలో ఏర్పాటు చేసారు.ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి హాజరయ్యారు.ఈ సంబరాలకు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వరన్ జ్యోతి ప్రజ్వాలన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు, డెప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్,విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ ఫోటోలకు పాలాభిషేకం జరిపారు.ఈ ప్రాంతంలో రైతులు పండించిన పండ్లతో పూజలు చేసారు.ఈ సందర్భంగా చెక్కులను పంపిణి చేసారు.ఇక్కడ రైతులు ఏర్పాటు చేసిన రక రకాల వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్స్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వరన్ అధ్యక్షత వహించారు.

## తెలుగు జాతి ముద్దు బిడ్డ పింగళి వెంకయ్య: వైఎస్ జగన్

**విజయవాడ,ఆగస్టు2,ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగు జాతి ముద్దు బిడ్డ పింగళి వెంకయ్య అని వైసిపి అధ్యక్షుడు వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం పింగళి వెంకయ్య జయంతిని పురస్కరించుకొని ... వైఎస్.జగన్ నివాళులర్పించారు. జాతీయ జెండా రూపకర్త, తెలుగు జాతి ముద్దు బిడ్డ పింగళి వెంకయ్య గారు. నేడు ఆ మహనీయుడి జయంతి సందర్భంగా ఆయన భారతదేశానికి చేసిన సేవలను స్మరించుకుంటూ మనస్ఫూర్తిగా నివాళులర్పిస్తున్నాను అని వైఎస్ జగన్ ట్వీట్ చేశారు.

## మదనపల్లె-చెన్నైల మధ్య రైళ్లు నడపాలి

**గుంతకల్లు రైల్వే, ఆగస్టు 2,ప్రభాతవార్త** రాయలసీమలోని ప్రఖ్యాత వాణిజ్య వ్యాపార కేంద్రంగా ప్రసిద్ధిగాంచిన మదనపల్లె నుంచి తమళనాడు రాష్ట్ర రాజధాని చెన్నై మధ్య రైలు సర్వీసులను నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు. దేశంలోనే ప్రసిద్ధిగాంచిన మదనపల్లె టమోటా మార్కెట్ నుంచి టమోటా దేశవ్యాప్తంగా ప్రసిద్ధి. అలాగే మామిడి తదితర వ్యవసాయ ఉత్పత్తులు ఇక్కడి నుండి చెన్నైలోని ప్రఖ్యాతిగాంచిన కోయంబెడు మార్కెట్, చెన్నైలోని పాండి బజార్,టి.నగర్ మార్కెట్‌కు అనేక వ్యవసాయ ఉత్పత్తులను తమ తమ అవసరాల నిమిత్తం ఈ ప్రాంత ప్రజలు ప్రస్తుతం రోడ్డు మార్గంలో మదనపల్లి-చెన్నై మధ్య నిత్యం రాకపోకలు సాగించేందుకు రోడ్డు మార్గం మినహా మరో మార్గంలేదు. విచిత్రం ఏమిటంటే రైలు మార్గం ఉన్న రైళ్లు లేకపోవడం, రైలు సదుపాయం లేకపోవడంతో ప్రజలు గత్యంతరం లేక రోడ్డు మార్గంపై ఆధారపడి తమ తమ కార్యకలాపాలను రాకపోకలను కొనసాగిస్తున్నారు. పాకాల,చిత్తూరు,కాట్పాడి మీదుగా మనదపల్లి-చెన్నైల మధ్య రైలు సర్వీసులను నడిపితే ఇటు ప్రజలకు రైలు సదుపాయం కల్పించడంతో పాటు రైల్వేకు రెవెన్యూ ఆదాయం సైతం పెరుగుతుంది. స్వతహాగా సానుకూలస్వభావి అయిన ప్రస్తుత గుంతకల్లు డిఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్తా ఈ విషయమై దృష్టి సారించాలన్నారు.

## తిరుపతి ఎస్వీజూలో ఆత్మకూరు ఆడపులి మృతి



**తిరుపతి,ఆగస్ట్ 2ప్రభాతవార్తప్రతినిధి:** ఆత్మకూరు ప్రాజెక్టు పరిధిలో పిఏపురం సెక్షన్ బైర్లూట్‌రేంజ్‌లో గతనెలలో పట్టుబడి తిరుపతి ఎస్వీజూకు తరలించిన టి-132 ఆడపులి చికిత్స తీసుకుంటూ శనివారం ఉదయం మృతి చెందింది. ఆత్మకూరులో తీవ్రంగా గాయపడిన ఆడపులిని జూలై 7వతేదీ అటవీశాఖ అధికారులు తిరుపతి జూకు తరలించారు. ఎస్వీపశువైద్యకళాశాల సర్జరీ విభాగం ప్రొఫెసర్లు ఆధ్వర్యంలో ఓరల్ కేవిటీ ఫిస్తులా తిరిగి తెరచుకోవడంతో మళ్ళీ సర్జరీ చేశారు. గతనెల 16వతేదీనుండి గాయానికి మృదువైన పీట్లు లోపలి మెత్తనిపొరలు అదనపు సంరక్షణగా కుట్లునయం కావడానికి మెత్తని మాంసం ,గ్లూకోస్,ఎలక్ట్రోలైట్, యాంటీబయాటిక్స్ ఇవ్వడం జరిగింది. టి-132 ఆడపులి రెండు రోజులుగా ఆహారం తీసుకోకుండా నీటిపైనే ఆధారపడింది. శనివారం ఉదయం మృతి చెందింది. ఎస్వీపశువైద్యకళాశాల పాథాలజీ విభాగం ప్రొఫెసర్ ఆధ్వర్యంలో పోస్టుమార్టమ్‌లో సెప్టీసీమియా షాక్‌తో మృతి చెందిందని తెలిపారు.. జంతుప్రదర్శనశాలలో ఖననం చేశారు.

## క్రిమినల్ జస్టిస్ వ్యవస్థలో డిజిటల్ మార్పులు : డిజిపి హరీష్‌కుమార్




ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ ఐసిజెఎస్ 2.0 ప్రారంభిస్తున్న డీజీపీ

**విజయవాడ, ఆగస్టు2,ప్రభాతవార్తప్రతినిధి:,** భారత ప్రభుత్వం హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆమోదించిన ఇంటరాపరబుల్ క్రిమినల్ జస్టిస్ సిస్టమ్ (ఐసిజెఎస్) 2.0 ను ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ ప్రారంభించింది.ఏపీ డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా శనివారం లాంఛనంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రూ.88.03 కోట్ల విలువైన ఈ ప్రాజెక్ట్ ద్వారా, క్రిమినల్ జస్టిస్ వ్యవస్థలోని ముఖ్యమైన శాఖలైన పోలీస్, జైలు, ప్రాసిక్యూషన్, ఫోరెన్సిక్స్, కోర్టులు అనే 5 విభాగాల్లో ఆధునిక హార్డ్ వేర్ మరియు మౌళిక సదుపాయాలను అమలు చేస్తోందని ఈ సందర్భంగా డీజీపీ తెలిపారు. ఈ ప్రాజెక్ట్ లక్ష్యం కాగితం లేని, సాంకేతికత ఆధారిత డేటా మార్పిడి ద్వారా న్యాయవ్యవస్థను సమర్థవంతంగా, పారదర్శకంగా, వేగవంతంగా చేయడం. ఇది క్రిమినల్ జస్టిస్ డెలివరీ విధానాన్ని సమూలంగా మార్చే విప్లవాత్మక చర్యగా నిలవనుంది. ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ దేశవ్యాప్తంగా ఒక రోల్ మోడల్ గా నిలిచింది, అత్యాధునిక హార్డ్ వేర్ ను అత్యంత పోటీతత్వ ధరలకు కొనుగోలు చేయడం ద్వారా ప్రభుత్వానికి కోట్లాది రూపాయలు ఆదా చేసింది. ఈ ప్రాజెక్టులో భాగంగా ప్రధానంగా కొనుగోలు చేసిన పరికరాలు ఉంటాయి.4,575 ఆల్‌ఇన్‌వన్ పీసీలు ప్రతి పోలీస్ స్టేషన్ కు 4 డెస్క్ టాప్‌లు, ప్రతి కోర్టు కాంప్లెక్స్ కు 2 డెస్క్ టాప్ లు, స్టేట్ ఫొరెన్సిక్ ల్యాబ్ కు 5 డెస్క్ టాప్ లు , రీజినల్ ఫొరెన్సిక్ ల్యాబ్ లు కు 3 డెస్క్ టాప్ లు, అలాగే జైళ్ల శాఖ,ప్రాసిక్యూషన్ కార్యాలయాల కోసం అదనపు పరికరాలు, ఇవన్నీ వేగవంతమైన డేటా ప్రాసెసింగ్ ను అందిస్తాయి1,259 వెబ్ క్యామ్ లు ,అన్ని శాఖల్లో వీడియో కాన్ఫరెన్సింగ్ మరియు సాక్ష్యాల రికార్డింగ్ కోసం 520 హైఎండ్ ల్యాప్ టాప్ లు ప్రతి పబ్లిక్ ప్రాసిక్యూటర్/అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కు ఒకటి (మొత్తం 465) , ఫీల్డ్ ఆఫీసర్లు మరియు పరిపాలనా పనుల కోసం అదనపు యూనిట్లు.1,483 మల్టీ ఫంక్షనల్ ప్రింటర్లు ఉంటాయి.అన్ని ఎండ్ పాయింట్ లు మరియు సున్నితమైన డేటా కోసం తి। ఆధారిత తక్షణ ప్రమాద గుర్తింపు, సెంట్రలైజ్డ్ మానిటరింగ్, క్లౌడ్ పాలసీ మేనేజ్మెంట్ వంటి ఫీచర్లతో ఒక బలమైన ఎండ్ టు ఎండ్ భద్రతా పరిష్కారం, ।దిరిళీ 2.0 ప్రారంభంతో, భారతదేశంలో డిజిటల్ పోలీసింగ్ లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ముందు వరుసలో నిలుస్తోంది. అత్యుత్తమ పరికరాలను పొందడమే కాకుండా, పోలీస్, జైళ్లు, ప్రాసిక్యూషన్, ఫొరెన్సిక్స్, కోర్టుల శాఖలలో వినూత్న పరిష్కారాలను సమర్థవంతంగా అమలు చేసి, పారదర్శకత, భద్రత, వేగవంతమైన న్యాయనివేదిక కోసం కొత్త ప్రమాణాలను నెలకొల్పుతోంది. ఈ ప్రయోగం అన్ని శాఖల మధ్య సమన్వయాన్ని బలపరిచేలా, ప్రజలకు వేగంగా విశ్వసనీయంగా న్యాయం అందించే దిశగా నడిపిస్తోంది.

## అన్నవరం దేవస్థానంలో సమస్యలపై ప్రక్షాళన చేపట్టాలి

### లేని పక్షంలో ఆలయం వద్ద ఆందోళన :బ్రాహ్మణ సంక్షేమ వేదిక అధ్యక్షుడు రామం



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో,ఆగస్టు 2( ప్రభాతవార్త ):** కాకినాడ జిల్లా పవిత్ర పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానంలో జరుగుతున్న అవకతవకలు,వేద పాఠశాల విద్యార్థుల మౌలిక సదుపాయాలు, సమస్యలపై ప్రభుత్వం స్పందించి ప్రక్షాళన చేయవలసిన అవసరం ఉందని బ్రాహ్మణ సంక్షేమ వేదిక ఆంధ్ర రాష్ట్ర జోనల్ అధ్యక్షులు మిర్తిపాటి రామం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో అన్నవరం దేవస్థానానికి ఒక విశిష్టత ఉందన్నారు. అటువంటి దేవస్థానంలో జరుగుతున్న అవినీతి, సమస్యలపై వస్తున్న పత్రికల వార్తా కథనాలను ప్రభుత్వం పరిగణలోకి తీసుకొని అధికార యంత్రాంగం పై చర్యలు చేపట్టాలన్నారు.ఇక్కడ వేద పాఠశాలలోని విద్యార్థులు అస్వస్థకు గురై, హాస్పటల్లో వైద్యం పొందుతున్నారనే వార్త విని చాలా బాధపడటం జరిగిందన్నారు.తల్లిదండ్రులు లేని పేద పిల్లలు వేద విద్యను నేర్చుకుని కుటుంబానికి ఆసరాగా నిలవాలనే సదుద్దేశంతో వేద పాఠశాలలో చేరడం జరుగుతుందన్నారు. అటువంటి వేదవిద్యార్థులకు సరైన సదుపాయాలు కల్పించకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కోవడం జరుగుతుందన్నారు. వేద పాఠశాల విద్యార్థులకు సరైన పోషకాహారం అందించడం లేదనేది పత్రికలు వాస్తవాలు వెల్లడిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. భోజనంను కాంట్రాక్టర్ కి అప్పగించడంతోనే ఆ విద్యార్థులకు నాణ్యతతో కూడిన ఆహారం అందటం లేదన్నారు.అన్నవరం వేద పాఠశాలకు విశేషత ఉందని పేర్కొన్నారు.ఈ పాఠశాలలో వేద విద్య నేర్చుకున్న విద్యార్థి నేడు కంచి కామకోటి పీఠాధిపతి అయ్యారని ఆయన వెల్లడించారు. అటువంటి వేద పాఠశాల రాజకీయ వ్యవస్థతో భ్రష్టు పడుతుందన్నారు. నెలరోజులు గడవకముందే వేద పాఠశాల విద్యార్థులు రెండుసార్లు అస్వస్థకు గురి కావడం చాలా బాధాకరమన్నారు. కమిషనర్ విచ్చేసి విద్యార్థులను పరామర్శించడం కాకుండా అక్కడ బాధ్యులపై చర్యలు చేపట్టే విధంగా ఆదేశాలు ఇవ్వాలని ఆయన కోరారు.ఒకటి , రెండు కాదు చాలా సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని..నెయ్యి డబ్బాలు తరలిపోతున్నాయి, శానిటేషన్ కార్మికుల పీఎఫ్ సొమ్ములు దారి మళ్ళాయి. వీటన్నిటి పైన తూతూ మంత్రపు చర్యలు కాకుండా అన్నవరం దేవస్థానం కి పట్టిన గ్రహణం ఎవరనేది పూర్తిస్థాయి విచారణ చేపట్టి ప్రక్షాళన చేయాలని ఆయన కోరారు.తక్షణం ప్రభుత్వం స్పందించి ఆలయంలో జరిగిన అవకతవకలు, సమస్యలపై పూర్తి స్థాయి విచారణ

## భక్తుల భద్రత, వాహనాల పార్కింగ్‌పై ప్రత్యేక దృష్టి - సివిఎస్‌ఒ మురళీకృష్ణ

**తిరుమల,ఆగస్ట్ 2ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగ వైకుంఠం తిరుమలలో సెప్టెంబర్ 23నుండి జరిగే సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాల్లో భక్తుల భద్రతతోబాటు వాహనాల పార్కింగ్‌పై ప్రత్యేక దృష్టిసారించాలని టిటిడి సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ సూచించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ రూమ్ నుండి తిరుమలలోని ప్రతి ప్రాంతంపై మరింత నిశితంగా టెక్నాలజీతో నిఘా ఉంచిభద్రతను పటిష్టంచేయాలన్నారు. బ్రహ్మోత్సవాల

సమయంలో తొలిరోజు ముఖ్యమంత్రి పట్టువస్త్రాలు సమర్పణ ఉం టుందని, ఆరోజు భద్రత పరంగా తీసు కోవాల్సిన చర్యలు గురించి చర్చించారు. బ్ర హ్మోత్సవాల్లో ముఖ్యంగా పెద్దశేషవాహనం, గరుడవాహనం, రథోత్సవం, చక్రస్నానం రోజుల్లో మరింత అప్రమత్తత అవసరమన్నారు. బ్రహ్మోత్సవాల ముందస్తు భద్రతా ఏర్పాట్లు, అనుసరించాల్సిన వ్యూహంపై శనివారం అన్నమయ్యభవనంలో సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ విజిలెన్స్ అధికారులతో సమావేశమయ్యారు.

భారతదేశంలో నిరుద్యోగుల్లో అత్యధికంగా ఇంజనీరింగ్ పూర్తి చేసిన వారు ఉండటం బాధాకరంగా ఉంది. దేశంలో 83 శాతం మంది ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు నిరుద్యోగులుగా ఉంటున్నారు. ఇంజినీరింగ్‌లో కూడా కంప్యూటర్ ఇంజినీరింగ్ పూర్తి చేసిన వారు ఎక్కువగా నిరుద్యోగులుగా ఉంటున్నారు. ఇంజినీరింగ్ నిరుద్యోగుల్లో 7.5 శాతంమంది కంప్యూటర్ ఇంజినీరింగ్ పూర్తి చేసిన వారు నిరుద్యోగులుగా ఉంటున్నారు. దీనివల్ల ఈ రంగం నిరుద్యోగ డిగ్రీ హోల్డర్ల జాబితాలో అగ్రస్థానంలో ఉంది. ఇంజినీరింగ్ వారి తరువాత 46శాతం బిజినెస్ గ్రాడ్యుయేట్లు నిరుద్యోగులుగా ఉన్నారు. ప్రతిష్టాత్మకమైన అర్హతలు ఉన్నప్పటికీ యువ నిపుణులు ఉపాధిని పొందేందుకు ఇబ్బందిపడుతున్నారు. ఇక ఆర్ట్ హిస్టరీ చదివిన వారిలో 3శాతం మంది నిరుద్యోగులుగా ఉంటున్నట్టు లెక్కలు చెబుతున్నాయి. సిఏ పూర్తిచేసిన వారు సైతం నిరుద్యోగులుగా ఉన్నారని ప్రజలు తరచుగా చెబుతుంటారు. దేశంలో సుమారు 20వేల మంది కొత్తగా అర్హత సాధించిన సిఏలు ఒకే ప్రయత్నంలోనే మార్కెట్‌లోకి ప్రవేశించారు వారు నిరుద్యోగులుగానే కొనసాగుతున్నారు. చివరికి ఐఐటీలు, ఎన్ఐటీల్లో చదువును పూర్తి చేసుకున్న వారు సైతం నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారు. గత సంవత్సరం క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లలో 24,230 మంది ఐఐటి, ఎన్ఐటి విద్యార్థులల్లో దాదాపు 8వేల మంది విద్యార్థులకి ఉద్యోగాలు లభించలేదు. ఆంత్రోపాలజీ గ్రాడ్యుయేట్ల 9.4 శాతంమంది నిరుద్యోగులుగా ఉన్నారు. భౌతిక శాస్త్రంలో గ్రాడ్యుయేట్ పూర్తిచేసిన వారిలో 7.8 శాతం మంది నిరుద్యోగులుగా మారుతు న్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తోపాటు మరి కొన్ని రాష్ట్రాల్లోనూ ఇంజనీరింగ్ పూర్తి చేసిన గ్రామీణప్రాంతనిరుద్యోగులు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రోజువారీ కూలీలుగా పనిచేస్తున్నారు.

# పెరుగుతున్న నిరుద్యోగం

**నాగమణీంద్ర పల్లాపు**

భారతదేశం జనాభాలో ప్రపంచంలో నంబర్ వన్ స్థానానికి చేరింది. జనాభాలోనే కాదు.. నిరుద్యోగంలో కూడా నంబర్ వన్ స్థానంలోనే ఉన్నట్టు కొన్ని సర్వేలను బట్టి చూస్తే తెలుస్తోంది. ప్రపంచంలోనే ఎక్కువ మంది జనాభా ఉన్న దేశంగా ఉన్న ఇండియాలో యువత కూడా ఎక్కువగానే ఉంది. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే పలు సందర్భాల్లో చెబుతూ వస్తోంది.. ప్రపంచంలోనే ఎక్కువ యువత ఉన్న దేశం భారతదేశమని.. ఇక్కడ ఏదైనా చేయడానికి సరిపడా యువత ఉన్నారని చెబుతోంది. ఇది వాస్తవమే. అయితే పనిచేయడానికి యువత సిద్ధంగా ఉన్నప్పటికీ వారికి పని కల్పించే వారు లేరు. దేశంలో ఉన్న యువతకు ఉపాధి లేక ఖాళీగా తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. నిరుద్యోగుల్లో కూడా రెండు రకాల నిరుద్యోగులు ఉన్నారు. వారిలో చదువుకుని ఎటువంటి ఉపాధి లేకుండా ఉన్న నిరుద్యోగులు ఒకరకమైతే.. చదువు లేకుండా చేయడానికి పనిలేకుండా ఉండే నిరుద్యోగులు మరోరకం. ఇలా రెండు రకాల నిరుద్యోగులతో భారతదేశం కొనసాగుతోంది. భారతదేశంలో నిరుద్యోగుల ఖచ్చితమైన సంఖ్యను గుర్తించడం కష్టమే అయినప్పటికీ, భారతదేశ గ్రాడ్యుయేట్ జనాభాలో గణనీయమైన భాగం నిరుద్యోగులుగా ఉన్నారని నివేదికలు సూచిస్తున్నాయి. 25 ఏళ్లలోపు వారికి ఇది 42.3 శాతం నుంచి 54.8 శాతం వరకు ఉంటుందని అంచనా. ముఖ్యంగా ఇంజినీరింగ్, వ్యాపారం(కామర్స్) వంటి రంగాలలో గ్రాడ్యుయేట్లు పెద్ద సంఖ్యలో డిగ్రీలు పూర్తి చేసిన తర్వాత కూడా ఉద్యోగాలు దొరకడం కష్టమవుతోందని ది వైర్ నివేదిక ప్రకారం తెలుస్తోంది. భారతదేశంలో దాదాపు 28మిలియన్ల మంది విద్యావంతులైన నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం వెతుకుతున్నారు. దాదాపు 100 మిలియన్ల మంది వ్యక్తులు నిరుద్యోగులుగా కొనసాగుతున్నారు. ప్రధానంగా మహిళలు పనికోసం వెతకడం మానేశారని నివేదికలు చెబుతున్నాయి. భారత్‌లో నిరుద్యోగం తాండవిస్తోందని అంతర్జాతీయ కార్మిక సంస్థ(ఐఎల్‌వో), మానవాభివృద్ధి సంస్థ(ఐహెచ్‌డీ) సంయుక్త అధ్యయనంలో వెల్లడైంది. 'భారత నిరుద్యోగ నివేదిక-2024'లో పలు కీలక విషయాలను వెల్లడించింది.

ఈ నివేదికను కేంద్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసింది. ఈ నివేదిక ముఖ్యంగా చదువుకున్న యువత ఉద్యోగాలు లేక ఈసురోమంటున్నారని తెలిపింది. 2022 నాటికి దేశంలోని మొత్తం నిరుద్యోగుల్లో 83శాతం మంది యువతేనని ఆ అధ్యయనం పేర్కొంది. అంతేకాక మొత్తం నిరుద్యోగుల్లో చదువుకున్న యువత 2000నాటికి 54.2 శాతం ఉండగా 2022 నాటికి అదికాస్త 65.7శాతానికి పెరిగింది. ఈ పరిస్థితి భారత్



వంటి అభివృద్ధి చెందుతున్న దేశానికి తీవ్ర ఇబ్బందేనని నివేదిక స్పష్టంచేసింది. ప్రస్తుతం నిరుద్యోగులైన యువ విద్యావంతుల్లో మహిళలు 76.7 శాతంగా ఉంటే పురుషులు 62.2 శాతం మంది ఉన్నారు. కరోనా కాలంలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు భారీగా తగ్గి నిరుద్యోగుల సంఖ్య పెరిగింది. 2000లో ఉద్యోగాలు పొందిన యువతలో సగం మంది స్వయం ఉపాధిని పొందినవారే. వీరిలో 13 శాతం మంది రెగ్యులర్, 37శాతం మంది తాత్కాలిక ఉద్యోగాలు దక్కించుకున్నారు. వచ్చే పదేళ్ల కాలంలో భారత్‌లో 70 నుంచి 80 లక్షల యువశక్తి అందుబాటులోకి రానుంది. దేశంలో గణనీయమైన శాతంలో గ్రాడ్యుయేట్లు నిరుద్యోగులుగా కొనసాగుతున్నారు. ఇండియా టుడే ప్రకారం, ఇండియా స్కిల్స్ రిపోర్ట్-2025 ప్రకారం భారతీయ గ్రాడ్యుయేట్లలో కేవలం 54.8 శాతం మంది మాత్రమే ఉపాధి పొందుతున్నారని సూచిస్తుంది. మెర్సర్, మెట్ల్స్ గ్రాడ్యుయేట్ స్కిల్ ఇండెక్స్- 2025 ఈ సంఖ్య ఇంకా తక్కువగా, 42.6 శాతం ఉంటుందని అంచనా వేసింది. చాలా మంది గ్రాడ్యుయేట్లు నిరంతర నిరుద్యోగం కారణంగా చురుకుగా ఉద్యోగాల కోసం వెతకడం మానేస్తున్నారు. దీని వలన వాస్తవ నిరుద్యోగ సంఖ్య ఎక్కువగా ఉంటుంది. ఆటోమేషన్, ఏఐ మూలంగా ప్రభావితమైన అభివృద్ధి చెందుతున్న ఉద్యోగ మార్కెట్ నైపుణ్యాల అంతరాన్ని సృష్టిస్తోందని.. దీని వలన గ్రాడ్యుయేట్లకు తగిన ఉపాధి దొరకడం కష్టమవుతుందని నిపుణులు చెబుతున్నారు. ఇంజినీరింగ్, కామర్స్ వంటి రంగాలలో గ్రాడ్యుయేట్లలో నిరుద్యోగ రేటు ఎక్కువగా ఉంది. సుమారు 83 శాతం ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లు, 46 శాతం బిజినెస్ గ్రాడ్యుయేట్లు నిరుద్యోగులుగా మిగిలిపోయారు. ఇంజినీరింగ్, బిజినెస్ మేనేజ్‌మెంట్ చేసిన వారే కాకుండా చాలా మంది గ్రాడ్యుయేట్లు కూడా నిరుద్యోగులుగా ఉన్నారు. వారి విద్యా అర్హతలు, నైపుణ్య సెట్‌లకు సరిపోని ఉద్యోగాలలో పనిచేస్తున్నారు. వివిధ అంశాలు గ్రాడ్యుయేట్ నిరుద్యోగానికి దోహదం చేస్తాయి. నైపుణ్యాలు, ఉద్యోగ అవసరాల మధ్య అసమతుల్యత, ఆర్థిక మందగమనం, ఉద్యోగ మార్కెట్ అభివృద్ధి చెందుతున్న స్వభావం వంటివి నిరుద్యోగానికి కారణాలుగా ఉన్నాయి. భారతదేశంలో చదువుకున్న నిరుద్యోగులు ఎక్కువగానే ఉన్నారు. ఇంజినీరింగ్, మెడిసిన్, ఎంబిఏ, ఎంసిఏ వంటి ఉన్నత కోర్సులు చేసిన వారు కూడా నిరుద్యోగులుగా మారుతున్నారు. వారితోపాటు పిహెచ్‌డిలు చేసిన వారు కూడా నిరుద్యోగులుగా మారుతున్నారు. ప్రతి ఏడాది లక్షలాది మంది ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లు తమ చదువును ముగించుకొని నిరుద్యోగులుగా రోడ్లపైకి వస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే ఏడాదిలో సుమారు 50 వేల మంది ఇంజినీరింగ్ కోర్సును పూర్తి చేస్తున్నారు. అలాగే ఏపీలో ఇంతకంటే ఎక్కువగా సుమారు 60వేల మంది ఇంజినీరింగ్ కోర్సును పూర్తి చేసుకుంటున్నారు. చదువుకున్న వారు ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూస్తుంటారు. అవి కేంద్ర ప్రభుత్వ, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు ఏవైనా బాగుంటుందని చూస్తారు. అయితే చదువుకున్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఉద్యోగాలు దొరకడం కష్టంగా మారుతుంది. ప్రభుత్వ ఉద్యోగాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నోటిఫికేషన్లను జారీ చేస్తాయి. వాటి ద్వారా వచ్చే ఉద్యోగాలు తక్కువగానే ఉంటాయి. ఇక ప్రైవేటు ఉద్యోగాలు ప్రభుత్వ ఉద్యోగాల కంటే ఎక్కువగానే ఉంటాయి. వాటిలో కూడా చదువుకున్న వారందరికీ వచ్చే అవకాశం లేదు. చదువుకున్న వారిలోకూడా నైపుణ్యాలు(స్కిల్స్) ఉన్న వారికి ఉద్యోగవకాశాలు ఎక్కువగా ఉంటుండగా.. సాధారణ డిగ్రీ కోర్సులు చేసిన వారికి తక్కువగా ఉంటున్నాయి. చదువుకున్న వారిసంఖ్య లక్షల్లో ఉండటం.. పోస్టుల సంఖ్య వందల్లో ఉండటంతో పోటీ విపరీతంగా ఉంటుంది. చివరికి ప్రభుత్వ ఉద్యోగాలతోపాటు, ప్రైవేటు ఉద్యోగాలకి సైతం చిన్నస్థాయి ఉద్యోగాలకి సైతం ఉన్నత చదువులు చదివిన వారు పోటీపడుతున్న వైనం కనబడుతోంది. గతంలో తెలంగాణతోపాటు, ఆంధ్రప్రదేశ్‌లోనూ కానిస్టేబుల్ పోస్టులకి పిహెచ్‌డీ చేసిన వారు సైతం దరఖాస్తు చేసుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విడిపోయి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన సమయంలో నిరుద్యోగుల కోసం వయోపరిమితిని ప్రభుత్వం పెంచడంతో రిజర్వేషన్ పొందే అభ్యర్థులు 50సంవత్సరాలు పైబడిన వారు సైతం ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ మధ్యకాలంలో ముంబయి పోర్టులో గ్రూప్-4 ఉద్యోగాల కోసం నోటిఫికేషన్ జారీ చేస్తే అందులో గ్రూప్-4 ఉద్యోగానికిసైతం పిహెచ్‌డీ, పీజీలు, ఇంజినీరింగ్ చేసిన వారు దరఖాస్తు చేసుకున్నారు. దీన్నిబట్టి అర్థం చేసుకోవచ్చు. దేశంలో నిరుద్యోగం ఏ మేరకు ఉందో. పీహెచ్‌డీ, డిగ్రీ కలిగి ఉండటం కేవలం ఒకప్రత్యేకత మాత్రమే కాదు. ఇది ఒక బలీయమైన ప్రయోజనం. ఒక సంస్థ నివేదించిన ప్రకారం పీహెచ్‌డీ హోల్డర్ల నిరుద్యోగిత రేటు 1శాతం కంటే తక్కువగా ఉండటంతో, జాతీయ సగటు 7శాతంతో పోలిస్తే, అధిక నైపుణ్యం కలిగిన వ్యక్తుల డిమాండ్ స్పష్టంగా ఉందని తెలుస్తోంది. ఇండియాలో ఎంబిబిఎస్ చదివితేఉద్యోగం వస్తుందనే అభిప్రాయం బలంగా ఉంటుంది. అయితే దేశంలో ఎంబిబిఎస్ పూర్తిచేసిన వారిలో సైతం 16 శాతం నిరుద్యోగులుగా ఉంటున్నట్టు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ●

---

కర్ణాటక

దాచేస్తే దాగని సత్యాలు మన చుట్టూ అనేకానేకం కనిపిస్తూంటాయి. అయితే అవి బహిర్గతం కాకుండా అనేక రకాల 'శక్తులు' కూడా పనిచేస్తుంటాయి. ఆ శక్తులు ఇవీ అని చెప్పలేం. కొన్ని సార్లు రాజకీయ శక్తులు, మరి కొన్ని సార్లు వ్యాపార శక్తులు, ఇంకొన్ని సార్లు ఇతర సామాజిక శక్తులు వాటిలో ఉంటాయి. కొన్ని సందర్భాల్లో అన్నీ కలిసి పనిచేస్తుంటాయి కూడా. కర్ణాటకలోని ధర్మస్థలలో ఇటీవల వెలుగులోకి వచ్చిన అసహజ మరణాల గురించి ఆరా తీస్తుంటే అక్కడ ఈ అన్నిశక్తులు కలగలిసి పనిచేశాయేమో! అనే అనిపిస్తుంది. ఒకరు, ఇద్దరు కాదు.. కొన్ని వందల మంది పురుషులు, మహిళలు ధర్మస్థల క్షేత్రంలో అసహజ మరణాలకు గురయ్యారనీ, వారిలో కొందరు స్థానికులుకాగా, కొందరు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారనీ తెలుస్తోంది. ధర్మస్థల ఒక పెద్ద పుణ్యక్షేత్రం గనుక నిత్యం ఎందరో భక్తులు, పర్యాటకులు వచ్చి వెళ్తూండడం సాధారణమే. అయితే వారిలో కొందరు అక్కడే అదృశ్యమవుతున్నట్లుగా తెలుస్తోంది. అలా అదృశ్యమైన వారిలో కొందరి మృతదేహాలను క్షేత్రం పరిసర ప్రాంతాల్లోనే ఖననం చేస్తున్నట్లు కూడా తెలుస్తోంది. తమవారి ఆచూకీ తెలియడం లేదనే ఫిర్యాదులు వచ్చినపుడు క్షేత్రంపై, అక్కడి పరిస్థితులపై బయటివారికి అనుమానాలు కలుగుతున్నాయి. లేదంటే గుట్టుచప్పుడు కాకుండా ఆ మృత దేహాలు 'భూస్థాపిత'మైపోతున్నాయి. దీని వెనుక గల మిస్టరీ ఏమిటన్నదే అంతుచిక్కకుండా ఉంది. చాలా కాలం నుంచి లెక్కలేనన్ని మృతదేహాలను అలా పూడ్చిపెట్టిన ఓ పారిశుధ్య కార్మికుడు దక్షిణ కన్నడ జిల్లా ఎస్పీ అరుణ్‌కు జూలై రెండోవారంలో రాసిన ఓ లేఖ తొలుత దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది.' 1998 నుంచి 2014 మధ్య వందకు పైగా మృత దేహాలను ఖననం చేశాను. నా చేత ఆ పనులు చేయించిన కొందరు వ్యక్తులు మా కుటుంబానికి చెందిన యువతి పైనే అఘాయిత్యానికి పాల్పడడంతో బెదిరిపోయి మేము ఆ ప్రాంతం వదలి పారిపోయాం. కానీ పాప భీతితో వణికిపోతూ ఈ లేఖ రాస్తున్నా. తగిన రక్షణ కల్పిస్తే అన్ని నిజాలు బయటపెడతా ' అంటూ అతడు ఆ

# అ'ధర్మస్థల' మా?

**ఎ.వి.వి ప్రసాద్**

లేఖలో రాశాడు. వెంటనే పోలీసులు రంగంలోకి దిగారు. ప్రభుత్వానికి సమాచారం తెలియగానే జూలై 19న నలుగురు సీనియర్ ఐపిఎస్‌లతో ఒక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసింది. ఆ కార్మికుడు ఇచ్చిన కొన్ని ఆధారాలతో 13 పాయింట్లను సిట్ గుర్తించి అక్కడ తవ్వడం మొదలు పెట్టింది. గత బుధ వారం (30, జూలై) ఒక పాయింట్ వద్ద తవ్వుతుం డగా ఓ అస్థి



సిట్

పంజరం అవశేషాలు పాక్షికంగా బయట పడినట్లు సమాచారం. కొంత దూరంలో కొన్ని ఎముకలు కూడా దొరికాయి. కొన్ని ఆధారాలను బట్టి ఆ అస్థి పంజరం పురుషునిదిగా భావించారు. మరో చోట ఓ పుర్రె కనిపించిందనీ, అది ఓ మహిళది కావచ్చనీ అంటున్నారు. అవశేషాలు ఎవరివనేది ఒక సందేహమైతే, అవి అసహజ మరణాలకు చెందినవేనా? అన్నది మరో సందేహం. పారిశుధ్య కార్మికుని లేఖవల్ల కొన్ని వందల అసహజ మరణాలు సంభవించాయనే విషయం స్పష్టమవుతోంది. అలా ఖననం చేసింది, చేస్తున్నది అతనొక్కడే కాదు. అతనికి ముందు, తర్వాత కూడా చాలా జరిగాయని సిట్ దర్యాప్తు ద్వారా తెలుస్తోంది. దక్షిణ కన్నడ జిల్లాలోని ధర్మస్థల మంజునాథ స్వామి కొలువైన గొప్ప పుణ్యక్షేత్రం. ఆలయం మినహా ఇతర ఎలాంటి ప్రాధాన్యాలు ఆ ప్రాంతానికి లేవు. రాజ్యసభ సభ్యుడైన డా. వీరేంద్ర హెగ్డే ఐదు దశాబ్దాలుగా ఆలయం ధర్మాధికారిగా ఉంటు న్నారు. భక్తుల సంఖ్య రానురాను పెరుగుతున్న సమయంలో తాజాగా వచ్చిన ఆరోపణలు భక్తుల్లో తీవ్ర భయాందోళనలకు కారణమవుతు న్నాయి. గత పదేళ్లలో ధర్మస్థల చుట్టుపక్కల 450 మంది పైగా అదృశ్యమైనట్లు పోలీసు లెక్కల ప్రకారం తెలుస్తోంది. దానికి రెండు మూడు రెట్లు ఎక్కువే వాస్తవ సంఖ్యలుండొచ్చని స్థానికులు అంటున్నారు. నేత్రావతి నది ఇసుక పాయల్లో కలిసిపోయిన శరీరాలుఎన్నో, ఎన్నెన్నో! మంజునాథ ఆలయానికి సంబంధం ఉన్నవ్యక్తులే ఈ అదృశ్య మరణాల వెనుక కూడా ఉన్నారనీ, అందుకే తాను అక్కడి నుంచి పారిపోయాననీ పారిశుధ్య కార్మికుడు చెబుతు న్నాడు. అదే నిజమైతే ఇది చాలా పెద్దమిస్టరీయే అవుతుంది. గ్రామం నుంచి ఢిల్లీ దాకా ఎందరి పునాదులో కదులుతాయి. కానీ పాతికేళ్లుగా మిస్టరీని తొక్కిపెడుతున్నవారు ఇప్పుడు బయటకు రానిస్తారా అన్నది మరో సందేహం. ఆ మృతదేహాలేగాక ఎన్నో నిజాలు కూడా అక్కడ భూస్థాపితమవుతున్నాయి. వాటిని బయటకు లాగాలంటే సిట్ దర్యాప్తు సరిపోతుందా! అన్నది మరోసందేహం. అసహజ మరణాలకు సంబంధించిన ఆరోపణలు రావడంతో 2015లోనే రాష్ట్ర ప్రభుత్వం ఉగ్రప్ప కమిటీని ఏర్పాటు చేసింది. తర్వాత మూడేళ్లకు ఆ కమిటీ నివేదికను సమర్పించింది. యేడాదికి 300 మంది పురుషులు, మహిళలు, కొందరు బాలలు కూడా అక్కడ అసహజ మరణాలకు గురైనట్లుగా ఆ కమిటీ గుర్తించింది. కొందరు ఆత్మహత్యలు చేసుకున్నట్లు పోలీసులు చెబుతున్నారు కానీ అందుకోసం ఎవరైనా ధర్మస్థల దాకా వస్తారా? అన్నదీ సందేహమే. అక్కడ అదృశ్యమైన వారిలో కొందరు డాక్టర్లు, జర్నలిస్టులు కూడా ఉన్నారట. సామాజిక మాధ్యమాల్లో హోరెత్తిపో తున్న ఈ ఉదంతంపై పూర్తి స్థాయి న్యాయ విచారణ జరిగితేనే అసలు వాస్తవాలు వెలుగులోకి రావచ్చు. లేకుంటే ఉగ్రప్ప కమిటీ నివేదిక మూలపడినట్లు గానే సిట్ దర్యాప్తు కూడా ఏమీ తేల్చలేకపోవచ్చు. ఈ అసహజ మరణాల మిస్టరీ తేలకపోతే పుణ్య క్షేత్రమైన ధర్మస్థల చరిత్రలో అధర్మస్థలగా మిగిలిపోయే ప్రమాదం ఉన్నదని భక్తులు వాపోతున్నారు. మిస్టరీ వెనుక గల అదృశ్య హస్తాన్ని త్వరగా కనుగొనవలసిన అవసరం ఎంతైనా ఉంది. ●

---

అమెరికా

అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు నోబెల్ శాంతి పురస్కారంపై మక్కువ రోజురోజుకూ పెరుగుతూ వస్తోంది. ఏకంగా వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు శాంతిపురస్కారం ప్రధానం చేయాలని ప్రకటించారు. ప్రపంచ దేశాల్లో ఆరు శాంతి ఒప్పందాలకు ట్రంప్ దౌత్యం నెరపారని, అణుయుద్ధాలను సైతం విరమింప చేసారంటూలీవిట్ పేర్కొనడం గమనార్హం. గడచిన ఆరునెలల్లో నెలకొక వివాదం చొప్పున వివాదాలను పరిష్కరించారని, ఆరు శాంతి ఒప్పందాలు జరగడంలో ట్రంప్ ఎనలేని కృషి చేసారని లీవిట్ చెప్పుకొచ్చారు. అసలు ఇప్పటికే ట్రంప్ తాను స్వయంగా ఉక్రెయిన్, రష్యా, ఇరాన్-ఇజ్రాయెల్-పాలస్తీనా ఘర్షణలు తానే నివారించానని నోబెల్ శాంతి పురస్కారం అంటూ ఇస్తే తనకే ఇవ్వాలంటూ గతంలోనే ప్రకటించారు. అందుకు తగినట్లుగానే ఆయనకు శాంతిపురస్కారం ప్రధానం చేయాలంటూ వివిధ దేశాధినేతలు కూడా ఎండార్స్‌మెంట్లు ఇస్తామని ప్రకటించారు. అధ్యక్షుడుగాపాలన పగ్గాలు చేపట్టిన ఏడాదిలోనే ట్రంప్ పాకిస్థాన్, ఇండియా, థాయిలాండ్ కాంబోడియా, ఇజ్రాయెల్ ఇరాన్, రువాండా, కాంగో, సెర్బియా కొసావో, ఈజిప్ట ఇథియోపియా దేశాలమధ్య రగిలిన రావణకాష్టాలన్నింటినీ విరమింపచేసి ఆదేశాల మధ్య సఖ్యతకు ఎంతో కృషిచేసారంటూ వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ చెప్పుకొచ్చారు. ఇక ఇండియా పాకిస్థాన్‌లమధ్య ఆపరేషన్ సింధూర్‌ను విరమింపచేసింది తానేనని ట్రంప్ ఏకంగా 30సార్లు అయినా చెప్పి ఉంటారని భారత్‌లోని విపక్షాలు చెపుతున్న సంగతి తెలిసిందే. సింధూర్ ముగిసిన వెంటనే పాక్‌కు ఐఎంఎఫ్‌రుణం మంజూరులోను, యుద్ధ తాత్కాలిక విరమణలోను సాయం చేసారనుకుందో ఏమోకానీ పాక్‌తనంత తానుగా డొనాల్డ్‌ట్రంప్‌ను నోబెల్ శాంతిపురస్కారానికి ఎంపికచేయాలని తమ దేశం తరపున ఎండార్స్‌మెంట్ ఇస్తామని ప్రకటించేసింది. ఇప్పటివరకూ ట్రంప్‌నకు నోబెల్‌శాంతి బహుమతి ఇవ్వాలంటూ ఇజ్రాయెల్, పాకిస్థాన్ ప్రధాన మంత్రులతోపాటు ఆఫ్రికన్ గ్రూప్ దేశాల నేతలు గాబన్, గెయినా బిస్సావు, లైబీరియా, మారుటేనియా, సెనెగల్ వంటి దేశాలు ట్రంప్‌నకు

# 'నోబెల్ శాంతి' కి ట్రంప్ తహతహ!

**గన్ని మోహన్**

శాంతిపురస్కారానికి తాము ఎండార్స్‌మెంట్ ఇస్తున్నట్లు ప్రకటించాయి. రువాండా కాంగో శాంతి ఒప్పందంలో ట్రంప్ విశేష కృషిచేసారంటూ ఆదేశాలు ప్రస్తుతించాయి. కాంబోడియా డిప్యూటి పిఎం సున్ ఛాంథోల్ ఇప్పటికే ట్రంప్‌నకు శాంతిపురస్కారం ప్రధానం చేయాలంటూ బహిరంగంగానే వ్యాఖ్యానించారు. తమ దేశానికి సుంకాలు తగ్గించడంలోను, పొరుగుదేశంతో ఉన్న వివాదాలు పరిష్కరించడంలోట్రంప్ కీలక పాత్రపోషించారని డిప్యూటి పిఎం చెప్పుకొచ్చారు. అలాగే అమెరికా కాంగ్రెస్ మాన్ బడ్డీ కార్టర్ ట్రంప్‌ను నామినేట్ చేస్తామని ప్రకటించారు. మరో కాంగ్రెస్ మ్యాన్ డారెల్ ఇస్సా కూడా తన నామినేషన్ను ట్రంప్‌కోసం పంపించారు. మధ్యప్రాచ్యంలో శాంతి నెలకొనేందుకు ట్రంప్ కీలక పాత్రపోషించారంటూ ఆయన తన నామినేషన్‌లో వివరణ ఇచ్చారు. వివిధ దేశాలు, ప్రముఖులు, సెనేట్, రిపబ్లికన్లు ఎండార్స్‌మెంట్ ఇవ్వడం అటుంచితే అసలు ట్రంప్‌కే నోబెల్ శాంతిపురస్కారంపై ఎనలేని మక్కువ ఏర్పడింది. ఇందుకు కారణం కూడా లేకపోలేదు. 2009లో అప్పటి డెమొక్రాట్ అధ్యక్షుడు బరాక్ ఒబామాకు శాంతిపురస్కారం లభించింది. అలాగే 2002 సంవత్సరంలో అప్పటి అమెరికా అధ్యక్షుడు జిమ్మీకార్టర్‌కు నోబెల్ శాంతిపురస్కారాలు లభించాయి. ఒబామాకు అయితే గెలిచి పాలన పగ్గాలు చేపట్టిన తొమ్మిదినెలలకే ఆయనకు శాంతిపురస్కారం లభించింది. నోబెల్ పురస్కారాలకు గాను మరుసటి సంవత్సరం జనవరి 31 నాటికే దరఖాస్తులు పంపించాలి. ట్రంప్ తరపున వెళ్లాయోలేదో తెలియదు కాని ఈసారి తమ అధ్యక్షుడికే ఈ శాంతిపురస్కారం లభిస్తుందంటూ శ్వేతసౌధం ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లివిట్ ధీమాగా ఉన్నారు. ఓ పక్క వాణిజ్యఒప్పందాలకు రావాలంటూ ప్రపంచ దేశాలపై ఒత్తిడిని పెంచుతూ సామ, దాన దండోపాయాలను ఉపయోగించి తనదారికి తెచ్చుకుంటూ ఒప్పందాలు చేసుకుంటున్న ట్రంప్‌శాంతిపురస్కారానికి ఎలా అర్హులని డెమొక్రాట్లు ప్రశ్నిస్తున్నారు. ఇరాన్‌పై ఏకపక్షంగా చేసిన దాడి శాంతిపురస్కారానికి దోహదం చేస్తుందా అని నిలదీస్తున్నారు. ఉక్రెయిన్, రష్యాల మధ్య గడచిన నాలుగేళ్లుగా సాగుతున్న యుద్ధకాండను ఇప్పటికీ విరమింపచేయలేకపోయారని, పుతిన్‌తో శాంతిచర్చల్లో ఘోరంగా విఫలమైన ట్రంప్ శాంతిపురస్కారానికి ఎలా అర్హులు అవుతారన్న విమర్శలు వెల్లువలా వచ్చిపడుతున్నాయి. నిజానికి జీ7 దేశాలు కానీ, జీ20 దేశాల్లో ఏ ఒక్క అభివృద్ధిచెందిన దేశం కూడా నోబెల్ పురస్కారానికి ట్రంప్ పేరును ప్రతిపాదించలేదు, సరికదా సూచించను కూడా లేదు. ఉగ్రవాదంతో అట్టుడుకుతున్న దేశాల్లో ఏర్పడిన సరిహద్దు తగాదాలు పరిష్కరించడంలో ట్రంప్ అమెరికా ప్రయోజనాలను కాదని ఎప్పుడూ ముందుకుపోలేదన్న వాదన ఉంది. నోబెల్ ఎంపికలను పరిశీలిస్తే శాంతి పురస్కారానికి నార్వే పార్లమెంటు ఏర్పాటుచేసిన ఐదుగురు సభ్యుల కమిటీ నిర్ణయిస్తుంది. ప్రభుత్వ అధినేతలు, ప్రొఫెసర్లు, మాజీ పురస్కార గ్రహీతలు, శాంతిపరిశోధక సంచాలకులు వంటి వారి నామినేషన్లను మాత్రమే ఈఐదుగురు సభ్యుల కమిటీ అనుమతిస్తుంది. వాస్తవానికి నోబెల్ పురస్కారాలకు నామినేషన్లు ఈ ఏడాది జనవరి 31తోనే ముగిసాయి. మొత్తం 338 మంది ప్రముఖులు, 94 వివిధ సంఘాలు ఇందుకోసం దరఖాస్తులు చేసాయి. విజేతను అక్టోబరు నాటికి ప్రకటిస్తుంది. నార్వేలోని ఓస్లోలో డిసెంబరు 10వ తేదీ ఈ పురస్కారాల ప్రధానం ఉంటుంది. విజేతలకు బంగారుపతకం, డిప్లొమా, తొమ్మిది లక్షల అమెరికా డాలర్లు లభిస్తాయి. ఇప్పుడు ట్రంప్‌ను శాంతిపురస్కారం వరిస్తుందోలే ఆయన్ను పట్టిపీడిస్తున్నచిరకాల కోరికనెరవేరుతుందోలేదో చూడాల్సిందే. ●



డొనాల్డ్‌ట్రంప్

---

# వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది భర్తీలో జాప్యమెందుకు?

**మన్నారం నాగరాజు**

బ్రిటిష్ పాలకుల ఆలోచనలు, విధానాలు, స్వాతంత్ర్య పూర్వ భారత్లో ఆరోగ్య సంరక్షణ నమూనాలపైప్రత్యక్ష ప్రభావం చూపాయి. స్వాతంత్ర్యానికి పూర్వం, బ్రిటిష్ వారి ఏలుబడిలో భారతదేశ పురోగతిపై పెద్దఎత్తున చర్చజరిగేది. అభివృద్ధి సూచనలు దేశాన్ని దీనస్థితిలో చూపడంలో, దానిపై పలురకాల చర్చలు సాగేవి. మౌలిక విద్య, ఆరోగ్యం, సంక్షేమం మొదలైన వాటికి సంబంధించి ప్రజలు అభివృద్ధి చెందకపోవటానికి, భారతదేశపు వెనుకబాటు తనానికి వలస పాలకులు, వారు సాగించిన దోపిడీయే ప్రధాన కారణమని జాతీయ ఉద్యమ కోణంనుంచి అభిప్రాయం వ్యక్తమయ్యేది. వైద్య సేవల లభ్యతపై గ్రామీణ, గ్రామీణ ప్రాంతాల మధ్య అంతరాలు నెలకొని ఉన్నాయి. గ్రామీణ ప్రజలు స్థానికంగా వైద్యులుగా చలామణి అవుతున్న వారితో వైద్యం చేయించామంటున్నారు. మూఢనమ్మకాలతో, సహేతుకం కాని వ్యాధి నివారణ పద్ధతులను పాటిస్తున్నారు. గ్రామీణ పట్టణప్రాంత ప్రజల మధ్య అంతరానికి ఇది ఒక కారణం. భారతీయ ప్రజలు తక్కువ శక్తిమంతులుగా ఉండటానికి భారతీయ సమాజంలో వ్యవస్థలనే నిందించాల్సి ఉంటుందని వలస పాలకుల వాదం. భారత జాతీయ కాంగ్రెస్‌లోని ఆధునికులు, వామపక్షీయులు, తీవ్రవాదులు జాతీయ ఆరోగ్య విధానాలపై సలహా ఇచ్చారు. వలసపాలనతో రాజకీయంగా, సామాజికంగా, మేధాపరంగా ఎదురవుతున్న సవాళ్లను ఎదుర్కోవటానికి భారతీయ మేధావి వర్గం జరిపే బహిరంగ చర్చల్లో ఆరోగ్యం, సామాజిక ఆచారాల అంశం కూడా భాగమైంది. ఆరోగ్య స్థితిగతులపై 1948లో సర్‌జాన్ భోరే కమిటీ నివేదిక వెలువరించింది. అప్పటినుంచి ఆరోగ్య రంగంలో, అందునా ప్రత్యేకించి గ్రామీణ భారతంలోని దీన పరిస్థితిని గురించి, జాతీయ వాదులే గాక బ్రిటిష్వారు కూడా బాహాటంగానే చర్చించడం మొదలైంది. బ్రిటిష్ భారత్లో ప్రతి వేయిమంది జనాభాకు మరణాల రేటు 22. అదే శిశువుల మరణాల రేటు ప్రతివేయి జనాభాకు 162గా కమిటీ నిర్ధారించింది. కమిటీ అంచనా సహేతుకంగా ఉందనే అభిప్రాయం వ్యక్తమైంది. స్వతంత్ర భారతావనిలో ఆరోగ్య రంగంలో పురోగతి సాధనకు కమిటీ సిఫారసులు గొప్ప ముందడుగుగా పరిగణించారు. దేశం నలుమూలలా ఆరోగ్య కేంద్రాలు నెలకొల్పాలి. ప్రతి పౌరుడికీ ఆరోగ్య సంరక్షణను అందుబాటులోకి తేవాలి. ఆరోగ్య సంరక్షణ ఖర్చు సామాన్యుడి తలకుమించిన భారంగా ఉండకూడదు. ప్రజానీకానికి ఉచితంగా ఆరోగ్య సంరక్షణను, రక్షిత తాగునీటిని, పారిశుద్ధ్యాన్ని, పౌష్టిహకారాన్ని, మౌలిక విద్యను అందించాల్సిన కర్తవ్యం ప్రభుత్వంపై ఉంది. ఖర్చు భరించలేని కారణంగా ఎవరూ తగిన వైద్య సంరక్షణకు దూరం కాకూడదు. ఆరోగ్య సంరక్షణను కల్పించే వారి పాత్ర గురించి కమిటీ ప్రస్తావిస్తూ, వైద్యుడనేవాడు సామాజిక ఫిజిషియన్ అనీ, రోగాలబారి నుండి ప్రజలను కాపాడటమే గాకఆరోగ్య కేంద్రాలకు మార్గనిర్దేశం చేయడం అతడి బాధ్యత అని తెలిపింది. భారత్లో జాతీయ ఆరోగ్య కార్యక్రమాలకు, కేంద్రీకృత సంస్థాగత నిర్మాణానికి భోరే కమిటీ సిఫారసులు ప్రాతిపదిక అయ్యాయి. బీఆర్ఎస్ పార్టీ పది సంవత్సరాల పాలనలో వైద్యరంగాన్ని నిర్లక్ష్యం చేయడంపై తీవ్రమైన విమర్శలు వెల్లువెత్తాయి. ఎన్నికల హామీల్లో గొప్పగా ప్రకటించిన ఆరోగ్య తెలంగాణ, కార్పొరేట్ వైద్యం అంతా ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులోకి తెచ్చేలా కేసీఆర్ కిట్లు, ఆరోగ్యశ్రీ వంటి పథకాలు ప్రారంభించినప్పటికీ, భద్రత కలిగిన మౌలిక సదుపాయాలు, అవసరమైన సిబ్బంది భర్తీ, సమయానుకూల బడ్జెట్ కేటాయింపులు లేకపోవడం వల్ల అవి నిరర్థకంగా మిగిలిపోయాయి. జిల్లా ఆసుపత్రులు వైద్యుల్లేక, ఫార్మసిస్టుల్లేక, సిబ్బందిలేక కష్టాల్లో కూరుకుపోయాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఏఎన్ఎంలు, ఆరోగ్యకార్యకర్తలు తగిన పరిమాణంలో లేక, ఉండే వారికీ జీతాలు సకాలంలోరాక, ఒత్తిడి, ఆక్రోశానికి గురయ్యారు. వైద్యరంగంలో ఖాళీగా ఉన్న వేలాది పోస్టులను బీఆర్ఎస్ భర్తీ చేయకపోవడం ద్వారా ప్రజారోగ్యంపాడైంది. అత్యవసర చికిత్స అవసరమైన సమయానికి అందక



ప్రాణనష్టం చెందిన ఘటనలు పలుమార్లు వార్తలయ్యాయి. పల్లెల్లో ప్రసూతి సేవలు, ప్రాథమిక చికిత్సఅందే పద్ధతులు దారుణంగా నశించాయి. ఫార్మసిస్ట్‌లు, నర్సులు, మెడికల్ టెక్నీషియన్లు, డాక్టర్లు అందుబాటులో లేకపోవడం వల్ల ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో నమ్మకం తగ్గింది. ఇదే సమయంలో ప్రభుత్వ ఆరోగ్యశ్రీ పథకం ఎక్కువగా ప్రైవేట్ ఆసుపత్రులకు మళ్లడం, వాటికి బకాయిలు పెరగడం వల్ల సేవల్లో అంతరాయం కలిగింది. ఇక ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ముందుగా సిబ్బంది నియామకాలపై స్పష్టతనిచ్చి, త్వరితగతిన ఉద్యోగాలు భర్తీ చేయాల్సిన అవసరం ఉంది. ప్రజారోగ్యం పరిరక్షణే ప్రభుత్వ ధర్మంగా భావించి, ఆరోగ్య శాఖలో వృత్తిపరంగా నిష్ణాతులైన డాక్టర్లను, నర్సులను, ఫార్మసిస్టులను, ఇతర సిబ్బందిని నియమించడం అత్యవసరం. గ్రామీణ ప్రాంతాలకు మొదట ప్రాధాన్యతనిస్తూ మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలి. వైద్యరంగానికి బడ్జెట్లో కేటాయింపులు గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం క్రమంగా తగ్గించింది. వైద్యానికి ఆదాయం కాదు, సేవ ధ్యేయంగా భావించి కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం రాష్ట్ర బడ్జెట్‌లో 8శాతం వరకు కేటాయింపులు చేస్తేనే మార్పు కనిపిస్తుంది. గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ఆసుపత్రులు నూతనంగా నిర్మించడం లేదా పునరుద్ధరించడం ద్వారా సేవా స్థాయిని మెరుగుపరచాలి. ఒక గొప్ప ఆరోగ్య వ్యవస్థకు మూలం వ్యవస్థాపిత నియామకాలూ, స్థిరమైన బడ్జెటు కేటాయింపులూ, ప్రజలపట్ల ఉన్నత నైతిక బాధ్యతగల పాలన. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వానికి మంచి అవకాశం ఉంది. గత పాలకుల తప్పుల్ని పునరావృతం చేయకుండా, ప్రజల ఆరోగ్యాన్ని ప్రధాన కర్తవ్యంగా భావించి ముందడుగు వేస్తే, తెలంగాణలో ఆరోగ్య రంగానికి కొత్త శకం ప్రారంభమవుతుంది. ఇక తెలంగాణ రాష్ట్రంలో ప్రజారోగ్య సేవల విస్తరణకు క్షేత్రస్థాయిలో మెరుగైన వైద్య సేవల అందుబాటుకు వైద్య ఆరోగ్య శాఖ కీలకపాత్ర పోషిస్తోంది. అయితే, గతంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు ఈ విభాగాన్ని నిర్లక్ష్యం చేయడంతో అనేక సమస్యలు ఎదురయ్యాయి. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ముందు తరాల పొరపాట్లను సరిదిద్దే బాధ్యతతో ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా ఆరోగ్యశాఖలో ఖాళీగా ఉన్న నర్సులు, ఫార్మసిస్టులు, ఫామ్ డి డాక్టర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఏఎన్ఎంల పోస్టుల భర్తీప్రక్రియలో వచ్చే సమస్యలు, ఆలస్యాలు ప్రజారోగ్యాన్ని ప్రభావితం చేయడం గమనార్హం. ఈ రోజు ఆరోగ్య వ్యవస్థను ముందుకు నడిపించడంలో డాక్టర్లతో పాటు ఇతర ఆరోగ్య సిబ్బంది పాత్రను విస్మరించలేం. గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేకంగా ఏఎన్ఎంలు, స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లు ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య సేవలను అందిస్తున్నారు. వీరి అందుబాటులోనే గర్భిణీ స్త్రీలు, చిన్నపిల్లలు, వృద్ధులు ఆధారపడతారు. దీంతోపాటు, ఫార్మసిస్టులు మందుల సరఫరా నిర్వహణలో కీలకం కాగా, ల్యాబ్ టెక్నీషియన్లు పలు రకాల పరీక్షల ద్వారా డాక్టర్లకు కీలకసమాచారం అందిస్తారు. సుమారు 6,269పోస్టుల భర్తీ ప్రక్రియ, పరీక్షలు పూర్తై నెలలు గడిచినా ఫలితాల వెల్లడి లేదు. 2023లో తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖ మెడికల్ రిక్రూట్మెంట్ బోర్డు ద్వారా 6,269 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీచేసింది. ఇందులో ప్రధానంగా ల్యాబ్ టెక్నీషియన్, నర్సింగ్ ఆఫీసర్, ఫార్మసిస్టు, ఏఎన్ఎం పోస్టులే కాకుండా ఇతర అనుబంధ ఉద్యోగాలూ ఉన్నాయి. పరీక్షలు నవంబరు, డిసెంబరు 2023లో జరిగినా ఫలితాలు ఇప్పటివరకు విడుదల కాకపోవడం అభ్యర్థులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ల్యాబ్ టెక్నీషియన్ వేలమంది నిరుద్యోగ యువత పరీక్షలు రాశి, ఒక మంచి ఉద్యోగావకాశం కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం త్వరగా ప్రక్రియను పూర్తి చేస్తుందని ఆశించిన అభ్యర్థులు, నెలలుగడుస్తున్నా ఫలితాలపై స్పష్టత లేకపోవడంతో అయోమయంలో ఉన్నారు. ఒకవైపు ప్రభుత్వాసుపత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనుకుంటే, మరోవైపుఅందుకు అవసరమైన మానవ వనరులను త్వరగా అందుబాటులోకి తేవాలి. అభ్యర్థులు న్యాయపరమైన అంశాలు పోరుపడుతుంటే, ప్రభుత్వ యంత్రాంగం నిర్ణయాలు ఆలస్యంగా తీసుకోవడం మరింత సమస్యలను పెంచుతుంది. కనీసం ఇప్పుడైనా ఫలితాల ప్రక్రియపై స్పష్టమైన కాలపట్టికను విడుదల చేసి, నియామకాలను వేగంగా పూర్తి చేయాలి. ●

Main tab page 111_Main tab page 111.qxd 8/2/2025 11:24 PM Page 1



## బళ్లారి రాఘవ చిత్రపటానికి నివాళులర్పించిన డిఆర్ఓ

**ఒంగోలుటౌన్, ప్రభాతవార్త**



బళ్లారి రాఘవ 145వ జయంతి సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి బి. సిహెచ్. ఓబులేసు కలెక్టర్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ ఓబులేసు మాట్లాడుతూ చిన్నతనం నుండి రాఘవకి నాటకాల మీద ఉన్న ఆశక్తితో నాటకాలలో నటించితో అనుభవం సంపాధించి నాటక రంగ అభివృద్ధికి ఎంతో కృషిచేశారని, సామాజిక నాటకాల ద్వారా ప్రజలలో సమాజంలో అనేక విషయాల పట్ల చైతన్యం తీసుకురావడానికి కృషిచేశారన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

## రాయల్ ఓక్ ఫర్నీచర్ స్టోర్ ప్రారంభం

**ఒంగోలుటౌన్, ప్రభాతవార్త**



రాయల్ ఓక్ ఫర్నీచర్ స్టోర్‌ను స్థానిక సుజాత నగర్, పద్మ టవర్స్ ప్రక్కన శనివారం ప్రారంభించారు. భారతదేశంలోని పేరొందిన ఫర్నీచర్ బ్రాండు రాయల్ ఓక్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తమ విస్తరణలో భాగంగా ఒంగోలు పట్టణంలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ చేతుల మీదుగా ఫనీచార్ స్టోర్ ప్రారంభించారు. అత్యంత వైభవంగా ప్రారంభమైన ఈ ఫర్నీచర్ స్టోర్ ఆవిష్కరణ కార్యక్రమంలో అతిధులుగా రాయల్ ఓక్ ఇన్ కార్పోరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ వ్రుజయ్ సుబ్రహ్మణ్యం మరియు మేనేజింగ్ డైరక్టర్ మదన్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాయల్ ఓక్ నుండి ఫ్రాంచైజ్ హెడ్ కిరణ్ చబారియా, వియం,యన్ఎస్ఓ హెడ్ తమ్మయ్య కొటేరా, అంధ్రప్రదేశ తెలంగాణా రాష్ట్రాల హెడ్ కెపి వినోద్, ఫ్రాంచైజ్ యజమానులు నాని, మోనికా పాల్గొన్నారు.



ఒంగోలులో ప్రారంభించిన ఈ స్టోర్ 13,000 చ.అ. విస్తీర్ణం కలిగి లివింగ్ రూమ్, బెడ్ రూమ్, డైనింగ్ హాల్, ఆఫీసు మరియు అవుట్ డోర్ మొదలైన వాటికి అవసరమైన విస్తృత శ్రేణి ఫర్నీచర్ ఏర్పాటుచేయటమైనది. ఇంటికి అందాన్ని మరియు సౌకర్యాన్ని అందించు హుందాతనాన్ని పెంపొందించు వివిధ రకాల ఫర్నీచర్ వస్తువులు అన్ని వర్గాల వారికి అందుబాటైన సరసమైన ధరలకే లభిస్తాయి. ఒంగోలు పరిసర ప్రాంతాల వారి కి చక్కని ఫర్నీచర్ అవసరాలను తీరుస్తుంది. ఆంధ్రప్రదేశ్ ప్రాంతంలో ఇది 19వ స్టోర్‌గా అవతరిం చటమే కాక రాయల్ ఓక్ బ్రాండును మరింత బలోపేతం చేస్తుంది. ఈ ప్రారంభోత్సం సందర్భం గా విజయ్ సుబ్రహ్మణ్యం రాయల్ ఓక్ చైర్మన్ మాట్లాడుతూ మా ఫ్రాంచైజ్ పార్టనర్ నాని గారితో కలసి ఒంగోలులో స్టోర్ ప్రారంభించడం మాకు అత్యంత సంతోషంగా, గర్వంగా ఉందన్నారు. ఇది రాష్ట్రంలో మా విస్తరణను బలోపేతం చేస్తుందని, అత్యున్నత నాణ్యమైన ఫర్నీచర్‌ను అందిస్తుంద న్నారు. ఖాతాదారులకు వారి ఫర్నీచర్ అవసరాలకు సంబంధించిన సేవలు అందించటం మరియు వారు కలలు కనే ఫర్నీచర్ సమకూర్చటం తమ బాధ్యత అన్నారు. ఫ్రాంచైజ్ యజమానులకు శుభాకాంక్షలు తెలియచేస్తున్నామన్నారు. ఈ స్టోర్ సువిశాలంగా ప్రత్యేకమైన కంట్రీ కలెక్షన్స్ తోపాటు, అమెరికా, ఇటలీ, మలేషియా వంటి దేశాల నుండి దిగుమతి చేసుకున్న అద్భుతమైన ఫర్నీచర్ను అందుబాటులో ఉంచినది. రాయల్ ఓక్ బ్రాండు లక్షలాది ఖాతాదారుల జీవనశైలిలో భాగంగా విలాసవంతమైన మరియు ఆకర్షనీయమైన ఫర్నీచర్ అందిస్తుంది. రాయల్ ఓక్ భారత దేశం లోని అన్ని మెట్రో నగరాలు, టైర్2, టైర్3 నగరాలలో తమ స్టోర్స్ కలిగి ఉన్నది.

## మారం చినపేరి రెడ్డికి ఘన నివాళులు - వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

**చీమకుర్తి, ఆగస్టు 2, ప్రభాతవార్త**



తమ ఫౌండేషన్ ద్వారా పేద ప్రజలకు సేవ చేయడానికి ఎల్లప్పుడూ ముందుంటామని మద్దిపాడు ఏఎంసీ మాజీ చైర్మన్ మార వెంకారెడ్డి అన్నారు. చీమకుర్తి పట్టణం, రెడ్డిపాలెంలోని వారి నివాసంలో వెంకారెడ్డి తండ్రి మారం చినపేరిరెడ్డి 26వ వర్ధంతి కార్యక్రమమును శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుతగా వారి తండ్రి చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన గావించి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మారం వెంకారెడ్డి యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో మారం చిన పేరిరెడ్డి గారి 26వ వర్ధంతి కార్యక్రమమును పురస్కరించుకొని చీమకుర్తి పట్టణంలోని పేద ప్రజలకు మారం వెంకారెడ్డి ఫౌండేషన్ ద్వారా సుమారు 1500 మందికి పైగా దుప్పట్లు పంపిణీ చేయడం జరిగినది. అలాగే ఈ కార్యక్రమమును పురస్కరించుకొని చీమకుర్తి గాంధీ నగరంలోని ఏర్పాటుచేసిన వృద్ధాశ్రమానికి తన వంతు సహాయంగా 25వేల రూపాయలు నగదును వృద్ధాశ్రమ అభివృద్ధి కొరకై ఆశ్రమ కన్వీనర్ భాషాకు అందజేయటం జరిగినది. ఈ సందర్భంగా మారం వెంకా రెడ్డి ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ మారం వెంకారెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులో ఇటువంటి మరెన్నో సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు సహాయం అందిస్తానని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జవహర్ నర్సింగ్ హోమ్ అధ్యక్షులు డాక్టర్ బందా జవహర్, మారం వెంకట సుబ్బారెడ్డి, పోకూరి రామకృష్ణారెడ్డి, నుసుమ్ అశోక్, పేరం శ్రీనివాసరావు, భాష, చింత క్రింది అశోక్, గంగిరెడ్డి ఓబుల్ రెడ్డి, మేడగం బ్రహ్మరెడ్డి, మేడగం బాలకృష్ణారెడ్డి, దండు మధుసూదన్ రెడ్డి, బడే దశరథ రామిరెడ్డి, పల్లెపు బాలయ్య, కడవ రామకృష్ణ, మారం శివరామకృష్ణారెడ్డి, బడే కృష్ణారెడ్డి, కోటా రాములు తదితరులు పాల్గొన్నారు.


## నాకు టైం వచ్చినప్పుడు, నేనూ టార్గెట్ చేస్తా

### - ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి ఉద్వేగ భరిత ప్రసంగం

**చీమకుర్తి, ఆగస్టు 2, ప్రభాతవార్త**




నన్ను తిట్టినా నేను పట్టించుకోను, నాన్నగారి పేరుతో మంచి పనులు చేస్తూ ట్రస్టును నిర్వహిస్తున్నాం. బోర్డులు పెట్టుకోవడానికి సేవ, పనులు చేయడం లేదు. డాక్టర్లు అడిగితే ప్రభుత్వ ఆసుపత్రి వద్ద, మున్సిపల్ అధికారులు అడిగితే మున్సిపల్ కార్యాలయం వద్ద ఆర్చిలు కట్టించాం. అంటూ ప్రకాశం జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, దరిశి శాసనసభ్యులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి ఉద్వేగభరిత ప్రసంగాన్ని చేశారు. చీమకుర్తి బి వి ఎస్ ఆర్ కళ్యాణ మండపంలో శనివారం జరిగిన




బాబు షూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం ఈ ప్రసంగానికి వేదిక గా మారింది. ఖితమ ట్రస్టు ద్వారా నిర్మించిన ఆర్చిలను గడ్డపారలు పెట్టి పొడిచి పొడిచి పొడిచి మరీ నా హృదయాన్ని గాయపరిచిన వారిని మరచిపోనుఖి. వారందరూ పోయిన గవర్నమెంట్ లో శుభ్రంగా వ్యాపారం చేసుకున్నారు. ఇప్పుడు కొంతమంది మా క్వారీని ఆపేద్దామని బలపం కట్టుకొని ఒంగోలుకు తిరుగుతున్నారు. అది కూడా మరిచిపోను. వాళ్ళు వ్యాపారాలు చేస్తున్నారు. మీరు బాగుంటే నేను బాగుంటాను. నన్ను పర్సనల్ గా టార్గెట్ చేసి రోజు పొడుస్తా ఉంటే, నాకు టైం వచ్చినప్పుడు నేను పొడుస్తా. కార్యకర్తలు ధైర్యంగా ఉండండి. మీకు అండగా నేను మాజీ మంత్రి సంతనూతలపాడు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మెరుగు నాగార్జున ఉంటారు అంటూ బూచేపల్లి ఉద్వేగంగా మాట్లాడారు.

## తల్లి పాలు బిడ్డకు రక్షక వలయం

**కొండపి, ప్రభాతవార్త**

రోగ నిరోధకాన్ని పెంచేవి తల్లిపాలే పుట్టిన బిడ్డకు వ్యాధి నిరోధకాన్ని పెంచేది తల్లిపాలనని కొండపి శిశు సంక్షేమ శాఖ సిడిపిఓ సుశీల తెలిపారు పుట్టిన అరగంటలోపు తల్లిపాలు పట్టించాలని అవి బిడ్డకు రక్షక వలయం లాగా పని చేస్తాయని ఆమె అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా శనివారం మండలంలోని పెరిదేపి అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలు, విశిష్టత గురించి



తల్లులకు వివరించారు. బిడ్డ పుట్టినప్పుడు నుండి ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. ముందుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి బాలింతల గృహాలకు వెళ్లి తల్లి పాల ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ విక్టోరియా రాణి, గర్భవతులు, బాలింతలు, మహిళ సంరక్షణ కార్యదర్శి, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు, సిబ్బంది పాల్గొన్నారు

# ప్రకాశం



తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

## ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ రెన్యూవల్

**ఒంగోలుటౌన్, ప్రభాతవార్త**



ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ రెన్యూవల్ జిల్లాలోనే మొదటిసారిగా 2, 3 జరుగుతుంది. దీనిని ఏపియంసి చైర్మన్ డా.దగ్గుమాటి శ్రీహరిరావు శనివారం ప్రారంభించారు. మొదట కార్యక్రమములో కార్యదర్శి ఐయంఎ కార్యదర్శి డా.జాలాది మణిబాబు రెన్యూవల్ చేసుకోగా, సర్టిఫికేట్‌ను చైర్మన్ శ్రీహరిరావు అందజేశారు. కార్యక్రమంలో ఏపియంసి మెంబర్ కెవి సుబ్బానాయుడు, కళాశాల ప్రిన్సిపాల్ డా.పి అశోక్ కుమార్, ఐయంఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు డా.మన్నే వీరయ్య చౌదరి, పూర్వ అధ్యక్షులు డా.రావిపాటి జయశేఖర్, ఐయంఎ ఒంగోలు అధ్యక్షకార్యదర్శులు డా బిఎస్ సీతారామ య్యా, డా.జాలాది మణిబాబు, డా.యంవి రమణారెడ్డి, సీనియర్ వైద్యులు డా.నల్లూరి రాఘవరావు, డా.కొమ్మి నరశింగరావు,డా.వెంకటేశ్వర్లు,డా సూర్యనారాయణ, డా కోటిరెడ్డి పాల్గొన్నారు.

### వచ్చే సీజన్‌కు వెలుగొండ ఫేజ్ 1 పూర్తిచేసి


# ప్రకాశం జిల్లాకు కృష్ణా నీళ్లు



**ఒంగోలు, ప్రభాతవార్తప్రతినిధి**

రైతులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఏ పంట వేస్తే లాభాలు వస్తాయన్నది అధ్యయనం చేసి వారికి సూచనలు జారీ చేస్తామని వెల్లడించారు. సూపర్ సిక్స్ లో ప్రధాన హామీ అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రకాశం జిల్లా, దర్శి మండలం, వీరాయపాలెంలో ప్రారంభించారు. పచ్చని పొలాల్లో రైతుల మధ్య కూర్చుని ఈ కార్యక్రమాన్ని సీఎం ప్రారంభించారు. కర్షక సోదరులతో కలిసి పథకాన్ని ప్రారంభించి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 46,85,838 మంది రైతుల ఖాతాల్లో రూ.7 వేలు జమ చేశారు. అనంతరం ముఖ్యమంత్రి రైతులతో కాసేపు ముచ్చటించారు. సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల అమల్లో గత ప్రభుత్వానికి...కూటమి ప్రభుత్వానికి గల వ్యత్యాసం ఎంత మేర ఉందో చూడాలని సీఎం అన్నారు. ఎన్నికల్లో చేసిన ప్రకటన మేరకు రైతులకు ఏటా రూ.20,000 వేలు ఇస్తామన్న హామీని నెరవేర్చామన్నారు. ఈ పథకం ద్వారా 3 విడతల్లో రైతులకు ఈ పథకాన్ని వర్తింప చేస్తామని సీఎం స్పష్టం చేశారు.

- 46,85,838 మంది రైతులకు రూ.3,175 కోట్లలబ్ధి
- రైతును రాజు చేయాలన్నదే కూటమి లక్ష్యం
- రాజకీయ ముసుగేసుకున్న నేరస్తులతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలి
- ప్రకాశం జిల్లా దర్శిలో పచ్చని పొలాలు, రైతన్నల మధ్య అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకం ప్రారంభించిన సీఎం చంద్రబాబు



**- రైతుల కళ్లలో ఆనందం చూశా..**

అన్నదాత సుఖీభవ పథకాన్ని ఇలా పచ్చని పొలాలు, దేశానికి అన్నం పెట్టే రైతుల మధ్య ప్రారంభించడం తనకు ఎంతో ఆనందాన్ని ఇస్తోందని ముఖ్యమంత్రి అన్నారు. "రైతు కళ్లల్లో ఆనందాన్ని నేరుగా చూస్తున్నాను. రైతు ఎప్పటికీ రాజే. కరోనా వంటి విపత్తులోనూ అన్నదాత నాగలి చేతపట్టి పొలంలో పనిచేశాడు. ఎన్ని కష్టాలున్నా రైతులు బాగుండాలనేది నా కోరిక. ఎన్నికలకు ముందు విధ్వంస, సైకో పాలనతో అందర్నీ ఇబ్బంది పెట్టి వారు ఆనందపడ్డారు. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్టే సూపర్ సిక్స్ అమలు నాకు మాటల్లో చెప్పలేని సంతోషాన్నిస్తోంది. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రాష్ట్రంలోని 46,85,838 మంది రైతులకు లబ్ధి చేకూరింది. మొదటి విడతలో రాష్ట్ర వాటాగా ఒక్కో రైతుకు రూ.5,000 చొప్పున జమ చేశాం. దీనికోసం రూ.2,343 కోట్ల నిధుల్ని కేటాయించాము. మొదటి విడతలో కేంద్ర ప్రభుత్వం తన వాటాగా రూ.2,000 చొప్పున రూ.832 కోట్లు ఇస్తోంది. మొదటి విడతలో కేంద్రంరాష్ట్ర వాటాలు కలిపి ఒక్కో రైతుకు రూ.7,000 జమ చేశాం. ఈ విడతలో రైతులకు రూ.3,175 కోట్ల మేర లబ్ధి కలుగుతోంది." అని సీఎం తెలిపారు.

**- సందేహాల నివృత్తికి పోర్టల్, టోల్ ఫ్రీ నెంబర్..**

పథకం అమలుకు సంబంధించి రైతులకు ఎలాంటి ఫిర్యాదులు, సందేహాలు ఉన్నా అన్నదాత సుఖీభవ పోర్టల్‌లోని ఆర్ఎస్ కే లాగిన్ ద్వారా తెలుసుకోవచ్చని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అలాగే 155251 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని అన్నారు. "అన్నదాత సుఖీభవ కింద ప్రకాశం జిల్లాకు రూ.186 కోట్లు ఇస్తున్నాం. జిల్లాలోని 2,65,317 లక్షల మంది రైతులకు ఈ పథకం ద్వారా లబ్ధి కలుగుతోంది. అలాగే దర్శి నియోజకవర్గంలో 42,786 మంది రైతులకు రూ.29 కోట్లు ఇస్తున్నాం. దర్శి మండలంలో 10,972 మంది రైతులకు రూ.7.36 కోట్లు ఇస్తున్నాం. ఒక్క వీరాయపాలెంలోనే 476 మంది రైతులకు రూ.31,00,000 లక్షలు ఇస్తున్నామని సీఎం చంద్రబాబు వివరించారు.

**- సూపర్ సిక్స్ అమలు సంతోషాన్నిస్తోంది..**

రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా టీడీపీ, బీజేపీ, జనసేన పొత్తు పెట్టుకుని ఎన్నికలకు వెళ్లాం. ప్రజలు బ్రహ్మాండమైన మెజారిటీతో గెలిపించారు. గత ప్రభుత్వం రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం చేసింది. చాలా సమస్యలు వచ్చాయి. ఎన్ని కష్టాలున్నా, ఇచ్చినమాట నిలబెట్టుకోవాలని సూపర్ సిక్స్ అమలు చేస్తున్నాం. నేను హామీ ఇచ్చినట్టే పెంచిన రూ. 4000 పింఛను గత ఏడాది ఏప్రిల్ నుంచే ఇచ్చాను. పింఛన్ల కోసం ఏడాదికి 64 లక్షల మందికి రూ. 32,134 కోట్లు ఖర్చు చేస్తున్నాం. గత ప్రభుత్వం ఐదేళ్లలో రూ.1000 మాత్రమే పెంచింది. భర్త చనిపోతే భార్యకు వితంతు పెన్షన్ ఎగ్గొట్టారు. ఎవరైనా లబ్దిదారులు రెండు నెలలు పింఛను తీసుకోకపోయినా మూడు నెలల మొత్తాన్ని ఒకేసారి ఇస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు.

**- 15వ తేదీ నుంచి ఉచిత బస్సు..**

తల్లికి వందనం కింద ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అందరికీ రూ.15 వేలు ఇచ్చాం. గత ప్రభుత్వం అందరికీ ఇస్తామని ఎన్నికల్లో చెప్పి తీరా గెలిచాక మాట మార్చి ఒక్కరికే పరిమితం చేశారు. దీపం పథకం కింద ఆడబిడ్డల జీవితాల్లో వెలుగులు నింపాను. దీపం కింద మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. ఇందుకోసం రూ. 2,700 కోట్లు వెచ్చిస్తున్నాం. ఈనెల ఆగస్టు 15న స్త్రీ శక్తి కింద ఆడబిడ్డలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తాం. దీని వల్ల రాష్ట్రంలోని 2 కోట్ల60 లక్షలమంది మహిళలకు లబ్ధి చేకూరుతుంది. మీ పెద్దలు ఇచ్చిన ఆస్తికంటే నేను నెలవారీ చేసే సాయమే ఎక్కువ. ప్రభుత్వం అన్నా క్యాంటీన్లు పెట్టి రూ.5 కే భోజనం పెడుతుంటే గత ప్రభుత్వం క్యాంటీన్లను మూసేసిందని సీఎం చంద్రబాబు అన్నారు.

**- పంటలకు గిట్టుబాటు ధర కల్పించాం..**

సబ్సిడీ విత్తనాల నుంచి గిట్టుబాటు ధర వరకు అండగా నిలిచాం. 20142019 మధ్య మా హయాంలోనే వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్ తీసుకువచ్చాం. రూ.15,279 కోట్ల రుణ మాఫీ చేశాం. ఉచితంగా భూసార పరీక్షలు జరిపి 1.33 కోట్ల సాయిల్ హెల్త్ కార్డులు ఇచ్చాం. ఎన్టీఆర్ జలసిరి కింద బోర్లు వేశాం. 6 లక్షల పంట కుంటలు తవ్వించాం. రూ.1,488 కోట్లతో4.99 లక్షల మంది రైతులకు వ్యవసాయ యంత్ర పరికరాలు అందించాం. రైతు రథం పేరుతో 23,500 ట్రాక్టర్లు సబ్సిడీపైన పంపిణీ చేశామని సీఎం తెలిపారు.

**- రాజకీయ ముసుగు వేసుకున్న నేరస్తులతో జాగ్రత్త..**

రాజకీయ ముసుగు వేసుకున్న నేరస్తులతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలి. 47 ఏళ్ల రాజకీయ జీవితంలో 15 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్నాను. గతంలో ఎన్నడూ చూడని కొత్త రాజకీయాలు చూస్తున్నాను. మన రాష్ట్రంలో ఉన్న ఒక పార్టీ.. అమరావతి ఆడబిడ్డలను వేశ్యలుగా చిత్రీకరించింది. ఆ పార్టీ అధినేత ప్రకాశం జిల్లా పొదిలి వచ్చినప్పుడు ఆడబిడ్డలు క్షమాపణ చెప్పమని కోరగా వారిపై దౌర్జన్యం చేశారు. టీడీపీ ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డిని వైసీపీ నేత నల్లపురెడ్డి పశువులా దూషించాడు. పార్టీ అధినేత ఏం చేశాడు? మందలించకుండా.. మా వాళ్లకు చెప్తే చాలు...ఇళ్లలోకి పోయి రప్పా రప్పా లేపేస్తారని అంటున్నాడు. బాబాయ్ హత్య విషయంలో నన్నూ ఏమార్చారు. పల్నాడులో వైసీపీ కార్యకర్త ఆయన కారు కిందే పడితే ఎత్తి పొదల్లో పడేశారు. చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం లో మామిడికి ధర లేదని మామిడి పళ్లను ట్రాక్టర్ల కింద తొక్కించి రాజకీయ విన్యాసం చేశాడు. నెల్లూరులో జనం వచ్చినట్టు ఫేక్ వీడియో ప్రదర్శించాడు.

**- జగన్‌ను చూసి బూతులు నేర్చుకోవాలా..**

రాజకీయ పార్టీలు ప్రజల కోసం పని చేయాలి. వారి అంతిమ లక్ష్యం అధికారమైనప్పటికీ నైతిక విలువలు, పద్దతులు, నిబంధనలు, కట్టుబాట్లు తప్పనిసరిగా పాటించాలి. జగన్ ను చూసి రప్పా రప్పా, బూతుల పంచాంగం, గొడ్డలి వేట్లు నేర్చుకోవాలా? పేదల ప్రాణాలు, ఆస్తులు కాపాడేందుకు నేను పనిచేస్తున్నాను. నేను అభివృద్ధి చేసిన తెలంగాణ ఎలా ఉందో చూశారుగా. అంతకు మిన్నగా ఏపీని 2047 నాటికి దేశంలోనే నెంబర్ వన్ గా తయారు చేస్తానని సీఎం చంద్రబాబు తెలిపారు.










## అభివృద్ధి సంక్షేమం దిశగా టిడిపి ప్రభుత్వం: ఎమ్మెల్యే దామచర్ల

*- అన్నదాత సుఖీభవ క్రింద 2 కోట్ల 94 లక్షల 84 వేలు మంజూరు*

**కొత్తపట్నం, ఆగస్టు 2, ప్రభాతవార్త**

ఎన్నికల హామీలు భాగంగా అన్నదాత సుఖీభవ పథకం కింద కొత్తపట్నం మండలంలో 4212 మంది రైతులకు 2 కోట్ల 94 లక్షల 84 వేలు మంజూరైనట్లు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ అన్నారు. శనివారం కొత్తపట్నం రైతు భరోసా కేంద్రం ఆవరణలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్నదాత సుఖీభవ పథకం అమలులో రైతులకు చెక్కులు పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి మండల వ్యవసాయ అధికారి ఏ కిషోర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ మాట్లాడుతూ ఎన్నికల్లో సూపర్ సిక్స్ పథకాలలో నాలుగవది అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దర్శిలో లాంఛనంగా ప్రారంభిస్తున్నారు. పది లక్షల కోట్లు అప్పుల్లో ఉన్నప్పటికీ టిడిపి ప్రభుత్వం అన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నా మన్నారు. రాష్ట్రంలో 46 లక్షల 85 వేల ఎనిమిది వందల ఎనిమిది మంది రైతులకు 2,340 కోట్లు ఖర్చు చేస్తున్నామ న్నారు. గత వైసిపి, ప్రస్తుత టిడిపి ప్రభుత్వ పనితీరును ప్రజలే అర్థం చేసుకోవాలన్నారు. జిల్లాలో 2,65, వేల మంది




రైతులకు 183 కోట్ల రూపాయలు రైతుల ఖాతాలో జమవుతుందన్నారు. అభివృద్ధి సంక్షేమం దిశగా తెలుగుదేశం ప్రభుత్వం ముందుకు నడుస్తుందన్నారు. ప్రైవేట్ స్కూలుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నామన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ కుందాం 6 పంచాయతీలకు సిసి రోడ్లు వేయించామని ఈతముక్కలలో బకింగ్ హామ్ కెనాల్ బ్రిడ్జి నిర్మాణ పనులు చేపడుతున్నామన్నారు. ప్రజలందరికీ మౌలిక వసతులు కల్పించాలని బాధ్యత మనపై ఉందన్నారు. కొత్తపట్నం నుండి పల్లెపాలెం బీచ్ వరకు సెంట్రల్ లైటింగ్ తో పాటు డబల్ రోడ్డు నిర్మాణము మోటుమాలకు రెండు కిలోమీటర్ల బీటీ రోడ్డు వేయిస్తామన్నారు. మండలాన్ని అభివృద్ధి పథంలో తీసుకుని వెళ్తామన్నారు. రెవిన్యూ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని వాటి పరిష్కారాలు తీసుకో నెలరోజులు వ్యవధి ఇస్తున్నామని తహసిల్దార్ ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పిడిసిసి బ్యాంక్ చైర్మన్ సీతారామయ్య, తాసిల్దార్ కే శాంతి, గేనం సుబ్బారావు, సర్పంచ్ మా కాని శ్రావణి, రామచంద్ర గౌడ్, బలగాని వెంకటేశ్వర్లు,పిన్ని దేవప్రసాద్, ద్వారబోకుల శ్రీనివాసరెడ్డి, కొత్తపట్నం టిడిపి అధ్యక్షులు సింగిరి శ్రీనివాసులు, కన్వీనర్ శివారెడ్డి, లక్ష్మణ్‌రెడ్డి, ఈ ఓ ఆర్ డి వేణుగోపాలకృష్ణమూర్తి నాయకులు కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.

### సింగరకొండ లక్ష్మీనరసింహాస్వామి

## పాలకమండలి నియామకం

### - 4న ప్రమాణ స్వీకారం

**అద్దంకి, ఆగస్టు 2, ప్రభాతవార్త**



ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన సింగరకొండలోని కొండపై వెంచేసియున్న శ్రీలక్ష్మీనరసింహాస్వామి ఆలయ పాలకమండలిని నియమిస్తూ రాష్ట్ర దేవాదాయశాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులను జారీ చేశారు. రాష్ట్ర విద్యుత్‌శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్ సిఫార్సులు మేరకు ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి. పాలకమండలి అధ్యక్షులుగా గుంజి శ్రీనివాసరావు(పాపులగారి శ్రీను), డైరెక్టర్‌లుగా మంగమూరి సురేష్, దాసరి రామాంజనేయులు, రుద్రు ఆదిలక్ష్మి శ్రీనివాసరావు, కొడెమల కోటేశ్వరమ్మ వెంకటేశ్వర్లు, చీమలదిన్నె వెంకటరమణ గురవయ్య, కసుకుర్తి లక్ష్మీ ప్రసన్న వీర వెంకట పద్మనాభ శర్మ, బత్తుల సరిత శ్రీనివాసరావు, అద్దంకి ఆదిలక్ష్మి వెంకటేశ్వర్లుతోపాటు ఆలయ పూజారి భాగవతుల నరసింహాచార్యులును నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇది ఇలా వుండగా ఈనెల 4వ తేది సోమవారం ఉదయం ఆలయ పాలకమండలి ప్రమాణ స్వీకారం చేయ నున్నది. ఆమేరకు ఆలయ అధికారులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.

















## మలినేని సుశీలమ్మ కళాశాలలో ఉచిత వైద్య శిబిరం



**సింగరాయకొండ, ఆగస్టు 2,(ప్రభాతవార్త**

గుమడల పరిధిలోని కనుమల్ల గ్రామం మలినేని సుశీలమ్మ ఇంజనీరింగ్ కళాశాలలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మై డెంట్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో దంత వైద్యులు డా. వర్షితల్లా,డా. ఆనంద్,డా.ఎం. జ్యోతి పాల్గొని విద్యార్థులకు సేవలు అందించారు.ఈ శిబిరంలో మొత్తం 206 మంది విద్యార్థులను పరీక్షి ంచి, దంత సంబంధిత సమస్యలపై వైద్య సలహాలు ఇచ్చి మందులు పంపిణీ చేశారు. దంత ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు.ఈ వైద్య సేవలందించిన వైద్య బృందాన్ని మలినేని విద్యాసంస్థల చైర్మన్ మలినేని పెరుమాళ్ళు, డైరెక్టర్ ఏ.జి.కె. మూర్తి ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కోటేశ్వరరావు, హెచ్.ఒ.డి మనువెల, సిబ్బంది నాగార్జున, వెంకటేశ్వర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కొప్పెరపాడులో తల్లిపాల వారోత్సవాలు



**బల్లికురవ, ఆగస్టు 2, (ప్రభాతవార్త**

తల్లిపాలు చంటి బిడ్డల ఎదుగుదలకు సంజీవనిలా పని చేస్తాయని, అదే విధంగా తల్లి ఆరోగ్యం కూడా మరింత మెరుగవుతుందని సంతమాగులూరు సీడీపీఓ సుధా అన్నారు. శనివారం మండలంలోని కొప్పెరపాడులో జరిగిన తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ప్రతి ఏటా ఆగస్టు మొదటి వారంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. పుట్టిన బిడ్డకు అరగంటలోపే ముర్రు పాలు తాగించడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెంపొంది, ఆరోగ్యవంతంగా ఎదుగుదల ఉంటుందన్నారు. చంటి బిడ్డలకు పాలు పట్టించడం ద్వారా తల్లులు రొమ్ము క్యాన్సర్ లాంటి ప్రమాదకర వ్యాధుల నుండి తప్పించు కోగలుగుతారు అన్నారు. ఈ సందర్భంగా స్థానిక ఉన్న పాఠశాలలో కిశోర వికాసం కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలికలకు గుడ్ టచ్,బ్యాడ్ టచ్ గురించి ప్రత్యేక అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ విజయనిర్మల,జ్యోతి,అంగన్వాడీ కార్యకర్తలు,సిబ్బంది పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు.. ఒకరు మృతి



**బల్లికురవ, ఆగస్టు 2, (ప్రభాతవార్త**

బల్లికురవ దగ్గరలో కలవకూరు పెట్రోల్ బంకు సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వల్లాపల్లి గ్రామానికి చెందిన షేక్ అల్లాఉద్దీన్(42) దుర్మరణం చెందారు. వివరాల్లోకి వెళ్తే.. వల్లాపల్లి గ్రామానికి చెందిన అల్లాఉద్దీన్ అద్దంకి ద్వారకానగర్లో ట్రాక్టర్ మెకానిక్షెడ్ నిర్వహిస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా రోజు అద్దంకి వెళ్లి రాత్రివేళ బొల్లాపల్లి చేరుకుంటాడు. రోజు మాదిరిగానే ఇంటికి వస్తున్న క్రమంలో కలవకూరు పెట్రోల్ బంక్ సమీపంలో ధర్మవరం వైపు వస్తున్న ఏపీ 09 సీఏ 6826 నెంబరు గల కారు అల్లాఉద్దీన్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి ఆగకుండా వెళ్ళిపోయింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన అల్లాఉద్దీన్ చికిత్స అందకపోవడంతో మృతి చెందారు. కారును గుర్తించిన గ్రామస్తులు శనివారం అద్దంకి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతునికి భార్య,ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

## నూతన వస్త్ర వేడుకకు హాజరైన కరణం



**బల్లికురవ, ఆగస్టు 2, (ప్రభాతవార్త**

బల్లిబాలాయ్యు కళ్యాణ మండపంలో శనివారం మద్దన వెంకటేశ్వర్లు, సరూపరాణిల కుమార్తె ఆధ్య నూతన వస్త్ర బహూకరణ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చీరాల మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి హాజరై చిన్నారి ఆధ్యను ఆశీర్వదించారు. ఆయనతో పాటు గోరంట్ల వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యాభివృద్ధికి అకాడమిక్ ఫోరం టీం సభ్యులు తోడ్పడాలి

### - ఎంఈఓ-2 నరసింహారావు



**కొనకనమిట్ల, ఆగస్టు 2, (ప్రభాతవార్త**

పాఠశాలలో విద్యాభివృద్ధికి మండల అకాడమిక్ ఫోరం సభ్యులు తోడ్పడాలని మండల విద్యాశాఖ అధికారి - 2 బరిగే నరసింహారావు కోరారు. మండల విద్యా వనరుల కేంద్రం నందు ఆయన అధ్యక్షతన శనివారం జరిగిన మండల అకడమిక్ ఫోరం సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మండల విద్యా వ్యవస్థలో ఎంఏఎఫ్ ఆధ్వర్యంలో మండలంలోని పాఠశాలలను సందర్శించడం జరుగుతుందని, పాఠశాలలో జరిగే విద్యాసంబంధమైన కార్యక్రమాలు, గుణాత్మక విద్య, టీచర్ హ్యాండ్ బుక్, విద్యా శక్తి పథకం, వివిధ సబ్జెక్టుల నైపుణ్యతను పరిశీలించడం జరుగుతుందన్నారు. ప్రాథమిక పాఠశాలలో పిల్లల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించడం జరుగుతుందని, విద్యార్థుల మదింపు, నోట్ బుక్స్,వర్క్ బుక్స్ కరెక్షన్స్, సహ పాఠ్య కార్యక్రమాల తీరును పరిశీలించడం జరుగుతుందని, విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పడే విధంగా మండల అకాడమిక్ ఫోరం టీం సభ్యులు తోడ్పడాలని సూచించారు. ఈ మండల అకడమిక్ ఫోరంలో గొట్లగట్టు, కొనకనమిట్ల క్లస్టర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు టి.ఆదినారాయణ,బి.ఉదయ్ కుమార్, ఎంఏఎఫ్టీం సభ్యులు, జీవశాస్త్ర,భౌతిక,సాంఘిక శాస్త్రాల గణితం,హిందీ,తెలుగు,ఇంగ్లీష్ పాఠ్యాంశాల ఉపాధ్యాయులు మండ్లరామాంజనేయులు,గీత,మురళి,బుర్రిశ్రీనివాసులు,కే.వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, తిరుపతయ్య, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు రమేష్రెడ్డి,మురళి,సీఆర్పీలు శ్రీనివాసరెడ్డి, చెన్నయ్య తదితరులు హాజరయ్యారు. కొనకనమిట్ల మండలంలోని ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాల సందర్శనకు ప్రత్యేక కార్యచరణను రూపొందించారు. మండల అకడమిక్ టీం మెంబర్స్ మండలంలోని అన్నిపాఠశాలలను సందర్శించడం జరుగుతుందని ఎంఈఓ - 2 నరసింహారావు తెలిపారు.

## వెలిగండ్లలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు



**వెలిగండ్ల, ఆగస్టు 2, (ప్రభాతవార్త**

వెలిగండ్ల మండల పరిధిలోని తాడివారిపల్లి అంగన్వాడీ కేంద్రంలో శనివారంనాడు తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా వెలిగండ్ల మండల అంగన్వాడి ఐసీడీఎస్ సీడీపీఓ ఉషాబేగం మాట్లాడుతూ నవజాత శిశువులకు తల్లిపాలు ఎంతో శ్రేష్టమైనవి, బిడ్డ ఎదుగుదలకు ఎంతో సహకరిస్తుందని అన్నారు. తల్లిపాలు వలన బిడ్డలు అనారోగ్యాల నుండి కాపాడుకోవచ్చు అన్నారు. ఖచ్చితంగా తల్లులు తమ బిడ్డలకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమం ఐసీడీఎస్ అంగన్వాడీ సూపర్వైజర్ కృపావరం, మేరీ ఉషశ్రీ, అంగన్వాడీ కార్యకర్తలు సామ్రాజ్యం, ఈశ్వరి, గర్భవతులు, బాలింతలు, పిల్లల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

## కానిస్టేబుల్గా ఎంపికైన ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల విద్యార్థి



**యర్రగొండపాలెం,ఆగస్టు 2,(ప్రభాతవార్త**

యర్రగొండపాలెం ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో 2024-25విద్యా సంవత్సరంలో బి.కాం.పూర్తి చేసిన పి.పాపరాజు అనే విద్యార్థి కానిస్టేబుల్గా ఎంపికయ్యాడు.కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ వైస్ ప్రిన్సిపాల్ ప్రదీప్,కళాశాల అధ్యాపకులు,విద్యార్థినీ విద్యార్థులు పాపరాజును అభినందించారు.

## గుమ్మలంపాడులో సమాచార హక్కు చట్టంపై అవగాహన



**సంతనూతలపాడు, ఆగస్టు 2, (ప్రభాతవార్త**

సంతనూతలపాడు మండలం గుమ్మలంపాడు సచివాలయంలో శనివారం నాడు సమాచార హక్కు చట్టంపై పంచాయతీ కార్యదర్శి ఎన్.జయశంకర్ అధ్యక్షతన గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సమాచార హక్కు చట్టంపై ప్రజలకు ఈ సందర్భంగా వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ షేక్ పాత్ర సాహెబ్, గ్రామ టీడీపీ అధ్యక్షులు బొద్దపాటి చంద్రశేఖర్, ఉప సర్పంచ్ ఎం.దామోదర్, గ్రామస్తులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## రాచమల్ల వారి వివాహ వేడుకలో మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు



**సీఎస్పురం, ఆగస్టు 2, (ప్రభాతవార్త**

కనిగిరి మాజీ కౌన్సిలర్ రాచమల్ల శ్రీనివాసులురెడ్డి కుమార్తె వివాహం సందర్భంగా శనివారం కనిగిరి మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు కనిగిరిలోని వారి నివాస గృహానికి వెళ్లి వధువుని ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కదిరి రమణయ్య, కదిరి పిచ్చయ్య, మాజీ కౌన్సిలర్ షేక్ ఫయాజ్, షేక్ రషీద్, మాజీ ఎంపీటీసీ మునగల నారాయణరెడ్డి, గోను చంద్రశేఖర్రెడ్డి, ముత్యాల ప్రతాప్, మార్తల రాము తదితరులు పాల్గొన్నారు.

## రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పుస్తకాలు, పెన్నులు బహుకరణ



**మార్టూరు, ఆగస్టు 2, (ప్రభాతవార్త**

మార్టూరు గ్రామంలోని ఎంపీపీ స్కూల్ పీర్ల చావిడి వద రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు వారి ఆధ్వర్యంలో భారత జాతీయ జెండా రూపశిల్పి, భారత స్వాతంత్ర్య యోధుడు, గాంధేయ వాది మన తెలుగుజాతి ముద్దుబిడ్డ పింగళి వెంకయ్య జయంతి వేడుకలను శనివారం నిర్వహించారు. తొలుత పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో 35 మంది స్కూల్ పిల్లలకు సుమారు రూ.8వేలు విలువ కలిగిన నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, బిస్కెట్లు, చాకెట్లు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు మాదాల సాంబశివరావు, కోశాధికారి గోనుగుంట్ల రవికుమార్, రొటిరియన్స్ మోటుపల్లి అంకయ్య, చల్లగుండ్ల శ్రీనివాసరావు, సీనియర్ రొటేరియన్ మురకొండ ఈశ్వర ప్రసాద్, రాంబాబులు పాల్గొన్నారు.

## వివాహ వేడుకలో మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు



**సీఎస్పురం, ఆగస్టు 2, (ప్రభాతవార్త**

కోవిలంపాడు గ్రామానికి చెందిన నీటి సంఘం అధ్యక్షుడు దోనపాటి మోహన్రెడ్డి సోదరుడు సుధాకర్రెడ్డి కుమారుడు మహేంద్ర వివాహం సందర్భంగా శనివారం కనిగిరి మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు కోవిలంపాడు లోని వారి నివాస గృహానికి వెళ్లి వరుడు మహేంద్రని ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు మునగల నారాయణరెడ్డి, మూరం కాశిరెడ్డి, అమడసాని బాల కేశవరెడ్డి, గోను చంద్రశేఖర్రెడ్డి, జిల్లెళ్ళ లక్ష్మీ నారాయణరెడ్డి, పాపి జన్ని, తిరుపతయ్య, షేక్ అహమ్మద్, సూరి తదితరులు పాల్గొన్నారు.

## రైతు ఆనందంగా ఉంటేనే.. రాష్ట్రం సస్యశ్యామలం

### - రైతుల భరోసాకే అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్

### - రైతు భరోసా ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ఏలూరి



**మార్టూరు. ఆగస్టు 2, (ప్రభాతవార్త**

రైతు ఆనందంగా ఉంటేనే రాష్ట్రం సస్యశ్యామలంగా ఉంటుందని, రైతుకు కూటమి ప్రభుత్వం బాసటగా నిలుస్తుందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. శనివారం పర్చూరు వ్యవసాయ మార్కెట్లో అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరయ్యారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం అద్భుత పథకానికి రూపం ఎన్నికల సమయంలో తెలుగుదేశం బీజేపీ జనసేన కూటమి ఇచ్చిన సూపర్ సిక్స్ హామీని ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రధాని మోడీ ఈనాడు నెరవేర్చారన్నారు. సాగు భూమి ఉన్న ప్రతి రైతు కుటుంబానికి సాగుదారు కుటుంబాలకు అన్నదాత సుఖీభవ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.14000లను పీఎం కిసాన్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం 6 వేలు మొత్తం ఏడాదికి 20 వేల చొప్పున ఆర్థిక సహాయం రైతులకు అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు. ఈ రోజు 4685838 రైతు ఖాతాల్లో రూ.3174 కోట్లు జమ చేయడం జరుగుతుందన్నారు. పర్చూరు నియోజకవర్గంలో 37,861 లక్షల మంది రైతు ఖాతాల్లో రూ.26,19,000 కోట్లు జమ కానున్నట్లు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, రైతన్న తీవ్ర నిర్లక్ష్యం చేసిందని మండిపడ్డారు. సబ్సిడీపై యంత్ర పరికరాలు బిందు సేద్యం, రైతు రథాలు అన్నింటిని నిలిపివేసిందన్నారు. కూటమి ప్రభుత్వం రైతాంగానికి అండగా నిలుస్తుందని సబ్సిడీ యంత్ర పరికరాలు డ్రోన్లు, విత్తనాలు అందిస్తుందన్నారు. కష్టాల్లో ఉన్న పొగాకు మామిడి కోకో రైతులకు ఆదుకొని భరోసా ఇచ్చిందన్నారు. రైతులు పొగాకు పంటను వేయవద్దని ప్రత్యామ్నాయ పంటల వైపు కదలాలన్నారు. ఎన్నో ఇబ్బందులు ఉన్న ఇచ్చిన మాటకు కట్టుబడి ఎన్నికల హామీని నెరవేర్చామన్నారు. రాష్ట్రాన్ని ఆర్థికంగా నిలబెట్టేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అహర్నిశలు శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో కాలువల్లో చివరి భూములకు సాగునీరు అందిన పరిస్థితి లేదని కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్నెస్పీ కొమ్మమూరు కాలువలను ఆధునీకరించి చివరి భూములకు నీళ్ల అందించేలా చర్యలు చేపట్టిందన్నారు. పొగాకు పంటను కొనుగోలు చేసేందుకు టొబాకో బోర్డు ముందుకు వచ్చిందన్నారు. దేశంలో ఎన్నడూ లేని విధంగా ఇబ్బందుల్లో ఉన్న బర్లీ రైతులను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు సాహసోపేత నిర్ణయం తీసుకున్నారని గుర్తు చేశారు. రైతులపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఉన్న ప్రేమకు నిదర్శనం అన్నారు. శనగ, మొక్కజొన్న పంటలను రైతులు సాగు చేయాలని ప్రభుత్వం మద్దతు కొనుగోలు చేస్తుందని ప్రకటించారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులు మొగ్గు చూపాలని ఎమ్మెల్యే రైతులకు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా అగ్రికల్చర్ డ్రోన్ను ఎమ్మెల్యే ఏలూరి పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయ పంటలు, చిరు ధాన్యాలను ఎమ్మెల్యే తిలకించారు. ఈ కార్యక్రమంలో పర్చూరు మార్కెట్ కమిటీ చైర్మన్ గుంజి వెంకటరావు, డ్వామా పీడీ విజయలక్ష్మీ, ప్రత్యేకాధికారి లవన్న, ఏడీఏలు ప్రవీణ్ , రాజు తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో గూడూరి ఎరిక్షన్బాబు



**యర్రగొండపాలెం,ఆగస్టు 2,(ప్రభాతవార్త**

యర్రగొండపాలెం నియోజకవర్గంలోని ఆమాని గుడిపాడు గ్రామంలో శనివారం అన్నదాత సుఖీభవ,పీఎం కిసాన్ మొదటి విడత నిధుల విడుదల కార్యక్రమంలో యర్రగొండపాలెం నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ ఇన్చార్జి గూడూరి ఎరిక్షన్బాబు పాల్గొన్నారు.ముందుగా ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యక్ష ప్రసారాన్ని నాయకులు,రైతులతో కలిసి వీక్షించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎరిక్షన్బాబు మాట్లాడుతూ రాష్ట్రంలోని 46,85,838 మంది రైతులు,అన్నదాత సుఖీభవ ద్వారా లబ్ది పొందనున్నారు.మొదటి విడతలో రాష్ట్ర వాటాగా ఒక్కో రైతుకు రూ5వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేశారు.దీనికి తోడుగా కేంద్రం పీఎం కిసాన్ పథకం కింద మెదటి విడతగా రూ2వేల చొప్పున రైతులకు సాయం అందిస్తోంది కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి ఒక్కో రైతుకు రూ7వేలు చొప్పున జమ చేశాయి.ఒక్కో రైతుకుటుంబానికి కేంద్రం సాయంతో కలిపిఏడాదికి రూ20వేలు అందించనున్నారు.ఆగస్టు 15నుంచి స్త్రీ శక్తిపథకం ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తాం అన్నారు.యర్రగొండపాలెం నియోజకవర్గంలో అన్నదాత సుఖీభవ ద్వారా 39,524మంది రైతులకు లబ్ది రూ27.66కోట్లు రైతుల ఖాతాలో నేరుగా ప్రభుత్వం జమచేస్తుంన్నారు.ఈ కార్యక్రమంలో యంపిడివో శ్రీనివాసులు,మార్కెట్యార్డ్ చైర్మన్ చేకూరి సుబ్బారావు,టిడిపి నాయకులు చిట్యాల వెంగల్రెడ్డి,వేగినాటిశ్రీను,తోట మహేష్నాయుడు,కొత్తమాసు సుబ్రమణ్యం,చెవుల అంజయ్య, తెలుగుదేశంపార్టీ కార్యకర్తలు,రైతులు పాల్గొన్నారు.

## మంగమూరులో తల్లిపాలు వారోత్సవాలు



**సంతనూతలపాడు, ఆగస్టు 2, ప్రభాతవార్త**

సంతనూతలపాడు మండలం మంగమూరు గ్రామంలో శనివారం నాడు ఐసీడీఎస్ సూపర్వైజర్ పార్వతీబాయ్ ఆధ్వర్యంలో తల్లిపాలు వారోత్సవాలు నిర్వహించారు. ఆరు నెలల వరకు బిడ్డకు ముర్రుపాలు తాగించడం ద్వారా వారిలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుందని సూపర్వైజర్ పార్వతి బాయ్ పేర్కొన్నారు. తల్లిపాలు టీకా లాంటిదని అన్నారు. గర్భిణీలు, బాలింతలకు తల్లిపాలు ప్రాముఖ్యతపై వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ షేక్ ఖాదర్ నిషా బేగం తదితరులు పాల్గొన్నారు.

## అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేసిన చంద్రబాబు





**చీమకుర్తి,జూలై 2,(ప్రభాతవార్త**

మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్రెడ్డి ఇచ్చే పథకాలతో పాటుగా, కొత్తగా ప్రజలకు సూపర్ సిక్స్ ఇస్తామని అబద్ధపు హామీలతో ప్రస్తుతం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రజలను మోసం చేశారని మాజీమంత్రి, సంతనూతలపాడు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి డాక్టర్ మేరుగ నాగార్జున విమర్శించారు. చీమకుర్తి బి.వి.ఎస్.ఆర్ కళ్యాణ మండపంలో శనివారం జరిగిన ఖబాబు షూరిటీ మోసం గ్యారంటీఖ చీమకుర్తి మండల స్థాయి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విస్తృత సమావేశానికి మండల పార్టీ అధ్యక్షులు పమిడి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివ ప్రసాద్ రెడ్డి, జెడ్పీ చైర్పర్సన్ బూచేపల్లి వెంకయ్యంలో హాజరయ్యారు. డాక్టర్ మేరుగా నాగార్జున మాట్లాడుతూ సూపర్ సిక్స్తో పాటు,సుమారు 130 వాగ్దానాలను చంద్రబాబునాయుడు మాటతప్పి ప్రజలను మోసగించాడన్నారు.మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం,నిరుద్యోగ భృతి ఎగవేసి, రిక్రూట్మెంట్లను పూర్తిగా నిలిపివేశారు అన్నారు. సుపరిపాలన అంటూ ఇంటింటికి వస్తున్న తెలుగుదేశం శ్రేణులను ప్రజలు నిలదీయాలని మేరుగ కోరారు. దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బుచేపల్లి శివప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డిని ఒంటరిగా ఎదుర్కొనే ధైర్యం లేక చంద్రబాబు నాయుడు మూడు పార్టీలతో కూటమి కట్టి, తప్పుడు వాగ్దానాలు చేసి గద్దెనెక్కారని అన్నారు. అయినా సరే దేశంలో మరే పార్టీకి లేనంత బలమైన కార్యకర్తలు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉన్నారన్నారు. ఎన్ని తప్పుడు కేసులు పెట్టిన ధైర్యంగా ఎదుర్కొంటూ, 2029లో జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి చేయడానికి ఎదురుచూస్తున్నారన్నారు. మంత్రిగా పనిచేసిన డాక్టర్ మేరుగా నాగార్జున ఎంతో నమ్మకంతో జగన్మోహన్రెడ్డి ఆదేశాల మేరకు సంతనూతలపాడు వచ్చిపోటీ చేశారని అన్నారు. దురదృష్టవశాత్తు వారిని గెలిపించుకోలేక పోయామన్నారు. మేరుగ నాగార్జున ఎక్కడికి పోరని, వచ్చే ఎన్నికలలో ఇక్కడనుంచి పోటీ చేస్తారన్నారు. వారిని 2029 లో అత్యంత ఘనమైన మెజార్టీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత తనతో పాటు ప్రతి కార్యకర్తకి ఉందని బూచేపల్లి అన్నారు. జడ్పీ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ 50 సంవత్సరాల లోపు మహిళలకు ఏడాదికి 15000 రూపాయలు పాటు సాయం అందిస్తానని చెప్పి మోసం చేశారన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి కేవలం ఆరు నెలల కాలంలోనే వంద శాతం నవరత్నాలు అమలు చేసి రికార్డు సృష్టించారు. చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చి సంవత్సరం దాటిన కేవలం సూపర్ సిక్స్ హామీలు కూడా అమలు చేయలేకపోయాడన్నారు. అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రిని చంద్రబాబునాయుడుని చూస్తున్నామని బూచేపల్లి అన్నారు. తోలుతుగా డాక్టర్ వైయస్సార్ చిత్రపటానికి పూల మాలలు వేసి నాయకులు నివాళులు అర్పించారు. నాయకులందరూ క్యూ ఆర్ కోడ్ బ్యానర్లను ప్రదర్శించారు.ఈ సభలో చీమకుర్తి ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, మునిసిపల్ చైర్ పర్సన్ గోపురపురాజ్యలక్ష్మి ్మ, జడ్పిటిసి సభ్యులు వేమా శ్రీనివాసరావు, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి మన్నం శ్రీధర్ బాబు, మండల పార్టీ అధ్యక్షులు పమిడి వెంకటేశ్వర్లు, పట్టణ పార్టీ అధ్యక్షులు క్రిష్టిపాటి శేఖర్ రెడ్డి, గోపిరెడ్డి ఓబులరెడ్డి, మొగిలిశెట్టి వెంకటేశ్వర్లు, నలమోలు మాణిక్యం పలువురు నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అభిమానులు భారీ పూలమాలతో బూచేపల్లి, మేరుగాలను సత్కరించారు.

## సమాచార హక్కు చట్టం పట్ల ప్రతి ఒక్కరూ చైతన్యవంతులు కావాలి



**సంతనూతలపాడు, ఆగస్టు 2, ప్రభాతవార్త**

సమాచార హక్కు చట్టం పట్ల గ్రామస్తులు ఈ అవగాహన సదస్సులు ద్వారా పూర్తిగా తెలుసుకొని చైతన్యవంతులు కావాలని బొడ్డువారిపాలెం, చంద్రపాలెం కార్యదర్శి ఎం.లక్ష్మీ స్వాతి పేర్కొన్నారు. శనివారం నాడు సంతనూతలపాడు మండలం బొడ్డువారిపాలెం, చంద్రపాలెం గ్రామాల్లో సమాచార హక్కు చట్టం 2005పై వేర్వేరుగా జరిగిన అవగాహన సదస్సులకు ఆమె అధ్యక్షత వహించి అనంతరం ప్రసంగించారు. చట్టంలోని నిబంధనలను తెలుసుకోవాలన్నారు. ఈ చట్టం ద్వారా ప్రజలకు పరిపాలనలో పారదర్శకత మెరుగుగానున్నట్లు కార్యదర్శి లక్ష్మీ స్వాతి వెల్లడించారు. ఈ కార్యక్రమాల్లో బొడ్డువారిపాలెం, చంద్రపాలెం సర్పంచ్లు తానిపర్తి వెంకట్రెడ్డి, బొడ్డు రామారావు, గ్రామ నాయకులు, గ్రామస్తులు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

## సమాచార హక్కు చట్టం ద్వారా పరిపాలనలో పారదర్శకత మెరుగు



**సంతనూతలపాడు, ఆగస్టు 2, ప్రభాతవార్త**

సమాచార హక్కు చట్టం ద్వారా ప్రజలకు పరిపాలనలో పారదర్శకత మెరుగు కానున్నట్లు సంతనూతలపాడు మండలంలోని తక్కెళ్ళపాడు, ఎనికపాడు సచివాలయాల కార్యదర్శి కే.ఈశ్వర్రెడ్డి పేర్కొన్నారు. సమాచ మక్కు చట్టం 2005పై శనివారం నాడు జరిగిన అవగాహన సదస్సులకు ఆయన అధ్యక్షత వహించి అనంతరం ప్రసంగించారు. చట్టంలోని నిబంధనలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్లు తలారి వెంకటరావు, పోకూరి సుజాత, వీఆర్వో సంజీవరావు, గ్రామ నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## వ్యాధి నిరోధకతకు తల్లిపాలే శ్రేష్టం - సీడీపీఓ ఝాన్సీ



**వేటపాలెం, ఆగస్టు 2, ప్రభాతవార్త**

వేటపాలెం పట్ట భద్రుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఎయిమ్స్ ఫర్ సేవ నందు శనివారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను మండల పరిధిలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండల సీడీపీఓ ఝాన్సీ మాట్లాడుతూ ప్రసవించిన స్త్రీ గంటలోపు బిడ్డకు పాలిస్తే అది వెలకట్టలేని వ్యాధి నిరోధక టీకా అన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు గృహ సందర్శనకు వెళ్లినప్పుడు గర్భవతులకు, బాలింతలకు యువతులకు తల్లిపాలపై అవగాహన కల్పించారు. పాలిచ్చిన తరువాత తల్లులు బిడ్డకు తేనుపు వచ్చే వరకు భుజంపై పెట్టుకుని లాలించాలని అన్నారు. పీహెచ్సీ వైద్యులు స్వాతి కిరణ్ మాట్లాడుతూ పుట్టిన బిడ్డలకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందించి వారి ఎదుగుదలకు తోడ్పడాలన్నారు. ఆరోగ్యవంతమైన ముగ్గురు పిల్లలను గుర్తించి బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ నారాయణ స్వామి, ఐసీడీఎస్ సూపర్వైజర్లు పుష్పవల్లి, శేషమ్మ, సంఘం కార్యనిర్వహక కార్యదర్శి మోహన్రావు, వ్యవస్థాపక సభ్యులు ప్రతి అనంతలక్ష్మీ, నాగాంజనేయులు, శరత్బాబు, వాసవి, వైద్య సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, గర్భవతులు బాలింతలు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ రంగం చరిత్రలో

### ఈ రోజు సరికొత్త సువర్ణాధ్యాయానికి కూటమి ప్రభుత్వం నాంది పలికింది

### - ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య



**చీరాల, ఆగస్టు 2, ప్రభాతవార్త**

సూపర్ సిక్స్ హామీల అమలులో భాగంగారాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అన్నదాత సుఖీభవ పథకానికి శ్రీకారంచుట్టింది.ఈ మేరకు పాపాయి పాలెం గ్రామం నందు అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించడం సంతోషంగా ఉంది.ఇచ్చిన మాట ప్రకారం రైతులకు పంట పెట్టుబడి సాయంగా కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని పీఎం కిసాన్ పథకం, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే అన్నదాతసుఖీభవ పథకం కింద ప్రతి ఏటా 20 వేలు ఆర్థిక సాయం అందనుంది. మొదటి విడతగా పీఎం కిసాన్ కింద రూ.2వేలు, అన్నదాత కింద రూ.5వేలు చొప్పున రూ.7వేలు చొప్పున చీరాల నియోజకవర్గం నందు రూ.7368 రైతులకు 4.59 కోట్లు,రాష్ట్రంలోని 46.86లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.3,174.43 కోట్లు జమ చేయడం జరిగింది. రాష్ట్రంలో వ్యవసాయాన్ని పండుగ చేసి, ప్రతి రైతన్నను రారాజుగా చేయడమే లక్ష్యంగా రైతు బాంధవుడు శ్రీ నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ముందడుగు వేస్తోంది. ఈ కార్యక్రమంలో రైతు సోదరులు,ఏఎంసీ చైర్మన్ కౌతరపు జనార్ధన్, ఆప్కో చైర్మన్ సజ్జ హేమలత, ఆర్డీఓ, అధికారులు,కూటమి నాయకులు పాల్గొన్నారు.

7_7.qxd 8/3/2025 12:18 AM Page 1



# మోటార్ బైకును ఢీ కొట్టిన ప్రైవేట్ బస్సు

## - యువకుడు మృతి



**కొరిశపాడు , ఆగస్టు 2,ప్రభాతవార్త**

గ్రానైట్ ఫ్యాక్టరీకి కూలీలను తరలించే మినీ బస్సు ఢీకొనగా యువకుడు మరణించిన సంఘటన మేదరమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం జరిగింది వివరాలలోకి వెళ్తే అనమనమూరు గ్రామానికి చెందిన కవల సాంబశివరావు దర్జీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు శనివారం ఉదయం 9 గంటల ప్రాంతంలో గ్రామంలోని మేదరమెట్ల గ్రామంలోని పాత జాతీయ రహదారిలో తన మోటార్ బైక్ పై వస్తుండగా ఎస్ బి కళ్యాణ మండపం ఎదురుగా గుండ్లపల్లి గ్రూప్ సెంటర్లోని గ్రానైట్ ఫ్యాక్టరీకి కూలీలను తరలించే మినీ బస్సు ఎదురుగా వచ్చి ఢీ కొట్టింది ఈ ప్రమాదంలో సాంబశివరావు 45 సంవత్సరాలు నుదురుకు బలమైన గాయాలు కాగా ఘటనా స్థలిలోని మరణించాడు ప్రమాద వార్త తెలుసుకున్న మేదరమెట్ల ఎస్సై మహమ్మద్ రఫీ సిబ్బందితో ప్రమాద స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాల తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# రైతన్నల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

## - ఎఎంసి వైస్ చైర్మన్ ధర్మవరపు



**అద్దంకి , ఆగస్టు 2, ప్రభాతవార్త**

రైతన్నల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అద్దంకి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు ధర్మవరపు నాగేశ్వరరావు అన్నారు. అద్దంకి మున్సిపల్ కార్యాలయంలో జరిగిన అన్నదాత సుఖీభవ పథకం నిధులు విడుదల సందర్భంగా జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఎఎంసి ఉపాధ్యక్షులు నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతులకు మూడు విడతలలో ఒక్కో కుటుంబానికి పి.యం.కిసాన్, అన్నదాత సుఖీభవ పథకం ద్వారా 20వేల రూపాయలు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు.కూటమి ప్రభుత్వం రైతులకు బిందు, తుంపర సేద్య పరికరాలు రాయితీ పై అందిస్తున్నట్లు ఆయన తెలిపారు.అద్దంకి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నాగినేని రామకృష్ణ మాట్లాడుతూ పొగాకు రైతులు ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం మార్క్ ఫెడ్ ద్వారా పొగాకు కొనుగోలు చేస్తున్నదని, దానికొరకు ప్రభుత్వం 300 కోట్ల రూపాయలు విడుదల చేసిందని తెలిపారు.80 శాతం రాయితీపై వ్యవసాయ డ్రోన్ లు అందిస్తున్నారని తెలిపారు.అద్దంకి సహాయ వ్యవసాయ సంచాలకులు బి ఎప్రాయిము మాట్లాడుతూ అద్దంకి నియోజకవర్గంలో 40,288 మంది రైతు కుటుంబాలకు 27.62 కోట్ల రూపాయలు పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ సహాయం రైతుల ఖాతాలలో జమచేసినట్లు తెలిపారు. తహసీల్దార్ శ్రీచరణ్ మాట్లాడుతూ జిల్లాలో ఈ పథకం ద్వారా ఎక్కువమంది రైతులు అద్దంకి నియోజవర్గం వారే వుండటం పట్ల ఆయన ఆనందం వ్యక్తం, చేస్తూ ఇంకా ఎవరైనా ఆధార్ తప్పుగా ఉన్న రైతులు వెంటనే తహసీల్దార్ కార్యాలయం లో సంప్రదించాలని,చనిపోయిన రైతులు కూడా వారి కుటుంబాలకు ప్రాపర్ పర్సన్ సర్టిఫికెట్ తీసుకొని వారు కూడా ప్రభుత్వ పథకం పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ మాట్లాడుతూ బ్యాంక్ అకౌంట్ కు ఆధార్ లింక్ కానీ రైతులు ఇంకా మండలం లో 200 మంది ఉన్నారని వారు కూడా వెంటనే బ్యాంకు లో ఎన్పిసిఐ చేయించుకుంటే వారికి కూడా డబ్బులు జమ చేయబడతాయని తెలిపారు.కార్యక్రమం లో మున్సిపల్ కౌన్సిలర్ లు కంపా రజినీ, మాగులూరి తిరుపతమ్మ,షేక్ జహీరా,మార్కెట్ కమిటీ డైరెక్టర్ చింతా వెంకటేశ్వర రెడ్డి,కొరిశపాడు వ్యవసాయాధికారి రామ్మోహన్‌రెడ్డి, జె.పంగులూరు వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి, బల్లికురవ వ్యవసాయాధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదకర విద్యుత్ స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి



**అద్దంకి , ఆగస్టు 2 ప్రభాతవార్త**

ప్రమాదకర విద్యుత్ స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని సి.ఐ.టి.యు. నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం సాయంత్రం అద్దంకి పట్టణంలోని ఆర్టిసి బస్టాండ్ పరిసరాలలో వ్యాపార సంస్థల వద్ద, స్మార్ట్ మీటర్ల రద్దు చేయాలని అవగాహన కలిగిస్తూ కరపత్రాలను పంపిణీచేశారు. ఆగస్టు 5వ తేదీన జరిగే నిరసన కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొనాలని తెలియజేస్తూ అద్దంకి ఆర్టీసీ బస్టాండ్ సెంటర్లో వ్యాపార సంస్థలువద్దా కరపత్రాలు పంపిణీ చేపట్టి ప్రచారం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉండగా స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలని పిలుపునిచ్చిన తెలుగుదేశం కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన తరువాత మాట మార్చి స్మార్ట్ మీటర్లను దొడ్డిదారిన వ్యాపార సంస్థలకు, గృహాలకు బిగించే ప్రయత్నం చేపట్టిందని ఆయన విమర్శించారు. ఈ స్మార్ట్ మీటర్లు రాబోయే కాలంలో చాలా ఇబ్బందులకు గురి చేయడం జరుగుతుందని, అధిక బిల్లులతో పాటు అనేక ఇబ్బందులు రావడం జరుగుతుందని ఇప్పటికే ట్రూఆఫ్ సర్దుబాటు చార్జీలు పేరుతో విద్యుత్ చార్జీలు పెంచుకుంటూ పోతున్నారని ఆయన పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం సంవత్సర కాలంలో సుమారు 16 వేల కోట్ల రూపాయలు విద్యుత్ భారాలు ప్రజల పైన వేయడం జరిగిందని విమర్శించారు. ప్రస్తుతం గృహాలకు స్మార్ట్ మీటర్లను బిగించే ప్రయత్నం జరుగుతుందని, ప్రజానీకం ఈ విషయం పట్ల అవగాహనతో ఉండి స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని ఆయన సూచించారు. ఈ నెల 5వ తేదీ జరిగే నిరసన కార్యక్రమంలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటి నాయకులు పి ఆదం. ఎస్కె కరం. మస్తాన్, మీరావలి. వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

# ఏకెయు ఎడ్యుకేషన్ బిఓఎస్ చైర్పర్సన్‌గా స్వరూపరాణి



**మార్కాపురం రూరల్, ఆగస్టు 2 ,ప్రభాతవార్త**

ఏకెయు ఎడ్యుకేషన్ బిఓ ఎస్ చైర్పర్సన్‌గా ప్రొఫెసర్ తెనాలి స్వరూప రాణిని నియమిస్తూ ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం ఇన్చార్జ్ ఉప కులపతి ప్రొఫెసర్ డివికే మూర్తి సూచనల మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ హరిబాబు ఉత్తర్వులు జారీ చేశారు. ఈమె ప్రస్తుతం గుంటూరులోని సెయింట్ జోసెఫ్ మహిళా బి.ఎడ్-ఎంఎడ్ కళాశాలలో ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్నారు. ఈమె ఆంధ్రకేసరి యూనివర్సిటీ బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా రెండేళ్లపాటు కొనసాగనున్నారు. ఉమ్మడి నాగార్జున యూనివర్సిటీ ఎడ్యుకేషన్ డీనుగా బిఓఎస్ చైర్మన్‌గా 10సంవత్సరాలకు పైగా పనిచేసిన స్వరూప రాణి ప్రస్తుతం ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ డీన్‌గా కూడా వ్యవహరిస్తున్నారు. దాదాపు 30పైగా స్కాలర్లు స్వరూప రాణి పర్యవేక్షణ ఎడ్యుకేషన్ విభాగంలో పిహెచ్‌డిలను పొందారు. ఎన్‌సిటిఈ తనిఖీ కమిటీ సభ్యురాలుగా, వివిధ విశ్వవిద్యాలయాల అఫిలియేషన్ కమిటీ చైర్మన్ సభ్యురాలుగా వ్యవహరిస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ సెమినార్లను నిర్వహించారు. దేశవ్యాప్తంగా జరిగిన వివిధ సెమినార్లలో ముఖ్య వక్తగా పాల్గొన్నారు. బిఈడి నూతన కరికులం జరిగినప్పుడు సిలబస్ రూపకల్పనలో కీలకంగా వ్యవహరించారు. ఎడ్యుకేషన్ విభాగంలో గుంటూరు, ప్రకాశం డిస్ట్రిక్ట్‌లో ప్రొఫెసర్ అర్హత కలిగిన ఒకే ఒక వ్యక్తి ప్రొఫెసర్ స్వరూప రాణి కావడం గమనార్హం. వివిధ ఉపాధ్యాయ కళాశాల అధ్యాపకుల, వివిధ పాఠశాల ఉపాధ్యాయుల నియామకాలలో స్వరూప రాణి సబ్జెక్ట్ నిపుణురాలుగా పనిచేశారు. జిల్లా స్థాయి ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయురాలుగా, ఎంపిక కూటమిలో గత ఏడాది కాలంగా సభ్యురాలుగా పనిచేశారు. ఉపాధ్యాయ విద్యకు సంబంధించిన అనేక ప్రభుత్వ, ప్రైవేటు పాఠ్యపుస్తకాలకు రచయిత్రిగా వ్యవహరించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఈమె రచించిన వ్యాసాలు ప్రచురితమయ్యాయి. నూతనంగా ఏర్పాటైన ఆంధ్రకేసరి యూనివర్సిటీలో ఉపాధ్యాయ విద్యను మరింత మెరుగుపరచడానికి చైర్మన్ ప్రొఫెసర్ స్వరూప రాణిని నియమించడం జరిగింది. ఈమె నియామకంపట్ల ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎడ్యుకేషన్ విభాగం బిఓ ఎస్ చైర్పర్సన్ డాక్టర్ జి శివలక్ష్మీతోపాటు బిఎడ్ కళాశాల యాజమాన్యం తరఫున ఈసీ మెంబర్ ఎస్ ఈశ్వర్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు కె.గుండాలరెడ్డి, వై వెంకటేశ్వరరావు, చంద్రరావు,డివి రమేష్, మార్పు గ్రోగోరి, షేక్ ఇస్మాయిల్, గఫార్ ఖాన్, డాక్టర్ ఎల్‌వి రెడ్డి తదితరులు అభినందనలు తెలిపారు.

# పలుగుంటిపల్లిలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం



**రాచర్ల, ఆగస్టు 2, ప్రభాతవార్త**

మండలంలోని పలుగుంటిపల్లి గ్రామంలో శనివారం ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు మాట్లాడుతూ పుట్టిన బిడ్డ ఆరోగ్యానికి తల్లిపాలు శ్రేయస్కరమని తెలిపారు. తల్లిపాల గురించి తల్లులు అవగాహన పెంచుకొని బిడ్డలకు తల్లిపాలు పట్టించే విధానం చూపించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ ఎం ప్రసాద్, సిహెచ్ఓ. ఎన్ రామాంజనేయులు, ఏఎన్ఎం లక్ష్మి, అంగన్ వాడీ కార్యకర్త, ఆయా, మహిళలు పాల్గొన్నారు.

# అన్నదాత సుఖీభవ-పిఎం కిసాన్ 2025-2026 మొదటి విడత కార్యక్రమం..



**మార్కాపురం రూరల్, ఆగస్టు 2, ప్రభాతవార్త**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న అన్నదాత సుఖీభవ-పిఎం కిసాన్ 2025-2026 మొదటి విడత కార్యక్రమాన్ని మార్కాపురం మండల భూపతిపల్లి, నికరంపల్లి గ్రామాలలో శనివారం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి హాజరవడం జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మార్కాపురం సబ్ డివిజన్‌లోని 5 మండలాల్లో 33,296మంది లబ్ధిదారులు ఉన్నారని,వారి ఖాతాల్లో ఈ రోజు రూ.23,74,82,000లు జమకానున్నట్లు తెలిపారు. ఇందులో కేవలం భూపతిపల్లి గ్రామంలో 1143మంది లబ్ధిదారులు ఉన్నారని వారి ఖాతాలలో రూ.8,11,000లు జమకానున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి కందుల రామిరెడ్డి, మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, మార్కాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు డి.బాలాజీనాయక్,మండల వ్యవసాయ అధికారిణి కె.బుజ్జిభాయ్, నాయకులు, రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టంపై అవగాహన కలిగి ఉండాలి

## - ఎంపిడిఓ రాజ్ కుమార్




**త్రిపురాంతకం, ఆగస్టు 2, ప్రభాతవార్త**

ప్రతిఒక్కరు సమాచార హక్కు చట్టంపై అవగాహన కలిగి ఉండాలని మండల ఎంపిడిఓ రాజ్‌కుమార్ అన్నారు. మండలంలోని స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో సమాచార హక్కు చట్టంపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ రాజ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమీషనర్ చావలి సునీల్ ఆదేశాలతో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. సమాచార హక్కు చట్టం వినియోగించుకునే హక్కు ప్రతిఒక్క భారతీయునికి ఉందని ఆయన తెలిపారు. సమాచార హక్కు చట్టం 2005 సంవత్సరం నుండి అమలు చేయడం జరిగిందన్నారు. సమాచారం కోరిన నిర్ణీత సమయంలో ధరఖాస్తుదారునికి సమాచార అధికారి సమాచారం అందించాలి అన్నారు. ఎవరైనా వ్యక్తిగత సమాచారం కోరితే వారికి ఆ సమాచారం ఇవ్వవలసిన అవసరం లేదు అన్నారు. దరఖాస్తు తమ శాఖపరమైన సమాచారం కాకపోతే 5రోజులు వ్యవధి ఉంటుందని అన్నారు. దరఖాస్తుదారుడు సంతృప్తి చెందకపోతే పై స్థాయి అధికారికి అప్పీలు చేసుకునే అధికారం దరఖాస్తు దారునికి ఉంటుందని అన్నారు. ప్రతి కార్యాలయంలో సమాచార హక్కు చట్టం అధికారుల వివరాలు తెలిపే నోటీసు బోర్డు ఏర్పాటు చేయవలసి ఉంటుందని తెలిపారు. దరఖాస్తుదారులు అడిగిన సమాచారం ఇచ్చేందుకు నగదు డిడి, స్టాంప్ రూపంలో రుసుము చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. తెల్లరేషన్ కార్డుదారులు ఎటువంటి రుసుము చెల్లించవలసిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో రామసుబ్బయ్య, డిప్యూటీ తహశిల్దార్ కిరణ్, డిప్యూటీ ఎంపిడిఓ మురళి, ఎంపిపి సుబ్బమ్మ, అన్ని శాఖల అధికారులు, అన్ని గ్రామాల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

# రైతుల పక్షాన నిలబడే ప్రభుత్వం కూటమి ప్రభుత్వం

## - అన్నదాత సుఖీభవ - పిఎం కిసాన్ మొదటి విడత కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తుముల



**గిద్దలూరు, ఆగస్టు 2, ప్రభాతవార్త**

ఎల్లప్పుడు రైతుల పక్షాన నిలబడే ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. గిద్దలూరు పట్టణంలోని స్థానిక మార్కెట్ యార్డులో శనివారం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అన్నదాత సుఖీభవ-పిఎం కిసాన్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే అశోక్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా మొదటి విడతగా రైతులకు పెట్టుబడి సహాయ నిధుల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి రైతుకు పిఎం కిసన్ ద్వారా రూ.6వేలతోపాటు రాష్ట్ర ప్రభుత్వం రూ.14వేలు కలిపి మొత్తం రూ.20వేలు పెట్టుబడి సహాయాన్ని మూడు విడతలుగా అందిస్తుందని తెలిపారు. నియోజకవర్గంలో మొత్తం 36,609మంది రైతులకుగాను ఒక్కో రైతుకు రూ.7వేల చొప్పున రూ.27.85కోట్లు రైతుల ఖాతాల్లో నేరుగా జమ కానున్నాయని తెలిపారు. రైతుల ఆర్థిక పరిస్థితులు మెరుగుపరచడానికి వారికి భరోసా కల్పించడానికి కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. రైతు బాగుంటేనే దేశం బాగుంటుందని రైతే దేశానికి రాజు అనే ఉద్దేశంతో సిఎం చంద్రబాబు నాయుడు ఈ పథకాన్ని ప్రారంభించారని తెలిపారు. గత పాలకులు అభివృద్ధిని, రైతులను కూడా విస్మరించి సంక్షేమం అంటూ వేలకోట్ల రూపాయలు దోచుకున్నారని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, తెలుగుదేశంపార్టీ, జనసేన, బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# డ్రైవర్ సమయస్ఫూర్తితో తప్పిన ప్రమాదం

## - మార్కాపురం చెరువుకట్టపై అదుపుతప్పిన ఆర్టీసీ బస్సు

## - ఊపిరి పీల్చుకున్న ప్రయాణీకులు



**మార్కాపురం రూరల్, ఆగస్టు 2, ప్రభాతవార్త**

ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి ఆర్టీసీ బస్సు అదుపుతప్పిన సంఘటన మార్కాపురం-ఒంగోలు రహదారిలోని మార్కాపురం చెరువుకట్టపై శనివారం సాయంత్రం జరిగింది. మార్కాపురం నుండి ఒంగోలు వెళ్తున్న మార్కాపురం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు శనివారం సాయంత్రం 50మంది ప్రయాణీకులతో బయలుదేరింది. మార్కాపురం చెరువు కట్టపై రెండు మోటారు బైకులు ఉన్నపలంగా బస్సుకు అడ్డంగా రావడంతో వాటిని తప్పించబోయి ఆర్టీసీ బస్సు అదుపుతప్పింది.డ్రైవర్ సమయస్ఫూర్తిగా వ్యవహరించడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా పెను ప్రమాదం నుంచి ప్రయాణీకులు రక్షించబడ్డారు. ఆర్టీసీ బస్సు చెరువు కట్ట కింది భాగంలోని వరిమల్లవైపు ఒరిగిపోయి పల్టీకొట్టకుండా నిలిచిపోయింది. డ్రైవర్ ఏమాత్రం అజాగ్రత్తతో ఉండినా, సమయస్ఫూర్తితో వ్యవహరించుకుండా ఉంటే బస్సు పల్టీ కొట్టి పెద్ద ఎత్తున ప్రాణనష్టం జరిగేది. అంతిమంగా అందరూ ఊపిరి పీల్చుకున్నారు. మార్కాపురం నుంచి చెరువుకట్ట మీదుగా ఒంగోలు వెళ్ళు ప్రధాన రహదారిలో రోడ్డు మార్గం సరిగా లేదని, వరుసగా తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని పలువురు అధికారుల ద్వారా ప్రభుత్వానికి విన్నవించినప్పటికీ ఈ రోడ్డుకు మోక్షం మాత్రం రావడం లేదని, ఇప్పటికైనా రోడ్డు వేయాలని ప్రజలు కోరుతున్నారు.


# నేడు అద్దంకి పట్టణంలో విద్యుత్‌కు అంతరాయం

**అద్దంకి , ఆగస్టు 2 ప్రభాతవార్త**

అద్దంకి పట్టణంలో నూతన పరివర్తకం ఏర్పాటుకు, మున్సిపాలిటీ కార్యాలయ ప్రాంగణంలోని వాటర్ ట్యాంకర్ కూల్చివేత కారణంగాగీతమందిర్ రోడ్,మున్సిపల్ ఆఫీస్ చుట్టుపక్కల ప్రాంతాలు, బంగ్లా రోడ్ చుట్టుపక్కల ప్రాంతాలలో ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్తుకు అంతరాయం కలుగుతుందని,డి.ఇ.ఇ.ఎం.దామోదరం ఒక ప్రకటనలో తెలిపారు.సదరు పట్టణవాసులు ఈ విషయమును గమనించి తగు ముందస్తు ఏర్పాటు చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు.

# భార్యను గొంతు కోసిన భర్త





**పెద్దదోర్నాల, ఆగస్టు 2, ప్రభాతవార్త**

భార్యాభర్తల కలహం.. భర్త భార్యను గొంతు కోసే వరకు వచ్చింది. మండలంలోని పెద్దబొమ్మలాపురంలో స్వేచ్ఛ కుమార్ తన భార్య మల్లేశ్వరిపై కత్తితో గొంతు కోసిన సంఘటన జరిగింది. భార్య మల్లేశ్వరి ఉదయం బహిర్భూమికి వెళ్లి తిరిగి వచ్చే సమయంలో భర్త స్వచ్ఛ కుమార్ భార్యపై దాడి చేశాడు. కుటుంబ కలహాలు ఎంత భయంకరమైన పరిణామాలను తీసుకురాగలవో పెద్దబొమ్మలాపురంలో శనివారం జరిగిన సంఘటన రుజువు చేస్తుంది. తరచూ గొడవలు పడుతూ అనుమానాల విభేధాలు తీవ్ర రూపం దాల్చి భర్త తన భార్య గొంతును కత్తితో గాయపరిచినట్లు తెలుస్తుంది. భర్త అక్కడి నుండి పారిపోయినట్లు తెలుస్తుంది. 108 వాహనానికి సమాచారం అందించగా వెంటనే క్షతగాత్రురాలని ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్సలుచేస్తున్నారు.పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# శ్రీ నెమలిగుండ్ల రంగనాయక స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు



**రాచర్ల, ఆగస్టు 2 ,ప్రభాతవార్త**

మండలంలోని జెల్లివారి పుల్లల చెరవు అటవీ ప్రాంతంలో వెలసియున్న శ్రీ నెమలిగుండ్ల రంగనాయక స్వామి ఆలయంలో శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా భక్తులు వివిధ ప్రాంతాల నుండి ప్రత్యేక పూజల్లో అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు పూజల అనంతరం భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదములను అందజేశారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం నాగయ్య అవసరమైన ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక పూజల సందర్భంగా ఆలయంలోని కాపుబలిజ అన్నదాన సత్రంలో భక్తులకు ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు సత్రం నిర్వాహకులు కన్నసాని గోపాలరావు, తోట చంద్రయ్యలు తెలిపారు.

# ఉపాధ్యాయుల డిమాండ్లు, సమస్యలు తక్షణం పరిష్కరించాలి



**సీఎస్‌పురం, ఆగస్టు 2, ప్రభాతవార్త**

ప్రభుత్వం ఉపాధ్యాయుల డిమాండ్లు, సమస్యలను తక్షణం పరిష్కరించాలని ఫ్యాప్టో పామూరు డివిజన్ నాయకులు షేక్ నాయబ్ రసూల్ పిలుపునిచ్చారు. ఒంగోలులో ఫ్యాప్టో ఆధ్వర్యంలో శనివారం తలపెట్టిన కార్యక్రమానికి సీఎస్‌పురం మండల ఏపీటీఎఫ్ నాయకులు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 12వ పీఆర్సీ కమిటీని వెంటనే నియామకం చేసి, 30 శాతం మధ్యంతర భృతి చెల్లించాలని, ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిలు వెంటనే పూర్తి చెల్లింపు చేయాలని డిమాండ్ చేశారు. పంచాయతీ రాజ్ విభాగంలో కారుణ్య నియామకాలు చేపట్టాలని, రిటైర్డ్ అయిన ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను తక్షణం పూర్తిగా చెల్లించాలన్నారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 3 డీఏలను ప్రకటించాలన్నారు. హైస్కూల్ ప్లస్‌లను పాఠశాల విద్యలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఎంఈఓ-1 పోస్టులను కేవలం ప్రభుత్వ ఉపాధ్యాయుల నుండి మాత్రమే నియమించుకోవడం కోసం ఇచ్చిన జీవోను ఫ్యాప్టో తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. జడ్పీ, ప్రభుత్వ మేనేజ్‌మెంట్ నుండి సంయుక్తంగా సీనియార్టీ ప్రాతిపదికన నియమించాలని వారు డిమాండ్ చేశారు.ఒంగోలుకు తరలి వెళ్లిన వారిలో షేక్ నాయబ్ రసూల్, బి.శ్రీనివాసులు, మహ్మద్, లక్ష్మణ్ కుమార్, జి.రవీంద్ర, జి.శ్రీహరి, కే.రవీంద్రనాథ్, సయ్యద్ ఖాజా రహంతుల్లా పలువురు పాల్గొన్నారు.

# అధికారం కోసం అబద్ధపు హామీలు - దద్దాల నారాయణ యాదవ్



**వెలిగండ్ల, ఆగస్టు 2, ప్రభాతవార్త**

అధికారం చేజిక్కించుకోవడం కోసం అమలు సాధ్యం కానీ అబద్ధపు హామీలతో రాష్ట్ర ప్రజలను చంద్రబాబు మోసం చేశాడని నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జి దద్దాల నారాయణయాదవ్ అన్నారు. బాబు షూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని మండలంలోని గుడిపాటి పల్లి గ్రామంలో శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దద్దాల నారాయణయాదవ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఎస్సీ, ఎస్టీ బీసీలకు మైనార్టీలకు 50 సంవత్సరాలకే పెన్షన్, నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి లాంటి ఎన్నో పథకాలను అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను మోసం చేశారని అన్నారు. కూటమి ప్రభుత్వం పరిపాలన కంటే వైసీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులకు పాల్పడుతూ తప్పుడు కేసులు బనాయించేందుకు ఎక్కువ శ్రద్ధ చూపుతున్నారని విమర్శించారు. ఈ సందర్భంగా మా నాయకులతో కలిసి ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రజలకు వివరించి క్యూ ఆర్ కోడ్లతో కూడిన కరపత్రాలను గ్రామస్తులకు పంచారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు గుంటక తిరుపతిరెడ్డి, గజ్జల వెంకటరెడ్డి, కటికల రిబ్కా వెంకటత్నం, కాకర్ల వెంకటేశ్వర్లు, సైకం వెంకటేశ్వరరెడ్డి, పాపాబత్తిన నాగేశ్వరరావు, నల్లబోతుల చెన్న కృష్ణయ్య, వెన్న తిరుపతిరెడ్డి, గోన దానయ్య, తాతపూడి సురేష్, పోల్లా సుబ్రహ్మణ్యం, ఎలికా నారాయణ, కుప్పనబోయిన వెంకట రామయ్య, బొబ్బ వెంకట రెడ్డి, చిలకల నారాయణరెడ్డి, కత్తెర వెంకటేశ్వరరెడ్డి, కేవలం శేఖర్‌రెడ్డి, ఆవుల శ్రీనివాసులురెడ్డి, చిలకల శ్రీనివాసులు, రామణ భాస్కర్‌రెడ్డి, ముక్కు వెంకటేశ్వరరెడ్డి, గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, ఆవుల భాస్కర్‌రెడ్డి, సైకం ఏడుకొండలురెడ్డి, డాక్టర్ ఆవుల కృష్ణారెడ్డి, వాకమల్ల రాజశేఖర్‌రెడ్డి, ముల్లంగి శ్రీహరి, అయిమల్ల నాగమణి రెడ్డి, పగడాల చక్రి, అయ్యన్నకోట వెంకట రంగయ్య, తాతపూడి నాని, గంజి రవీంద్రారెడ్డి, చేదర్ల చెన్న కృష్ణ, తమ్మినేని శివరామిరెడ్డి, గజ్జల నాగేశ్వరరెడ్డి, సంగటి మహేందర్‌రెడ్డి, ముక్కు వేణుగోపాల్‌రెడ్డి, కేసరి వెంకట నారాయణరెడ్డి, గోన జేమ్స్, కాకర్ల నాగయ్య, గజ్జల నారాయణస్వామి, రాయల్ల బ్రహ్మం, తోక బ్రహ్మయ్య, కటుకూరి చిన పీరా, బత్తుల కృష్ణయ్య, శెట్టి వెంకట సుబ్బారెడ్డి, శివ బొడిగె శివ, ఓసూరి ముసలయ్య, బండ్లపూడి తిరుపాలు, మితికల వెంకటేశ్వర్లు, జక్కుల బాలరాజు, దండు జయరామిరెడ్డి, పాపబత్తిన వెంకటయ్య, ముక్కు వెంకటేశ్వర్లు, యోగిరెడ్డి, పాపిజెన్ని రమణారెడ్డి, నల్లబోతుల చెన్నయ్య, కొనతం కేశవరెడ్డి, దుబ్బమడుగు గురవయ్య, చాగని ఈశ్వర్‌రెడ్డి, కారుమంచి సిద్దయ్య, మద్రి వెంకట నారాయణ, ఈర్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## నిధులు లేక చేసిన అభివృద్ధి చెప్పుకోలేక

# సాదాసీదాగా సాగిన సర్వసభ్య సమావేశం



**త్రిపురాంతకం, ఆగస్టు 2 ,ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపిపి ఆళ్ల సుబ్బమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఎంపిడిఓ రాజ్ కుమార్ ఏర్పాటు చేసిన అజెండా ప్రకారం ముందుగా ప్రభుత్వ వైద్యాధికారి భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ హాస్పిటల్‌లో ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారికి చేసే వైద్య సేవలు గురించి వివరించడం జరిగింది. ఫామిలీ ప్లానింగ్ ఆపరేషన్ చేయడానికి సంబంధిత వైద్య సిబ్బంది అన్ని వేళలా అందుబాటులో ఉంటారని తెలియజేశారు. అత్యవసర సేవలకు సంబంధించి స్నేక్ బైట్, కుక్కకాటుకు, కోతులు వలన గాయాలపాలైన వారికి కావలసిన వ్యాక్సినేషన్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. అనంతరం అన్నసముద్రం మరియు దూపాడు పిహెచ్‌సి వైద్యులు మాట్లాడుతూ సాధ్యమైనంతవరకు ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించి కార్పోరేట్ హాస్పిటల్‌కు వెళ్ళి చికిత్స అందించడం జరుగుతుందని తెలియజేశారు. అనంతరం సివిల్ సప్లై సంబంధించిన డిటీ మాట్లాడుతూ 25వ తేదీ నుండే అంగవైకల్యం కలిగిన వారికి వృద్ధాప్యంలో ఉన్న వారికి ఇంటి వద్దకే వచ్చి రేషన్ బియ్యం ఇవ్వడం జరిగిందని తెలియజేశారు.

**పొలం పిలుస్తోంది కార్యక్రమం ద్వారా పంటల సాగుపై రైతులకు అవగాహన :**

అనంతరం మండల వ్యవసాయ అధికారి సంగమేశ్వరరెడ్డి మాట్లాడుతూ పొలం పిలుస్తోంది అనే కార్యక్రమం ద్వారా వ్యవసాయ అధికారులకు సంబంధించిన పొలాల్లోకి వెళ్లి అక్కడ పొలం ఛాయలు పరిశీలించి అధిక దిగుబడి రావాలంటే ఏ పంట వేయాలో, ముందుగా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించడం జరిగిందని, జరుగుతుందని తెలియజేశారు. రైతులకు సంబంధించి విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఎల్లవేళలా ఉంటుందని తెలిపారు. మండల విద్యాశాఖ అధికారులు మాట్లాడుతూ విద్యార్థులకు మంచి విద్యను అందించి గతం కంటే మంచి ఫలితాలను రాబట్టేందుకు తమ వంతుగా కృషిచేస్తామని వారు తెలిపారు. మిగతా శాఖల వారు కూడా నామికే వాస్తిగా పాల్గొన్నారు తప్పా వారి శాఖకు సంబంధించి చేసిన పనుల గురించి కానీ, అభివృద్ధి గురించి చెప్పకపోవడం గమనార్హం. కారణం గత 10నెలల నుండి మండల గ్రామాలు అభివృద్ధి కొరకు కేటాయించబడే ఆర్థికసంఘం నిధులు రాకపోవడమే కారణమని కూడి వచ్చిన కొందరు గుసగుసలాడటం గమనార్హం. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ ఉత్తమ బోధన అందించాలి


## - ఎంఈఓ వి గిరిధర్ శర్మ



**రాచర్ల, ఆగస్టు 2, ప్రభాతవార్త**

ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ విద్యార్థులకు ఉత్తమ బోధనఅందించాలని మండల ఎంఈఓ వి గిరిధర్‌శర్మ అన్నారు. మండలంలోని రంగారెడ్డి పల్లి, చర్లోపల్లి ఎంపిపిఎస్ పాఠశాలలను, అంగన్‌వాడీ కేంద్రాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలల్లోని విద్యార్థుల హాజరు, రికార్డులు, అంగన్ వాడీ కేంద్రాల్లోని విద్యార్థుల వివరాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే మద్దులూరిని కలిసిన ఎన్ఆర్ అండ్ పీఎం హైస్కూల్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు



**చీరాల, ఆగస్టు 2, ప్రభాతవార్త**

ఎన్ఆర్ అండ్ పీఎం హైస్కూల్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు యోగా సభ్యులు100 మంది స్థానిక శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య ని వారి స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి రాష్ట్ర వెనుకబడిన వర్గాల సంక్షేమ కమిటీ సభ్యుడిగా నియమితులైన శుభ సందర్భంగా వారిని శాలువాతో సత్కరించి మొక్క అందజేశారు. వారు మాట్లాడుతూ చీరాల ప్రాంతంలో ప్లాస్టిక్ పూర్తిగా నిషేధించడానికి మీ సహాయ సహకారాలు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలుదాసు రామకృష్ణయ్య, చారగుళ్ళ గురుప్రసాద్, నారాయణమూర్తి, దోగుపర్తి వెంకట సురేష్, వలివేటి మురళీకృష్ణ, ఎంవీ సుబ్బారావు, ఎంఎస్ దేవకి సుబ్బారావు, జి.వై ప్రసాద్, మధుసూదనరావు, ఉమా, వాకింగ్ సభ్యులు పాల్గొన్నారు.

## దద్దాల నారాయణను కలిసిన దేవస్థాన కమిటీ సభ్యులు



**కనిగిరి, ఆగస్టు 2, ప్రభాతవార్త**
కనిగిరిలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో పార్టీ ఇన్‌ఛార్జ్ దద్దాల నారాయణ యాదవ్‌ను కమిటీసభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి కొత్తూరు శ్రీ అభయాంజనేయస్వామి దేవస్థాన ప్రాంగణంలో నిర్మించబోయే నూతన కళ్యాణమండప శంకుస్థాపన మహోత్సవానికి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా దద్దాల నారాయణ యాదవ్‌కి కమిటీ సభ్యులు దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కర్నాటి సుబ్బారెడ్డి, యాళ్ల కృష్ణారెడ్డి, ఏకుల వెంకట సుబ్బారెడ్డి, అచ్చాల రామస్వామి రెడ్డి, అచ్చాల లక్ష్మీరెడ్డి, అచ్చాల శ్రీనివాసులురెడ్డి,అచ్చాల రమేష్‌రెడ్డి, మడతల రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సీపీఐ రాష్ట్ర మహాసభల్ని జయప్రదం చేయండి

### - ఏఐటీయుసీ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ యాసిన్ పిలుపు




**కనిగిరి, ఆగస్టు 2, ప్రభాతవార్త**
ఈనెల 20వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ఒంగోలు నగరంలో నిర్వహించనున్న కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా 28వ రాష్ట్ర మహా సభలను విజయవంతం చేయాలని ఏఐటీయుసీ జిల్లా అధ్యక్షులు సయ్యద్ యాసిన్ పిలుపునిచ్చారు. శనివారం కనిగిరిలోని దర్శి చెంచయ్య భవనంలో జరిగిన అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ సమావేశంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశానికి కే.శ్రీదేవి అధ్యక్షత వహించగా, సయ్యద్ యాసిన్ మాట్లాడుతూ సీపీఐ పార్టీ ఆవిర్భావం అనంతరం ఒంగోలు నగరంలో రాష్ట్ర మహాసభలు జరగడం ఇదే తొలి సారి. మహాసభలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించి, ప్రజల మధ్య కమ్యూనిస్టు ఉద్యమానికి మరింత బలాన్ని కలిగించాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు. ఈ మహాసభల్లో వేయి మంది కళాకారులు పాల్గొని 100 గొంతులు- 100 డప్పులతో ఘనమైన జానపద ప్రదర్శనలు ఇవ్వనున్నారని ఆయన వెల్లడించారు. గోరేటి వెంకన్న, సుద్దాల అశోక్ తేజ, వందేమాతరం శ్రీనివాస్, నల్లపూసల బాబ్జి, ఏపూరి సోమన్న లాంటి ప్రముఖ కళాకారులతో పాటు గిరిజన నృత్యాలు, కోలాటం, గొల్లసుద్దులు లాంటి జానపద కళారూపాలు ప్రేక్షకులను అలరించనున్నాయని వివరించారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు కుమారి, మానస, దీపిక, జులేఖ, స్కూల్ ఆయాల సంఘం జిల్లా నాయకురాలు దాసరి సునీత, మహిళా సంఘం నాయకులు షేక్ బషీరా, రామనబోయిన అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

## రైతన్నలకు అండగా కూటమి ప్రభుత్వం

### - కనిగిరి నియోజకవర్గం రైతన్నల ఖాతాల్లో రూ.28.74 కోట్లు - ఎమ్మెల్యే ఉగ్ర





**కనిగిరి, ఆగస్టు 2, ప్రభాతవార్త**
రైతన్నల సంక్షేమమే ముఖ్య లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అన్నదాతకు అండగా పీఎం కిసాన్ పథకం శనివారం కనిగిరిలో ప్రారంభమైంది. కనిగిరి మార్కెట్ యార్డులో రైతులతో కలిసి నిర్వహించిన కార్యక్రమంలో శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రైతులకు సంవత్సరానికి రూ.13,500లు అందజేస్తే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం అదనంగా రూ.6,500లు చొప్పున కలిపి మొత్తం రూ.20వేలు అందజేస్తోంది. ఇది రైతుల ఆర్థిక స్థితిని మెరుగుపరిచే కీలక చర్య అని వివరించారు. మొదటి విడతగా కనిగిరి నియోజకవర్గానికి చెందిన 42,302 మంది అర్హులైన రైతులకు రూ.28.74 కోట్లు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమయ్యాయి.


**మండలాల వారీగా లబ్దిదారుల సంఖ్య :**
కనిగిరి మండలం 10,411 మంది, పామూరు మండలం 7,621, పీసీపల్లి మండలం 6,655, హనుమంతునిపాడు 6,542, వెలిగండ్ల 5,736, సీఎస్‌పురం 5,337 రైతుల జీవన ప్రమాణాలను మెరుగుపరచే ఈ పథకం, ప్రభుత్వ అంకితభావానికి కూటమి పాలన విశ్వాసానికి నిదర్శనమని ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి పేర్కొన్నారు. అన్నదాతల జీవితం వెల్లకిలా ఉండే దిశగా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు.

## సీఎం చంద్రబాబు పర్యటనలో పాల్గొన్న జన ప్రభంజనానికి జేజేలు

### - వెరీ గుడ్ బాగా కష్టపడ్డారు అని డాక్టర్ లక్ష్మీ లలిత్ సాగర్‌ని అభినందించిన సీఎం

**దర్శి, ఆగస్టు 2, ప్రభాతవార్త**
దర్శి మండలం తూర్పు వీరాయ పాలెంలో శనివారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రారంభించి రైతులకు నేరుగా నగదు బదిలీ చేశారు. సూపర్‌సిక్స్ పథకాలలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్రమోడీ సహకారంతో ఏడాదికి రూ.20వేలు ఇచ్చే అన్నదాత సుఖీభవ మొదటి విడత రూ.7వేలను రైతులకు అందజేశారు. చంద్రబాబు పర్యటనలో పాల్గొన్న దర్శి ప్రాంత కూటమి నేతలు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, రైతాంగానికి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియ జేశారు.సీఎం రైతు రచ్చబండ కార్యక్రమం హెలిప్యాడ్ వద్ద ఏర్పాట్లు, భోజన ఏర్పాట్లు, తదితర పనులలో నిమగ్నమైన ఆయన పర్యటన ఆద్యాంతం ఎక్కడ ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించిన మన పార్టీ క్యాడర్‌కు, అదే విధంగా ముఖ్యంగా పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ శాఖలు ఆర్‌అండ్‌బి, పంచాయతీ రాజ్, విద్యుత్ ఉద్యానవన, వ్యవసాయ, విద్యా, వైద్య ఆరోగ్య ఇంజనీరింగ్ అధికారులు, వివిధ శాఖల అధికారులకు సిబ్బందికి డాక్టర్ లక్ష్మీ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించినందుకు వెరీ గుడ్ గుడ్ వర్క్ బాగా కష్టపడ్డారు అంటూ సీఎం చంద్రబాబు డాక్టర్ లక్ష్మీ,డాక్టర్ కడియాల లలిత్ సాగర్‌లను ప్రత్యేకంగా అభినందించారు. ఉదయం 11గంటలకు హెలిప్యాడ్ వద్దకు సీఎం చంద్రబాబు చేరుకున్నారు.ఈ సందర్భంగా వ్యవసాయశాఖ మంత్రి అచ్చెంనాయుడు, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఏపీ టూరిజం డవలప్‌మెంట్ చైర్మన్ నూకసాని బాలాజీ, 20 సూత్రాల కమిటీ చైర్మన్ లంకా దినకర్, ఏపీ ఎస్ వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, టీడీపీ ఇన్‌ఛార్జ్‌డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, కడియాల లలిత్ సాగర్, మాజీ ఎమ్మెల్యేలు నారపుశెట్టి పాపారావు, వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ దారం నాగవేణి సుబ్బారావు, మున్సిపల్ చైర్మన్ పిచ్చయ్య, నియోజకవర్గంలోని అన్ని మండల పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, గ్రామ పార్టీ అధ్యక్షులు పెద్ద ఎత్తున సీఎం చంద్రబాబుకు హెలిప్యాడ్ వద్ద సాదర స్వాగతం పలికారు. అనంతరం తూర్పు వీరాయపాలెం పొలాలలో ఏర్పాటు చేసిన రైతు రచ్చబండ కార్యక్రమానికి దాదాపు రెండు గంటలకు పైగా నడి ఎండలో మండుటెండను సైతం లెక్కచేయకుండా సీఎం చంద్రబాబు రచ్చబండలో పాల్గొని ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రసంగం అద్యంతం విని ఆయన ఆ పథకం ప్రారంభించిన తర్వాత కేంద్ర ప్రభుత్వ నిధులకు జోడించి రాష్ట్ర ప్రభుత్వ నిధులతో అన్నదాత సుఖీభవ నగదును రైతుల అకౌంట్ జమ చేసే కార్యక్రమానికి ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టి ప్రారంభించారు. ఒక్క దర్శి నియోజకవర్గంలోనే సుమారు 29 కోట్ల రూపాయల అన్నదాత సుఖీభవ నిధులను విడుదల చేసి వందసన్న గొప్ప రైతు బాంధవుడుగా చెప్పవచ్చు. ఆ తర్వాత రైతులతో మాట్లాడి వారి అభిప్రాయాలను రైతులతో పంచుకున్నారు. ఈ సందర్భంగా తూర్పు వీరాయపాలెం కి చెందిన ఓ యువకుడు అడిగిన ఇల్లులు టు తూర్పు వీరాయపాలెం రోడ్డును వెంటనే పూర్తిగా ప్రారంభించి పూర్తి చేయాలని సంబంధిత జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాని ఆదేశించారు. ఆ తర్వాత చంద్రబాబు ప్రసంగం ఒంటిగంట నుండి దాదాపు రెండు గంటల వరకు సుదీర్ఘంగా రైతులను, ఈ ప్రాంత ప్రజలను ఎంతో ఉత్తాహపరిచే విధంగా సాగింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీఎం చంద్రబాబు మొట్టమొదటిసారిగా దర్శికి వచ్చిన సందర్భంగా పెద్ద ఎత్తున దర్శి ప్రాంతం ప్రజలు సాదర స్వాగతం పలికారు. దర్శి అంతా పసుపు మయంగా మారింది. వీరాయపాలెం రోడ్డు కిటకిటలాడింది. తూర్పు వీరాయపాలెం రోడ్డు అంతా పచ్చ తోరణాలు, ఫ్లెక్సీలతో నిండిపోయింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఏది ఏమైనా దర్శిలో తెలుగుదేశం పండుగ వాతావరణ సాగింది. సీఎం చంద్రబాబు పర్యటనలో పాల్గొన్న అశేష ప్రజానీకానికి మరొక్క సారి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ లలిత్ సాగర్ కృతజ్ఞతలు తెలియజేశారు.

## ద్విచక్రవాహానం అదుపుతప్పి వ్యక్తికి గాయాలు



**రాచర్ల, ఆగస్టు 2, ప్రభాతవార్త**
ద్విచక్రవాహానం అదుపుతప్పి వ్యక్తికి గాయాలైన సంఘటన మండలంలోని పలుగుంటిపల్లి మూలమలుపు వద్ద శనివారం చోటుచేసుకుంది. అర్ధవీడు మండలం బొల్లుపల్లి గ్రామానికి చెందిన చిట్టెం సురేష్ (జోసఫ్) అనే వ్యక్తి తన ద్విచక్రవాహనంపై వస్తూ పలుగుంటిపల్లి మూల మలుపు వద్ద ద్విచక్రవాహానం అదుపు తప్పి క్రిందపడ్డాడు. ఈ ఘటనలో సురేష్ తలకు గాయాలుకాగా స్థానికులు 108కు సమాచారమందించడంతో 108సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని సురేష్‌ను గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

## దర్శి ప్రాంత అభివృద్ధిలో మరో ముందడుగు

### - సీఎం పర్యటనలో డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ విన్నపాలకు సానుకూలత









**దర్శి, ఆగస్టు 2, ప్రభాతవార్త**
దర్శి మండలం,తూర్పు వీరాయపాలెం గ్రామానికి శనివారం విచ్చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దర్శి అభివృద్ధికి సానుకూలత వ్యక్తం చేశారు. ముఖ్యంగా గత తెలుగుదేశం ప్రభుత్వం ప్రారంభించిన ఇంటర్నేషనల్ డ్రైవింగ్ స్కూల్ తిరిగి ప్రారంభించేందుకు సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. గత వైసీపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును నిర్లక్ష్యంగా వదిలేసిందని, తిరిగి ప్రతిష్ఠాత్మకమైన ఇంటర్నేషనల్ డ్రైవింగ్ స్కూల్ పనులు ప్రారంభించాలని డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ సీఎం చంద్రబాబును కోరారు. వెంటనే పనులు తిరిగి ప్రారంభిద్దామని హామీ ఇచ్చారు. అదే విధంగా దొనకొండ పారిశ్రామిక కారిడార్ కోల్డ్ స్టోరేజీ నిర్మాణం, వలసలను నివారించేందుకు ఉపాధి అవకాశాలు పెంచే విధంగా సాంకేతిక విద్య, పారిశ్రామిక అభివృద్ధి, గ్రామీణ రోడ్ల అభివృద్ధికి, ఆర్టీసీ బస్టాండ్ పునర్నిర్మాణం, వెంకటాచలంపల్లి టు దొనకొండ డబుల్ రోడ్డు నిర్మాణం, వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేయడం తదితర నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేసి ఆయా పనులను ప్రారంభించాలని డాక్టర్ లక్ష్మీ చంద్రబాబును కోరారు. వీటన్నింటిపై సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. ముఖ్యంగా తూర్పు వీరాయపాలెం గ్రామంలో అంతర్గత రోడ్లు, డ్రైన్లు పనులు తదితర అభివృద్ధి పనుల చేపట్టాల్సిందిగా సీఎం చంద్రబాబును కోరగా వెంటనే కలెక్టర్ తమీమ్ అన్సారియా కి తెలియజేసి తూర్పువీరాయపాలెంలో అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేయాలని రోడ్లు, డ్రైన్లు చేపట్టాలని కోరారు. అదే విధంగా ఆ గ్రామంలో పేదలైన అర్హులకు దాదాపు 90 మందికి ఇళ్ల పట్టాలను మంజూరు చేయాలని సీఎం డాక్టర్ లక్ష్మీ విన్నపం మేరకు వెంటనే అధికారులకు ఆదేశించారు. ఇలా నియోజకవర్గంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లేందుకు శనివారం జరిగిన దర్శి సీఎం పర్యటన ఎంతో మేలు చేసిందని డాక్టర్ లక్ష్మీ సందర్భంగా వివరించారు. వెలుగొండ ప్రాజెక్టు వచ్చే రెండేళ్లలో పూర్తి చేస్తానని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ వెలుగొండ ప్రాజెక్టు దొనకొండ, కురిచేడు వంటి వెనుకబడిన ప్రాంతాలకు వరంగా చెప్పవచ్చని డాక్టర్ లక్ష్మీ ఈ సందర్భంగా సీఎంని ప్రత్యేంగా అభినందించారు. కరువు కోరల్లో ఉన్న దొనకొండకు వెలుగొండ వెలుగులు నింపుతుందని తాగునీటి సమస్యకు పరిష్కారం లభిస్తుందని సీఎం దర్శి సభలో వెలుగొండ ప్రాజెక్టు పై ప్రకటన చేయడం ఒక మంచి శుభ పరిణామం అని డాక్టర్ లక్ష్మీ అన్నారు. దర్శి అభివృద్ధి బాధ్యత నేను తీసుకుంటానని, ప్రజలు ప్రజల అభివృద్దే మీ బాధ్యత అని సీఎం చంద్రబాబు భరోసా ఇచ్చారు. మన మంచి ప్రభుత్వంలో ప్రజలకు మంచి చేయడమే మన లక్ష్యమని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మరొక సారి డాక్టర్ లక్ష్మీ, డాక్టర్ కడియాల లలిత్ సాగర్‌లు సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

## దర్శి మార్కెట్ యార్డు చైర్మన్ దారం నాగవేణి

### - సుబ్బారావును అభినందించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు



**దర్శి, ఆగస్టు 2, ప్రభాతవార్త**
అన్నదాత సుఖీభవ కార్యక్రమానికి దర్శి మండలంలోని వీరాయపాలెం గ్రామానికి విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని ఘనంగా సన్మానించిన దర్శి ఏఎంసీ చైర్మన్ దారం నాగవేణి సుబ్బారావు. దర్శి టీడీపీ ఇన్‌ఛార్జ్ డాక్టర్ గొట్టిపాటిలక్ష్మీ, టీడీపీ యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్, టీడీపీ సీనియర్ నాయకులు కడియాల రమేష్ ఉన్నారు. ఈ సందర్భంగా అన్నదాత సుఖీభవ పథకం ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని హెలిప్యాడ్ ప్రాంగణం వద్ద మెమోంటోని అందజేసి దర్శి మార్కెట్ యార్డు చైర్మన్ దారం నాగవేణి- సుబ్బారావు. ఈ సందర్భంగా ఇరువురిని సీఎం అభినందించారు.

## విజయవంతంగా ముగిసిన ఇంటర్ వర్క్‌షాప్



**వేటపాలెం, ఆగస్టు 2, ప్రభాతవార్త**
సెయింట్ ఆన్స్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, చీరాల నందను గత ఆరు రోజులుగా జరుగుతున్న డ్రోన్ డవలప్‌మెంట్ యూజింగ్ ఇంటర్ యాక్టివ్ వర్క్ షాపు విజయవంతంగా ముగిసిది. ఆర్టిన్ స్మార్ట్, ఈపీఐటీ రీసెర్చ్ ల్యాబ్స్ హైదరాబాద్ వారి సంయుక్త సహకారంతో జరిగిన ఈ వర్క్ షాపు వర్క్ నందు విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ద్వారా డ్రోన్ డవలప్‌మెంట్‌పై అవగాహన కల్పించి, వాటి తయారీ వినియోగంపై శిక్షన ఇచ్చారు. వర్క్ షాపు ద్వారా విద్యార్థులు స్వతహాగా కోడింగ్ ద్వారా డ్రోన్స్‌ను స్ప్రే చేశారు. విద్యార్థులు తమకు అందిన ఈ గొప్ప అవకాశాన్ని అందిపుచ్చుకొని కాలేజీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఇంటరాక్టివ్ వర్క్ షాపునకు అట్టెన్ స్మార్ట్, ఈపీఐటీ రీసెర్చ్ ల్యాబ్ నుండి వి.వరుణ్(సీఈఓ), ఎల్.సూర్య ప్రకాష్(కో డైరక్టర్), కే.ప్రశాంతి, వి.చరణ్, ఎస్‌కే రఫీ, డివిలియమ్స్‌లు పాల్గొని విద్యార్థులకు పూర్తి స్థాయి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఈసీఈ విభాగ అధిపతులు, అధ్యాపకులు, మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## సూపర్‌సిక్స్ హామీలు తథ్యం.. మద్దులూరి



**వేటపాలెం, ఆగస్టు 2, ప్రభాతవార్త**
దేశాయిపేట గ్రామం రామానగర్ నందు నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో చీరాల శాసనసభ్యులు మాకలొండయ్య చీరాల తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి మహేంద్రనాథ్, యువ నాయకులు గౌరీ అమర్నాథ్ పాల్గొన్నారు. కూటమి నాయకులు నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అమలు చేస్తోన్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పథకాల లబ్దిదారులతో ప్రత్యేకంగా సమావేశమై ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరుపై ప్రజలు అభిప్రాయాలను తెలుసుకున్నారు. రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నా.. సూపర్ సిక్స్‌లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తూ.. సీఎం చంద్రబాబు తన చిత్తశుద్ధిని చాటుకున్నారని ఇదే స్ఫూర్తితో రాబోవు 4 ఏళ్లలో ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తూ మరింత సుపరిపాలన అందించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం కార్యకర్తలు, పార్టీ అభిమానులు ప్రజలు పాల్గొన్నారు.

## తల్లిపాలతోనే ఆరోగ్యం



**నాగులుప్పలపాడు, ఆగస్టు 2, ప్రభాతవార్త**
నాగులుప్పలపాడు మండలంలోని నిడమానూరు, ఈదుమూడి, రాపర్ల, కనపర్తి గ్రామాల్లో శనివారం తల్లిపాల వారోత్సవాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో తల్లిపాల ప్రాముఖ్యత గురించి, కంగారు మదర్ కేర్ గురించి వివరించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ పుట్టిన పిల్లలకు తల్లిపాలు తాపించడం వలన ఆరోగ్యంగా ఉంటారని, తల్లిపాలు బిడ్డలకు చాలా సురక్షితమైనవని అంతే కాకుండా రోగనిరోధక శక్తిని పెంపొందిస్తాయని తెలిపారు. బిడ్డ పుట్టిన వెంటనే అరగంట లోపల తల్లిపాలు ఇవ్వాలని తెలిపారు. తల్లిపాలు ఇవ్వడం వల్ల బ్రెస్ట్ క్యాన్సర్ పాలిచ్చే తల్లులకు రొమ్ము క్యాన్సర్ ప్రమాద స్థాయి తగ్గిస్తుందని గర్భాశయం అండాశయంలో క్యాన్సర్‌ను నిరోధిస్తుందని కణజాలంలో ఈస్ట్రోజన్ తక్కువగా ఉత్పత్తి కావడంతో ఈ పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ముర్రుపాలు బిడ్డకు తాపించడం వల్ల తల్లి బిడ్డకు ఎముకల వ్యాధి నియంత్రణకు దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌కేలు, ఏఎన్ఎంలు, ఆశాలు, ఐసీడీఎస్ సూపర్ వైజర్ అన్నపూర్ణ, ప్రమీల, ఉషారాణి, శ్రీదేవి పాల్గొన్నారు.

## పటిష్ట బందోబస్తు నడుమ ప్రశాంతంగా ముగిసిన ముఖ్యమంత్రి పర్యటన


### - జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్





**దర్శి, ఆగస్టు 2, ప్రభాతవార్త**
రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటన సందర్భంగా హెలిప్యాడ్ వద్ద గుంటూరు రేంజ్ ఐజీ సర్వ శ్రేష్ఠ త్రిపాఠి, జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. పర్యటనకు ముందు హెలిప్యాడ్, వీఐపీ రూట్, ప్రజా వేదిక ప్రదేశం, పార్కింగ్ ప్రాంతాలను గుంటూరు రేంజ్ ఐజీ, జిల్లా ఎస్పీ సందర్శించి భద్రతా ఏర్పాట్లను సమీక్షించి, సంబంధిత అధికారులకు పలు సూచనలు ఇచ్చారు.సీసీటీవీ కెమెరాలు, డ్రోన్ కెమెరాల ద్వారా ప్రజావేదిక, హెలిప్యాడ్, ప్రధాన మార్గాలపై నిఘా ఉంచాలని సూచించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూఅతితక్కువ సమయంలోఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. బందోబస్తు విజయవంతంగా పూర్తి చేసినందుకు ప్రజా వేదిక, రూట్, ట్రాఫిక్, బందోబస్తు అధికారులు, మహిళా సిబ్బందిని అభినందించారు. పర్యటనను విజయవంతంగా నిర్వహించిన పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్పీ అభినందనలు తెలియజేశారు. అలాగే సహకరించిన అన్ని ప్రభుత్వ శాఖల అధికారులకు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

## శ్రీలక్ష్మీనరసింహాస్వామి ఆలయాన్ని సందర్శించిన పాలకమండలి



**అద్దంకి , ఆగస్టు 2, ప్రభాతవార్త**
సింగరకొండలోని శ్రీలక్ష్మీనసింహాస్వామి ఆలయ నూతన పాలకమండలి నియామకం జరిగిన నేపద్యంలో పాలకమండలి సభ్యులు శనివారం ఆలయాన్ని సందర్శించారు.రాష్ట్ర విద్యుత్‌శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను ఉదయం ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి,కమిటీ నియామకం సమాచారాన్ని తెలియజేశారు. అనంతర అక్కడనుండి నేరుగా సింగరకొండలోని శ్రీలక్ష్మీనరసింహాస్వామి ఆలయానికి పాలకమండలి సభ్యులు చేరుకున్నారు. పాలకమండలి బాధ్యతలు స్వీకరణ విషయం ఆలయం వద్ద అధికారితో చర్చించి, ఈ నెల 4వ తేదిన పాలకమండలి ప్రమాణస్వీకార అంశాన్ని చర్చించి నిర్ణయించారు.

## శ్రీలక్ష్మీనరసింహాస్వామి దేవస్థాన చైర్మన్‌గా గుంజి



**అద్దంకి , ఆగస్టు 2, ప్రభాతవార్త**
ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన సింగరకొండలోని శ్రీలక్ష్మీనరసింహాస్వామి దేవస్థాన పాలకమండలిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. పాలకమండలి అధ్యక్షులుగా అద్దంకి పట్టణంలోని ఇందిరనగర్‌కు చెందిన గుంజి శ్రీనివాసరావు (పాపులగారి శ్రీను), నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. గుంజి శ్రీనివాసరావు 1983 పార్టీ అవిర్భావం నుండి కార్యకర్తగా పనిచేస్తున్నారు. పార్టీ మండల బిసి సెల్ అధ్యక్షులుగా, టౌన్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా, పార్టీలో చురుకుగా పనిచేస్తున్నారు. గత ఎన్నికలలో పార్టీ గెలుపుకు కృషిచేశారు. విద్యార్థి దశనుండే రాజకీయాల పట్ల ఆసక్తి కలిగిన శ్రీనివాసరావు, తెలుగుదేశం పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత స్థానిక శాసనసభ్యులు, రాష్ట్ర విద్యుత్‌శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్ గుంజి శ్రీనివాసరావును శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవస్థాన పాలకమండలి చైర్మన్‌గా సిఫార్సు చేశారు. ఈ నేపద్యంలో ప్రభుత్వం నుండి పాలకమండలిని నియమిస్తూ ఉత్తర్వులు విడదలయ్యాయి. ఇది ఇలా వుండగా గుంజి శ్రీనివాసరావు తండ్రి గుంజి పాపులు, రెండు పర్యాయాలు శ్రీలక్ష్మీనరసింహాస్వామి దేవస్థాన డైరెక్టర్‌గా పనిచేశారు. ఈ నేపద్యంలో ప్రస్తుతం శ్రీనివాసరావుకు దేవస్థాన పాలకమండలి చైర్మన్ లభించింది.

## శ్రీలక్ష్మీనరసింహాస్వామి ఆలయాన్ని సందర్శించిన జడ్జి





**అద్దంకి , ఆగస్టు 2 ప్రభాతవార్త**
సింగరకొండలోని శ్రీలక్ష్మీ నరసింహాస్వామి ఆలయాన్ని శనివారం అద్దంకి సీనియర్ సివిల్ జడ్జి వెంకట నాగలక్ష్మి సందర్శించారు. ఈమెకు ఆలయం వద్ద అధికారి సాదర స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జడ్జికి ఆలయ పూజారులు, తీర్ధ ప్రసాదాలతోపాటు ఆశ్వీరచనాలను అందజేశారు.

## మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన పాలకమండలి

### - మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన నేతలు - పాలకమండలికి మంత్రి శుభాకాంక్షలు





**అద్దంకి ,ఆగస్టు 2 ,ప్రభాతవార్త**
ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన సింగరకొండ శ్రీలక్ష్మీనరసింహాస్వామి దేవస్థాన పాలకమండలిని నియమిస్తూ రాష్ట్ర దేవాదాయశాఖ ఉత్తర్వులు జారీచేసింది.ఈ నేపద్యంలో పాలకమండలి సభ్యులుగా నియమితులైన నేతలు శనివారం రాష్ట్రవిద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను చిలకలూరిపేటలోని ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ సందర్భంగా నియామక ఉత్తర్వులు వెలువడిన వెంటనే పాలక మండలి బాధ్యతలు తీసుకోవాలని మంత్రి సూచించారు. పాలకమండలి సభ్యులు మంత్రికి బోకే అందజేసి, తమ కృతజ్ఞతలు తెలియజేశారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్‌పాలకమండలి సభ్యులకు తన అభినందనలు, శుభాకాంక్షలను తెలియజేశారు. మంత్రిని కలిసిన వారిలో పాలకమండలి చైర్మన్ గుంజిశ్రీనివాసరావు, మంగమూరి సురేష్, దాసరి రామాంజనేయులు,రుద్రు ఆదిలక్ష్మి శ్రీనివాసరావు, కొడెమల కోటేశ్వరమ్మ వెంకటేశ్వర్లు, చీమలదిన్నె వెంకటరమణ గురవయ్య, కసుకుర్తి లక్ష్మీప్రసన్న వీరవెంకట పద్మనాభశర్మ, బత్తుల సరిత శ్రీనివాసరావు,అద్దంకి ఆదిలక్ష్మి వెంకటేశ్వర్లుతో పాటు ఆలయ ఈఓ శ్రీనివాసరావుతోపాటు పలువురు టిడిపి నాయకులు వున్నారు.

## శ్రీలక్ష్మీనరసింహాస్వామి దేవస్థాన డైరెక్టర్‌గా మంగమూరి



**అద్దంకి , ఆగస్టు 2, ప్రభాతవార్త**
ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన సింగరకొండలోని శ్రీలక్ష్మీనరసింహాస్వామి దేవస్థాన పాలకమండలిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.ఈ పాలకమండలిలో బిజెపి నుండి నాగులపాడుకు చెందిన మంగమూరి సురేష్‌ను డైరెక్టర్‌గా నియమించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత నామినేటెడ్ పదవులలో కూటమిలోని మూడు పార్టీలకు ప్రాధాన్యత కల్పిస్తున్నారు. అయితే ప్రభుత్వంలోని మూడు పార్టీలు వారి వారి రేషోలలో పదవులను కేటాయిస్తున్న నేపద్యంలో సింగరకొండ లక్ష్మీనరసింహాస్వామి దేవస్థాన పాలకమండలిలో బిజెపికి ఒక డైరెక్టర్ పదవిని కేటాయించారు. అందులో భాగంగా గత ఏళ్ళగా నాగులపాడు గ్రామానికి చెందిన మంగమూరి సురేష్ బిజెపిలో క్రియాశీలక సభ్యుడుగా పనిచేస్తున్నారు. రెండు సంవత్సరాలనుండి బిజెపి బాపట్ల జిల్లా కిసాన్‌మోర్చా అధ్యక్షులుగా పనిచేస్తున్నారు. గత ఎన్నికలలో కూటమి తరుపున అద్దంకిలో బిజెపి నుండి అభ్యర్థి గెలుపుకు కృషిచేశారు. ఈ నేపద్యంలో దేవస్థాన పాలకమండలిలో బిజెపి నుండి మంగమూరి సురేష్ పేరును సిఫార్సు చేశారు. ఆమేరకు మంగమూరి సురేష్‌ను పాలక మండలిలో డైరెక్టర్ నియమిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది.

## విద్యార్థినీలకు గుడ్, బ్యాడ్ టచ్, సైబర్ నేరాలు, హెల్మెట్‌పై అవగాహన కల్పించిన జిల్లా ఎస్పీ



**దర్శి, ఆగస్టు 2, ప్రభాతవార్త**
దర్శి మండలం పొతకమూరు గ్రామంలోని జడ్పీ హైస్కూల్‌లో చదువుతున్న విద్యార్థులకు గుడ్, బ్యాడ్ టచ్, సైబర్ నేరాలు, హెల్మెట్‌పై కూడా అవగాహన కల్పించారు. ముఖ్యంగా విద్యార్థినులకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ మధ్య తేడా తెలుసుకోవడం, స్వీయ రక్షణ, మహిళలపై జరుగుతున్న నేరాలు, ప్రస్తుత సమాజంలో ఆడ పిల్లలు ఎదుర్కొంటున్న సవాళ్ల గురించి కూడా అవగాహన కల్పించారు. ఫోన్లో అవసరమైన/ తెలియని వాటి జోలికి వెళ్ళరాదని సైబర్ నేరాల పట్ల విద్యార్థి దశ నుండే అవగాహన కలిగి ఉండాలన్నారు.

3-8Pg5_3-8Pg5.qxd 8/2/2025 11:27 PM Page 1





# ప్రజ్వల్ రేవణ్ణకు జీవిత ఖైదు

పనిమనిషిపై అత్యాచారం కేసు

తనకు తక్కువ శిక్ష వేయాలంటూ కోర్టులో ఏడ్చేసిన రేవణ్ణ

14 నెలలుగా జైల్లో ఉన్న మాజీ ఎంపి

**బెంగళూరు,ఆగస్టు 2:** లైంగిక దాడి కేసులో మాజీ ఎంపీ, హెచ్‌డీ దేవేగౌడ మనుమడు ప్రజ్వల్ రేవణ్ణకు కోర్టు జైలు శిక్షఖరారు చేసింది. ఆయనకు జీవితై ఖైదు విధిస్తూ తీర్పును వెలువరించింది. ఓ తనపై అత్యాచారం చేసి బెదిరింపులకు పాల్పడినట్లు మహిళ ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ప్రజ్వల్ రేవణ్ణను ప్రత్యేక కోర్టు దోషిగా తేల్చింది. శనివారం ప్రజ్వల్ రేవణ్ణకు జీవిత ఖైదు విధించింది. ప్రజ్వల్ రేవణ్ణపై నాలుగు అత్యాచార కేసులు ఉన్నాయి. ఈ కేసులో ప్రజ్వల్ ఇప్పటికే 14 నెలలుగా జైలు జీవితం గడిపారు. మైసూర్‌లోని కేఆర్‌ఎస్ నగర్‌కు చెందిన పని మనిషిపై అత్యాచారం కేసులో ప్రజ్వల్‌ను దోషిగా తేలుస్తూ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి సంతోష్ గజానన్ భట్ తీర్పును వెలువరించారు. ప్రభుత్వం తరఫున న్యాయవాది జగదీష్ వాదనలు వినిపించారు. ప్రజ్వల్ చర్య నీచమైందని, జీవనోపాధి కోసం పని కోసం వచ్చిన చదువు రానివారిపై దారుణ చర్యకు పాల్పడ్డాడని, వీడియోలు చిత్రీకరించడం బాధితురాలిని మానసికంగా కూడా హింసించడమేనని, ఓ దశలో బాధితురాలు ఆత్మహత్యకు ప్రయత్నించిందని కోర్టుకు తెలిపారు. ప్రజ్వల్‌పై మరో మూడు కేసులు పెండింగ్‌లో ఉన్నాయని వాదనలు వినిపించారు. ప్రజ్వల్ రాజకీయాల్లోకి కేవలం డబ్బు కోసమే రాలేదని, ప్రజ్వల్ ప్రజలకు సేవ చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చారన్నారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు వీడియోలు దురుద్దేశంతో లీక్ చేశారని, అతని రాజకీయ భవిష్యత్‌ను నాశనం చేసేందుకు ఈ చర్యకు పాల్పడ్డారంటూ వాదనలు వినిపించారు. ప్రజ్వల్ ఏడాది జైలులో ఉన్నాడని, ఈ కేసుతో అతనికి తీవ్రమైన నష్టం జరిగిందని తెలిపారు.

అత్యాచారం కేసులో మాజీ ప్రధాని హెచ్‌డీ దేవగౌడ మనవడు.. హసన్ నియోజకవర్గానికి చెందిన జనతాదళ్ పార్టీ మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణను బెంగళూరు ప్రత్యేక న్యాయస్థానం దోషిగా తేల్చిన విషయం తెలిసిందే. ఈ కేసులో శిక్షకు సంబంధించిన తుది తీర్పును కోర్టు నేడు వెల్లడించనుంది. ఈ నేపథ్యంలో ప్రజ్వల్ తనకు తక్కువ శిక్ష వేయాలంటూ న్యాయమూర్తిని వేడుకుంటూ ఆయన ముందు బిగ్గరగా ఏడ్చినట్లు తెలిసింది. హసన్ జిల్లాలోని హూలే నరసిరపురలోని గన్నికాడ ఫామ్‌హౌస్‌లో పనిచేస్తున్న 48ఏండ్ల పనిమనిషిపై రేవణ్ణ కొవిడ్ సమయంలో 2021లో రెండుసార్లు లైంగిక దాడి చేశారు. అంతేకాక ఆ దారుణాన్ని మొబైల్ ఫోన్‌లో రికార్డు చేశాడు. ఈ మేరకు బాధితురాలు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. రేవణ్ణ 2024 లోక్‌సభ ఎన్నికల్లో హసన్ నుంచి ఎంపీగా పోటీ చేశారు. ఆయన తరఫున ప్రధాని నరేంద్రమోదీ కూడా ప్రచారం నిర్వహించారు. అదే సమయంలో మహిళలపై ప్రజ్వల్ సాగించిన లైంగిక దాడులకు సంబంధించిన వీడియోలు బయటకు రావడం, విస్తృతంగా ప్రచారం కావడం కర్ణాటకతో పాటు దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. దీంతో రేవణ్ణపై లైంగిక దాడి, లైంగిక వేధింపులు తదితర నాలుగు వేర్వేరు కేసులను సిట్ నమోదు చేసింది. అప్పటికే ఆయన జర్మనీకి పారిపోయారు. జర్మనీ నుంచి వచ్చిన ఆయనను గత ఏడాది మే 31న అరెస్ట్ చేయడంతో గత 14 నెలలుగా ఆయన జైలులోనే ఉన్నారు. విచారణలో ఫోరెన్సిక్ నివేదికలు కూడా ఆ వీడియోలో ఉన్నది ప్రజ్వలే అని నిర్ధారించాయి. హసన్ ఎంపీ సీట్‌ను నిలబెట్టుకోవడంలో విఫలమైన రేవణ్ణను తర్వాత పార్టీ నుంచి సస్పెండ్‌చేశారు. పనిమనిషిపై అత్యాచార ఘటనేకాదు, ఆయనపై అశ్లీల వీడియోల కేసులు నమోదు అయ్యాయి. హసన్‌లోని అతని ఫామ్ హౌస్‌నుంచి 2,900 వీడియోలు ఉన్న పెన్‌డ్రైవ్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనిపై ఆయనపై మూడు కేసులు నమోదయ్యాయి.

## విచారించేందుకు జైలుకు వస్తే.. దుస్తులిప్పేసి యూన్ సుక్ నిరసన




**సియోల్, ఆగస్టు 2:** అనూహ్యంగా ఎమర్జెన్సీ ప్రకటించి దక్షిణ కొరియా మాజీ అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ జైలు పాలయ్యారు. ఆయనపై పలు కేసులు నమోదవగా అధికారులు దర్యాప్తు చేపట్టారు. అయితే, ఈ కేసులకు సంబంధించి విచారణకు హాజరయ్యేందుకు ఆయన నిరాకరిస్తూనే ఉన్నారు. తాజాగా ఆయనను ప్రశ్నించేందుకు అధికారులు మరోసారి జైలుకు రాగా వారి ముందు దుస్తులు విప్పేసి అర్ధనగ్నంగా నేలపై పడుకున్నారు. ఎమర్జెన్సీ వివాదంతో ఈ యేడాది ఏప్రిల్‌లో యూన్ సుక్ యోల్ అభిశంసనకు గురై పదవి నుంచి దిగిపోయిన సంగతి తెలిసిందే. అనంతరం ఆయనపై పలు అవినీతి కేసులు నమోదయ్యాయి. దీంతో గత నెల ఆయనను అరెస్టు చేశారు. ప్రస్తుతం ఆయన సియోల్‌లోని ఓ జైలులో ఉన్నారు. అవినీతి కేసుల్లో ఆయనను విచారించాలని కొత్త అధ్యక్షుడు లీ జే మ్యూంగ్ ఆదేశించారు. ఈ క్రమంలోనే ప్రత్యేక అధికారుల బృందం కోర్టు నుంచి డిటెన్షన్ వారెంట్ తీసుకొని జైలుకు చేరుకుంది. విచారణకు స్వచ్ఛందంగా రాకపోతే బలవంతంగానైనా ఆయనను డిటెన్షన్ సెంటర్‌కు తీసుకెళ్లేందుకు న్యాయస్థానం నుంచి అధికారులు అనుమతి తీసుకున్నారు. అయినప్పటికీ విచారణకు హాజరయ్యేందుకు ఆయన నిరాకరించారు. అధికారులు రాగానే మాజీ అధ్యక్షుడు జైలు యూనిఫామ్ తొలిగించి అర్ధనగ్నంగా నేలపై పడుకొని నిరసన తెలిపారు. దీంతో చేసేదేంలేక,అధికారులు అక్కడినుంచి వెనుదిరిగారు.

## ఆమె ఓ మెషీన్‌గన్.. వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీపై ట్రంప్ ప్రశంసలు



**వాషింగ్టన్, ఆగస్టు 2:** వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రశంసలు కురిపించారు. న్యూస్‌మాక్స్‌లో రాబ్ ఫిన్నెర్టీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ అమెరికాకు అధ్యక్షుడిగా సేవలు అందించిన అందరూ అధ్యక్షుల్లో తనకు మాత్రమే అద్భుతమైన, ఉత్తమ ప్రెస్ సెక్రటరీ ఉందని అన్నారు. కరోలిన్ లీవిట్ మెషీన్‌గన్‌లా పని చేస్తూ తన విధులను సమర్థవంతంగా నిర్వర్తిస్తోందన్నారు. అందం, హుందాతనంతో ప్రజల్లో ఓ స్టార్‌గా మారిపోయిందని పేర్కొ న్నారు. కరోలిన్ మాట్లాడేటప్పుడు ఆమె పెదాల కదలిక చాలా అందంగా ఉంటుందని పొడిగారు. అదే ఇంటర్వ్యూలో మాట్లాడుతూ అమెరికా మాజీ అధ్యక్షుడు ఒబామాపై ట్రంప్ విమర్శలు గుప్పించారు. 2016 ఎన్నికల్లో తాను విజయం సాధించిన తర్వాత తన పాలనను నియంత్రించేందుకు ఒబామా సన్నిహిత వర్గాలు అసత్య ప్రచారం చేశాయని మండిపడ్డారు. ఎన్నికల్లో రష్యా జోక్యం చేసుకుందంటూ తప్పుడు వాదన తెచ్చారని ఆరోపించారు. దీనికి ఆయన తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందన్నారు. మరోవైపు కరోలిన్ లీవిట్ కూడా అమెరికా అధ్యక్షుడిపై ప్రశంసలు గుప్పించారు. ట్రంప్ ప్రపంచంలోనే అత్యంత ప్రభావవంతమైన నేత అని కొనియాడారు. ఆయన భారత్-పాక్ మధ్య జరిగిన ఘర్షణసహా ప్రపంచవ్యాప్తంగా థాయ్‌లాండ్-కంబోడియా, ఇజ్రాయెల్-ఇరాన్, ఈజిప్ట్-ఇథియోపియా, రువాండా-కాంగో డిమోక్రాటిక్ రిపబ్లిక్ వంటి అనేక యుద్ధాలను ముగించారన్నారు. రష్యా-ఉక్రెయిన్, ఇజ్రాయెల్ హమాస్ మధ్య జరుగుతున్న యుద్ధాన్ని ఆపడానికి చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఇందుకుగాను ఆయనకు నోబెల్‌శాంతి పురస్కారాన్ని అందించాలని కోరారు. ఈ నేపథ్యంలో కరోలిన్ లీవిట్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.



## బోగస్ ఆధార్‌తో బంగ్లా నటి శాంతాపాల్ అరెస్టు

**కోల్‌కత్తా,ఆగస్టు 2:** నకిలీ పాస్‌పోర్టుతో భారత్‌లోకి వచ్చిన బంగ్లాదేశ్ నటి శాంతా పాల్(28)ని కోల్‌కత్తా డిటెక్టివ్‌పోలీసులు అరెస్టుచేసారు. అక్రమ విధానాల్లో భారతీయ ఓటరుకార్డు, ఆధార్‌కార్డులు పొందినట్లు అధికారుల దర్యాప్తులో తేలింది. ఆమె విచారణలో చేసిన వ్యాఖ్యలు పొంతన లేకుండా ఉన్నాయని, అందుకే మళ్లీ సమగ్ర దర్యాప్తు చేస్తామని కోల్‌కత్తా పోలీసులు వివరించారు. ఈకేసులో ఆమె స్నేహితుడు సుమన్ చంద్రశీల్‌ను కూడా అదుపులోకి తీసుకుంటామని చెప్పారు. విచారణలో ఆతడి పేరును నటి వెల్లడించింది. అయితే దేశ సమాచారాన్ని మరే ఇతర దేశానికయినా పంపిస్తున్నదా అన్న కోణంలో కూడా దర్యాప్తుచేసారు. చూడటానికి మంచి విలాసవంతమైన జీవన శైలిలో ఉంటూ నాథూలాపాస్ వంటి కీలక ప్రాంతాల్లోకి కూడా వెళ్లింది. భారత్ చైనా సరిహద్దు, దిఘా, గ్యాంగ్‌టక్ వంటి ప్రాంతాల్లో ఆమె రీల్స్ చేసింది. బంగ్లాదేశ్‌లోని బరిసాల్‌కు చెందిన ఆమె జాదవ్‌పూర్‌లో 2023నుంచి ఒక అద్దె అపార్టుమెంట్‌లో నివసిస్తోంది.ఆమెకు రెండు ఆధార్‌కార్డులున్నాయని చెపుతున్నారు. మొదటి ఆధార్ 2020లో ఉంటే అందులో జమ్ముకాశ్మీర్‌లోని బుర్ద్వాన్‌నుంచి తీసినట్లు చిరునామా ఉంది. మరో కార్డులో కోల్‌కత్తా అడ్రస్ ఉందని అధికారులు గుర్తించారు. ఆమె స్నేహితుడు చంద్రశీల్‌కోసం గాలింపు ప్రారంభించారు. నటి బ్యాంకు ఖాతాలను కూడా వివరాలు రాబట్టారు. బ్యాంకురుణం పొందేందుకు ఆమె బోగస్ పత్రాలుకూడా సమర్పించిందని చెపుతున్నారు. శాంతాపాల్ అనేక మోడలింగ్ పోటీల్లో కూడా పాల్గొంది. టాలివుడ్‌లో ఆమె ఒక చిత్రంలో పనిచేస్తోంది. మరో మూవీకోసం టాలివుడ్ నటుడితో సంప్రదింపులు జరుపుతున్నట్లు కూడా పోలీసులు గుర్తించారు.

# అమర్‌నాథ్ యాత్రకు బ్రేక్



**జమ్ము, ఆగస్టు 2:**రుతుపవనాల ప్రభావంతో దేశ వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. జమ్ము కశ్మీర్‌లోనూ కుండపోత వర్షాలతో పలు నదులు పొంగి పొర్లుతున్నాయి. పలుచోట్ల కొండచరియలు విరిగిపడుతున్నాయి. దీనితో ఎంతో కట్టుదిట్టమైన భద్రత మధ్య నిర్వహిస్తున్న అమర్‌నాథ్‌యాత్రకు తాత్కాలిక బ్రేక్‌లు పడక తప్పడంలేదు. ఈ వర్షాలకు అమర్‌నాథ్ యాత్రకు మళ్లీ తాత్కాలిక బ్రేక్ పడింది. కశ్మీర్ అంతటా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా అమర్‌నాథ్ యాత్రను ఆగస్టు 3 వరకూ నిలిపివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. యాత్రికుల భద్రతను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు కశ్మీర్ డివిజనల్ కమిషనర్ విజయ్ కుమార్ బిధురి ప్రకటించారు. పహల్గాం, బల్తాల్‌ఉంగా భక్తులను అనుమతించట్లేదని వెల్లడించారు. భారీవర్షాల కారణంగా దెబ్బతిన్న రహదారికి నిర్వహణ అవసరంకావడంతో ఆ మార్గాన్ని మూసివేసినట్లు అధికారులు తెలిపారు.

## బాత్‌రూమ్‌లో జారిపడ్డ జార్ఖండ్ మంత్రి



**రాంచి,ఆగస్టు 2:** జార్ఖండ్ మంత్రి ఒకరు ప్రమాదవశాత్తూ బాత్రూమ్‌లో జారి పడ్డారు. దీంతో బ్రెయిన్ ఇంజూరీ(మెదాడుకు గాయం) తో ఆసుపత్రిలో చేరారు. ప్రస్తుతం మంత్రి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. జార్ఖండ్ విద్యాశాఖ మంత్రి రాందాస్ సోరెన్ శనివారం ఉదయం తన ఇంట్లోని బాత్రూమ్‌లో జారిప డ్డారు. దీంతో తలకు బలమైన గాయమైంది. కుటుంబ సభ్యులు మంత్రిని హుటాహుటిన జంషెడ్‌పూర్‌లోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. మంత్రి మెదడులో రక్తం గట్టకట్టినట్లు వైద్యులు గుర్తించారు. ఈ మేరకు ప్రత్యేక హెలికాప్టర్‌లో ఆయన్ని ఢిల్లీ ఆస్పత్రికి తరలించినట్లు జార్ఖండ్ ఆరోగ్య మంత్రి ఇర్ఫాన్ అన్సారీ తెలిపారు. మరోవైపు రాందాస్ సోరెన్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని బీజేపీ సీనియర్ నాయ కుడు, కేంద్ర మాజీ మంత్రి అర్జున్ ముండా తెలిపారు.

## ఎన్నికల్లో బూత్‌లెవల్ అధికారులకు పారితోషికం రెట్టింపు

**న్యూఢిల్లీ,ఆగస్టు 2:** బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారుల పారితోషికాలు, గౌరవభృతిని సవరించింది. 2015 తర్వాత ఈసీ ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారుల పారితోషికాలను సవరించడం ఇదే తొలిసారి. తాజా సవరణ ప్రకారం బూత్ లెవల్ అధికారుల పారితోషికాన్ని ఈసీ ఏకంగా రెండింతలు చేసింది. 2015 నుంచి ఇప్పటివరకు బూత్ లెవల్ అధికారులకు పారితోషికంగా రూ.6 వేలు ఇస్తుండగా ఇప్పుడు దాన్ని రూ.12 వేలు చేసింది. అదేవిధంగా ఓటర్ల జాబితాను సరిచూసినందుకు బీఎల్‌వోలకు గతంలో రూ.1000 ఇన్సెంటివ్‌గా ఇచ్చేవారు. ఇప్పుడు ఆ ఇన్సెంటివ్‌ను రూ.2వేలకు పెంచారు. ఇక బీఎల్‌వో సూపర్‌వైజర్లకు గతంలో రూ.12 వేలు పారితోషికంగా ఇస్తుండగా ఇప్పుడు దాన్ని రూ.18 వేలు చేశారు.

ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులకు, అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులకు గతంలో ఎలాంటి గౌరవభృతి ఇచ్చేవారు కాదు. కానీ ఇప్పుడు ఈఆర్‌వోలకు రూ.25 వేలు, ఏఈఆర్‌వోలకు రూ.30 వేలు గౌరవభృతి ఇవ్వనున్నారు.అదేవిధంగా బీహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పేరుతో జరిగిన ఓటర్ల జాబితా అత్యవసర సవరణ కోసం పనిచేసిన బూత్‌లెవల్ అధికారులకు కూడా ఎన్నికల సంఘం రూ.6 వేలు ప్రత్యేక ఇన్సెంటివ్‌గా ప్రకటించింది.

# ఓటర్ల జాబితా ముసాయిదాలో నా పేరు లేదు: తేజస్వియాదవ్

### పాతనంబరుతో చెక్ చేసుకుని ఉంటారన్న ఎన్నికల సంఘం!



**పాట్నా, ఆగస్టు 2:** బీహార్‌శాసనసభ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా ముసాయిదాను ఎన్నికల సంఘం ప్రచురించిన సంగతి తెలిసిందే. దీనిపై విపక్షాలు తీవ్రంగా మండిపడుతున్నాయి. తాజాగా ఆర్జేడీ నేత, మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వియాదవ్ స్పందిస్తూ ఈ ముసాయిదా జాబితాలో తన పేరే లేదని ఆరోపించారు. పాట్నాలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. నా ఇపిఐసి నంబరుతో ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో చెక్ చేశా. ఈ ముసాయిదా జాబితాలో నా పేరు కనిపించలేదు. ఇక నేను ఎన్నికల్లో ఎలా పోటీ చేయాలి? స్వయంగా బూత్‌లెవల్ అధికారి నా వద్దకు వచ్చి ఫామ్ తీసుకెళ్లారు. అయినా నా పేరు జాబితాలో లేదు అని తేజస్వి వెల్లడించారు. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ అనంతరం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి దాదాపు 20 వేల మంది నుంచి 30 వేల వరకు ఓటర్లను తొలగించారని ఆర్జేడీ నేత ఆరోపించారు. మొత్తంగా రాష్ట్రంలో దాదాపు 65 లక్షల ఓటర్లను తొలగించారని పేర్కొన్నారు. అయితే తేజస్వియాదవ్ చేసిన ఆరోపణలను కేంద్ర ఎన్నికల సంఘం ఖండించింది. ముసాయిదా జాబితాలో ఆయన పేరు ఉందని పేర్కొంది. అందుకు సంబంధించిన కాపీని కూడా విడుదల చేసింది. ఆర్జేడి నేత బహుశా తన పాత ఇపిఐసి నంబరుతో చెక్ చేసుకుని ఉంటారని, అందుకే ఆయన పేరు జాబితాలో కనిపించకపోయి ఉండవచ్చని ఇసి తెలిపింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పూర్తవటంతో ఇసి ఈ ముసాయిదా జాబితాను రూపొందించింది. జాబితా నుంచి 65 లక్షల మందిని తొలగించడంతో ఓటర్ల సంఖ్య 7.93 కోట్ల నుంచి 7.28 కోట్లకు తగ్గింది. దీనిపై అభ్యంతరాలు తెలిపేందుకు సెప్టెంబర్ 1 వరకు ఇసి గడువు కల్పించింది. బీహార్‌లో ఈ యేడాది చివర్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి.

# పిఓకెలో 15పాక్ ఉగ్రశిబిరాలు: దాయాదిదేశం కొత్త వ్యూహం

### నిఘాకంటికి చిక్కకుండా సరిహద్దుల్లో నిర్మాణం

**హైదరాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త:** జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రవాద కార్యకలాపాలను మరోసారి పెంచేందుకు పాక్ భారీ వ్యూహలు రచించిందని నిఘా వర్గాలకు సమాచారం అందింది. గత ఫిబ్రవరి నెలలో జరిగిన పహల్గాం ఉగ్రదాడి తరువాత భారత్ చేబట్టిన ఆపరేషన్ సింధూర్ వల్ల పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్‌లో ఉగ్రవాద శిబిరాలు ధ్వంసం కావడం, పదుల సంఖ్యలో ఉగ్రవాదులు హతమవడం తెలిసిందే. ఆపరేషన్ సింధూర్‌లో పిఓకెలోని బవహల్‌పూర్‌లో గల జైషే మహమ్మద్ ప్రధాన కార్యాలయం, మురిద్కేలోని లష్కర్ ఏ తోయిబా శిక్షణా కేంద్రం సహా పలు ఉగ్రవాదసంస్థల కార్యాలయాలు, ఆయుధ కేంద్రాలు ధ్వంసమయ్యాయి. దీంతో తాత్కాలికంగా కాశ్మీర్‌లో ఉగ్రవాద కార్యకలాపాలకు బ్రేక్ ఇచ్చిన పాక్ తాజాగా మళ్లీ వీటిని పునరుద్ధరించేందుకు నిర్ణయించింది. ఇందుకోసం పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో 15ఉగ్రవాద శిబిరాలను నెలకొల్పింది. ఈ శిబిరాలు పిఓకెలో పాక్ మిలటరీ కేంద్రాలకు అతి సమీపంలో వున్నాయని నిఘా వర్గాలకు సమాచారం అందింది. చూసేందుకు ఉగ్రవాద శిబిరాలు కూడా మిలటరీ కేంద్రాలుగా భావించే విధంగా వున్నట్లు కేంద్ర ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబి) కూడా నిర్ధారించింది. తాజాగా ఏర్పాటైన ఉగ్రవాద శిబిరాలు ఇదివరకు వున్న చోట కాకుండా పిఓకెలోని సైనిక స్థావరాలకు అతి సమీపంలో వున్నాయని నిఘా వర్గాలకు సమాచారం అందింది. ఈ శిబిరాలు భారత నిఘా వర్గాల రాడార్లకు చిక్కకుండా నూతన టెక్నాలజిని వాడి నిర్మించినట్లు తేలింది. ఇక ప్రతి శిబిరంలో 20 నుంచి 25 ఉగ్రవాదులు వుండే విధంగా జాగ్రత్త పడుతున్నారు. ఈ శిబిరాలలో లష్కర్ ఏ తోయిబా, జేషే మహమ్మద్, హిజ్‌బుల్ ముజాహిద్దీన్ వంటి ఉగ్రవాద సంస్థలు కలిసికట్టుగా పనిచేస్తున్నట్లు నిఘా వర్గాలకు సమాచారం అందింది.

## విమానంలో చెంపదెబ్బ తిన్న ప్రయాణికుడు అదృశ్యం!



**న్యూఢిల్లీ, ఆగస్టు 2:** ఇండిగో విమానంలో ఓ ప్రయాణికుడు, మరో ప్రయాణికుడిపై భౌతిక దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు వైరల్ అయ్యాయి. ఈ క్రమంలో విమానంలో చెంపదెబ్బ తిన్న ప్రయాణికుడు అదృశ్యమైనట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని అతడి కుటుంబ సభ్యులు తెలిపినట్లు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. చెంపదెబ్బ తిన్న వ్యక్తి అస్సాంలోని కాచార్ జిల్లాకు చెందిన హుస్సేన్ అహ్మద్ మజుందార్‌గా అతడి కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఈ ఘటన అనంతరం అతడు ఇంటికి రాలేదని, ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తోందని తెలిపారు. హుస్సేన్ ముంబయిలోని ఓ హోటల్‌లో పనిచేస్తున్నాడు. పలుమార్లు ఇదే మార్గంలో ఇంటికి వచ్చేవాడు. ఎప్పటిలాగానే అతడి కోసం ఎయిర్‌పోర్టుకు వెళ్లాం. అయితే అతడు కనిపించలేదు. ఆ తర్వాత వైరల్ అయిన వీడియో ద్వారా గొడవ తెలిసింది. తర్వాత హుస్సేన్ ఆచూకీ కోసం ఎంత ప్రయత్నించినప్ప టికీ తెలియలేదు అని హుస్సేన్ తండ్రి అబ్దుల్ మన్నన్ మజుందార్ పేర్కొన్నారు. విమానాశ్ర యంలోని కేంద్రపారిశ్రామిక భద్రతాదళం అధికారులకు సమాచారం ఇచ్చామని, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు.



## 19వ పిఎం కిసాన్ నిధులు విడుదల చేసిన ప్రధాని మోడీ

### 9.7 కోట్ల మంది రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ

**వారణాసి,ఆగస్టు 2:** దేశవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది రైతులకు ప్రధాని నరేంద్ర మోడీ శుభవార్త అందించారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకంలో భాగంగా 20వ విడత ఆర్థిక సాయాన్ని శనివారం విడుదల చేశారు. ప్రస్తుతం ఉత్తరప్రదేశ్ పర్యటనలో ఉన్న ప్రధాని, వారణాసిలో జరిగిన ఓ కార్యక్రమంలో బటన్ నొక్కి నిధులను రైతుల ఖాతాల్లోకి బదిలీ చేశారు. ఈ విడతలో భాగంగా సుమారు 9.7 కోట్ల మంది అర్హులైన రైతుల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా రూ.20,500 కోట్లు జమ అయ్యాయి. రైతులకు పంట పెట్టుబడి ఖర్చుల భారాన్ని తగ్గించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఏటా రూ.6,000 చొప్పున ఆర్థిక సాయాన్ని అందిస్తోంది. ఈ మొత్తాన్ని మూడు సమాన వాయిదాల్లో, అంటే ప్రతి నాలుగు నెలలకు ఒకసారి రూ.2,000 చొప్పున నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తోంది. తాజా విడుదలతో అన్నదాతలకు వ్యవసాయ పనుల కోసం కీలకమైన పెట్టుబడి సాయం అంది నట్లయింది. ఈ పథకం కింద 19వ విడత నిధులను కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరిలో విడుదల చేసింది. ఆ సమయంలో బీహార్‌లోని భాగల్‌పూర్‌లో జరిగిన కార్యక్రమంలో దాదాపు 9.8 కోట్ల మంది రైతులకు రూ.22 వేల కోట్లకు పైగా సాయాన్ని అందించింది. ఇప్పటివరకు ఈ పథకం ద్వారా 19 విడతల్లో సుమారు 11 కోట్ల మంది రైతులకు రూ.3.46 లక్షల కోట్లకు పైగా ఆర్థిక చేయూత లభించినట్లు అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

వారణాసి పర్యటనలో భాగంగా మోదీ దాదాపు రూ.2,200 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించడంతోపాటు శంకుస్థాపన చేశారు. వీటిలో రోడ్లు, ఆసుపత్రులు, స్కూళ్ల సహారకరకాల మౌలిక సదుపాయాలు ఉన్నాయి. ఈ ప్రాజెక్టులు వారణాసి ప్రజల జీవితాలను మరింత మెరుగుపరుచనున్నాయి. ఈ అభివృద్ధి ప్రాజెక్టులు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలను కూడా పెంచబోతున్నాయని తెలిపారు. ఇలాంటి ప్రాజెక్టులు రైతుల జీవితాలు, గ్రామీణ భారతాన్ని మరింత బలోపేతం చేస్తాయన్నారు. మోడీ మాట్లాడుతూ, మీరు దేశానికి అన్నం పెట్టే అన్నదాతలు. మీ సంక్షేమం కోసం మేం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటామన్నారు. రైతులకు నగదు విడుదల చేసిన సందర్భంగా మరో పథకం గురించి కూడా మోడీప్రస్తావించారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన. ఈ పథకం ద్వారా పంటకు నష్టం జరిగితే బీమా సంస్థ పరిహారం ఇస్తుందని గుర్తు చేశారు. ఈ స్కీం ద్వారా ఇప్పటివరకు రైతులకు రూ.1.75 లక్షల కోట్లకు పైగా విలువైన క్లెయిమ్‌లు ఇచ్చినట్లు ప్రస్తావించారు. పంట బీమా తీసుకోని వారు వెంటనే తీసుకోవాలన్నారు.

## అణు జలాంతర్గాముల మోహరింపునకు ట్రంప్ ఆదేశం



**వాషింగ్టన్, ఆగస్టు 2:** రష్యాకు చేరువలోని సముద్రజలా ల్లో రెండు అణు జలాంతర్గాములను మోహరిం చాలని తమ నౌకాదళాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ ఆదేశించారు. రష్యా మాజీ అధ్యక్షుడు దిమిత్రీ మెద్వదేవ్ చేస్తున్న హెచ్చరికలకు ప్రతిస్పందనగా ఈ చర్యను చేప ట్టినట్లు ఆయన సామాజిక మాధ్యమం 'ట్రూత్ సోషల్'లో ప్రకటించారు. 'ఒకవేళ ఆ రెచ్చగొట్టే వ్యాఖ్యల వెనుక ఏదైనా ఉద్దేశాలు ఉంటే వాటికి సన్నద్ధమయ్యేందుకు ఇలా చేశా. మాటలు ము ఖ్యం. వాటివల్ల కొన్నిసార్లు అవాంఛిత పరిణ మాలు తలెత్తవచ్చు. ప్రస్తుత అంశంలో ఇలాం టివి జరగవని ఆశిస్తున్నా' అని తెలిపారు. ఉక్రె యిన్ అంశంలో కాల్పుల విరమణకు 10 రోజు ల్లో ముం దు కు రావాలని ట్రంప్ రష్యా కు హెచ్చరిక చేసిన నేప థ్యంలో మె ద్వదేవ్ స్పందించారు. రష్యా వద్ద సోవియట్ హయాంనాటి అణు దాడి సామర్థ్యం ఉందన్నారు. కొత్తగా అభివృద్ధి చేసిన ఒరెష్నిక్ హైపర్‌సోనిక్ క్షిపణుల ఉత్పత్తిని ప్రారంభించామని రష్యా అధ్యక్షుడు పుతిన్ శుక్రవారం తెలిపారు. వాటిని తమ సైన్యంలో ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నారు.

# సంక్షిప్తంగా..

## హాస్టల్ పైనుంచి దూకి ఐఐటి బాంబే విద్యార్థి ఆత్మహత్య



**ముంబై, ఆగస్టు 2:** మహారాష్ట్రలోని ప్రతిష్టాత్మక విద్యా సంస్థ ఐఐటి బాంబేకు చెందిన విద్యార్థి హాస్టల్ టెర్రస్ పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆ సమయంలో మరో విద్యార్థి అక్కడ ఫోన్‌లో మాట్లాడుతున్నట్లు పోలీసులు తెలుసుకున్నారు. ఢిల్లీకి చెందిన రోహిత్ సిన్హా (26) ఐఐటి బాంబేలో చదువుతున్నాడు. మెటలర్జికల్ ఇంజినీరింగ్,మెటీరియల్స్ సైన్స్ కోర్సు నాలుగో సంవత్సరంలో ఉన్నాడు. కాగా, శనివారం తెల్లవారుజామున 2.30గంటల సమయంలో హాస్టల్ భవనం టెర్రస్ పైనుంచి రోహిత్‌సిన్హా కిందకు దూకాడు. తీవ్రంగా గాయపడిన ఆ విద్యార్థిని వెంటనే హాస్పిటల్‌కు తరలించారు. అయితే అతడు అప్పటికే మరణించినట్లు డాక్టర్లు తెలిపారు. మరోవైపు ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. రోహిత్ ఆత్మహత్యపై కేసు నమోదు చేశారు.అతడు ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడు అన్న దానిపై దర్యాప్తు చేస్తున్నారు.

## జమ్ములో మరో ఎన్‌కౌంటర్, కీలక ఉగ్రవాది హతం

**జమ్ము, ఆగస్టు 2:** జమ్మూ కశ్మీర్‌లో మన భద్రతా బలగాలు మరోసారి తమ శక్తిని చూపించాయి. కుల్గాం జిల్లాలోని అఖల్ ప్రాంతంలో జరిగిన ఒక ఎన్‌కౌంటర్‌లో మన సైన్యం ఒక కీలక ఉగ్రవాదిని హతమార్చింది. దక్షిణ కశ్మీర్‌లోని అటవీ ప్రాంతంలో కొంతమంది ఉగ్రవాదులు దాక్కున్నారనే సమాచారం అందింది. ఈ సమాచారం ఆధారంగా భారత సైన్యం, జమ్మూ కశ్మీర్ పోలీసులు, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ కలిసి ఒక సంయుక్త ఆపరేషన్‌ను ప్రారం భించాయి. ఈ ఆపరేషన్‌లో భాగంగా వారు అఖల్ ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ చర్యలు చేపట్టారు. ఈ గాలింపు సమయంలో ఉగ్రవాదులు హఠాత్తుగా భద్రతా దళాలపై కాల్పులు జరిపారు. మన సైనికులు ఏమాత్రం వెనక్కి తగ్గలేదు. వారు వెంటనే ప్రతిస్పందించి, ఒక ఉగ్రవాదిని హతమార్చారు. మరో ఇద్దరి నుంచి ముగ్గురు ఉగ్రవాదులు ఆ ప్రాంతంలో దాక్కుని ఉన్నారని అనుమానం ఉంది. ఈ క్రమంలో భద్రతా దళాలు గాలింపు చర్యలను ముమ్మరం చేశాయి.

## మలయాళ నటుడు కళాభవన్ నవాస్ మృతి



**కొచ్చి,ఆగస్టు 2:** ప్రముఖ మలయాళ నటుడు, మిమిక్రీ కళాకారుడు కళాభవన్ నవాస్ (51) కొచ్చిలో నిన్న గుండెపోటుతో మరణించారు. 'ప్రకంబణం' అనే సినిమా షూటింగ్ నిమిత్తం చోటానికరలోని ఒక హోటల్‌లో బస చేసిన ఆయన, షూటింగ్ పూర్తయిన తర్వాత తన గదిలో అపస్మారక స్థితిలో కనిపించారు. వెంటనే ఆసుపత్రికి తరలించినప్పటికీ, అప్పటికే ఆయన మరణించినట్టు వైద్యులు ధ్రువీకరించారు. గుండెపోటు కారణంగానే ఆయన మరణించి ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. మరణానికి కచ్చితమైన కారణం తెలుసుకోవడానికి నేడు కలమస్సేరి ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రిలో పోస్ట్‌మార్టం నిర్వహించనున్నారు. నిన్న సాయంత్రం 5.30 గంటలకు షూటింగ్ ముగించుకుని హోటల్‌కి వచ్చిన నవాస్, రెండు రోజుల విరామం ఉన్నందున ఇంటికి వెళ్లాలని అనుకున్నారు. అయితే, చెక్‌అవుట్ సమయానికి ఆయన గది నుంచి బయటకు రాకపోవడంతో, సిబ్బంది తలుపు తెరిచి చూడగా ఆయన స్పృహ కోల్పోయి ఉన్నారు. నవాస్ 1974లో కేరళలోని వడక్కంచెరిలో జన్మించారు. ఆయన తండ్రి అబూ బక్కర్ కూడా నటుడే.

## కేరళ క్రైస్తవ నన్స్‌కు షరతులతో బెయిల్



**నయారాయ్‌పూర్, ఆగస్టు 2:** మానవ అక్రమ రవాణాకు, బలవంతపు మత మార్పిడిలకు పాల్పడుతున్నారనే ఆరోపణలతో గత వారం ఛత్తీస్‌గఢ్‌లో అరెస్టయిన ఇద్దరు కేరళ సన్యా సినిలకు నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీకి చెందిన ప్రత్యేకకోర్టు షరతులతో కూడిన బెయిల్ మం జూరు చేసింది. అందుకు ఇద్దరు సన్యాసినిలు వారి పాస్‌పోర్టులను సరెండర్ చేయాలని, ఒక్కొక్కరు రూ.50వేల చొప్పున పూచీకత్తు పెట్టాలని, ఒక్కొక్కరికి ఇద్దరు వ్యక్తుల చొప్పున ష్యూరిటీ ఇవ్వాలని కోర్టు షరతులు విధించింది. కాగా కేరళకు చెందిన ఆ ఇద్దరు సన్యాసినిలు ముగ్గురు గిరిజన బాలికలను మతమార్పిడి చేయించేం దుకు ప్రయత్నించారని బజరంగ్‌దల్, హిందూ వాహిని సంఘాల ప్రతినిధులు పోలీసులకు ఫిర్యాదుచేశారు. దాంతో గత నెల 25న పోలీ సులు ఆ ఇద్దరు సన్యాసినులను అరెస్ట్ చేశారు. బెయిల్ కోసం సన్యాసినిలు ముందు దుర్గ్‌లోని సెషన్స్ కోర్టును ఆశ్రయించారు. అయితే వారి బెయిల్‌పిటిషన్‌లను సెషన్స్‌కోర్టు తోసిపుచ్చింది.

03-8Pg6exHMNWJQE_03-8Pg6exHMNWJQE.qxd 8/3/2025 12:52 AM Page 1



# రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వం అజెండా: ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



**కోవూరు (నెల్లూరు), ఆగస్టు 2, ప్రభాతవార్త :** రైతులకు సహాయం భారం కాదు.. బాధ్యతగా గుర్తించిన ఏకైక వ్యక్తి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడే అని , తెలుగుదేశం పార్టీ జెండాలోనే నాగలి ఉందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. కోవూరులోని పీవీఆర్ కళ్యాణ మండపంలో శనివారం అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్‌తో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం పాటుపడడం తెలుగుదేశం పార్టీ సిద్ధాంతమన్నారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా కోవూరు నియోజకవర్గంలో 16938 రైతులకు వారి వారి ఖాతాల్లో 11,06,94000 రూపాయలు జమ కావడం జరుగుతుందన్నారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా నేడు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాల ద్వారా తొలి విడతగా రైతుల ఖాతాల్లో 7 వేలు నిధులు జమ చేయడం జరుగుతుందన్నారు. అర్హతగా ఉండి అన్నదాత సుఖీభవ అందని రైతులు ఏదైనా సాంకేతిక సమస్యల కారణంగా తమ ఖాతాలో డబ్బులు జమ కాకుంటే స్థానిక నాయకులు, వ్యవసాయాధికారులతో సమన్వయం చేసుకుని రైతులకు సహాయ పడాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యానవన శాఖ ద్వారా రైతులకు 90 శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలు, యంత్ర పరికరాలను అందజేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం రైతులకు 12,500 ఇస్తామని ప్రకటించి కేవలం 7500 మాత్రమే ఇచ్చిందన్నారు. గతంలో ధాన్యం అమ్మిన డబ్బులు కోసం రైతులు ఉద్యమాలు చేయాల్సిన పరిస్థితి ఉండేదని కూటమి ప్రభుత్వం వచ్చాక 48 గంటల్లోనే ధాన్యం డబ్బులు చెల్లిస్తున్నామన్నారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 18 ఏళ్ల తర్వాత జూలై నెలలోనే ప్రాజెక్టులన్నీ నీటితో కళకళలాడుతున్నాయన్నారు. ఇప్పటికే శ్రీశైలం ప్రాజెక్టు జులై నెలలోనే రెండు సార్లు నిండిపోయిందన్నారు. నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులను శరవేగంగా పూర్తి చేసి 2026 చివరికల్లా వెలిగొండ, 2027 నాటికి పోలవరం పూర్తి చేస్తామని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. గత ప్రభుత్వంలో డ్రిప్ ఇరిగేషన్ రంగం నాల్గవ స్థానంలోకి పడిపోగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మళ్లీ దేశంలో మొదటి స్థానంలో ముఖ్యమంత్రి నిలబెట్టారన్నారు. కౌలు రైతుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ వారి జీవితాలను ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా 3826 కోట్లు పంట రుణాలను మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ నెలలోనే మరో సూపర్ సిక్స్ హామీకి ముఖ్యమంత్రి శ్రీకారం చుడుతున్నారన్నారు. మహిళలకు ఫ్రీ బస్సు ఇచ్చి ఆ హామీని నెరవేరుస్తున్నారన్నారు. ప్రజలకు కూటమి ప్రభుత్వంపై రోజురోజుకూ విశ్వాసం పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా రైతులకు భారీ చెక్కును అందజేశారు. అనంతరం రైతులకు శాలువా, పూలమాలతో సత్కరించి సన్మానం చేశారు.

# దుర్గమ్మవారి సేవలో కేంద్రమంత్రి గడ్కరి



కేంద్రమంత్రి నితిన్ గడ్కరికి దుర్గమ్మవారి చిత్రపటం అందిస్తున్న ఇఓ

**ఇంద్రకీలాద్రి, ఆగస్టు 2, ప్రభాతవార్త** దుర్గమ్మ వారిని శనివారం కేంద్రమంత్రి నితిన్‌గడ్కరి దర్శించుకున్నారు. ఆయనతో పాటు ఎంపిలు సిఎం రమేష్, టి కృష్ణ ప్రసాద్, రాష్ట్ర మంత్రులు అనగాని సత్య కుమార్ యాదవ్, బిసి జనార్ధనరెడ్డి, ఎమ్మెల్యే డా పార్థసారథి, ఏపి బిజెపి నేత పి మాధవ్, టిటిడి బోర్డు సభ్యుడు భాను ప్రకాష్, ఇతర బిజెపి నేతలు కూడా దుర్గమ్మవారిని దర్శించుకున్నారు. వారికి ఇఓ వికె శీనా నాయక్ దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు. దుర్గమ్మ ఆలయంలో జరిగే ఉచిత ప్రసాదం పంపిణీకి రు.1,01,116లను గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన బి విశ్వనాథ శాస్త్రి, మహాలక్ష్మి దంపతులు విరాళంగా శనివారం అందించారు. వరంగల్‌కు చెందిన ఎం జయలక్ష్మి కుటుంబీకులు రు.1,01,116ల విరాళాన్ని ఆలయాధికారులకు అందించారు. దాతలకు, వారి కుటుంబసభ్యులకు దుర్గమ్మవారి దర్శనం ఏర్పాటు చేసిన అధికారులు, దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

## బసవతారకం ఇండోఅమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి నిర్మాణానికి 13న సిఎం చంద్రబాబు శంకుస్థాపన

### హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ

**విజయవాడ,ఆగస్టు2,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలోబసవతారకం ఇండోఅమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి నిర్మాణానికి ముహూర్తం ఖరారు చేసినట్టు ఆ సంస్థ అధినేత,ఎంఎల్ఏ నందమూరి బాలకృష్ణ తెలిపారు.ఈ ఆస్పత్రి నిర్మాణానికి ఈ నెల 13న సీఎం చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేయనున్నారన్నారు. రాజధాని అమరావతి ప్రాంతంలోని తుళ్లూరు మండలం.అనంతవరంలో హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పర్యటించారు. బసవతారకం ఇండోఅమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి నిర్మాణానికి ప్రభుత్వం కేటాయించిన 20 ఎకరాల భూమిని ఆయన స్వయంగా పరిశీలించారు.

ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ బాలకృష్ణ మాట్లాడుతూ భగవంత్ కేసరి సినిమాకి ఉత్తమ తెలుగు చిత్రం విభాగంలో జాతీయ అవార్డు రావడం గర్వకారణమని చెప్పారు. మహిళా సాధికారతపై బలమైన సందేశం ఇచ్చే చిత్రంగా భగవంత్ కేసరి నిలిచిందని పేర్కొన్నారు.

## నేటి నుంచి ఎన్ఎస్ యులో భాషోత్సవ జాతీయ సదస్సు

### - వర్సిటీలో 14వరకు డేస్ స్కాలర్స్ కు స్పాట్ అడ్మిషన్లు - ఈ యేడాది వర్సిటీలో ఐకేఎస్ నూతన కోర్సు ప్రారంభం - మీడియాతో విసి జీఎస్ఆర్ కృష్ణమూర్తి



**తిరుపతి విద్య ఆగస్టు 2 ప్రభాత వార్త** జాతీయ సంస్కృత వర్సిటీ,ఉత్కల పీఠం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నుంచి మూడు రోజుల పాటు ప్రస్థానత్రయంలో భాషోత్సవం పేరుతో జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి తెలిపారు.శనివారం వర్సిటీలో ఆయన " మీడియాతో మాట్లాడుతూ సంస్కృత విద్యాపీఠం నుంచి అంచెలంచెలుగా ఎదుగుతూ జాతీయ విశ్వవిద్యాలయంగా అవతరించిందన్నారు. వర్సిటీలో ఎన్ఈపి2020 విధానాన్ని అమలు చేస్తూ పలు నూతన కోర్సులను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. డిగ్రీ ఆనర్స్ తో పాటు రీసెర్చ్ ఓరియెంటెడ్ ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సులు నడుపుతున్నామన్నారు.అలాగే వర్సిటీలో యూజీ,పీజీ కోర్సులలో పదుల సంఖ్యలో మిగిలి ఉన్న సీట్లకు ఈనెల 14వ తేదీ వరకు కేవలం డేస్కాలర్స్ కి స్పాట్ అడ్మిషన్లు కల్పించనున్నట్లు తెలిపారు.స్థానిక విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాటే ఎన్ ఎస్ యూలో ఈ ఏడాది నుంచి యూజీ, పీజీలో ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్ (ఐకేఎస్) కోర్సును నూతనంగా ప్రవేశపెట్టడం జరిగిందన్నారు.వర్సిటీలో నిర్మించిన శ్రీ స్వామినారాయణ సంప్రదాయ అక్షరపురుషోత్తమ మందిరాన్ని సైతం ఆదివారం జాతీయ సదస్సుకు హాజరయ్యే ప్రముఖులు ఆవిష్కరిస్తారని తెలిపారు.అలాగే సదస్సుకు వీసీలు, ఒరిస్సా గవర్నర్,ఉత్తరాఖండ్ సీఎం హాజరవుతారని చెప్పారు.అలాగే స్వామి నారాయణ సంప్రదాయ సంస్థలతో విశ్వవిద్యాలయం పరస్పర అవగాహనా ఒప్పందం చేసుకుని అమెరికా,ఇగ్లండ్, అబుదబి,నేపాల్లో ఉన్నటువంటి సంస్థలతో కలిసి విశేష పరిశోధనలు జరపనున్నట్లు తెలిపారు.

# అలిపిరి 'ఆర్చి'పై అసత్యాలు!

## - పాతరంగులున్న ఆర్చితో హల్‌చల్



**తిరుమల,ఆగస్ట్ 2ప్రభాత వార్తప్రతి నిధి:** ఆధ్యాత్మికత ఉట్టిపడేలా కొన్ని వందల సంవత్సరాల క్రిందట నిర్మించిన అలిపిరి ప్రధాన ప్రవేశమార్గం ఆర్చిపై భాగంలో గంధర్వులు పుష్పమాలలు చేతబట్టిన రూపంలో ఉన్నవాటిని "అన్యమతబొమ్మలు" గా ఇప్పుడు అసత్యాలు ప్రచారం జరిగింది. అసలు ఎవరూ ఊహించని రీతిలో అక్కడ ఎలాంటి మార్ఫింగ్ చేయడానికిగానీ, ఇతరులు ఎవరూ కనీసం గుర్తులు చెరిపివేయడానికి గానీ అవకాశం లేదు. 24గంటలూ నిఘా నేత్రాల పర్యవేక్షణతోబాటు విజిలెన్స్ సిబ్బంది పహారా ఉంటుంది. ఆర్చిపై భాగంలో ఈ గంధర్వుల బొమ్మలు రూపం మార్చడానికి ఇనుప నిచ్చెనలుగానీ, ఎత్తయిన బల్లలు గానీ వాడాల్సి ఉంటుంది. అలాంటిది ఏ మాత్రం నమ్మశక్యంలేని ఈ దుష్ప్రచారం సామాజిక మాధ్యమాల్లో ప్రచారం కావడంతో టిటిడి అధికారులు స్పందించారు. పైగా అలిపిరి ప్రవేశమార్గం ఆర్చి లేతనీలం బూడిదరంగు కలసిన రంగులతో ఉంటుంది. కానీ సామాజిక మాధ్యమాల్లో ఎప్పుడో రెండు దశాబ్ధాల క్రిందట ఉన్న లైట్‌ఆరంజ్‌రంగున్న ఆర్చిని పెట్టి అన్యమత బొమ్మలంటూ దుష్ప్రచారం చేశారు. ఇదీ కొన్నినిమిషాల్లోనే పెద్ద దుమారం రేగింది. ఇప్పుడు అలిపిరి ప్రవేశమార్గం ఆర్చి ఉన్న రంగుకు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేసిన రంగుకు తేడా ఉండటంతో ఎవరో పనిగట్టుకుని దుష్ప్రచారం చేశారనేది టిటిడి విజిలెన్స్ అధికారులు తేల్చేశారు. అలిపిరి ప్రవేశమార్గంలో ఆర్చిపై అన్యమత బొమ్మలున్నట్లు అసత్యప్రచారం చేయడం బాధాకరమని టిటిడి ఖండించింది. ఆర్చిపై భాగంలో గంధర్వులు చేతిలో పూలమాలలు ధరించిన బొమ్మలు ఉన్నాయి. సప్తగిరి తనిఖీకేంద్రానికి ముందే అలిపిరి గరుడ కూడలి దాటిన తరువాత వచ్చే ప్రధాన ప్రవేశమార్గం ఆర్చి కొన్ని వందల సంవత్సరాల క్రిందట నిర్మించింది. సనాతన హైందవ ధర్మాన్ని ప్రతిబింబించే శిల్పాల రూపంలో ఎస్వీశిల్పకళాశాల నిపుణుల సూచనలతో తీర్చిదిద్దారు. అన్యమత శిల్పాలూ చిత్రీకరించి అవాస్తవాలు ప్రచారం చేయడం విచారకరమని టిటిడి తెలిపింది. భక్తుల మనోభావాలను గాయపరిచే విధంగా అసత్యకథనాలను ప్రసారం చేసిన వ్యక్తులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని టిటిడి హెచ్చరించింది.

# రైల్లో గంజాయి చాక్లెట్లు పట్టివేత

## - ఒరిస్సా నుంచి బెంగళూరు వెళ్తున్న వ్యక్తి వద్ద నుంచి స్వాధీనం

**అనంతపురం, ఆగస్టు 2 ప్రభాతవార్త బ్యూరో** ఒడిస్సా నుండీ బెంగుళూరుకు అక్రమంగా తీసికెళ్తున్న గంజాయి చాక్లెట్లు పట్టుకుని ఒకరి అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాల మేరకు..జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాలతో రైళ్లలో త్రీటౌన్ పోలీసులు, ఈగల్ సెల్, జీఆర్పీ, రైల్వే పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శనివారం ఉదయం గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు అనంతపురం జిల్లాలో ప్రత్యేక గంజాయి చెకింగ్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఈగల్ సెల్, అనంతపురం 3 టౌన్ పోలీస్, రైల్వే పోలీస్ బృందాలు సంయుక్తంగా పాల్గొన్నాయి. ఈ తనిఖీలు అనంతపురం నుండి ధర్మవరం వెళ్ళే 18463 నెంబర్ ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైలు (ఆరంభ సమయం ఉదయం 6:20 గంటలకి)లో చేపట్టారు. తనిఖీల సందర్భంగా ఒడిషాకు చెందిన సాల్మన్ అనే ప్రయాణికుడి వద్ద గంజాయి పదార్థం కలిగిన 219 చాక్లెట్లు పట్టుకున్నారు. పట్టుబడిన వ్యక్తి వద్దగల గంజాయి పదార్థం కలిగిన చాక్లెట్లు రైల్వే పోలీసులు స్వాదీనం చేసుకున్నారు. ప్రస్తుతం రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి మరింత దర్యాప్తు జరుపుతున్నట్లు వారు తెలిపారు. గంజాయి వంటివి మానసిక ఆరోగ్యానికి హానికరమైనవిగా ఉండటంతో, వాటి వినియోగాన్ని, రవాణాను నిరోధించేందుకు ఈగిల్ సెల్ నిరంతరం చర్యలు తీసుకుంటోంది. ప్రజలు కూడా ఇలాంటి నేరాలను గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

# దేశంలోనే విశిష్ట నమూనాగా ట్రిపుల్ ఐటీ-శ్రీసిటీ

## స్నాతకోత్సవంలో ప్రభుత్వ గౌరవ సలహాదారు డా. సతీష్‌రెడ్డి



**సత్యవేడు, ఆగస్టు 2 ప్రభాతవార్త:** రిశ్రామిక కేంద్రం నడుమ ట్రిపుల్ ఐటీ-శ్రీసిటీ వంటి జాతీయ విద్యా సంస్థ ఏర్పాటు కావడం, దేశంలోనే ఓ విశిష్ట నమూనాగా డీఆర్‌డీవో మాజీ చైర్మన్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ గౌరవ సలహాదారు(ఏరోస్పేస్, డిఫెన్స్) డాక్టర్ జి.సతీష్ రెడ్డి వ్యాఖ్యనించారు. ట్రిపుల్ ఐటీ-శ్రీసిటీ 2025(9వ బ్యాచ్) స్నాతకోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. మొత్తం 318 మంది విద్యార్థులకు ట్రిపుల్ ఐటీ-శ్రీసిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం.వి.కార్తీకేయన్ పట్టాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సతీష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కాగా, గవర్నింగ్ బోర్డు సభ్యుడు శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, ట్రిపుల్ ఐటీ-తిరుపతి డైరెక్టర్ డాక్టర్ కె.ఎన్.సత్యనారాయణ, ఇతర సెనేట్ సభ్యులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. సతీష్‌రెడ్డి స్నాతకోత్సవ ప్రసంగంలో ట్రిపుల్ ఐటీ-శ్రీసిటీ కోయంబత్తూరు టెక్స్‌టైల్స్ క్లస్టర్ లాంటి పర్యావరణ వ్యవస్థను కలిగి ఉంది. ఇక్కడ విద్యాసంస్థ, పరిశ్రమ కలిసి అభివృద్ధి చెందుతాయి. ఈ వ్యూహాత్మక ప్రయోజనాన్ని ఉపయోగించుకోవాలని, వికసిత్ భారత్‌ను నిర్మించడంలో అందరూ భాగస్వాములు కావాలని, ఆవిష్కరణ, పరిశోధన, పరిశ్రమ స్థాపన దిశగా ముందుకు సాగాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ స్నాతకోత్సవంలో కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగాల్లో 309 మందికి బీటెక్ పట్టాలను, 9 మందికి పీహెచ్‌డీలను ప్రదానం చేశారు. వీరిలో 18మంది రీసెర్చ్ స్కాలర్స్‌కు పట్టాలు ప్రదానం చేయగా, మరో ముగ్గురు ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులు బంగారు పతకాలను అందుకున్నారు. స్నాతకోత్సవ కార్యక్రమంలో పట్టభద్రులు తమ అధ్యాపకులను, స్నేహితులు, జూనియర్లను ఆత్మీయంగా కలసి గత స్మృతులను స్మరించుకున్నారు.

## వివిధ సమస్యలపై 7 నుంచి దశల వారి ఆందోళన

### డిగ్రీ కళాశాలల అధ్యాపకుల జెఎసి

**విజయవాడ,ఆగస్టు2,ప్రభాతవార్తప్రతినిధి:** వివిధ సమస్యలపై దశలవారీగా నిరసనలు చేపట్టేందుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకుల జేఏసీ పిలుపునిచ్చింది. ఈనెల 7న నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరుకావాలని, 11వ తేదీ నుంచి భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని, 18న విజయవాడలోని ధర్నాకు హాజరుకావాలని లెక్చరర్లను కోరింది."ఎన్నిసార్లు అడిగినా డిగ్రీ అధ్యాపకుల బదిలీలు చేపట్టడంలేదు. గతంలో ఎయిడెడ్ కాలేజీలకు గ్రాంట్ నిలిపివేసినప్పుడు జీవో 42 తీసుకొచ్చిన ప్రభుత్వ లెక్చరర్ పోస్టుల్లో ఎయిడెడ్ లెక్చరర్లను నియమించింది. అనంతరం ఎయిడెడ్ కాలేజీలకు గ్రాంట్ పునరుద్ధరించినా వారిని అక్కడే కొనసాగిస్తోంది. దీనిపై ఎన్నిసార్లు ప్రభుత్వానికి మొరపెట్టుకున్నా స్పందించలేద్ధు అని శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 26 రాష్ట్రాల్లో డిగ్రీ అధ్యాపకులను అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లు, ప్రొఫెసర్లుగా మార్చారని, ఏపీలో ఇప్పటికీ అధ్యాపకులుగానే కొనసాగిస్తున్నారని తెలిపారు.

# వృద్ధుల నేత్ర సంరక్షణ కేంద్రం ప్రారంభం



**విజయవాడ, ఆగస్టు 2, ప్రభాతవార్త :** ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ కోడె వెంకటాద్రి చౌదరి క్యాంపస్ వద్ద నున్న ఎల్‌వి ప్రసాద్ నేత్ర వైద్యశాలలో కె సూర్య నారాయణమ్మ, డా కె ఎల్‌వి ప్రసాద్ పేరిట వృద్ధుల నేత్ర సంరక్షణా కేంద్రం శనివారం రిటైర్డ్ ఐఎఎస్ అధికారి కాసరనేని దమయంతి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఎల్‌విపిఈఐ వ్యవస్థాపక చైర్మన్ డా జిఎన్ రావు, వృద్ధుల నేత్ర సంరక్షణా కేంద్రం నెట్వర్క్ ఇన్చార్జ్ డా అవినాష్ పతంగి ఇతర ప్రముకులు హాజరయ్యారు. ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల విజయవాడ క్యాంపస్ హెడ్ డా అనసువా కపూర్ మాట్లాడుతూ ఈ వృద్ధుల కేంద్రం విశాఖపట్నంలోని సంధ్యా మెరైన్స్ సామాజిక సేవా బాధ్యత ప్రేరణగా అందిస్తున్న మద్దతుతో సేవలందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో దాతల కుటుంబం సంధ్యా మెరైన్స్ లిమిటెడ్ యాజమాని ఆనంద కుమార కొండ్రగుంట, వారి తండ్రి డా కెవి ప్రసాద్ లు పాల్గొన్నారు.

## విద్యుత్ ఛార్జీలు పెంచడం లేదంటూనే ట్రూ యా ప్ పేరుతో మరో రూ.12,771 కోట్ల భారాన్ని ప్రజలపై మోపారు

### - సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

**విజయవాడ.ఆగస్టు2,ప్రభాతవార్తప్రతినిధి:**విద్యుత్ ఛార్జీలు పెంచడం లేదంటూనే ట్రూ అప్ పేరుతో మరో రూ.12,771 కోట్ల భారాన్ని ప్రజలపై మోపడాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు దారుణమన్నారు. తక్షణం దీన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యుత్ ఛార్జీల పెంపుదలకు వ్యతిరేకంగా ట్రూ అప్ ఇంధన సర్దుబాటు ఛార్జీల విధానం రద్దు చేయాలని, స్మార్ట్‌మీటర్లు వద్దని ఈ నెల 5న ప్రజావేదిక ఆధ్వర్యాన జరిగే ధర్నాలను జయప్రదం చేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ ప్రజలకు విజ్ఞప్తి చేసిందని తెలిపాఉ. 2019-20 నుంచి 2023-24 సంవత్సరాలకు సంబంధించి విద్యుత్ రిటైల్ వ్యాపార లోటు రూ.12,771 కోట్లు ట్రూ అప్ భారం వేయడానికి విద్యుత్ పంపిణీ సంస్థలు నియంత్రణ మండలికి ప్రతిపాదనలు పంపి బహిరంగ ప్రకటన చేశాయని తెలిపారు. రాష్ట్రప్రభుత్వానికి తెలియకుండా ఇది జరగదని, ప్రభుత్వం వెంటనే స్పందించి ఛార్జీల పెంపుదలను నిలిపేయాలని కోరారు. గత 36 నెలల నుంచి 2014-19 కాలానికి సంబంధించి రూ.3 వేల కోట్లు ట్రూఅప్ వసూలు చేశారని వివరించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత 2022-23, 2023-24 సంవత్సర కాలానికి రూ.15,485 కోట్లు సర్దుబాటు ఛార్జీల భారం మోపారని పేర్కొన్నారు. అదీగాక 2024-25 సంవత్సరానికి ప్రతినెలా యూనిట్‌కు 40 పైసలు చొప్పున ఒక్క సంవత్సరం లోనే రూ.2,787 కోట్లు వసూలు చేశారని వివరించారు. స్మార్ట్‌మీటర్ల వల్ల అదనపు భారాలు సిద్ధంగా ఉన్నాయని, గత ప్రభుత్వం వేసిన విధంగా విద్యుత్ భారాలు వేయబోమని, తగ్గిస్తామని కూటమి పార్టీలు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాయని పేర్కొన్నారు. కూటమి సర్కార్ మాట తప్పి భారాలు మోపిందని ప్రజలు ఆందోళన చెందుతున్నారని వివరించారు. ఇటీవల రూ.449 కోట్లు ట్రూడౌన్ ద్వారా ఛార్జీలు తగ్గిస్తామని ప్రచారం చేశారు. మూడు డిస్కంల పరిధిలో సగటున మిగులు ఉందని కూడా చూపెట్టారు.

## ఉమ్మడి పాలమూరులో 8 మంది పంచాయతీ సెక్రెటరీల సస్పెన్షన్

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 2, ప్రభాతవార్త:** ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ఎనిమిది మంది పంచాయతీ సెక్రెటరీలు సస్పెన్షన్‌కు గురయ్యారు. వివరాల్లోకి వెళ్తే..వనపర్తి జిల్లా పరిధిలో పనిచేస్తున్న పంచాయతీ సెక్రటరీలు విధులకు హాజరయ్యే సమయానికి ఇష్టానుసారంగా వ్యవహరించడం పట్ల జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి పంచాయతీ సెక్రెటరీలను సస్పెన్షన్ చేసినట్లు జిల్లా అధికారి రఘునాథ్‌రెడ్డి తెలిపారు. పలుమార్లు ఫేక్ అటెండెన్స్ చేయొద్దని ఫిజికల్‌గా ఉండి ఫోటో అప్లోడ్ చేయాలని ఎన్నోసార్లు మీటింగ్ ఏర్పాటు చేయడం జరిగిందని గతంలో ఉన్నటువంటి యాప్ పాత పద్ధతి ప్రకారంగానే ఫోటో క్యాప్చరింగ్ చేసి అప్లోడ్ చేస్తున్నారని అలా చేయొద్దని కొత్తగా వచ్చిన యాప్‌లో ఫేక్ అటెండెన్స్ చేసినట్లయితే తెలిసిపోతుందని పలుమార్లు హెచ్చరించిన జిపి సెక్రెటరీ మానకపోవడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాలతో శనివారం ఏదుల మండలం రేకులపల్లి తండా, గోపాల్పేట్ మండలం ఏదుట్ల గ్రామం, పానగల్ మండలంలోని షాగాపూర్ తాండ, పెబ్బేరు మండలంలోని కొత్త సూగురు గ్రామపంచాయతీ. మదనాపూర్ మండలంలోని గోపన్ పేట్, అమరచింత మండలంలోని నందిమల్ల జిపి సెక్రటరీతో కలిపి ఆరుగురిపై సస్పెన్షన్ వేటు పడినట్లు డిపిఓ తెలిపారు. అదేవిధంగా నాగర్ కర్నూలు జిల్లా అచ్చంపేట మండల పరిధిలోని ఇద్దరు పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా కలెక్టర్ బాధావత్ సంతోష్ తెలిపారు.

## శ్రీకాళహస్తి రోడ్డును జాతీయ రహదారిగా గుర్తించండి: కేంద్ర మంత్రికి ఎమ్మెల్యే విజ్ఞప్తి



కేంద్ర మంత్రికి కలంకారి కళాఖండాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

**శ్రీకాళహస్తి,ఆగస్టు 2 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రం ఆధ్యాత్మిక చింతనతో పాటు కళల్లో కూడా రాణిస్తుందని ఇందుకు నిదర్శనం 'కలంకారి కళ' అని శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి, తిరుపతిజిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వరన్ కేంద్ర రహదారులు,భవనాల శాఖ మంత్రి నితిన్ గడ్కారికి వివరించారు. శనివారం కేంద్ర మంత్రిని శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి కలసి వినతి పత్రం అందించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గం రోజు రోజుకు ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ది చెందుతుందని వివరించారు.ఈ ఆలయానికి నిత్యం తమిళనాడు నుంచి వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతుందన్నారు.అంతేకాక చెన్నై విశాఖ కారిడార్ వెళుతుందని అయితే తడ-శ్రీకాళహస్తి మధ్య సింగిల్ రోడ్డు ఉండటంతో ప్రయాణం ఇబ్బందిగా మారిందని మంత్రికి వివరించారు. ఈ మర్గాన్ని ఆరు లేన్ల నిర్మాణంతో పాటు జాతీయ రహదారిగా మార్చాలని అభ్యర్థించారు. కాగా నాయుడుపేట-రేణిగుంట ఆరు లేన్లు చేయటంతో తిరుపతి-శ్రీకాళహస్తి రాకపోకలకు అంతరాయంగా ఉందని కాబట్టి తిరుపతి-రేణిగుంట-శ్రీకాళహస్తి మధ్య ప్రత్యేక రోడ్డును మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని అభ్యర్థిస్తూ వినతి పత్రాన్ని అందించారు. శ్రీకాళహస్తిలో హస్తకళలకు నిలయమని ఇక్కడి కలంకారి కళకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉందని ఎంఎల్ఏ మంత్రికి వివరించారు. కాబట్టి ఇక్కడి కలంకారి ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించుటకు మంత్రిని కోరారు.ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించాలని కోరారు. కలంకారి కళ ప్రచారానికి పార్లమెంటు సమావేశాల్లో మహిళా ఎంపిలు కలంకారి చీరలు, మగ ఎంపిలు కలంకారి కండువాలను ధరించి హాజరైతే ప్రచారం ఉంటుందని మంత్రికి వివరించారు.ఈ సందర్భంగా కలంకారి కళాఖండాన్ని మంత్రికి సమర్పించారు.

# మంచి పుస్తకంతో మార్పు సహజం

## - విజయవాడ నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి




**విజయవాడ, ఆగస్టు2, ప్రభాత వార్తప్రతినిధి:** మంచి పుస్తకంతో మార్పు సహజంగా వస్తుందని విజయవాడ నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. నవ్యాంధ్ర రచయితల సంఘం, ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఉదయం విజయవాడ కొత్తపేట కెబిఎన్ కళాశాల లైబ్రరీ రీడింగ్ హాలులో యేమినేని వెంకటరమణ రచించిన ఖిరమణీయమ్థ పుస్తకావిష్కరణ సభ జరిగింది. ముఖ్య అతిథిగా వచ్చిన విజయవాడ నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మీ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ మంచి పుస్తకాలు జీవితాల్లో పెనుమార్పులు తీసుకొస్తాయన్నారు. చిరిగిన చొక్కా అయినా వేసుకో మంచి పుస్తకం కొని చదువు అని విజ్ఞులన్నారన్నారు.పుస్తకం చేతిలో ఉంటే ఎంతో ఉపశమనం అన్నారు.అయితే ఇటీవల వస్తున్నకొన్ని పుస్తకాలు చదవడం వల్ల భావోద్రేకాలు కలుగుతాయని, అలాంటి పుస్తకాల జోలికి యువత వెళ్ళకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై వుందన్నారు. ఎస్ కె పి వి వి విద్యాసంస్థల ఎడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డా. వి. నారాయణరావు పుస్తకాన్ని సమీక్షిస్తూ అర్థపర్థం లేని రచనలు విస్తృతంగా వస్తున్న నేటి తరుణంలో రమణ రాసినరమణీయం పుస్తకంలో అర్థం పరమార్థం వున్నాయన్నారు. ఇందులోని రచనలన్నీ సమకాలీన సమస్యలపై ఎక్కుపెట్టిన బాణాలేనన్నారు. అందుకే ఈ రచయితను సామాజిక రచయితగా నేను ప్రకటిస్తున్నానన్నారు. కెబిఎన్ కళాశాల కార్యదర్శి తూనుగుంట్ల శ్రీనివాసు జ్యోతి ప్రజ్వలన చేసిన ఈ సభకు సుప్రసిద్ధ రచయిత డా. యం. ప్రభాకర్ అధ్యక్షత వహించారు. కృష్ణా మిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు, వ్యాపారవేత్తలు చెవులు ఆంజనేయులు, చింతలపూడి సత్యనారాయణ, గౌతమ్ విద్యాసంస్థల అధినేత ఎన్.సూర్యారావు పాల్గొన్నారు. శ్రీదేవీ కరుమారి అమ్మన్ శక్తిపీఠం పీఠాధిపతులు కరుమారి దాసు, నవ్యాంధ్ర రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి కలిమిశ్రీ, ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీరామ్ యాదవ్, ఆకుల శ్రీనివాస్, వెస్ట్ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి పత్తిపాటి శ్రీధర్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

# సింగరేణి బొగ్గుగనుల్లో గోడ కూలి కార్మికుడి మృతి

**హైదరాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త:** సింగరేణి బొగ్గుగనుల్లో తీవ్ర విషాదం జరిగింది. సైడ్ గోడ కూలి ఓ కార్మికుడు మృతి చెందాడు. శుక్రవారం రాత్రి జరిగిన ఘటనపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కోల్‌మైనింగ్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న రాచపల్లి శ్రవణ్ కుమార్ (32) మందమర్రి సింగరేణి ఏరియాలోని కేకే 5 గనిలో సెకండ్ షిఫ్ట్‌లో సైడ్ గోడ కూలిపోయి బొగ్గుపెల్లలు పడడంతో కుప్పకూలిపోయాడు. తోటి కార్మికులు అప్రమత్తమై రామకృష్ణాపురంలోని ఆస్పత్రికి తరలించగా... అతని ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే ప్రాణాలు కోల్పోయాడు.అధికారుల నిరక్ష ్యంల్ల వల్లే ఈ ప్రమాదం జరిగిందని, శ్రవణ్ మృతి చెందాడని పలు యూనియన్లు మండిపడ్డాయి.

## ఎస్సీ, ఎస్టీ బాధితుల హక్కుల పరిరక్షణ - నిందితులకు కఠిన శిక్షల విధింపు

### డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ బైరా రామకోటేశ్వరరావు





సమీక్షా సమావేశంలో డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ బైరా రామకోటేశ్వరరావు

**విజయవాడ,ఆగస్టు2,ప్రభాతవార్తప్రతినిధి:** ఎస్సీ, ఎస్టీ బాధితుల హక్కుల పరిరక్షణ - నిందితులకు కఠిన శిక్షల విధింపులో ప్రాసిక్యూషన్ కీలక భూమిక పోషించాలని డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ బైరా రామకోటేశ్వరరావు అన్నారు.ఆయన నేతృత్వంలో రాష్ట్ర స్థాయి సమీక్షా సమావేశం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రాసిక్యూషన్ విభాగం ఆధ్వర్యంలో, 2025 జనవరి నుండి జూన్ నెలల వరకూ ఎస్సీ, ఎస్టీ (అణచివేత అరికట్టే) ప్రత్యేక న్యాయస్థానాల్లో పెండింగ్ ఉన్న కేసులపై రాష్ట్రస్థాయిలో సమీక్షా సమావేశం శనివారం డైరెక్టరేట్ ఆఫ్ ప్రాసిక్యూషన్ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్లు సంబంధిత పోలీసు అధికారులు పాల్గొన్నారు.బాధితులకు ఈ సందర్భంగా డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ బైరా రామకోటేశ్వరరావు మాట్లాడుతూ,"ప్రతి కేసులో బాధితునికి గౌరవనీయమైన న్యాయం కల్పించడం, నిందితుడికి చట్టపరంగా గట్టి శిక్ష విధించడం ద్వారా సమాజానికి స్పష్టమైన హెచ్చరిక ఇవ్వడం ప్రాసిక్యూషన్ విభాగం యొక్క ప్రాధాన్యమైన బాధ్యత" అని స్పష్టంగా తెలిపారు.

03-08pg7exHMNWJQE_03-08pg7exHMNWJQE.qxd 8/3/2025 12:30 AM Page 1



# యువశాస్త్రవేత్తలను తీర్చిదిద్దుతున్న వ్యవసాయ వర్సిటీ



స్నాతకోత్సవంలో పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ (డేర్) కార్యదర్శి డాక్టర్ మంగీలాల్ జాట్, ఉపకులపతి అల్దాస్ జానయ్య

## భవిష్యత్‌లో నం-1 స్థానానికి వర్సిటీ: గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

## ఘనంగా 55వ స్నాతకోత్సవం

**హైదరాబాద్ (అత్తాపూర్) ఆగస్టు 2, ప్రభాతవార్త:** దేశం వ్యవసాయ రంగంలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఎంతో కీలకంగా పని చేస్తుందని, ఎంతో మంది యువశాస్త్రవేత్తలను తీర్చిదిద్దుతుందని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ పేర్కొన్నారు. శనివారం వ్యవసాయ విశ్వవిద్యాలయం 55వ స్నాతకోత్సవం రాజేంద్రనగర్ లోని విశ్వవిద్యాలయంలో ఘనంగా జరిగింది. 2021-22 మధ్య ఉత్తీర్ణులైన 844 మంది యూజి, పీజీ, పిహెచ్‌డి విద్యార్థులకు విశ్వవిద్యా లయ కులపతి, గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అధ్యక్షతన స్నాతకోత్సవంలో పట్టాలు ప్రదానం చేశారు. తొలుత పిజెటిఎయు ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య వార్షిక నివేదికను సమర్పిం చారు. విశ్వవిద్యాలయం వివిధ పంటల్లో విడుదల చేసిన వంగడాలు జాతీయస్థాయిలో ఆదరణ పొందు తున్నాయని అల్దాస్ జానయ్య తెలిపారు. బోధన, పరిశోధన, విస్తరణల్లో విశ్వవిద్యాలయం బహుముఖ ప్రతిభ కనబరుస్తుందన్నారు. దేశ, విదేశాలకు చెందిన అనేక ప్రముఖ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకున్నామని జానయ్య తెలిపారు. అగ్రి హబ్, ఇతర ల్యాబ్‌ల్ని విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేశామని తెలిపారు. ఐసీఏఆర్, విశ్వవిద్యాలయ కులపతి జిష్ణుదేవ్ వర్మ,ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తోడ్పాటుతో విశ్వవిద్యాలయాన్ని అత్యున్నత స్థాయికి తీసుకెళ్లడానికి కృషి చేస్తున్నామని జానయ్య వివరించారు. అనంతరం డిపార్ట్మెంట్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ (డేర్) కార్యదర్శి డాక్టర్ మంగీలాల్ జాట్ మాట్లాడుతూ...విశ్వవిద్యాలయంలో చదివిన ఎందరో వ్యక్తులు నేడు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అత్యుత్తమ స్థానాల్లో ఉండి దేశానికి, రైతాంగానికి సేవలు అందిస్తున్నారన్నారు. ఒకనాడు ఆహార కొరత ఎదుర్కొన్న దేశం నేడు ఆహార ధాన్యాల మిగులు స్థాయికి చేరుకుందన్నారు. దీనికి శాస్త్ర విజ్ఞానం, ప్రభుత్వాల విధానాలు, రైతుల నిరంతర శ్రమలే దోహదం చేశాయన్నారు. నేడు తెలంగాణ, ఇతర రాష్ట్రాల కారణంగా దేశం వరి ఉత్పత్తిలో ప్రథమ స్థానంలో నిల్చిందన్నారు. భూగర్భజలాల క్షీణత, భూసార క్షీణత, పర్యావరణ విధ్వంసం, పర్యావరణ మార్పులు వంటి సవాళ్లను నేడు మనం ఎదుర్కొంటున్నామని జాట్ అన్నారు. ఈ సవాళ్లను సమర్ధంగా ఎదుర్కొని 2047 నాటికి 'వికసిత్ భారత్'గా రూపాంతరం చెందటానికి అందరూ కృషి చేయాలన్నారు. భవిష్యత్తులో విశ్వవిద్యాలయం దేశంలో తొలి పది స్థానాల్లో నిలవనుందని గవర్నర్ ఆశాభావం వ్యక్తం చేశారు. పిజెటీఏయూ ఈ మధ్య నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం, ప్రతి గ్రామానికి నాణ్యమైన విత్తనాలు కార్యక్రమాల వల్ల రైతాంగానికి చాలా మేలు జరిగిందని వివరించారు. వాతావరణమార్పులు, మార్కెటింగ్ తదితర సవాళ్లకు అనుగుణంగా శాస్త్రవేత్తలు కొత్త పరిష్కారాలు చూపించాలన్నారు. యువతకి, మహిళలకి ఉపాధి కల్పించడంతోపాటు పేదరికం రూపుమాపి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో వ్యవసాయానిది ప్రధాన పాత్ర అని.. యువ పట్టభద్రులు రైతులకు నిరంతర సేవలందిస్తూ సాగుని లాభసాటిగా చేసేందుకు కృషి చేయాలని గవర్నర్, విశ్వవిద్యాలయ కులపతి జిష్ణుదేవ్ వర్మ పిలుపు నిచ్చారు. ఈ స్నాతకోత్స వంలో రిజిస్ట్రార్ డాక్టర్ జి.ఈ.సీ హెచ్. విద్యాసాగర్, విశ్వవిద్యాలయ పాలక మం డలి సభ్యులు, విశ్వవిద్యాలయ అధి కారులు, పూర్వ ఉపకులపతులు, రిజిస్ట్రార్ లు, ఐసీఏఆర్ సంస్థల ప్రతి నిధులు, అధికారులు వివిధ బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# రేపటి నుంచి ఎడ్‌సెట్-2025 వెబ్‌ఆప్షన్లు

## 9న సీట్ల కేటాయింపు

## 11 నుంచి 14 వరకు కాలేజీల్లో చేరాలి

**హైదరాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు బీఈడీ కాలేజీల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎడ్‌సెట్-2025 కౌన్సెలింగ్‌లో భాగంగా రేపటి(సోమవారం) నుంచి అభ్యర్థులు వెబ్‌ఆప్షన్లు ఇవ్వడానికి అవకాశం కల్పించారు. వెబ్‌ఆప్షన్లు ఇచ్చిన వారికి ఈ నెల 9న సీట్ల కేటా యింపు చేపట్టనున్నారు. సీట్లు పొందిన వారు ఈ నెల 11 నుంచి 14 వరకు ట్యూషన్ ఫీజు చెల్లించి ఆయా కాలేజీల్లో చేరాల్సి ఉంటుంది. ఈ నెల 18 నుంచి క్లాసులను ప్రారంభించాలని ఇప్పటికే ప్రకటించిన కౌన్సెలింగ్ షెడ్యూల్‌లో అధికారులు ప్రకటించిన విషయం తెలిసిందే. ఎడ్ సెట్-2025కి సంబంధించిన నోటిఫికేషన్‌ను జులై 14న జారీ చేయగా.. జులై 21 నుంచి దరఖాస్తుల ప్రక్రియను ప్రారంభించారు. ఎడ్ సెట్-2025లో అర్హత సాధించిన అభ్యర్థులు తమ వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసుకోవడానికి జులై 21 నుంచి 31 వరకు అవకాశం కల్పించారు. ఇదే సమయంలో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహించనున్నారు. స్పెషల్ కేటగిరీ అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను జూలై 23 నుంచి 26 వరకు నిర్వహించారు. కౌన్సెలింగ్‌కి అర్హులైన వారి జాబితాను శనివారం వెబ్‌సైట్‌లో పొందు పరిచారు. కౌన్సెలింగ్‌కి అర్హత సాధించిన వారు ఈ నెల 4(సోమవారం), 5(మంగళవారం) రెండు రోజులు వెబ్ ఆప్షన్లకి అవకాశం కల్పించారు. ఈ నెల 6న వెబ్ ఆప్షన్లకి ఎడిట్ చేసుకోవడానికి అవకాశమిచ్చారు. ఎడ్ సెట్ కౌన్సెలింగ్ మొదటి విడత సీట్ల కేటాయింపు ఈ నెల 9న చేపట్టనున్నారు. సీట్లు పొందిన అభ్యర్థులు ట్యూషన్ ఫీజు చెల్లించి.. ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో ఈ నెల 11 నుంచి 14 వరకు కాలేజీల్లో చేరాల్సి ఉంటుంది. ఈ నెల 18 నుంచి క్లాసులను ప్రారంభించనున్నట్టు అధికారులు కౌన్సెలింగ్‌లో ప్రకటించారు.

# బిసిలను మోసం చేసిందే బిజెపి

## జనహిత పాదయాత్రతో సంక్షేమ పథకాలపై ప్రజలకు చైతన్యం : ఎమ్మెల్యే బాలునాయక్

**హైదరాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త:** రాష్ట్ర బిజెపి అధ్యక్ష పదవితో బిసిల పట్ల ఆ పార్టీ చిత్త శుద్ధి తేలిపోయింది బిజెపి బిసిలను మోసంచేసే పార్టీ అని ఎమ్మెల్యే బాలునాయక్ ఆరోపించారు. శనివారం గాంధీభవన్‌లో అందు బాటులో ప్రజాప్రతినిధులు కార్యక్రమంలో ఎమ్మెల్యే బాలు నాయక్ పాల్గొని ప్రజలు, స్థానికుల నుంచి వినతులు స్వీకరించి సమస్యల పరిష్కారం కోసం ఆయా శాఖల అధికారులతో మాట్లాడారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ఏం మాట్లాడుతున్నాడో ఆయనకే అర్థం కావడం లేదని ఆయన విమర్శించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం దేశంలో ఎక్కడ లేని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని ఆయన చెప్పారు. సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేసేందుకు జనహిత పాదయాత్ర చేపట్టారని ఆయన వివరించారు. బడుగు బలహీనవర్గాలు పక్షపాతి కాంగ్రెస్ పార్టీ 42శాతం రిజర్వేషన్ బిల్లు తెస్తే బిసి రిజర్వేషన్లకు బిజెపి నేతలు అడ్డు పడుతున్నారని ఆరోపించారు. దళిత బిడ్డను పార్టీ అధ్యక్షుడిని చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని అన్నారు. బిసి 42 శాతం రిజర్వేషన్ల బిల్లును ఆమోదించాలని ప్రధానిని డిమాండ్ చేస్తున్నానని అన్నారు. పోలవరం బనకచర్ల లింక్ ప్రాజెక్టు బిఆర్ఎస్ హయాంలో ప్రారంభించారని, నీటి వాటాను తాకట్టు పెట్టింది బిఆర్ఎస్ నేతలు ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే లంబాడా, తెలంగాణ లంబాడీలు జీవితాంతం ఇందిరాగాంధీకి రుణపడి ఉంటారని ఆయన అన్నారు.

# ముస్లింల పేరిట రిజర్వేషన్లను బిజెపి అడ్డుకునే యత్నం

## బలహీనవర్గాల వ్యతిరేకి రామచందర్‌రావు

## బిజెపి నేతల ధర్నాపై మంత్రి పొన్నం ఆగ్రహం

**హైదరాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త:** ముస్లింల పేరు చెప్పి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రిజర్వేషన్లను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని బిసి సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. కడుపులో కత్తులు పెట్టుకొని అదు ముకున్నవిధంగా బిసి రిజర్వేషన్లపై ధర్నా చేస్తున్న బిజెపి నేతల తీరు ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వం కామారెడ్డి డిక్లరేషన్ నుండి మొదలు కులగణన చేసి న్యాయ పరమైన చిక్కులు లేకుండా బిసిలకు రాజకీయ, విద్య, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలుచేస్తూ చట్టంచేసి గవర్నర్‌కు పంపించి అక్కడినుండి రాష్ట్రపతికి పంపించడం వరకు తాము చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని ఆయన వివరించారు. రాష్ట్రపతి ఆమోదం పొందాల్సిన ఈ బిల్లుపై బిజెపి కేంద్రంలో అధికారంలో ఉండి హైదరాబాద్‌లో ధర్నా చేయడాన్ని ప్రజలు నవ్వు కుంటు న్నారని ఆయన విమర్శించారు. తెలంగాణ బిజెపి ఎమ్మెల్యేలు శాసనసభ లో బిసిలకు రిజర్వేషన్లపై మద్దతు ఇచ్చి ముస్లింల పేరు మీద అడ్డుకుం టున్నారని అవేదన చెందారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తప్పులు ఉంటే సవరించి బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఆమోదింపజేయాలని డిమాండ్ చేశారు.

బిసిలకు న్యాయం చేయాలని ఆయన కోరారు. బలహీనవర్గాల వ్యతిరేకి రామచంద్రరావు చేసే ధర్నాలో మీరు పాల్గొని మీరు కూడా బల హీన వర్గాల వ్యతిరేకిగా మారుతున్నారని ఆయన అన్నారు.

బిజెపి నేతలు బిసిలు రిజర్వేషన్లు సాధించాలనుకుంటే ఈ ధర్నా ఢిల్లీలో చేయాలి ప్రధాని మోడీని ఒప్పించండి అని ఆయన కోరారు.సోమవారం అందరం కలిసి ఢిల్లీ వెళ్దాం రండి మన రిజర్వేషన్లు సాధించుకుందామని ఆయన అన్నారు. బిజెపి అధ్యక్షుడు రామచందర్ రావు ధర్నా చేయాల్సింది హైదరాబాద్‌లో కాదు ఢిల్లీలో అని ఆయన హితవు చెప్పారు. బిజెపి అధ్యక్షుడు రామచంద్రరావు పక్కా బిసిల వ్యతిరేకి మంత్రి పొన్నం పునరుద్ఘాటించారు. బిజెపి నేతలు మీ స్థాయిని ధర్నాచౌక్ వరకు కాకుండా మాతో కలిసి ఢిల్లీ రండి అని మంత్రి పొన్నం కోరారు.



అభివాదం చేస్తున్న మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఐలి వెంకన్నగౌడ్, ఎలికట్టె విజయ్‌మార్‌గౌడ్, కూరెళ్ల వేములయ్యగౌడ్, అనంతరాజుగౌడ్ తదితరులు

# లిక్కర్ మాఫియాకు తలొగ్గి కల్లును నిషేధించే కుట్ర

## మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్

**హైదరాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో మాదిరిగా లిక్కర్ మాఫియాకు తలొగ్గి హైదరాబాద్‌లో కల్లును నిషేధించే కుట్రలు చేస్తుందని మాజీమంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ మండిపడ్డారు. ఎక్కడో కల్లు కల్తీ ఘటన జరిగితే దాని బూచిగా చూపి కల్లును నిషేధించడం కుట్రగా కనిపిస్తుం దని లిక్కర్ మాఫియానే కల్లులో ఏమైనా కలిపిందనే అనుమానాలు వ్యక్త మవుతునాయని అన్నారు. ఈ మేరకు శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షులు ఐలి వెంకన్నగౌడ్, గౌడజనహక్కుల పోరాట సమితి అధ్యక్షులు ఎలికట్టె విజయకుమార్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో రాష్ట్రంలో కల్లుగీత వృత్తిపై నెలకొన్న సమస్యలపై ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశానికి శ్రీనివాస్‌గౌడ్ ముఖ్యఅతిధిగా హాజరై ప్రసంగించారు. ఇటీవల జరిగిన కల్తీ కల్లుఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ గౌడ ఐక్య సాధన సమితి అధ్యక్షులు అంబాల నారాయణగౌడ్, బీసీ సంఘాల సమాఖ్య అధ్యక్షులు దుర్గయ్య గౌడ్, తెలంగాణ గౌడ సంఘాల జేఏసీ లీగల్ అడ్వైజర్ ముద్దగౌని రామ్మోహన్ గౌడ్, అంబర్‌పేట కార్పొరేటర్ విజయ్ కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు సమగ్రాభివృద్ధికి కృషి

## రూ.20,500 కోట్లతో పిఎం కిసాన్ నిధి

## ఆర్థికంగా మూడో స్థానంలోకి భారత్: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



యాచారంలో కార్యక్రమాన్ని వీక్షిస్తున్న కేంద్రమంత్రి, ఎమ్మెల్యే, అధికారులు మాజీ ప్రజాప్రతినిధులు

**యాచారం, ఆగస్టు 2, ప్రభాతవార్త :** భారత దేశంలో వ్యవసాయానికి మొదటి ప్రాధాన్యతనిస్తూ రైతు సమగ్ర అభివృద్ధి కోసం ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ కృషి చేస్తున్నట్లు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. శనివారం ఉత్తర ప్రదేశ్ వారణాసిలో ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి సమ్మేళనం కార్యక్రమాన్ని యాచారం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి ఎస్‌సిఎఆర్ క్రీడా జోన్ ఎక్స్ డైరెక్టర్ వికేసింగ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి ఉష, సహాయ వ్యవసాయ సంచాలకులు సుజాత, ఆర్డీఓ అనంతరెడ్డి, వివిధ గ్రామాల నుండి విచ్చేసిన రైతులు కార్యక్రమాన్ని వీక్షించారు. అనంతరం కేంద్రమంత్రి మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేతుల మీదుగా 20,500 కోట్ల రూపాయలు విడుదల చేసి 9.7 కోట్ల మంది రైతులకు లబ్ధి చేకూరేలా పిఎం కిసాన్ నిధి ప్రారం భించినట్లు తెలిపారు. ప్రపంచ ఆర్థిక గణాంకాల ప్రకారం భారతదేశము నాలుగో స్థానంలో ఉందని నేడు మూడో స్థానానికి చేరే ప్రయత్నం కృషి జరుగుతుందన్నారు. ఆనాటి నుంచి ఈనాటి వర కు వ్యవసాయంపై మక్కువతో దేశంలో గణనీయంగా వృద్ధి జరిగిందని మన దేశం నేడు ఇతర దేశాలకు ఆహార ఉత్పత్తులు సరఫరా చేసే స్థాయికి అగ్రగామిగా నిలిచింద న్నారు. ఇతర దేశాలకు భారతదేశం అభివృద్ధి మింగుడు పడడం లేదన్నారు.140 కోట్ల మంది జనాభాకు సరిపడా ఆహార ఉత్పత్తులు చేస్తూ ఇతర దేశాలకు ఎగుమతులు చేసి స్థాయికి వెళ్లి అగ్రస్థానం నిలుస్తూ శత్రుద్దేశం గుండెల్లో గుబులు పుట్టించే స్థాయికి చేరుకున్నామన్నారు. కరోనా కష్టకాలంలో కరోనా వ్యాక్సిన్ తయారుచేసి హైదరాబాదు నుండి 45 దేశాలకు ఉచితంగా కరోనా వ్యాక్సిన్ ను అందించిన ఘనత మనదే అన్నారు. పూర్వం మన దేశంలో పాల ఉత్పత్తుల కోసం ఇతర దేశాలపై ఆధారపడే పరిస్థితి ఉండేదని నేడు దేశంలో పాల ఉత్పత్తుల్లో ఎంతో అభివృద్ధి సాధించి మెరుగైన పోషకాహారాలను అందిస్తున్నామన్నారు. దేశాన్ని అభివృద్ధి పథంలో నడుపుతూ బడుగు బలహీన వర్గాల కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు. రైతుల అభ్యున్నతి కోసం దాన్యం మద్దతు ధర 2380 అందజేస్తూ రైతుకు ఎంతో బసటగా నిలుస్తున్నారని గుర్తు చేశారు. మిగులు బడ్జెట్ తో తెలంగాణ రాష్ట్ర ఏర్పడిదని నేడు రాష్ట్రాన్ని అప్పుల పాలుచేసిందని, రాష్ట్రం అప్పుల్లో ఉందని భవిష్యత్తులో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వస్తే అభివృద్ధిచేసి చూపిస్తామన్నారు. కార్య క్రమంలో ఏఎంసీ చైర్మన్ గుర్నాథ్‌రెడ్డి, ఎంసి డైరెక్టర్లు మస్కి నర సింహా, గులాం అక్బర్, పిఎస్‌సిఎస్ చైర్మన్ రాజేందర్ రెడ్డి, మాజీ ఎంపీపీలు రాచర్ల వెంకటేశ్వర్లు, కొప్పు సుకన్య భాష్యం,మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షులు కొండపల్లి శ్రీధర్ రెడ్డి, బిఎన్ఆర్ ట్రస్ట్ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, భారతీయ జనతా పార్టీ నాయకులు మాజీ సర్పంచ్లు అంజయ్య యాదవ్, దేరంగుల రాజు, విజయ్ కుమార్, శ్రీధర్ రెడ్డి, మూడేడ్ల వెంకట్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు అరవింద్ నాయక్, వరికుప్పల సుధాకర్, నెర్రె శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి, కృష్ణా జలజగడం పరిష్కారానికి ప్రభుత్వం కృషి

## బిసి ద్రోహుల పార్టీ బిజెపి: ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్

**హైదరాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త:** గోదావరి, కృష్ణా నది జలజగడాల శాశ్వత పరిష్కారం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తున్నదని బిఆర్ఎస్ నాయకగణం వీలైతే సహకరించండి లేదంటే తప్పుడు ప్రచారాన్ని మానుకోండి అంటూ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ హితవు చెప్పారు. శనివారం గాంధీభవన్‌లో విలేఖరులతో మాట్లాడుతూ కెటిఆర్ లాగా దొంగతనంగా ఢిల్లీకి పోయే పద్ధతి రేవంత్ రెడ్డికి తెలియదుహైదరాబాదులో పుట్టిన మీ పార్టీ ,మీరు దొంగ సాటుగా ఢిల్లీ పోయి మోడీని,అమిత్ షా, సిఎం రమేష్ ను కలిసినట్లు రేవంత్ రెడ్డి కలవట్లేదని విమర్శించారు. తెలంగాణ ప్రజలు, తెలంగాణ సమాజం కోసం రేవంత్ రెడ్డి 100 సార్లు కాదు 500 సార్లు అయినా పోతడు అని ఆయన చెప్పారు. నీళ్లను, నిధులను నియామకాలను మొత్తాన్ని తన కుటుంబానికి మలుపుకున్న కెసిఆర్ కుటుంబానికి శ్రీనివాస్ గౌడ్ వత్తాసు పలుకుతుండని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. బనకచర్ల అప్పుడు శ్రీనివాస్ గౌడ్ మంత్రిగా ఉండు ఏం చేసిండని ప్రశ్నించారు. గోదావరి మీద కాళేశ్వరం కట్టి నిధులను దోచుకున్నప్పుడు శ్రీనివాస్ కూడా మాట్లాడలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. రామచంద్ర రావు స్టేట్మెంట్లు తన అజ్ఞానాన్ని తానే చెప్పుకుంటట్లుగా కనిపిస్తుందని అన్నారు. పార్టీ అధ్యక్షుడు బిసి ఉంటేనే ఆయన మార్చి రామచంద్ర రావు అధ్యక్షుడు అయిండు అని అన్నారు. బిసి గురించి మాట్లాడే నైతిక హక్కు ఆయన కోల్పోతుండు అని అన్నారు. బిజెపి బిసి ద్రోహ పార్టీ అని రామచంద్ర రావు గుర్తిస్తే మంచిదని అన్నారు. మేము మంత్రివర్గంలో, కార్పొరేషన్ లో 42 శాతం రిజర్వేషన్ ఇచ్చినం రేపు పార్టీలో కూడా ఇవ్వబోతున్నామని అన్నారు.

# డిఇఒలుగా అదనపుబాధ్యతల కేటాయింపులో సర్వీస్ నిబంధనలు పాటించాలి

## ప్రభుత్వ ప్రధానకార్యదర్శికి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య వినతి

**హైదరాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త:** జిల్లా విద్యాశాఖ అధికారులు(డిఈవో)గా అదనపు బాధ్యతలు(ఎఫ్ఏసి) అప్పగించే సందర్భంలో తప్పకుండా సర్వీస్ నిబంధనలు పాటించాలని కరీంనగర్- ఆదిలాబాద్-నిజామాబాద్-మెదక్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య అన్నారు. ఇదే అంశంపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి కె రామకృష్ణారావుకి శనివారం వినతిపత్రం సమ ర్పించారు. జిల్లా విద్యాశాఖ అధికారి(డిఈవో), ఉపజిల్లా విద్యాధికారులు (డిప్యూటీ. డిఈవో)లుగా తాత్కాలిక బాధ్యతలు (ఎఫ్ఏసి) అప్పగించడంలో విద్యా అర్హతలను, ఉన్నతాధికారుల నియామక నిబంధనలను పక్కనపెట్టి తీసుకుంటున్న నిర్ణయాలను ఎమ్మెల్సీ మల్క కొమురయ్య తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ విషయంపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి లిఖితపూర్వకంగా విజ్ఞప్తి చేశారు. సర్వీస్ నియమావళి ప్రకారం డిఈవో, డిప్యూటీ డిఈవో పోస్టులకు కనీస అర్హతగా సాధారణ డిగ్రీతోపాటు బిఎడ్ ఉండాలన్నారు. కానీ బిఎడ్ అర్హతలు లేని అధికారులకు ముఖ్యంగా ఏఐఎస్ అధికారులకు ఈ బాధ్యతలు అప్పగించడం నింధనలకు విరుద్ధమన్నారు. అంతేకాకుండా విద్యా రంగంలో నైపుణ్యాలు, విద్యాపరమైన అనుభవం అవసరమైన చోట పరిపాలనా కోణంతో తీసుకునే నిర్ణయాల వల్ల విద్యా వ్యవస్థ తీవ్రంగా దెబ్బతినే ప్రమాదముందన్నారు.వారి స్వతంత్ర పరిపాలనా పాత్రకు విఘాతం కలగవచ్చని ఎమ్మెల్సీ మల్క కొమరయ్య అభిప్రాయపడ్డారు.

# విద్యార్థినులకు శానిటరీ నాప్కిన్స్ ఉచితంగా పంపిణీ చేయాలి

## ఎస్ఎఫ్ఐ విద్యార్థినుల సదస్సులో ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

**హైదరాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త:** రాష్ట్రంలో చదువుకుంటున్న విద్యార్థినులకు అవసరమైన వారికి శానిటరీ నాప్కిన్స్‌ను ఉచితంగా పంపిణీ చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి డిమాండ్ చేశారు. గతంలో అమ్మాయిల హాస్టల్, కాలేజీలలో శానిటరీ నాప్కిన్స్ ఉచితంగా ఇచ్చేవారని.. కానీ ప్రస్తుతం ఇవ్వడం లేదని ప్రతి గురుకులంలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ సిటి సిఐటియు కార్యాలయంలో జరిగిన భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) విద్యార్థినిల రాష్ట్ర సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సమావేశానికి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి మమత అధ్యక్షత వహించారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు రజనీకాంత్, రాష్ట్ర కార్యదర్శి టి నాగరాజు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర విద్యార్థినుల కన్వీనర్ పూజ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లు లక్ష్మీ మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రం లో అమ్మాయిల పైన అత్యాచారాలు రోజురోజుకు పెరుగుతున్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాటిపైన ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటన్నారు. బేటి బచావో, బేటి పడావో అని చెప్పే ప్రధాని నరేంద్ర మోడీ భారత దేశంలో ఒక గంటకి కొన్ని వేల అత్యాచారాలు, కొన్ని వేల మందిపై యాసిడ్ దాడులు జరుగుతున్నాయన్నారు. చట్టం ఉన్నవారికి చుట్టంలాగా లేని వారికి ఎటువంటి చట్టం వర్తించకపోవడం చాలా బాధాకరమన్నారు. మహిళలు ఉపయోగించే నిటరీ నాప్కిన్స్ పైన జిఎస్‌టిని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

హాస్టళ్లు, గురుకులాలు, కెజిబివిల్లోని అమ్మాయిలకు సరైన సదుపాయాలు లేక సరిపడ గదులు, వాష్రూమ్స్ లేక అమ్మాయిలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశరు. వాటిపైన ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అమ్మాయిలు సరైన ఆహారం తీసుకోక అనారోగ్య బారిన పడుతున్నారని, రక్తహీనతకు గురవుతున్నారని, అందుకే అమ్మాయిలకు న్యూట్రిషన్ ఫుడ్ అందించాలని డిమాండ్ చేశారు. అమ్మాయిలకు మెస్ చార్జీలు పెంచాలన్నారు. విద్యా ర్థులందరూ మహనీయుల చరిత్రలు తెలుసుకొని మహనీయుల అడుగు జాడల్లో నడవాలని, వారి ఆశయదారుల్లో కొనసాగాలని సూచించారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో వస్తున్న అశ్లీల కంటెంట్, డబుల్ మీనింగ్ వీడియోలు, డ్రగ్స్, గంజాయి, మద్యం, సిగరెట్ లాంటి సంస్కృతి విద్యార్థి నుల్లో కూడా రుద్దబడుతుందని.. వాటికి వ్యతిరేకంగా విద్యార్థులు ఉద్యమిం చాలని పిలుపునిచ్చారు.

# ట్రంప్‌కు ప్రధాని మోడీ ఊడిగం.. ప్రజలకు అవమానకరం



## మోడీ, కెసిఆర్ అందంగా అబద్ధాలు చెబుతారు

## పార్టీ ఫిరాయింపులపై ఎన్నికల కమిషన్ ఏం చేస్తుంది?

## సెప్టెంబరు 22 నుంచి చండీగఢ్‌లో జాతీయ మహాసభలు


## సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ

**హైదరాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త:** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు ప్రధానిమోడీ బానిసత్వం చేయడం దేశ ప్రజలందరికీ అవమా నకరమని సిపిఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ విమర్శించారు. అబద్ధాలను అందంగా, అవలీలగా చెప్పే వ్యక్తులు ఈ దేశంలో ఇద్దరే ఇద్దరు ఉన్నారని, వారు ఒక్కరు దేశ ప్రధాన మంత్రి నరేంద్రమోడీ కాగా, మరొక్కరు తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు అని అన్నారు. హైదరాబాద్‌లోని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో శనివారం నారాయణ మీడియాతో మాట్లాడారు. పార్లమెంట్‌లో ప్రధాన మంత్రి నరేంద్రమోడీ, తెలంగాణ అసెంబ్లీలో కెసిఆర్ చెప్పినవి, చెప్పేవని అబద్దాలేనని ఎద్దేవా చేశారు. అమెరికా అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్‌కు ప్రధాని మోడీ బానిసత్వం చేయడం దేశ ప్రజలందరికీ అవ మానకరమని.. ట్రంప్ నిరాశ, నిస్పృహాలతో ఇష్టానుసారంగా వ్యవరిస్తుండగా, మన దేశ ప్రధాని సృహాలో ఉండి కూడ అబ్బదాలు చెబుతున్నారని మండిపడానదరు. పహల్గాం ఉగ్రవాదులను పార్లమెంట్ సమావే శాలకు ఒక్కరోజు ముందు హతమార్చి వారి శవాలను అడ్డం పెట్టుకుని సభలో తప్పించునే ప్రయత్నం చేశారన్నారు. కాశ్మీర్‌లో 7.50లక్షల మంది భద్రాత సిబ్బందిని మోహరించిన కేంద్రం ఉగ్రవాదులను పట్టు కోకుండా ఇంతకాలం ఏమి చేసిందో చెప్పాలని నారాయణ డిమాండ్ చేశారు. మోడీ గ్రాఫ్ పడిపోవడంతో ఆర్‌ఎస్ఎస్ 75 యేళ్ల వరకే పదవి కాలం అనే అంశాన్ని తెరపైకి తెచ్చిందని, అయితే ప్రధానమంత్రి ఎవరూ అనేది ఇక్కడ కాదని, దేశభద్రత, ఆర్థిక వ్యవస్థ పట్ల కేంద్ర ప్రభుత్వ విధానాల మార్పు కావాలన్నారు. కర్నాటకలోని ధర్మస్థల పవిత్ర ఆలయాన్ని ట్రస్టీ అపవిత్రం చేసిందని, ఆ దేవాలయాన్ని తక్షణమే ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని నారాయణ డిమాండ్ చేశారు. ఆలయంలో జరిగిన అన్ని దారుణాలకు ట్రస్ట్ బోర్డుదే బాధ్యతని.. వెంటనే బోర్డు సభ్యులను అరెస్టు చేయాలన్నారు. అక్కడ 400 మంది మహిళలపై అత్యాచారానికి పాల్పడి అత్యంత క్రూరంగా చంపి పూడ్చిపెట్టారని, పవిత్ర ధర్మస్థలా, స్మశానమా అర్థం కావడం లేదన్నారు. ధర్మస్థల ఘటనకు సం బంధించి వార్తల ప్రచు రణలను నిలిపి వేస్తూ స్థానిక కోర్టు ఇచ్చిన ఉత్త ర్వులను హైకోర్టు రద్దు చేస్తూ తీర్పును ఇవ్వడం స్వాగతి స్తున్నామన్నారు. పొలి టికల్ ఇంజినీర్ల నిర్వాకం వల్లే కాళేశ్వరం ప్రాజెక్టుకు ఈ దుస్థితి ఏర్పడిందని పేర్కొ న్నారు. మాయల పక్కీర్ ప్రాణాలు ఎక్కడో చిలకలో దాగి ఉన్నట్లు, ప్రస్తుతం కమిషన్ నివేదికలో మాజీ సిఎం కెసిఆర్ బాగోతం దాగి ఉందని నారాయణ తెలిపారు. పార్టీల ఫిరాయిం పులకు సంబంధించి మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు తీర్పును ఇచ్చినంత మాత్రాన జరిగేది ఏమి లేదన్నారు నారాయణ. స్పీకర్‌కు ఉన్న విశేష అధికారాల నేపథ్యంలో వారి తీర్పును ఎవరూ కాదనే పరిస్థితి ఉండదన్నారు. ఎంఎల్ఎలు, ఎంపిల పార్టీ ఫిరాయింపులపై ఎన్నికల కమిషన్ అసలు ఏమి చేస్తోందని నారాయణ ప్రశ్నించారు. ఎంఎల్ఎలు, ఎంపిలు ఎన్నికైనట్లు సర్టిఫికెట్లను అందజేసి సభలకు పంపేదే ఎన్నికల కమిషన్ అని.. కమిషన్ వద్ద అన్ని వివరాలను ఉంటాయి కదా అలాంటప్పుడు ఎవరైన పార్టీ ఫిరాయిం పులకు పాల్పడితే ఎన్నికల కమిషన్ తక్షణమే దానిని సుమోటోగా స్వీకరించి అనర్హులుగా ప్రకటించాలన్నారు. సెప్టెంబర్ 22 నుంచి చండీఘర్‌లో సిపిఐ జాతీయ మహాసభలు జరగనున్నాయని తెలిపారు. ఈ మహాసభల్లో బిజెపి వ్యతిరేక ఫ్రంట్ బలోపేతం చేయడంతో పాటు ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ దేశవ్యాప్తంగా ప్రజాఉద్యమాలను ఉదృతంచేసే దిశగా కార్యాచరణను రూపొందించనున్నట్లు నారాయణ వెల్లడించారు.

# న్యాయమైన నీటివాటా కోసం, తెలంగాణ కోసం పనిచేస్తాం

## చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**హైదరాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త:** రాయలసీమను రతనాల సీమ చేయడం కోసం కాదు, కృష్ణా, గోదావరిలో న్యాయమైన నీటి వాటాను సాధించేందుకు తెలంగాణ కోసం కాంగ్రెస్ నాయక గణం పనిచేస్తోందని చొప్పండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. శనివారం సిఎల్‌పిలో మీడియాతో ఆయన మాట్లాడుతూ బనకచర్లను ప్రభుత్వం ఆపి తీరుతుందని సిఎం ఇప్పటికే ఢిల్లీ వెళ్లి కేంద్రానికి ఫిర్యాదు చేశారని గుర్తుచేశారు. కేంద్రం కూడా సానుకూలం గా స్పందించింది బనకచర్ల డిపిఆర్‌ను కూడా రిజెక్ట్ చేశారని ఆయన వివరిం చారు.



నారా లోకేష్ మాట్లాడినంత మాత్రాన హడావుడి పడాల్సిన అవసరం లేదని అనుమతులు లేకుండా నారా లోకేష్ బనక చెర్ల ను ఎలా కడతాడో చూస్తాం అని మేడిపల్లి సత్యం ధీమా వ్యక్తం చేశారు. నారా లోకేష్ మాటలను బూచిగా చూపించి హరీశ్‌రావు ప్రభుత్వం పైన విమర్శలు చేస్తు న్నాడని విమర్శించారు. బనకచర్లపైన హరీశ్‌రావు తెగ హడావుడి చేస్తు న్నారని అపహాస్యం చేశారు. హరీశ్‌రావుకు అంత కష్టం అవసరం లేదు బనకచెర్లను ప్రభుత్వం ఆపి తీరుతుందని తెలిపారు. నారా లోకేష్ నా తమ్ముడు లాంటోడు అని కెటిఆర్ సన్నాయి నొక్కులు నొక్కుతున్నాడని సత్యం విమర్శించారు. బిఆర్ఎస్ మోసగాళ్లకు అడ్డాగా మారిందని విమర్శిం చారు. తెలంగాణ ప్రయోజనాలు రక్షణ కోసమే బిఆర్ ఎస్ ఉందన్న హరీశ్ రావు లోకేష్‌ను కెటిఆర్ ఎందుకు కలిసాడో చెప్పాలని నిలదీశారు. మీ లాలూచీ వ్యవహారాలు అన్నీ తమకు తెలుసని అన్నారు.

ONG 12 Pg_3-8pg10.qxd 8/3/2025 1:18 AM Page 1





# ప్రో కబడ్డీకి రంగం సిద్ధం

## 29 నుండి ప్రారంభం

### విశాఖ సహా సహా 4 నగరాల్లో టోర్నీ

### తెలుగు టైటాన్స్, తమిళ్ తలైవాస్ మధ్య తొలి మ్యాచ్

**న్యూఢిల్లీ:** ప్రో కబడ్డీ లీగ్ (పికెఎల్) 12వ సీజన్ ఘనంగా ప్రారంభమయ్యేందుకు రంగం సిద్ధమైంది. ఈసారి నాలుగు వేదికల్లో టోర్నీని నిర్వహించేందుకు నిర్వాహకులు ప్లాన్ రెడీ చేశారు. ఈ లీగ్‌లో వైజాగ్, జైపూర్, చెన్నై, ఢిల్లీ అంతటా 12 జట్లు ట్రోఫీ కోసం తలపడతాయి. ఈ ప్రోలీగ్ టోర్నమెంట్ ఈ నెల 29న వైజాగ్‌లోని రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో ప్రారంభం కానుంది. దాదాపుగా ఏడేళ్ల తర్వాత వైజాగ్ వేదికగా కబ్బడ్డీ మ్యాచ్‌లు జరగనున్నాయి. ఆరంభ మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్, తమిళ్ తలైవాస్ మధ్య మ్యాచ్ జరగనుంది. అదే రోజు రెండో మ్యాచ్‌లో బెంగళూరు బుల్స్, పుణేరి పల్టన్స్ తలపడనున్నాయి. ఈ మ్యాచ్‌లకు సంబంధించిన షెడ్యూల్‌ను ప్రో కబడ్డీ లీగ్ నిర్వాహకులు విడుదల చేశారు. పికెఎల్ టోర్నమెంట్ ఈ నెల 29 నుండి అక్టోబర్ 23 వరకు నాలుగు నగరాల్లో జరుగనుంది. వైజాగ్‌లో మొదటి విడత మ్యాచ్‌లు ముగిసిన తర్వాత రెండో భాగం జైపూర్ లోని ఇండోర్ హాల్‌లో మ్యాచ్‌లు నిర్వహిస్తారు. మూడో దఫా చెన్నై, చివరిగా ప్లేఆఫ్ మ్యాచ్‌లు ఢిల్లీ వేదికగా జరగనున్నాయి. ఇందులో భాగంగా వైజాగ్ (ఈ నెల 29 నుండి సెప్టెంబర్ 11 వరకు), జైపూర్ (సెప్టెంబర్ 12, 28), చెన్నై (సెప్టెంబర్ 29 నుండి అక్టోబర్ 12 వరకు), ఢిల్లీ (అక్టోబర్ 13 నుండి 23 వరకు) మొత్తం 108 లీగ్ దశ మ్యాచ్‌లను నిర్వహించనున్నారు. హోమ్ టీమ్ అయిన తెలుగు టైటాన్స్ 2018లో చివరిసారిగా ఆరోస్థానాన్ని చేరినా, ఆ తర్వాత జరిగిన అన్ని సీజన్లలో టేబుల్‌లో అట్టడుగుకే పరిమితమైంది. ఈసారైనా బలంగా సత్తా చాటాలని తెలుగు టైటాన్స్ జట్టు ప్రణాళికలు రచిస్తుంది. డిఫెండింగ్ చాంపియన్స్ హర్యానా స్టీలర్స్ ఈ నెల 31న బెంగాల్ వారియర్స్ మ్యాచ్‌తో టైటిల్ వేటను మొదలుపెట్టనున్నారు. ప్రస్తుతం లీగ్ షెడ్యూల్ విడుదల చేసిన ప్రో కబ్బడ్డీ లీగ్ నిర్వాహకులు ప్లే ఆఫ్స్ షెడ్యూల్‌ను త్వరలోనే రిలీజ్ చేయనున్నారు.

## వరల్డ్ రెజ్లింగ్ ఛాంపియన్‌గా

# భారత్ మహిళల టీం

### రెండోసారి దక్కిన టైటిల్.. ఫైనల్‌కు పురుషుల జట్టు

**న్యూఢిల్లీ:** ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్-2025లో భారత్ మహిళా జట్టు ఛాంపియన్‌గా నిలిచింది. అలాగే భారత్ పురుషుల జట్టు ఫైనల్‌కు దూసుకెళ్లింది. భారత్ మహిళల జట్టు టైటిల్‌ను గెలుచుకోవడం వరుసగా ఇది రెండోసారి. ఈ టోర్నీలో రెండు స్వర్ణాలు, మూడు రజతాలు, ఒక కాంస్యంతో సహా మొత్తం ఆరు పతకాలను సాధించింది. ఇక హెవీవెయిట్ రెజ్లర్ లాకీ 110 కిలోల ఫ్రీస్టైల్ విభాగంలో భారత్ పురుషుల జట్టు ఫైనల్‌కు దూసుకెళ్లి, వ్యక్తిగత ప్రపంచ టైటిల్ కోసం పోటీలో నిలిచింది. 43 కిలోల విభాగంలో రచన స్వర్ణంతో ప్రచారాన్ని ప్రారంభించడంతో భారత మహిళల పతకాల జోరు ప్రారంభమైంది. ఆమె ఫైనల్‌లో చైనాకు చెందిన జిన్ హువాంగ్‌ను ఓడించింది. ఆ తర్వాత కొద్ది సేపటికే, అశ్విని విష్ణోయ్ 65 కిలోల బరువు విభాగంలో ఉజ్బెకిస్తాన్‌కు చెందిన ముఖయ్యో రఖిమ్జోనోవాపై నిర్ణయాత్మక విజయంతో రెండవ బంగారు పతకాన్ని జోడించింది. 57 కిలోల ఫైనల్‌లో కజకిస్తాన్‌కు చెందిన మధ్థియా ఉస్మానోవా చేతిలో ఒక పాయింట్ తేడాతో ఓడిపోయిన తర్వాత రజతం సాధించిన మోనితో భారతదేశం బలమైన ప్రదర్శన కొనసాగింది. 73 కిలోల విభాగంలో, చైనాకు చెందిన వెంజిన్ క్యూ చేతిలో ఓటమితో ముగిసిన పట్టుదల ప్రచారం తర్వాత కాజల్ కూడా రజతంతో సంతృప్తి చెందింది. కోమల్ వర్మ 49 కిలోల విభాగంలో కాంస్య పతకంతో తన ప్రదర్శనను ముగించింది, తన పతక పోరులో అన్వెలినా బుర్కినాను ఓడించి భారతదేశం యొక్క ఐదవ పతకాన్ని కైవసం చేసుకుంది. ఆ ఊపు ఇప్పటి వరకు కొనసాగింది. భారత్‌కే చెందిన యషిత 61 కిలోల విభాగంలో ఫైనల్‌కు చేరుకుంది. సాంకేతిక ఆధిపత్యం ద్వారా ఆమె డిఫెండింగ్ ఛాంపియన్ అమెరికాకు చెందిన త్రైనా ఫెర్నాండెజ్ చేతిలో ఓడిపోయింది. కానీ ప్రశంసనీయమైన రజతం సాధించింది. 69 కిలోల కాంస్య పతక పోటీలో, మనీషా ఉక్రెయిన్‌కు చెందిన సోలోమియా పెట్రివ్‌ను ఓడించలేక పోయింది.



## వరల్డ్ ఛాంపియన్‌షిప్: భారత్ టెన్నిస్ జట్లకు అర్హత

**న్యూఢిల్లీ:** ప్రపంచ ఛాంపియన్‌షిప్-2026లో భారత టేబుల్ టెన్నిస్ జట్లుకు చోటు లభించింది. నేపాల్‌లోని ఖాట్మండులో శనివారం జరిగిన 2025 దక్షిణాసియా ప్రాంతీయ ఛాంపియన్‌షిప్‌లలో ఆధిపత్య ప్రదర్శనలు ఇచ్చిన తర్వాత భారత పురుషులు, మహిళల టేబుల్ టెన్నిస్ జట్లు లండన్‌లో జరిగే 2026 ప్రపంచ టీమ్ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లకు (డబ్ల్యూటిటిసి) అర్హత సాధించాయి. ఐదు దేశాల రౌండ్ రాబిన్ ఫార్మాట్‌లో పోటీ పడిన రెండు భారత జట్లు అజేయంగా నిలిచాయి. బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్ మరియు మాల్దీవులపై 3-0 తేడాతో ఒకేలాంటి విజయాలను నమోదు చేసి, గ్రూప్‌లో అగ్రస్థానంలో నిలిచాయి. డబ్ల్యూటిటిసి కోసం ఏకైక దక్షిణాసియా కోటాను కైవసం చేసుకున్నాయి. ఆకాష్‌పాల్, రోనిత్ భంజా, అనిర్బన్ ఘోష్, అభినంద్ ప్రధివాధి, మరియు దివ్యాన్ష్ శ్రీవాస్తవలతో కూడిన భారత పురుషుల జట్టు గ్రూప్ దశలో ఒక్క మ్యాచ్ కూడా వదులుకోకుండా 4 టైలలోనూ ఆధిపత్యం చెలాయించింది. ప్రతి మ్యాచ్ 3-0 స్కోరుతో ముగిసింది, ఇది జట్టు యొక్క సాంకేతిక పదును మరియు వ్యూహాత్మక నియంత్రణను ప్రతిబింబిస్తుంది. అలాగే మహిళల జట్టు ఆధిపత్యాన్ని ప్రతిబింబించింది. కృత్వికా సిన్హా, సెలీనా సెల్వకుమార్, తనీషా కోటేచా, సయాలి వాని మరియు సింద్రెలా దాస్ లతో కూడిన భారత్ మహిళల జట్టు కూడా అదే ప్రత్యర్థులపై 3-0 తేడాతో క్లీన్ విజయాలు సాధించారు. ఆ జట్టు మ్యాచ్‌లలో స్థిరమైన ఫామ్ మరియు అనుకూలతను ప్రదర్శించింది.



## మకావు ఓపెన్‌లో భారత్‌కు డబుల్‌హార్ట్ బ్రేక్

### తరుణ్, లక్ష్యసేన్ నిష్క్రమణ



**న్యూఢిల్లీ:** 2025మకావు ఓపెన్ సూపర్ 300లో భారత బ్యాడ్మింటన్‌కు ఇది నిరాశపరిచే రోజు. శనివారం జరిగిన ఈ టోర్నమెంట్‌లో భారత్ ఆటగాళ్లు మానేపల్లి తరుణ్, లక్ష్య సేన్ ఇద్దరూ పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో ఓటమిపాలై మకావులో టైటిల్ ఆశలకు ముగింపు పలి కారు. అంతకుముందు రోజు, ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 47వస్థానంలోఉన్న తరుణ్ గంటా 21 నిమిషాల పాటు సాగిన మూడు గేమ్‌ల ఉత్కంఠభరితమైన మ్యాచ్‌లో మలేషియాకు చెందిన జస్టిన్ హోహ్ చేతిలో ఓడిపోయాడు. మొదటి గేమ్‌ను చేజిక్కించుకున్నప్పటికీ, నిర్ణయాత్మక మ్యాచ్‌లో వరుస తప్పిదాల నుండి కోలుకోలేక తరుణ్ చివరికి 21-19, 16-21, 16-21 తేడాతో ఓడిపోయాడు. 23 ఏళ్ల భారతఆటగాడు పటిష్టంగా ఆట ప్రారంభించి తొలి గేమ్‌లో 11-6 ఆధిక్యంలోకి దూసుకెళ్లాడు. హోహ్18 పాయింట్లతో తిరిగి సమంచేసినప్పటికీ, తరుణ్‌మంచి ప్రదర్శ నతో మొదటి గేమ్‌ను స్పష్టమైన స్ట్రెయిట్ రిటర్న్‌తో ముగించాడు. కానీ మలేషియా ఆటగాడు రెండవ గేమ్‌లో పరిస్థితిని మార్చాడు, తరుణ్ తప్పుగా అంచనా వేసిన షాట్లు, అనవసరమైన తప్పిదాలను సద్వినియోగం చేసుకున్నాడు. నిర్ణయాత్మక మ్యాచ్‌లో, తరుణ్ మళ్ళీ ప్రారంభంలోనే ముందంజలో ఉన్నాడు కానీ ప్రత్యర్థి ఒత్తిడి తట్టుకోలేకపోయాడు. హోహ్ ఆట మధ్యలో విరామం తర్వాత ముందుకు దూసుకెళ్లి, తెలివైన డ్రాప్ షాట్‌తో మ్యాచ్‌ను ముగించాడు. ఇక టోర్నమెంట్‌లో భారత్ యొక్క అగ్ర ఆశ అయిన లక్ష్య సేన్, ఇండోనేషియాకు చెందిన రైజింగ్ స్టార్ అల్వి ఫర్హాన్ చేతిలో 45 నిమిషాల కంటే తక్కువ వ్యవధిలో 16-21, 9-21 తేడాతో వరుస గేమ్‌లలో ఓడిపోయాడు. ఆరంభం నుంచే ఫర్హాన్ ఆధిపత్యం చెలాయించాడు. మొదటి గేమ్ తర్వాత, ఇండోనేషియా ఆటగాడు రెండవ గేమ్‌తో ఓడిపోయినా, భారత ఆటగాడు లక్ష్యసేన్‌కు ఊపును పెంచుకునే అవకాశం ఇవ్వకపోవడంతో చివరకు ఓటమి తప్పలేదు. ఈ విధంగా తరుణ్, లక్ష్య ఇద్దరూ ఓటమి పాలవడంతో, మకావు ఓపెన్ 2025లో పురుషుల సింగిల్స్ విభాగంలో భారత్ ప్రచారం సెమీఫైనల్ దశలో ముగిసింది.



## స్టార్ కంటెండర్ ఫైనల్స్‌కు

# మనుష్-దియా

### మహిళల డబుల్స్ మనికా- స్వస్తిక ఓటమి

**న్యూఢిల్లీ:** డబ్ల్యూటిటి స్టార్ కంటెండర్ ఫోజ్ డో ఇగువాకు 2025లో భారతదేశం టేబుల్ టెన్నిస్ చరిత్ర సృష్టించింది. భారతీయ డబుల్స్ జోడీ ఫైనల్స్‌కు చేరుకోవడం ఒక మైలురాయిగా నిలిచింది. బ్రెజిల్‌లో శనివారం జరిగిన ఈవెంట్‌లో భారత ఆటగాళ్ళు మిక్స్‌డ్ డబుల్స్, పురుషుల డబుల్స్ రెండింటిలోనూ ఫైనల్స్‌కు చేరుకోవడం ఇదే మొదటిసారి. మిక్స్‌డ్ డబుల్స్‌లో ప్రపంచ నంబర్ 10, డ్రాలో మొదటి సీడ్‌గా నిలిచిన మనుష్ షా-దియా చిటాలే మంచి సమన్వయాన్ని ప్రదర్శించారు. వారు సెమీఫైనల్లో చిలీకి చెందిన నాల్గవ సీడ్‌జంట నికోలస్‌బుర్గోస్-పౌలినా వేగాను 3-0 తేడాతో ఓడించారు (11-7, 11-2, 11-7). అంతకుముందు, వారు ప్రారంభ రౌండ్‌లో బై పొందారు. క్వార్టర్ ఫైనల్స్‌లో చిలీకి చెందిన గుస్తావో గోమెజ-డానియేలా ఒర్టెగాలను ఓడించారు. ఇక పురుషుల డబుల్స్‌లో, టాప్ సీడ్ భారత జంట మానవ్ ఠక్కర్-మనుష్ షా (ప్రపంచ 10వ ర్యాంక్) ఫైనల్‌కు చేరుకున్నారు. 16వ రౌండ్‌లో జపాన్‌కు చెందిన క్వాలిఫయర్లు సతోషి ఐడా-మిజుకి ఓయికావాపై 3-1 తేడాతో విజయం సాధించి, ఆ తర్వాత క్వార్టర్ ఫైనల్స్‌లో ఫ్రాన్స్‌కు చెందిన ఫ్లోరియన్ బౌర్రస్సాడ్-లిలియన్ బార్డెట్‌పై 3-2 తేడాతో విజయం సాధించారు. సెమీఫైనల్లో, వారు చైనీస్ తైపీకి చెందిన హువాంగ్ యాన్‌చెంగ్-కువో గువాన్‌హాంగ్‌లను ఐదు గేమ్‌ల హోరాహోరీ పోరులో (5-11, 11-9, 11-6, 8-11, 11-5) ఓడించారు. కాగా మహిళల డబుల్స్‌లో మానికా బాత్రా-స్వస్తిక ఘోష్ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నారు కానీ దక్షిణ కొరియాకు చెందిన జూ చియోన్‌హుయ్-లీ యున్‌హ్యే చేతిలో ఓడిపోయారు. కాగా ఈ స్టార్ కంటెండర్ టోర్నీలో భారత్ సింగిల్స్ ప్రచారం ఇంకా కొనసాగుతోంది. మహిళల సింగిల్స్‌లో మానికా బాత్రా 16వ రౌండ్‌కు చేరుకోగా, పురుషుల సింగిల్స్ డ్రాలో హర్మీత్ దేశాయ్, మనుష్ షా కూడా 16వ రౌండ్‌లోకి ప్రవేశించారు.


## ట్రంప్‌ను నమ్మొద్దు.. భారత్ ఆర్థిక వ్యవస్థ ఓకే: ఏఐ

**న్యూఢిల్లీ, ఆగస్టు 2:** భారత్‌ది డెడ్ ఎకానమీ అంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన సంచలన వ్యాఖ్యలను ఆయన సొంత దేశంలోనే అభివృద్ధి చేసిన కృత్రిమ మేధ (ఏఐ) ప్లాట్‌ఫామ్‌లు ఖండించాయి. భారత ఆర్థిక వ్యవస్థ నిర్జీవంగా లేదని, ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఒకటిగా ఉందని స్పష్టం చేశాయి. భారత దిగుమతులపై 25 శాతం భారీ సుంకం (టారిఫ్) విధిస్తున్నట్టు ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో ఈ ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. అమెరికాకు చెందిన ఐదు ప్రముఖ ఏఐ ప్లాట్‌ఫామ్‌లైన చాట్‌జీపీటీ, గ్రోక్, జెమిని, మెటా ఏఐ, కోపైలట్‌లను భారత్‌ది డెడ్ ఎకానమీయా? అని ప్రశ్నించింది. దీనికి అవన్నీ ఏకగ్రీవంగా లేదు అనే సమాధానం ఇచ్చాయి. భారత ఆర్థిక వ్యవస్థ చచ్చి పోలేదు, చాలా చురుగ్గా, ప్రతిష్ఠాత్మకంగా ఉంది అని చాట్‌జీపీటీ చెప్పగా, అసలు ఆ మాటే నిజం కాదు, దానికి పూర్తి భిన్నమైన పరిస్థితులు ఉన్నాయి అని కోపైలట్ తేల్చి చెప్పింది. భారత ఆర్థిక వ్యవస్థ పతనం కాలేదు. ఇది ప్రపంచవ్యాప్తంగా అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా ఉంది అని గ్రోక్ తెలిపింది. భారత ఆర్థిక వ్యవస్థ బలమైన వృద్ధితో దూసుకెళ్తోంది అని జెమిని అంది. అలాగే మెటా ఏఐ కూడా భారత్‌ది డెడ్ ఎకానమీ కాదు. ఇది ప్రపంచ వ్యాప్తంగా అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థలలో ఒకటి అని చెప్పింది. ఇలా అమెరికన్ ఏఐ ప్లాట్‌ఫామ్‌లన్నీ కూడా ఒకే తరహా అభిప్రాయాన్ని వ్యక్తం చేశాయి. భారత ఆర్థిక వ్యవస్థపై ట్రంప్ మాటలు అబద్ధమని తేల్చేశాయి.




## టెస్లాకు రూ.2,100 కోట్ల ఫైన్

**వాషింగ్టన్, ఆగస్టు 2:** అమెరికాకు చెందిన దిగ్గజ ఎలక్ట్రిక్ ఆటోమొబైల్ సంస్థ టెస్లాకు భారీ జరిమానా పడింది. 2019 నాటి రోడ్డు ప్రమాదం కేసులో టెస్లా కారులోని ఆటో పైలట్ వ్యవస్థ తప్పిదమే ప్రమాదానికి కారణమని ఫ్లోరిడా కోర్టు నిర్ధరించింది. దీంతో బాధితులకు 242 మిలియన్ డాలర్ల పరిహారం (భారత కరెన్సీలో దాదాపు రూ.2,100కోట్లు) చెల్లించాలని కంపెనీని ఆదేశించింది. నాటి ప్రమాదంలో ఓ యువతి మృతి చెందగా.. మరో వ్యక్తి గాయపడ్డారు. 2019లో ఫ్లోరిడాలోని కీ లార్గోలో ఈ ఘటన చోటు చేసుకుంది. జార్జ్ మెక్‌గీ అనే వ్యక్తి తన టెస్లా కారులో వెళ్తూ అధునాతన ఆటోపైలట్ ఫీచర్‌ను ఉపయోగించాడు. ఇది టెస్లా అందించిన ఆటోమేటెడ్ డ్రైవింగ్ వ్యవస్థ. మార్గమధ్యలో తన మొబైల్ ఫోన్ కారులో కింద పడిపోయింది. ఎలాగూ కారు ఆటోపైలట్ మోడ్‌లోనే ఉందని భావించిన జార్జ్.. కిందకు వంగి ఫోన్ తీసుకునేందుకు ప్రయత్నించాడు. ఆ సమయంలో కారు అదుపుతప్పి పక్కనే పార్క్ చేసి ఉన్న ఓ కారును ఢీకొట్టి ఇద్దరు వ్యక్తుల పైకి దూసు కెళ్లింది. ఈ ఘటనలో ఓ 22 ఏళ్ల యువతి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా.. ఆమె స్నేహితుడు తీవ్రంగా గాయ పడ్డాడు. ప్రమాద తీవ్రతకు యువతి మృతదేహం 75 అడుగుల దూరంలో ఎగిరిపడింది. ఈ ఘటనపై బాధిత కుటుంబాలు కోర్టును ఆశ్రయించాయి. దీనిపై సుదీర్ఘవిచారణ తర్వాత తాజాగా ఫ్లోరిడా కోర్టు తీర్పు వెలువరించింది. ఈ ప్రమాదానికి గానూ బాధితుల కుటుంబాలకు 329 మిలియన్ డాలర్ల నష్టపరి హారం చెల్లించాలని న్యాయస్థానం ఆదేశం చింది. ఆటోపైలట్ వ్యవస్థ తప్పిదం కూడా ప్రమాదానికి ఓ కారణమేనని గుర్తించిన కోర్టు.. ఇందుకు గానూ పరిహారంలో మూడోవంతు అంటే దాదాపు 242 మిలియన్ డాలర్లు టెస్లా కంపెనీ చెల్లించాలని ఆదేశించింది. మిగతా మొత్తం సదరు వాహనడ్రైవర్ ఇవ్వాలని స్పష్టం చేసిం ది. అయితే, ఈతీర్పుపై అప్పీల్ చేయనున్నట్లు టెస్లా తెలిపింది.




## స్వదేశీ జెట్ ఇంజిన్ల తయారీపై జొమాటో ఆసక్తి

**న్యూఢిల్లీ, ఆగస్టు 2:** ఫుడ్ డెలివరీ సంస్థ జొమాటో వ్యవస్థాపకుడు, సిఇఒ దీపిందర్ గోయల్ కీలక వ్యాఖ్యలు చేశారు. తాను మద్దతిస్తున్న ఏవియేషన్ స్టార్టప్ ఎల్ఎటి ఏరోస్పేస్ భారత్‌లో సొంత గ్యాస్ టర్బైన్ ఇంజిన్‌ను నిర్మించేందుకు సిద్ధమవుతోందని చెప్పారు. బెంగళూరులో ఒక ప్రొపల్షన్ రీసెర్చ్ టీమ్‌ను ఏర్పాటు చేస్తున్నామని, ఇందులో టర్బైన్లు, రోటర్లు, కంట్రోల్ సిస్టమ్స్‌ను అభివృద్ధి చేయడంలో అనుభవం ఉన్న వారికోసం అన్వేషిస్తున్నట్లు దీపిందర్ గోయల్ తన లింక్డ్ఇన్ పోస్ట్‌లో పేర్కొన్నారు. మేడ్-ఇన్-ఇండియా గ్యాస్ టర్బైన్ ఇంజిన్‌ను నిర్మించాలని కంపెనీ లక్ష్యంగా ఉంది. మన ఏరో స్పేస్ రంగంలో కీలక మార్పులకు తాను సిద్ధంగా ఉన్నట్లు దీపిందర్ గోయల్ అన్నారు. స్వదేశీ గ్యాస్ టర్బైన్ ఇంజిన్‌ల తయారీలో భారతీయ ఇంజినీర్లకు పూర్తిగా స్వేచ్ఛ ఇస్తామని, ఒకవేళ విఫలమైనప్పటికీ, వారికి తిరిగి అవకాశాలు ఇవ్వనున్నట్లు స్పష్టం చేశారు. ఇంజినీర్లకు తగిన ప్రోత్సాహకాలు కూడా ఉంటాయని గోయల్ వెల్లడించారు. గతంలో భారత్ స్వదేశీ గ్యాస్ టర్బైన్ ఇంజిన్ నిర్మించేందుకు ప్రయత్నించిందని, అయితే ఎల్ఎటి మళ్లీ దానికోసం ముందుకొచ్చింది. ఎల్ఎటి ఏరోస్పేస్ పరిశోధనా కేంద్రం దహన, టర్బోమెషినరీ, థర్మల్ సిస్టమ్‌లు, మెటీరియల్స్‌తో కూడిన ప్రయోగశాలలతో ఏర్పాటైంది. ఇక్కడ ఇంజినీర్లు అవసరమైన ఆవిష్కరణలకు వీలు కల్పిస్తుందని దీపిందర్ గోయల్ వివరించారు. కంపెనీ చేపట్టే పరిశోధనలకు ఏ వ్యాపార సంబంధిత వ్యక్తులూ నాయకత్వం వహించరని, ఇంజినీర్ల చేతుల్లోనే వీటి నిర్వహణ ఉంటుందని గోయల్ స్పష్టం చేశారు. కాగా, ఇది వరకు 1986లో డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ ప్రారంభించిన కావేరీ ఇంజిన్ ప్రోగ్రామ్, భారత లైట్ కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ తేజస్ కోసం స్వదేశీ జెట్ ఇంజిన్‌ను అభివృద్ధికి పనిచేసింది. సాంకేతిక సవాళ్లు, ఆలస్యం వల్ల ఇది పూర్తవలేదు.




## మెటా తీరుతో ఇతర కంపెనీలు నాశనం

**వాషింగ్టన్, ఆగస్టు 2:** కృత్రిమ మేధ (ఏఐ) విభాగంలో కొత్త ఆవిష్కరణలు చేసేలా ప్రపంచవ్యాప్తంగా టాలెంట్ హంటింగ్ అనూహ్య స్థాయికి చేరుకుంది. ఓపెన్‌ఏఐ అగ్ర నిపుణులను ఆకర్షించడానికి మెటా 100 మిలియన్ డాలర్ల అంటే సుమారు రూ.870 కోట్లు బోనస్‌ను సైతం ఆఫర్ చేస్తున్న తరుణంలో ఆంత్రోపిక్ సిఇఒ డారియో అమోడీ తన ఉద్యోగులకు పంపిన అంతర్గత ఇ-మెయిల్ వైరల్‌గా మారింది. మెటా వంటి పోటీదారుల నుంచి వచ్చే వేతన ఆఫర్లు కంపెనీల సంస్కృతిని నాశనం చేస్తాయని అంతర్గత ఇ-మెయిల్‌లో అమోడీ తెలిపారు. ఇతర కంపెనీలు ఆఫర్ చేసే ఆర్థిక ప్రోత్సాహకాల కంటే ఆంత్రోపిక్ తన మిషన్ పట్ల నిబద్ధతగా వ్యవహరించాలని ఆయన ఉద్యోగులను కోరారు. మెటా అసాధ్యాన్ని సాధ్యం చేయాలనే తప్పుడు ఆలోచనతో ఉందన్నారు. మెటా తీరు ఇతర కంపెనీల సంస్కృతిని నాశనం చేసేలా ఉందని అంతర్గత ఇ-మెయిల్‌లో అమోడీ తెలిపారు. ఆంత్రోపిక్ ఉద్యోగులకు వేతన ఆఫర్ల కంటే కంపెనీ మిషన్ ప్రధానమని చెప్పారు. మెటా ఆఫర్ చేస్తున్న ప్యాకేజీల కారణంగా సంస్థాగత సమగ్రతను కాపాడుకుంటూ కీలక ప్రతిభావంతులను నిలుపుకోవడంపై పరిశ్రమలో ఇతర కంపెనీలు ఆందోళన చెందుతున్నట్లు తెలుస్తుంది. ఆర్టిఫిషియల్ జనరల్ ఇంటెలిజెన్స్ (ఏజిఐ)ను అభివృద్ధి చేయడానికి ఉద్దేశించిన సూపర్ ఇంటెలిజెన్స్ ల్యాబ్ (ఎంఎస్ఎల్) అనే కొత్త విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు మెటా సిఇఒ మార్క్ జుకర్‌బర్గ్ ఇప్పటికే రీసెర్చ్‌ను అభివృద్ధి చేస్తాయని చెప్పారు. ఎంఎస్ఎల్ కింద కొత్త ల్యాబ్ తదుపరి తరం లార్జ్ ల్యాంగ్వేజ్ మోడళ్ల నిర్మాణంపై దృష్టిపెడుతుందని తెలిపారు.



# వాణిజ్యం

## రష్యా నుంచి భారత్‌కు చమురు కొనుగోళ్లకు నో బ్రేక్!

**ముంబై, ఆగస్టు 2:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన సుంకాలతో రష్యా నుంచి భారత్ ఇంధనాన్ని కొనుగోలు చేయడం లేదంటూ వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేయడం లేదని తెలిసిందని, ఇది మంచి నిర్ణయమని అన్నారు. ఈ నేపథ్యంలో దీనిపై ప్రభుత్వ వర్గాలు స్పందించాయి. ఆ వార్తలను తోసిపుచ్చాయి. భారత చమురు శుద్ధి సంస్థలు రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు చేస్తున్నాయని ప్రభుత్వ వర్గాలు శనివారం స్పష్టం చేశాయి. ఇంధన దిగుమతులు మార్కెట్ డైనమిక్స్, జాతీయ ప్రయోజనాల దృష్టా జరుగుతున్నాయని పునరుద్ఘాటించాయి. భారత చమురు సంస్థలు రష్యన్ దిగుమతులను నిలిపివేసినట్లు తమకు ఎలాంటి సమాచారం లేదని స్పష్టం చేశాయి. కాగా, ఉక్రెయిన్‌పై యుద్ధం నేపథ్యంలో రష్యాపై పశ్చిమదేశాలు ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. అయినప్పటికీ మాస్కో నుంచి భారత్ పెద్ద మొత్తంలో చౌక ధరకు చమురు కొనుగోలు చేస్తోంది. దీనిపై పశ్చిమ దేశాలు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నాయి. మాస్కోతో వ్యాపారం చేస్తోందన్న కారణం చూపుతూ ఇటీవల అమెరికా అధ్యక్షుడు ట్రంప్ .. భారత్‌పై పెనాల్టీలు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ పరిణామాల నేపథ్యంలో రష్యా నుంచి చమురు కొనుగోళ్లను దేశీయ సంస్థలు నిలిపివేశాయంటూ వార్తలు వస్తున్నాయి. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, హిందు స్థాన్ పెట్రోలియం కార్పొరేషన్, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ వంటి భారత్‌కు చెందిన ప్రభుత్వ చమురు శుద్ధి సంస్థలు గత వారం రోజులుగా మాస్కో నుంచి చమురు దిగుమతులను నిలిపి వేసినట్లు ప్రచారం జరుగుతోంది.



## మూడవ అతిపెద్ద సౌరశక్తి ఉత్పత్తి దేశంగా భారత్!

**న్యూఢిల్లీ, ఆగస్టు 2:** భారతదేశం జపాన్‌ను అధిగమించింది. ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద సౌరశక్తి ఉత్పత్తిదారుగా అవతరించింది భారత్. అంతర్జాతీయ పునరుత్పాదక ఇంధన సంస్థ నుంచి డేటాను కేంద్ర ఇంధన శాఖ మంత్రి ప్రస్తావించాడు. భారతదేశం ఇప్పటి వరకు 1,08,494 గిగావాట్ గంటల (జిడబ్ల్యుహెచ్) సౌరశక్తిని ఉత్పత్తి చేసిందని, జపాన్ 96,459 జిడబ్ల్యుహెచ్ సౌరశక్తినిమాత్రమే ఉత్పత్తి చేసిందని ఆయన స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలో భారతదేశం ప్రపంచ క్లీన్ ఎనర్జీ విప్లవానికి నాయకత్వం వహిస్తోందని కేంద్ర మంత్రి అన్నారు. 2030 నాటికి 500 గిగావాట్ల శిలాజేతర ఇంధన ఆధారిత విద్యుత్ సామర్థ్యం అనే ప్రతిష్టాత్మక లక్ష్యాన్ని చేరుకోవడానికి భారత్ బహుముఖ విధానంతో పనిచేస్తున్నందున ఈ విజయం సాధ్యమైందన్నారు. ఈ దిశ లో భారతదేశం సాధించిన పురోగతి ఇంధన భద్రతను పెంచడమే కాకుండా ప్రపంచ వాతావరణ మార్పులకు వ్యతిరేకంగా ఒక బలమైన అడుగుగా కూడా నిరూపితమైందన్నారు. అంతర్జాతీయ ఇంధన సంస్థ 2024 డేటా ప్రకారం, సౌర పివి సామర్థ్య వృద్ధిలో చైనా ముందుంది. ఇది 2023లో 260 గిగావాట్లను ఉత్పత్తి చేసింది. ఇది మునుపటి సంవత్సరం కంటే దాదాపు మూడు రెట్లు ఎక్కువ. చైనా 14వ పునరుత్పాదక ఇంధన ప్రణాళిక 2022లో అమలు చేయడానికి ప్రతిష్టాత్మక లక్ష్యాలను నిర్దేశించుకుంది.



Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps